# KAVYAS

## M.A. (SANSKRIT) I Semester Paper -III

**Director**

**Dr.Nagaraju Battu**

M.H.R.M., M.B.A., L.L.M., M.A. (Psy), M.A., (Soc), M.Ed., M.Phil., Ph.D.

Centre for Distance Education

Acharya Nagarjuna University

Nagarjuna Nagar-522510

Phone No.0863-2346208, 0863-2346222, Cell No.9848477441

0863-2346259 (Study Material)

Website: www.anucde.info

e-mail: anucdedirector@gmail.com

M.A (Sanskrit): KAVYAS

First Edition: 2021

No. of Copies : 100

(C) Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of M.A Sanskrit, Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is mean for limited circulation only

Printed at

Romith Technologies
Guntur

# మేఘసందేశము

## కవి పరిచయం

### 1. దేశకాలాలు :

కాళిదాసు తన తల్లిదండ్రులను గూర్చికాని, జన్మస్థలం, కాలం గూర్చి కాని ఎక్కడా చెప్పలేదు. మన పూర్వకవులలో చాలామందికి, తమ వివరాలు భావి తరాలవారికి తెలుపాలనే అవగాహన లేదు. అందువలన ఇతరాధారాలతో ఊహించటం జరుగుతున్నది. ఇతని దేశ విషయంలో మతభేదాలున్నాయి. కాశ్మీరు ప్రాంతీయుడని కొందరు, మిథిలా ప్రాంతీయుడని ఇతరులు చెప్పుతున్నారు. కాని ఎక్కువ మంది పరిశీలకులు కాళిదాసు ఉజ్జయినీ ప్రాంతీయుడని నమ్ముతున్నారు. ఉజ్జయిని పాలకుడు విక్రమాదిత్యుని ఆస్థానంలో "ధన్వంతరి క్షపణకామరసింహశంఖ బేతాళభట్ట ఘటకర్పర కాళిదాసాః" అనే శ్లోకంలో నవరత్నాలలో కాళిదాసు పేర్కొనబడటం ఒక కారణం కాగా, మేఘ సందేశంలో యక్షుడు అలకానగర మార్గాన్ని చెప్పే సందర్భంలో, "వక్రః పన్థాయదపి భవతః" అనే శ్లోకంలో నీ ప్రయాణమార్గం కొంచెం చుట్టు అయినా ఉజ్జయిని పట్టణాన్ని తప్పక దర్శించాలని, ఆ సౌభాగ్యాన్ని పోగొట్టుకోవద్దని చెప్పుతాడు. అంతేకాక అక్కడి నదిని, నగరాన్ని 16 శ్లోకాలలో వర్ణిస్తాడు. ఈ కారణాలను బట్టి కాళిదాసుకు ఉజ్జయినిపై ప్రత్యేకాభిమానమని, అదే అతని వాసస్థానమని అభిప్రాయపడుతున్నారు. ఇది ఊహా నిర్ణయం మాత్రమే. అసలు నిజం దైవానికెరుక.

ఇక కాలం విషయం కూడ వివాదాస్పదమే. విక్రమాదిత్యుని ఆస్థానంలో ఉన్నాడనేది కాని, ధన్వంతరి క్షపణకా అనే శ్లోకం కాని పరంపరగా వస్తున్న జనశ్రుతేకాని నిర్దుష్టమైన ఆధారం కాదు. అయితే కాళిదాసు తన 'మాలవికాగ్నిమిత్ర' నాటక ప్రస్తావనలో, ప్రథితయ శసాం భాస సౌమిల్లక కవిపుత్రాదీనాం ప్రబంధా నతిక్రమ్య వర్తమానకవేః కాళిదాసస్య క్రియాయాం కథం బహుమానః?" అని పారిపార్శ్వకునితో పలికించినాడు. మిక్కిలి కీర్తి గడించిన భాస, సౌమిల్లక, కవి పుత్రాదుల గ్రంథాలను వదిలి ప్రస్తుత కవి కాళిదాసు రచనపై ఎందుకు గౌరవము? అని పైవాక్యమునకర్థము. దీనివలన కాళిదాసు కాలానికి భాసాదులు చాలపేరు గడించినారని తెలుస్తుంది. భాసుని కాలము క్రీ.పూ. మూడవ శతాబ్ద ప్రాంతమని చరిత్రకారులు నిర్ణయించినారు. కనుక భాసుని తరువాతివాడనేది స్పష్టము. ఇక క్రీ.శ.634 సం॥నికి చెందిన 'ఐహోల్' శిలా శాసనంలో కాళిదాసు ప్రస్తావన ఉన్నందున అంతకు పూర్వమువాడు కావలెను. భాసుని ప్రఖ్యాతి వ్యాపించుటకు రెండు శతాబ్దాలైనా పట్టిందనుకుంటే కాళిదాసు క్రీ.పూ - ప్రథమ శతాబ్దికి క్రీ.శ.ఏడవ శతాబ్దికి మధ్యకాలంలో జీవించినాడని భావించాలి.



గుప్తరాజుల కాలంలో కాళిదాసు జీవించినాడనే వారిమతంలో గుప్తరాజుల కాలము స్వర్ణయుగము కనుక, కవిత్వం బాగా వ్యాపించిందని, సముద్రగుప్తుని దిగ్విజయ యాత్ర ఆధారంగా రఘువు దిగ్విజయాన్ని వర్ణించినాడని వారి వాదము. గుప్తరాజులలో రెండవ చంద్రగుప్తునికి విక్రమాదిత్య బిరుదమున్నదని వారి అభిప్రాయము. దీని ప్రకారము కాళిదాసు క్రీ.శ. 5వ శతాబ్దపువాడని చెప్పుతారు.

కాని ఎక్కువమంది విమర్శకులు, కాళిదాసకవి క్రీ.పూ.ప్రథమ శతాబ్దం నాటి శకస్థాపకుడైన విక్రమాదిత్యుని కాలం వాడనే నమ్ముతున్నారు. నవరత్నాలలో ఒకడనే జనశ్రుతి మాత్రమే కాక వారు మరికొన్ని ఆధారాలు చెప్పుతున్నారు. ఊర్వశీ పురూరవసులకథతో రచించిన నాటకానికి విక్రమోర్వశీయమని పేరుపెట్టుట, అదే నాటకంలో "అనుత్సేకః ఖలు విక్రమాలంకారః" అని మరికొన్ని చోట్ల కూడ విక్రమశబ్దాన్ని తరుచుగా ప్రయోగించటం, విక్రమాదిత్యుని రాజధాని అగు ఉజ్జయినిపై మేఘసందేశంలో కవి ప్రత్యేక శ్రద్ధ చూపటం, విక్రమాదిత్యుని అభినందన కృతి రామచరితంలో "ఖ్యాతింకామపి కాళిదాస కృతయోనీతాః శకారాతినా" అని కాళిదాస ప్రసక్తి కన్పించటం ఈ అభిప్రాయానికి సమర్థకాలు.

మొత్తం మీద భాసకవికి, ఐహోల్ శాసనానికి మధ్యకాలంలో (క్రీ.పూ.ప్రథమ శతాబ్ది - క్రీ.శ.7వ శతాబ్ది) ఏదో ఒక కాలంలో కాళిదాసు జీవించాడనేది నిర్దుష్టమైన చారిత్రకాధారము.

### రచనాశైలి :

కాళిదాస రచనాశైలి సరళము, లలితము, మధురపదాలతో కూడి ఉంటుంది. అల్ప సమాసాలతో, చక్కని అలంకారాలతో హృద్యంగా ఉంటుంది. కొన్నిచోట్ల దీర్ఘ సమాసాలున్నా అర్థ బోధలో ఇబ్బందిలేని పదాలే ఉంటాయి. ప్రధానంగా కాళిదాసుకవిత వైదర్భీరీతిలో ఉంటుంది. వైదర్భి అనగా–

"బంధపారుష్య రహితా శబ్దకాఠిన్యవర్జితా
నాతిదీర్ఘసమాసాచ వైదర్భీరీతిరిష్యతే"

అని లక్షణము. పదాల కూర్పు పరుషంగా లేకుండా, కఠినమైన శబ్దాలు ప్రయోగించక, మిక్కిలి దీర్ఘ సమాసాలు లేని రచన వైదర్భీరీతి అంటారు.

ప్రకృతి పరిశీలనాశక్తి కాళిదాసు వర్ణనలలో మనకు కనిపిస్తుంది. ఆమ్రకూట పర్వతాన్ని, దశార్ణ జనపదాలను, ఉజ్జయినీ నగరంలోని ఉద్యానాల, క్రీడా పర్వతాల,

సుందర స్త్రీల విలాసాల వర్ణనలు అసాధారణం. నిర్వింధ్యానదిని, హిమాలయ పర్వతాన్ని, అలకానగరాన్ని ఎంతో హృద్యంగా వర్ణించినాడు.

కాళిదాసు ప్రకృతి పరిశీలనాశక్తికి శాకుంతలంలోని ఈ శ్లోకం చక్కని ఉదాహరణం "నీవారాః శుకగర్భ...రేఖాంకితాః" ఇక్కడ చెట్లకింద చిలుకల నోటి నుండి జారిపడిన నీవార ధాన్యపు గింజలు, చితుకగొట్టబడిన గారపండ్లచేత జిగట పొందిన శిలలు, నమ్మకము కలిగినందువలన భయములేక ఇక్కడి జింకలు ధ్వనిని వినికూడ చెదిరిపోవుట లేదు. జలాశయానికి వెళ్లేదారులలో మునులు స్నానం చేసి తమ నారబట్టలు పిండుతూ నడుస్తున్నపుడు పడిన నీటి చారలు – ఇవన్నీ ఇది ఒక మున్యాశ్రమ ప్రదేశమని స్పష్టం చేస్తున్నాయి" ఇది కణ్వాశ్రమవర్ణన ఘట్టము. ఎంత నిశిత పరిశీలన!

అలంకారాలు : అలంకార ప్రయోగంలో కాళిదాసు దిట్ట అని "ఉపమాకాళి దాసస్య" అనే సూక్తి తెలుపుతుంది. రఘువంశంలో ప్రార్థన శ్లోకంలోనే పార్వతీ పరమేశ్వరులను వాగర్థములవలె విడదీయరాని జంటగా వర్ణించాడు. ప్రస్తుత కావ్యంలో మచ్చుకు –

1. బర్హేణేవ స్ఫురిత రుచినా గోపవేషస్యవిష్ణోః 1-15

ఎదురుగా పుట్ట మీదుగా ప్రసరిస్తున్న ఇంద్రధనుస్సు మేఘంతో చేరినప్పుడా మేఘము నెమలి పింఛముతో కూడిన కృష్ణుని వలె ఉంటుందని వర్ణన.

2. మధ్యేశ్యామః స్తన ఇవ భువః శేషవిస్తారపాండుః 1-18

ఆమ్రకూట పర్వతాన్ని వర్ణిస్తూ, ఆ కొండపై మామిడి చెట్లు దట్టంగా పండ్లతో గౌర వర్ణంగా ఉంటాయి. అప్పుడు మేఘుడా పర్వత శిఖరం మీద వాలితే భూమి అనే పడతి స్తనం వలె కనపడుతుందట. స్తనం అగ్రభాగం నల్లగా ఉంటుంది. మేఘం నల్లగా ఉన్నది. స్తనం మిగతా భాగం గౌరవర్ణం (లేతపసుపు) లో ఉంటుంది. మామిడి పండ్లు గౌరవర్ణంలో ఉంటాయి. అందువల్ల మేఘం వాలినప్పుడా పర్వతం భూకాంతస్తనం వలె ఉంటుందని చక్కని పోలికను వర్ణించాడు.

ఇక రూపకము, ఉత్ప్రేక్ష, ఉదాత్తాలంకారాలు కూడ కొన్ని స్థలాలలో చక్కగా ప్రయోగించినాడు.

అర్థాంతర న్యాసాలంకారాలకీ కావ్యంలో ప్రత్యేకత ఉన్నది. వాటిలో చాలా వరకు లోకంలో సుభాషితాలుగా ఉపయోగించదగి ఉన్నవి.

1. కామార్తాహి ప్రకృతికృపణాశ్చేతనా చేతనేషు 1-5
2. రిక్తః సర్వోభవతి హి లఘుః పూర్ణతాగౌరవాయ 1-20



3. మందాయన్తే నఖలు సుహృదామభ్యుపేతార్థకృత్యాః 1-42
4. ఆపన్నార్తి ప్రశమనఫలాః సంపదోహ్యుత్తమానామ్ 1-57
5. ప్రాయేణైతే రమణవిరహే ష్వంగనానాం వినోదాః 2-26
6. ప్రాయస్సర్వోభవతి కరుణావృత్తి రార్ద్రాంతరాత్మా 2-32

ఇత్యాదులు మరికొన్ని ఉన్నాయి.

శబ్దాలంకారాలకు కాళిదాసు అంతగా ప్రాముఖ్యమీయలేదు.

ఛందస్సు : ఈ కావ్యము రెండు సర్గలలో అన్ని శ్లోకాలు మందాక్రాంత వృత్తంలోనే రచింపబడ్డాయి. ఇది ఈ కావ్యానికి ఎంతగానో సరిపోయింది. అందుచేతనే దీని తరువాత వచ్చిన హంససందేశం వంటి చాలా సందేశ కావ్యాల్లో ఈ వృత్తమే ప్రయోగించబడింది. ఇది లయబద్ధంగా శ్రావ్యంగా ఉంటుంది.

## కాళిదాస ప్రశంస

ఈ మహాకవిని గూర్చి అనంతర కవులు, లాక్షణికులు చేసిన ప్రశంసలు, అసంఖ్యాకంగా ఉన్నాయి. వాటిలో కొన్ని చూద్దాము.

1. జయదేవుడు తన ప్రసన్నరాఘవ నాటకంలో –

"యస్యాశ్చోర శ్చికురనికరః కర్ణపూరోమయూరః
భాసోహాసః కవికులగురుః కాళిదాసోవిలాసః"

అనే శ్లోకంలో సరస్వతీదేవికి చోరకవి సిగముడి అని మయూరుడు కర్ణాభరణమనీ, భాసకవి ఆమె నవ్వు అనీ, కవికుల గురువైన కాళిదాసు ఆమె విలాసమని ప్రస్తుతించాడు.

వ్యాఖ్యాతృ సార్వభౌముడైన మల్లినాథ సూరి–

"కాళిదాసగిరాంసారం కాళిదాస స్సరస్వతీ
చతుర్ముఖోఽ థవా విద్యాద్విదుర్నాన్యేతు మాదృశాః"

అన్నాడు. (కాళిదాసు వాక్కుల సారాన్ని కాళిదాసు, సరస్వతీ దేవి, ఒకవేళ బ్రహ్మ తెలుసుకోగలరు. నావంటి ఇతరులకది సాధ్యము కాదు.)

మహా విద్వాంసుడు, బహు కావ్య వ్యాఖ్యాత అయిన మల్లినాథుడు వినయంతో చెప్పినా, కాళిదాసకవితా వైశిష్ట్యాన్ని పైశ్లోకం వెల్లడిస్తుంది.

2. గద్య చక్రవర్తి బాణ భట్టు

"నిర్గతాసు నవాకస్య కాళిదాసస్య సూక్తిషు
ప్రీతిర్మధుర సాంద్రాసు మంజరీష్వివ జాయతే"

అని వర్ణించినాడు. (మధుర భావములతో, లలిత పదములతో కూర్చబడిన కాళిదాసుని సూక్తుల యందు, తీయని రసముతో, కమ్మని పరిమళముతో మనోహరముగా ఉన్న పూల గుత్తుల యందు వలె ఎవరికి ప్రీతి కలుగకుండును?)

3. విద్వల్లోకంలో పరంపరగా వినబడుతున్న మరొక ఆభాణక మీవిధంగా ఉన్నది.

"పురా కవీనాం గణనాప్రసంగే
కనిష్ఠికాఽ ధిష్ఠిత కాళిదాసా
అద్యాపి తత్తుల్యకవేరభావా
దనామికా సార్థవతీ బభూవ."

పూర్వమొకప్పుడు కొందరు పండితులు చేరి ఉత్తమ కవులెవరు? అని చర్చించుకుంటూ మొదటి పేరుగా కాళిదాసును చెప్పి చిటికెన వేలు మూసినారు. తరువాత అంతటివాడెవరు? అని యోచన చేయగా ఎవరూ తోచకపోవటం వలన ఉంగరం వేలు మూయబడలేదు. అందుకే ఆ వేలుకు 'అనామిక' అనేపేరు సార్థకమైంది అని భావము. (పేరులేనిది అనామిక. ఆ వేలు మీద లెక్కించదగిన కవి పేరు లేదని భావము.)

దీనివలన కాళిదాసుతో సమానుడైన మరొక కవిలేడని తేలిన సారాంశము.

సంఖ్యలను లెక్కించేటప్పుడు చిటికెనవేలుతో ఆరంభించి ఒక్కొక్కవేలు ముడువటం పూర్వం నుంచి ఇప్పటి వరకు అలవాటుగా ఉన్న ఆచారము కనిష్ఠిక అనగా చిటికెనవేలు.

4. మరొక రసికుడు తనకు ప్రతిజన్మలో కావలసిన వస్తువుల నీవిధంగా కోరుకున్నాడు.

శ్లో॥ "కాళిదాసకవితా నవంవయః
మాహిషం దధి సశర్కరం పయః
ఏణమాంస - మబలాచ కోమలీ
సంభవంతు మమ జన్మజన్మని."

(కాళిదాసు కవిత్వము, నూతనమైన యౌవనము, గేదె పెరుగు, పంచదార కలిపిన పాలు, జింక మాంసము, సుకుమారియైన వనిత నాకు ప్రతి జన్మలో లభించుగాక)

పాశ్చాత్యులలో జర్మనీదేశానికి చెందిన గేథే అనే గొప్పకవి కాళిదాసు శాకుంతల నాటకానువాదాన్ని చదివి ముగ్ధుడై ఆనందపారవశ్యంలో గంతులు వేసినాడని,



ఆసంతోషంలో ఆ గేథే కవి జర్మన్ భాషలో శాకుంతలాన్ని గూర్చి ఒక కవిత వ్రాసినాడని అభిజ్ఞుల కథనం.

ఆ కవితలోని భావమిట్లున్నది.

"ఓ శాకుంతలమా! నీవు ధన్యవు. విశ్వసాహిత్యంలో ఎన్ని గొప్ప నాటకాలున్నా, నేను నిన్నే అభిమానిస్తాను. సర్వసమగ్ర కావ్యరూపక లక్షణములు, అక్షర రమ్యత, కావ్య సంపద, భావసౌరభములు, రసప్రవాహము నీయందే ఉన్నవి. ఆత్మకానందదాయకములు, ఆవశ్యకములు అయిన సర్వము నీయందే ఉన్నది. స్వర్గమర్త్యలోకముల ఏకరూప సామ్యము నీలోనే కనిపించుచున్నది."

ఇట్లే మరికొందరు విదేశ పండితులు కూడ కాళిదాసు ప్రతిభను కొనియాడినారు. ఇకదేశీయుల ప్రశంసలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. విస్తర భీతితో స్థాలీపులాక న్యాయంగా కొన్ని మాత్రం పేర్కొన్నాను.

కావ్యకథ : మేఘ సందేశంలో కథాభాగం ఎక్కువగా లేదు. వర్ణనలు, సందేశ వచనాలే ఎక్కువ.

"యక్షరాజు కుబేరుని దగ్గర ఉద్యోగి అయిన యక్షుడు ఒకనాడు యజమాని పనిలో నిర్లక్ష్యం చేసి అతని శాపానికి గురైనాడు. సంవత్సరం పాటు ఇల్లు విడిచి వెళ్లాలని శాపం ఆయక్షుడు రామగిరి అనే పర్వత ప్రాంతంలో ఉంటున్నాడు. 8 నెలలు గడచినాయి. ఆషాఢం వచ్చింది. ఒకనాడా యక్షుడు ఆకాశంలో మేఘాన్ని చూచి తన భార్యను తలచుకొని బాధపడి, ఆమేఘుణ్ణి సంభావించి, తన భార్యకు తన కుశల సమాచారాన్ని సందేశంగా అందజేయమని కోరుతాడు. తరువాత తన భార్య ఉన్న అలకానగరానికి వెళ్లవలసిన మార్గాన్ని చెప్పుతాడు. దారిలో వచ్చే పర్వతాలు, పట్టణాలు, నదులను గూర్చి వర్ణిస్తాడు. ఆ సందర్భంలోనే ఉజ్జయినిపై తన పక్షపాతాన్ని ప్రకటిస్తాడు కవి. కైలాస సమీపాన అలకాపురి చేరటంతో మొదటి సర్గ సమాప్తమవుతుంది.

రెండవ సర్గలో అలకానగరాన్ని, అక్కడి భవనాలను, స్త్రీ పురుషుల భోగానుభవాలను విపులంగా వర్ణిస్తాడు యక్షుడు. తన యింటి గుర్తులను తెల్పి తన భార్యయే విధంగా ఉండగలదో ఊహించి చెప్పుతాడు. తరువాత తన కుశల సమాచారం చెప్పి ఊరట కల్గించుమని కోరుతాడు.

మేఘుడా యక్షునిసందేశాన్ని అతని భార్యకు దేవతల భాషలో వినిపించినాడని, యక్షుని విరహవేదనను, సందేశాన్ని విన్న కుబేరుడు దయతో వారి శాపకాలాన్ని తగ్గించి వారి సమాగమాన్ని కల్పించినాడని, కావ్యాన్ని సుఖాంతంగా ముగించినాడు.

వాల్మీకి రామాయణంలో శ్రీరాముడు లంకలోని సీతకు హనుమంతునితో పంపిన సందేశము సందేశ కావ్యాలకు తొలి ప్రేరణగా భావించవచ్చు. భారతంలో నలదమయంతుల హంససందేశము, భాగవతంలో రుక్మిణి కృష్ణునికి పంపిన సందేశం కూడా దోహదం కావచ్చు. బృహత్కథలో యక్షుని శాప కథ ఉన్నట్లు తెలుస్తున్నది. పద్మపురాణంలో యోగినీ ఏకాదశి మహత్త్వ వర్ణన సందర్భంలో మేఘ సందేశ కథను పోలిన ఘట్టమున్నదని తెలుపుతూ శ్లోకాలతో కూడ విద్వాన్ కోసూరు వెంకట నరసింహరాజు తమ మేఘ సందేశ వ్యాఖ్య పుస్తకంలో వ్రాసినారు.

ఏమైనప్పటికి ఈ విధమైన సందేశ కావ్యాలలో కాళిదాసు మేఘ సందేశమే తొలి రచన.

దీని తరువాత అనుసరణగా చాలా సందేశకావ్యాలు వచ్చినవి. మేఘ సందేశంలోని ప్రతి శ్లోకం నాల్గవపాదాన్ని తన శ్లోకాల చివరిపాదంగా చేర్చి 'నేమిదూతమ్' అనే సందేశ కావ్యాన్ని విక్రమకవి నేమి అనే యాదవరాజుపై రచించాడు. ఇంకా హంస సందేశం, భృంగసందేశం, పవన దూతం, శుకసందేశం మొదలగు 70 వరకు సందేశ కావ్యాలున్నట్లు సంస్కృత వాఙ్మయ చరిత్రలో ఉన్నది.

రసము : ఈ కావ్యంలో విప్రలంభశృంగారం ప్రధానరసం. నాయికానాయకులు ఎడబాసి ఉన్నప్పుడు వారనుభవించే బాధను, జ్ఞాపకాలను వర్ణించేది విప్రలంభశృంగారము.

రామగిరి నుండి కైలాస పర్వతము వరకు మేఘునితో చెప్పిన మార్గవర్ణన వలన కాళిదాస కవికి గల భౌగోళిక పరిజ్ఞానం తెలుస్తుంది. వాటిలో కొన్ని పర్వతాల, పట్టణాల పేర్లు కాలక్రమంలో మార్పుచెంది ఉండవచ్చును.

# మేఘసందేశమ్

## ప్రథమ సర్గ

శ్లో॥ కశ్చిత్కాంతావిరహగురుణా స్వాధికారాత్ప్రమత్తః
శాపేనాస్తంగమితమహిమా వర్షభోగ్యేన భర్తుః
యక్షశ్చక్రే జనకతనయా స్నానపుణ్యోదకేషు
స్నిగ్ధచ్ఛాయాతరుషు వసతిం రామగిర్యాశ్రమేషు. 1

ప్రతిపదార్థం : కశ్చిత్ = ఒకానొక, యక్షః = యక్షుడు, స్వాధికారాత్ = తన ఉద్యోగ బాధ్యత నుండి, ప్రమత్తః = అశ్రద్ధతో తప్పుచేసి, కాంతా...గురుణా; కాంతా = భార్యయొక్క విరహ = ఎడబాటువలన, గురుణా = బరువైన, వర్షభోగ్యేన = ఏడాది పాటు అనుభవించవలసిన, భర్తుః = యజమానియొక్క, శాపేన = శాపము కారణంగా, జనక...దకేషు; జనకతనయా = జనకుని కూతురైన సీతయొక్క, స్నాన = స్నానముచేత, పుణ్య ఉదకేషు = పవిత్రమైన నీరు కలిగినవి, స్నిగ్ధ...తరుషు; స్నిగ్ధ = దట్టమైన, ఛాయా = నీడతో కూడిన, తరుషు = చెట్లుకలిగిన, రామగిరి+ఆశ్రమేషు = రామగిరి అనే పర్వత ప్రదేశములందు, వసతిం = నివాసమును, చక్రే = చేసెను.

తాత్పర్యం : ఒక యక్షుడు తన ప్రభువైన కుబేరుని సేవలో ఏదో తప్పుచేసి అతని కోపానికి గురైనాడు. కుబేరుడతనికి ఏడాదిపాటు ఇంటిని, భార్యను విడిచి వెళ్లాలని శపించినాడు. ఇది దేశ బహిష్కారం వంటి శిక్ష అనుకోవచ్చు. అందువలన యక్షుడు భూమిపైన రామగిరి అనే పర్వత ప్రాంతంలో నివసించాడు. పూర్వం వనవాసకాలంలో సీతారాములాప్రాంతంలో ఉన్నప్పుడు సీతాదేవి అక్కడ స్నానం చేయటం వలన ఆ నీరు పవిత్రమైందని, అక్కడ దట్టమైన నీడనిచ్చే చెట్లు ఉన్నాయని కవి వర్ణించినాడు.

ఈ కావ్యంలోని శ్లోకాలన్నీ 'మందాక్రాంత' అనే వృత్తంలో రాయబడ్డాయి. మ, భ, న, త, త గణాల తరువాత రెండు గురువులు ప్రతిపాదంలో ఉంటాయి. 4, 6, 7 అక్షరాల తరువాత ఒక విరామం ఉంటుంది. ఇది మందాక్రాంత వృత్త లక్షణం.

శ్లో॥ తస్మిన్నద్రౌ కతిచిదబలావిప్రయుక్తస్స కామీ
నీత్వా మాసా న్కనకవలయభ్రంశరిక్త ప్రకోష్ఠః
ఆషాఢస్య ప్రథమదివసే మేఘమాశ్లిష్టసానుం
వప్రక్రీడా పరిణత గజప్రేక్షణీయం దదర్శ. 2

ప్ర.ప. : అబలావిప్రయుక్తః = తనభార్యతో ఎడబాటు పొందినవాడు, కామీ = ఆమె యందు ప్రేమకలవాడు, కనక...ప్రకోష్ఠః; కనక = బంగారపు, వలయ = కడియము, భ్రంశ = జారుటచేత, రిక్త = శూన్యమైన, ప్రకోష్ఠః = ముంజేయికలవాడు ఐన, సః = ఆయక్షుడు, తస్మిన్ = ఆ, అద్రౌ = పర్వతముపైన, కతిచిత్ = కొన్ని, మాసాన్ = నెలలను, నీత్వా = గడిపి, ఆషాఢస్య = ఆషాఢమాసము యొక్క ప్రథమదివసే = మొదటి దినము, ఆశ్లిష్టసానుం = కొండ చరియను కరుచుకొని ఉన్నది, వప్ర...ప్రేక్షణీయం; వప్రక్రీడా = వప్రక్రీడలో, పరిణత = నిమగ్నమై ఉన్న, గజ = ఏనుగువలె, ప్రేక్షణీయం = చూడదగిన, మేఘం = మబ్బును, దదర్శ = చూచెను.

తా. : ఆ యక్షుడు కుబేరుని శాపం వలన భార్యకు దూరమై, ఆమె యందు ఎక్కువ ప్రేమ కలవాడు. కనుక విచారముతో బక్కచిక్కి చేతి కడియము జారగా కొన్ని నెలలు గడిపి, ఆషాఢ మాసము మొదటి రోజు పర్వతానికతుక్కొని ఉండి వప్రక్రీడలో నిమగ్నమైన ఏనుగువలె కనిపించే మేఘాన్ని చూచినాడు.

విశే : 1. ఆషాఢమంటే తెలుగు నెలల్లో నాలుగోది.

2. వప్రక్రీడ అనగా, ఏనుగులు మదము వచ్చినప్పుడు దంతములతో రాళ్లు, రప్పలను పైకి చిమ్ముతూ ఆడే ఆట.

శ్లో॥ తస్యస్థిత్వా కథమపి పురః కౌతుకాధానహేతో
రన్తర్బాష్ప శ్చిర మనుచరో రాజరాజస్య దధ్యౌ
మేఘాలోకే భవతి సుఖినోఽప్యన్యథా వృత్తిచేతః
కంఠాశ్లేషప్రణయిని జనే కిం పునర్దూరసంస్థే. 3

ప్ర.ప. : రాజరాజస్య = యక్షులకు రాజైన కుబేరుని యొక్క, అనుచరః = సేవకుడైన యక్షుడు, కౌతుక+ఆధానహేతోః = తహతహను కల్గించుటకు కారణమైన, తస్య = ఆ మేఘము యొక్క, పురః = ఎదుట, కథమపి = అతికష్టము మీద, స్థిత్వా = నిలిచి, అంతర్బాష్పః = కన్నీళ్లను లోపల అణచుకొని (భార్యను తలచుకొనుట వలన) చిరం =



చాలసేపు, దధ్యౌ = చింతించినాడు; మేఘాలోకే = మబ్బును చూచినప్పుడు, సుఖినః అపి = (భార్యతో) సుఖముగా ఉన్నవానికి కూడ, చేతః = మనస్సు, అన్యథా వృత్తి = మరొక విధముగా, భవతి = అవుతుంది, కంఠ+ఆశ్లేష ప్రణయిని = మెడను కౌగిలించు కొనుటలో ఆసక్తికల, జనే = జనము (వ్యక్తి), దూరసంస్థే సతి = దూరమందున్నప్పుడు, కింపునః = ఇంకేమి చెప్పవలెను?

తా. : కుబేరుని భృత్యుడైన యక్షుడు మనస్సులో కోరికను కలిగించే మేఘము ముందు కన్నీళ్ల నాపుకొని అతికష్టము మీద నిలిచి చాలాసేపు విచారించెను. లోకములో మబ్బును చూచినప్పుడు ప్రేయసితో కలిసి ఉన్నవారికి కూడ మనస్సు వికారము చెందుతుంది. అటువంటప్పుడు వారిలో ఒకరు దూరమైతే ఇక చెప్పవలసిన దేమున్నది? ప్రియావియోగంలో ఉన్న యక్షుడు మబ్బును చూచి కలతచెందటం సహజమని భావము.

విశే. : సంస్కృతంలో రెండు సప్తమ్యంతపదాల తరువాత సతి అనే మరొక సప్తమ్యంతం చేరిస్తే అవి ప్రథమావిభక్త్యర్థాన్ని బోధిస్తాయి. అందువలన జనే, దూరసంస్థే సతి అనగా జనము దూరమందుండగా అని అర్థం వచ్చింది. అలంకారము – అర్థాంతరన్యాసము.

ఒక విషయం చెప్పిదాన్ని మరొకదానితో సమర్థిస్తే అది అర్థాంతరన్యాసమవుతుంది. ఈ శ్లోకం మొదటి సగంలో చెప్పిన విషయాన్ని తరువాతి సగంలో సమర్థించటం జరిగింది.

శ్లో॥ ప్రత్యాసన్నే నభసి దయితాజీవితాలంబనార్థీ
జీమూతేన స్వకుశలమయీం హారయిష్య న్ప్రవృత్తిమ్
స ప్రత్యగ్రైః కుటజకుసుమైః కల్పితార్ఘాయ తస్మై
ప్రీతః ప్రీతి ప్రముఖవచనం స్వాగతం వ్యాజహార. 4

ప్ర.ప. : నభసి = శ్రావణ మాసము, ప్రత్యాసన్నే సతి = సమీపిస్తుండగా, దయితా...ర్థీ; దయితా = ప్రియురాలి (భార్య) యొక్క జీవిత = ప్రాణములను, ఆలంబన+అర్థీ = కాపాడదలచినవాడై, సః = ఆ యక్షుడు, జీమూతేన = మేఘముతో, స్వకుశలమయీం = తన క్షేమముతో కూడిన, ప్రవృత్తిం = వృత్తాంతాన్ని, హారయిష్యన్ = పంపదలచినవాడై, ప్రత్యగ్రైః = అప్పుడే వికసించిన, కుటజకుసుమైః = కొండమల్లెపూవులతో, కల్పిత+అర్ఘాయ = ఏర్పరచిన పూజా ద్రవ్యాలు కల, తస్మై = ఆమేఘుని కొరకు, స్వాగతం = స్వాగత వాక్యమును, ప్రీతః = సంతోషముతో కూడి, ప్రీతి ప్రముఖవచనం = ప్రేమతో కూడిన మాటలు కలుగునట్లు, వ్యాజహార = పలికెను.

తా. : వర్షాకాలంలో రెండవదైన శ్రావణమాసం దగ్గరపడుతున్నందువల్ల తన ఎడబాటు దుఃఖంతో మరణించకుండా తన భార్య ప్రాణాలు కాపాడదలచిన యక్షుడు ఆమెకు తన క్షేమ సమచారాన్ని మేఘునితో సందేశం పంపాలనుకున్నాడు. అందుకు ముందుగా మేఘునికి మర్యాద చేయదలచి, అప్పుడే విచ్చిన కొండ మల్లెపూలతో స్వాగత వచనాలు ప్రేమ పూర్వకంగా పలికినాడు.

శ్రావణం విరహంలో ఉన్నవారికి ఎక్కువతాపం కలిగించి ప్రాణాంతకం కూడ కావచ్చునని యక్షుడు ముందుచూపుతో వార్త పంపాలని తలచినాడు.

**శ్లో॥ ధూమజ్యోతి స్సలిలమరుతాం సన్నిపాతః క్వ మేఘః**
**సందేశార్థాః క్వ పటుకరణైః ప్రాణిభిః ప్రాపణీయాః**
**ఇత్యౌత్సుక్యాదపరిగణయ న్గుహ్యకస్తం యయాచే**
**కామార్తా హి ప్రకృతికృపణా శ్చేతనాచేతనేషు. 5**

ప్ర.ప. : ధూమ...మరుతాం; ధూమ = పొగ, జ్యోతిః = అగ్ని, సలిల = నీరు, మరుతాం = గాలి అనేవాటి యొక్క, సన్నిపాతః = సమ్మేళనరూపమైన, మేఘః = మబ్బు, క్వ = ఎక్కడ?, పటుకరణైః = బలమైన ఇంద్రియాలుకల, ప్రాణిభిః = ప్రాణులతో, ప్రాపణీయాః = చేర్చదగినవైన, సందేశార్థాః = వార్తల విషయాలు, క్వ = ఎక్కడ? ఇతి = అని, ఔత్సుక్యాత్ = మిక్కిలి ఆదుర్దా వలన, అపరిగణయన్ = లెక్కించక, గుహ్యకః = యక్షుడు, తం = ఆమేఘున్ని, యయాచే = కోరినాడు, కామార్తాః = కామంచే పీడింపబడేవారు, చేతనాచేతనేషు = ఇవి చేతనాలు ఇవికావు అనే విషయంలో, ప్రకృతి కృపణాః హి = సహజంగా మందబుద్ధులు కదా!

తా. : ఆవిరి, తేజస్సు, నీరు, గాలి యొక్క సమ్మేళనమైన అచేతనమేఘము బలమైన ఇంద్రియములు కలప్రాణులు చేర్చగల సందేశాన్ని ఏ విధంగా తీసుకొని పోగలదని భార్య విషయంలో కలతతో ఉన్న యక్షుడాలోచించక మేఘుని ప్రార్థించినాడు. కామంతో బాధపడేవారికి చేతనాచేతనముల వివేకముండదు కదా!

ఈ శ్లోకంలో చివరి పాదంతో పూర్వం చెప్పిన విషయాన్ని సమర్థించటం వలన అర్థాంతరన్యాసమనే అలంకారమున్నది. విరుద్ధ కార్య సంఘటన వలన విషమాలంకారము కూడ కలదు.



**శ్లో॥ జాతం వంశే భువనవిదితే పుష్కలావర్తకానాం**
**జానామి త్వాం ప్రకృతిపురుషం కామరూపం మఘోనః**
**తేనార్థిత్వం త్వయి విధివశాద్దూరబంధుర్గతోఽహం**
**యాచ్ఞామోఘా వరమధిగుణే నాధమే లబ్ధకామా. 6**

ప్ర.ప. : హేమేఘ = ఓ మేఘమా, త్వాం = నిన్ను, భువనవిదితే = లోకమందు ప్రసిద్ధమైన, పుష్కలావర్తకానాం = పుష్కలావర్తకములను పేరుగల, వంశే = వంశమునందు, జాతం = పుట్టినవానినిగా, మఘోనః = ఇంద్రునికి సంబంధించిన, కామరూపం = కోరినరూపము ధరించగలవానినిగా, ప్రకృతి పురుషం = ముఖ్యమైన అనుచరుడుగా, జానామి = ఎరుగుదును, తేన = అందుచేత, దూరబంధుః = దూరమందున్న బంధువు (భార్య) కల, అహం = నేను, విధివశాత్ = దైవగతి వలన, త్వయి = నీ విషయంలో, అర్థిత్వం = యాచక భావాన్ని, గతః = పొందినాను, అధిగుణే = మంచి గుణములు కలవాని విషయంలో, మోఘా = వ్యర్థమైనా, యాచ్ఞా = కోరుట, వరం = మేలయినది, అధమే = చెడ్డవానియందు, లబ్ధకామా = కోరికతీరినప్పటికి, యాచ్ఞా = అడుగుట, న వరం = మంచిదికాదు.

తా. : ఓ మేఘమా! నీవు ప్రసిద్ధమైన పుష్కలావర్తకములనే జాతికి చెందినవాడవని, కోరిన రూపముధరించగల ఇంద్రుని ముఖ్య పురుషుడవని నాకు తెలుసు. అందుచేతనే భార్యనెడబాసి ఉన్న నేను నిన్ను యాచించవలసివచ్చింది. మంచివారినడిగి లేదనిపించు కున్నా మేలు కాని అధముని వలన ఫలితం లభించినా కోరటం మంచిది కాదు కదా?

అలంకారం : అర్థాంతరన్యాసము. ప్రేయోఽలంకారము కూడ ఉన్నది.

**శ్లో॥ సంతప్తానాం త్వమసి శరణం తత్పయోద ప్రియాయాః**
**సందేశం మే హర ధనపతి క్రోధవిశ్లేషితస్య**
**గంతవ్యా తే వసతి రలకా నామ యక్షేశ్వరాణాం**
**బాహ్యోద్యానస్థిత హరశిరశ్చంద్రికా ధౌతహర్మ్యా. 7**

ప్ర.ప. : హేపయోద = ఓ మేఘమా, త్వం = నీవు, సంతప్తానాం = తాపము పొందినవారికి (ఎండచేత తపించిన వారికి), శరణం = కాపాడువాడవు, అపి = ఐ ఉన్నావు, తత్ = అందువలన, ధన...తస్య, ధనపతి = కుబేరుని యొక్క, క్రోధ = కోపము చేత, విశ్లేషితస్య = ఎడబాటు పొందిన, మే = నా యొక్క, సందేశం = కుశల

వార్తను, ప్రియాయాః = నా భార్యకు, హర = అందించుము, యక్షేశ్వరాణాం = యక్షప్రభువుల యొక్క, వసతిః = నివాసస్థానము, బాహ్యోద్యా...హర్మ్యా; బాహ్యా = నగరముబయట ఉన్న, ఉద్యాన = తోటలో, స్థిత = ఉన్నటువంటి, హర = శివునియొక్క శిరశ్చంద్రికా = తలమీది చంద్రుని వెన్నెల చేత, ధౌత = తెల్లగాచేయబడిన, హర్మ్యా = మేడలు కల, అలకానామ = అలక అనే పట్టణము, గంతవ్యా = వెళ్లదగినది.

**తా.** : ఓ మేఘుడా! నీవు జనుల తాపాన్ని పోగొట్టటానికి సమర్థుడవు. మా ప్రభువు కోపం వలన భార్యను విడిచి ప్రవాసం గడుపుతున్నాను. నా విరహంతో బాధపడుతున్న నా భార్యకు నాక్షేమ వార్తను, ఓదార్పు సందేశాన్ని అందజేయుము. నీవు యక్షుల నివాసమైన అలకానగరానికి వెళ్లవలసి ఉన్నది. అక్కడికి దగ్గరలోని కైలాసంలో ఉన్న శంకరుని తలమీది చంద్రుని వెన్నెలతో ఆ పట్టణపు భవనాలు తెల్లగా మెరుస్తుంటాయి.

నేను జీవించి ఉన్నానని, శాపము గడువు పూర్తికాగానే తిరిగి వత్తునని నీవు చెప్పితే ఆమె ప్రాణాలతో ఉంటుందని యక్షుని అభిప్రాయము.

**శ్లో॥ త్వామారూఢం పవనపదవీ ముద్గృహీతాలకాంతాః**
**ప్రేక్షిష్యంతే పథికవనితాః ప్రత్యయా దాశ్వసంత్యః**
**క స్సన్నద్ధే విరహవిధురాం త్వయ్యుపేక్షేత జాయాం**
**న స్యాదన్యోఽపృహమివ జనో యః పరాధీన వృత్తిః.** 8

**ప్ర.ప.** : పవనపదవీం = ఆకాశమును, ఆరూఢం = ఎక్కి ఉన్న, త్వాం = నిన్ను, పథికవనితాః = ప్రవాసంలో ఉన్నవారి భార్యలు, ఉద్గృహీతా....తాః; ఉద్గృహీత = పైకి లాగబడిన, అలకాంతాః = కురుల కొనలు కలవారై, ప్రత్యయాత్ = నమ్మకం వల్ల, ఆశ్వసంత్యః = ఊరడిల్లినవారై, ప్రేక్షిష్యంతే = చూడగలరు, త్వయి = నీవు, సన్నద్ధేసతి = వ్యాపించి ఉండగా, విరహ విధురాం = ఎడబాటుతో బాధపడుతున్న, జాయాం = భార్యను, కః = ఎవడు, ఉపేక్షేత = నిర్లక్ష్యము చేయగలడు? యః = ఎవడు, పరాధీన వృత్తిః = ఇతరుల అధీనమైన జీవితము కల, అహమివ = నావలె, అన్యః = ఇతరుడైన, జనః అపి = వ్యక్తికూడ, నస్యాత్ = కాజాలడు.

**తా.** : ఓ మేఘమా! నీవు ఆకాశంలో కనిపించగానే భర్తలకు దూరంగా ఉన్న స్త్రీలు, తమ భర్తలు తొందరలో తిరిగివత్తురనే నమ్మకంతో ముంగురులను పైకెత్తి దారులను నిరీక్షిస్తూ నీవైపు చూస్తారు. వర్షాకాలములో విరహతాపం ఎక్కువ కనుక దూర ప్రాంతాలకు వెళ్లిన భర్తలు మబ్బును చూచి ఇంటిదారి పట్టుతారు. పరాధీనజీవితం కల నావంటి



వాడు తప్ప మేఘాన్ని చూచి కూడ తమ భార్యల వద్దకు రాకుండ ఎవడుండగలడు? అని యక్షుడు మేఘముతో పలికినాడు.

అలంకారం : అర్థాంతరన్యాసాలంకారము.

**శ్లో॥ తాం చావశ్యం దివసగణనా తత్పరా మేకపత్నీ**
**మవ్యాపన్నా మవిహతగతి ర్ద్రక్ష్యసి భ్రాతృజాయామ్**
**ఆశాబన్ధః కుసుమసదృశం ప్రాయశోహ్యంగనానాం**
**సద్యఃపాతి ప్రణయి హృదయం విప్రయోగే రుణద్ధి.** 9

**ప్ర.ప.** : అవిహతగతిః = అడ్డులేని నడకగలదానవై, దివస...త్పరాం; దివస = రోజులను, గణనా = లెక్కపెట్టుటలో, తత్పరాం = నిమగ్నమై ఉన్న, ఏకపత్నీం = పతియే ముఖ్యుడుగా కలది ఐన, భ్రాతృజాయాం = అన్నభార్యను (సోదర సమానుడనైన నాభార్యను) అవశ్యం = తప్పక, అవ్యాపన్నాం = ఆపదను పొందని దాన్నిగా, ద్రక్ష్యసి = చూడగలవు, ఆశాబన్ధః = ఆశ అనే బంధము (తొడిమె), అంగనానాం = స్త్రీలయొక్క కుసుమసదృశం = పూవుతో సమానమైన, ప్రణయి హృదయం = అనురాగ హృదయము కలది, విప్రయోగే = విరహ సమయంలో, సద్యఃపాతి = వెంటనే పడిపోవుదాన్ని, ప్రాయశః = సాధారణంగా, రుణద్ధి = అడ్డగించును.

**తా.** : ఓ మేఘమా! నీవు ఆటంకాలు లేకుండా అక్కడికి వెళ్లి, నారాక కొరకు రోజులను లెక్కపెట్టుతున్న, నాపైనే మనస్సు నిల్పి ఉన్న నా భార్యను క్షేమంగా ఉండగా తప్పక చూస్తావు. ఎందుకనగా, పూలవలె కోమలమైన స్త్రీల మనస్సు ప్రియుల యెడబాటుకు బాధతో పతనావస్థకు చేరుకొన్నప్పుడు ఆశ అనే బంధము దానిని నిలిపి ఉంచుతుంది. ఆశ ప్రాణాలను నిలుపటానికి తొడిమెవలె పనిచేస్తుందని భావము.

అలంకారం : అర్థాంతరన్యాసాలంకారము.

**శ్లో॥ మందంమందం నుదతి పవన శ్చానుకూలో యథాత్వాం**
**వామ శ్చాయం నదతి మధురం చాతకస్తే సగంధః**
**గర్భాధానక్షణ పరిచయా న్నూన మాబద్ధమాలాః**
**సేవిష్యంతే నయనసుభగం ఖే భవంతం బలాకాః** 10

**ప్ర.ప.** : అనుకూలః = అనుకూలమైన, అయం = ఈ, పవనశ్చ = వాయువు కూడ, త్వాం = నిన్నుద్దేశించి, మందం-మందం యథా = మెల్లమెల్లగా, నుదతి =

వీస్తున్నది, అయం = ఈ, సగంధః = గర్వముతో కూడిన, చాతకః = వానకోయిల, వామః = ఎడమభాగంలో, మధురం = తీయగా (కమ్మగా) నదతి = కూస్తున్నది, గర్భా...పరిచయాత్; గర్భ = గర్భమును, ఆధాన = ధరించుటకువీలైన, క్షణ = సమయము యొక్క పరిచయాత్ = గుర్తించటం వల్ల, ఖే = ఆకాశంలో, ఆబద్ధమాలాః = బారులు తీరినవై, నయనసుభగం = నేత్రములకు అందముగా కనిపించే, భవంతం = నిన్ను, బలాకాః = బెగ్గురు పక్షులు, సేవిష్యంతే = సేవించగలవు.

**తా.** : మేఘమా! నీ ప్రయాణానికి మంచి శకునాలు కన్పిస్తున్నాయి. అనుకూలమైన గాలి మెల్లమెల్లగా వీస్తున్నది. చాతక పక్షి ఎడమభాగంలో మదించి కమ్మంగా కూస్తున్నది. వర్షాకాలము తమకు గర్భము ధరించే సమయమని గుర్తించి బెగ్గురు పక్షులు నిన్నుచూచి ఆకాశంలో బారులు తీరి, చూచుటకు అందంగా ఉన్న నిన్ను సేవించగలవు. చల్లని గాలి, చాతకపక్షి వామభాగంలో కూయటం, బలాకలదర్శనం శుభశకునాలని విశ్వాసము.

శ్లో॥ **కర్తుం యచ్చ ప్రభవతి మహీముచ్ఛిలీంధ్రా మవంధ్యాం**
**తచ్ఛ్రుత్వా తే శ్రవణసుభగం గర్జితం మానసోత్కాః**
**ఆ కైలాసా ద్బిసకిసలయచ్ఛేద పాథేయవంతః**
**సంపత్స్యంతే నభసి భవతో రాజహంసాః సహాయాః** **11**

ప్ర.ప. : యత్ = ఏదైతే, మహీం = భూమిని, ఉచ్ఛిలీంధ్రాం = పుట్టగొడుగులు మొలిచినదానిగా, అవంధ్యాం = పంటలు పండే దాన్నిగా, కర్తుం = చేయటానికి, ప్రభవతి = సమర్థమవుతుందో, తత్ = ఆ, శ్రవణ సుభగం = చెవులకింపుగా ఉండే, తే = నీ యొక్క గర్జితం = ఉరుమును, శ్రుత్వా = విని, మానస+ఉత్కాః = మానస సరస్సుపై కుతూహలంకలవై, బిస...వంతః; బిసకిసలయ = లేత తామర తూండ్ల, ఛేద = ముక్కలే, పాథేయవంతః = దారిలో ఆహారంగా కలవై, భవతః = నీకు, ఆకైలాసాత్ = కైలాసపర్వతం వరకు, రాజహంసాః = రాజహంసలు, సహాయాః = తోడుగా, సంపత్స్యంతే = కాగలవు.

**తా.** : ఓ మేఘుడా! నీ గర్జనను విని హంసలు మానస సరస్సుకు వెళ్లటానికి వేడుక పడుతాయి. నీ ఉరుము వర్షానికి సూచన. వర్షంతో భూమిపై పుట్టగొడుగులు మొలుస్తాయి. నేలకూడ పంటలు పండిస్తుంది. వర్షాకాలంలో నదుల నీరు మురికిగా ఉంటుంది కనుక హంసలు ఆ కాలంలో మానస సరస్సు దగ్గరకు వెళ్లుతాయని ప్రసిద్ధి. అందువలన నీ గర్జన విని మానస సరస్సుకు బయలుదేరే రాజహంసలు కైలాసపర్వతం వరకు ఆకాశమార్గంలో నీకు సహాయంగా ఉంటాయి. అవి ప్రయాణకాలంలో తమ ఆహారం కొరకు లేత తామర కాడల ముక్కలను చద్దిగా తెచ్చుకుంటాయి. మానస సరస్సు కైలాస పర్వతానికి సమీపంలో ఉంటుంది కనుక మీరు కలిసి ప్రయాణం చేయవచ్చునని యక్షుని అభిప్రాయం.

శ్లో॥ **ఆపృచ్ఛస్వ ప్రియసఖ మముం తుంగమాలింగ్య శైలం**
**వంద్యైః పుంసాం రఘుపతిపదై రంకితం మేఖలాసు**
**కాలేకాలే భవతి భవతా యస్య సంయోగమేత్య**
**స్నేహవ్యక్తి శ్చిరవిరహజం ముంచతో బాష్ప ముష్ణమ్.** **12**

ప్ర.ప. : ప్రియసఖం = ప్రియమిత్రము, తుంగం = ఎత్తైనది, పుంసాం = జనులకు, వంద్యైః = పూజింపదగిన, రఘుపతి = శ్రీరాముని, పదైః = అడుగులతో, మేఖలాసు = చరియలపైన, అంకితం = గుర్తులు వేయబడిన, అముం = ఈ, శైలం = రామగిరిని (చిత్రకూటాన్ని) ఆలింగ్య = కౌగిలించుకొని, ఆపృచ్ఛస్వ = వీడ్కోలు తీసుకొనుము, కాలేకాలే = ప్రతివర్షకాలంలో, భవతా = నీతో, సంయోగం = కలయికను, ఏత్య = పొంది, చిరవిరహజం = చాలాకాలం ఎడబాటు వల్ల కల్గిన, ఉష్ణం = వేడి, బాష్పం = కన్నీటిని, ముంచతః = వదులుతున్న, యస్య = ఏ రామగిరి యొక్క స్నేహవ్యక్తిః = స్నేహ ప్రకటన, భవతి = వెల్లడి అవుతున్నదో.

**తా.** : జలదా! నీవు వెళ్లేముందు నీ మిత్రము, ఎత్తైన ఈ రామగిరిని ఆలింగనం చేసుకొని వీడ్కోలు చెప్పి కదులుము. పూర్వము వనవాసకాలంలో శ్రీరాముడిక్కడ కొంతకాలమున్నాడు కనుక ఆయన పాద ముద్రలు కొండచరియల మీద పడినవి కనుక జనులా పర్వతాన్ని పూజిస్తారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో నీవు కలిసినప్పుడు చాలాకాలపు ఎడబాటు వలన కలిసినప్పుడు వేడి కన్నీటిని విడిచి తన స్నేహాన్ని ఈ పర్వతము వ్యక్తం చేస్తుంది. చిరకాలం తరువాత కలిసిన వారికి ఆనందబాష్పాలు రాలటం సహజమే కదా! వర్షం పడగానే పర్వతము తన పూర్వపువేడిని ఆవిరిగా వదులుటను వేడినిట్టూర్పుగా కవి వర్ణించినాడు. కొండలకు, మబ్బులకు స్నేహం వర్ణించటం కవి సమయంగా గ్రహించాలి.

శ్లో॥ **మార్గం తావచ్ఛృణు కథయత స్త్వత్ప్రయాణానురూపం**
**సందేశం మే తదను జలద శ్రోష్యసి శ్రోత్రపేయమ్**

**ఖిన్నః ఖిన్నః శిఖరిషుపదం న్యస్య గంతాసి యత్ర**
**క్షీణః క్షీణః పరిలఘు పయః స్రోతసాం చోపభుజ్య.** 13

ప్ర.ప. : జలద = ఓ మేఘమా! తావత్ = ఇప్పుడు, కథయతః = చెప్పుతున్న నానుండి, త్వత్ప్రయాణ+అనురూపం = నీ ప్రయాణానికనుకూలమైన, మార్గం = దారిని, శృణు = వినుము, తదను = ఆ తరువాత, మే = నాయొక్క, శ్రోత్రపేయం = చెవులకు విందైన, సందేశం = సందేశాన్ని, శ్రోష్యసి = వినగలవు, ఖిన్నః ఖిన్నః = ప్రతిసారి అలసినప్పుడు, యత్ర = ఏ మార్గంలో, శిఖరిషు = పర్వతాలపైన, పదం = పాదమును, న్యస్య = ఉంచి, క్షీణః క్షీణః = బక్కపడినప్పుడంతా, స్రోతసాం = నదీప్రవాహాల యొక్క, పరిలఘు = తేలికైన (స్వచ్ఛమైన), పయః = నీటిని, ఉపభుజ్య = త్రాగి, గంతాసి = వెళ్లుదువు.

తా. : ఓ మేఘమా! నీవు ముందుగా నీ ప్రయాణానికనుకూలమైన మార్గాన్ని వినుము. తరువాత నా భార్యకు నేను పంపే సందేశాన్ని విందువుగాని ప్రయాణకాలంలో అలసిపోయినప్పుడు దారిలో పర్వతాల శిఖరాల మీద కొంచెం విశ్రమించి, కృశించినప్పుడు నదులలోని నిర్మలమైన నీటిని త్రాగి సుఖంగా ప్రయాణం చేయవచ్చును.

**శ్లో॥ అద్రేః శృంగం హరతి పవనః కిం స్విదిత్యున్ముఖీభిః**
**దృష్టోత్సాహ శ్చకితచకితం ముగ్ధసిద్ధాంగనాభిః**
**స్థానా దస్మాత్సరసనిచులా దుత్పతోదఙ్ముఖః ఖం**
**దిఙ్నాగానాం పథి పరిహరన్ స్థూలహస్తావలేపాన్.** 14

ప్ర.ప. : పవనః = వాయువు, అద్రేః = పర్వతముయొక్క, శృంగం = శిఖరాన్ని, హరతికింస్విత్ = తీసుకొనిపోతున్నదాయేమి? ఇతి = అని, ఉన్ముఖీభిః = ముఖాలు పైకెత్తిన, ముగ్ధ = అమాయకులైన, సిద్ధాంగనాభిః = సిద్ధజాతిస్త్రీలచేత, చకితచకితం = భయం భయంగా, దృష్టోత్సాహః = చూడబడిన ఉత్సాహంతో, సరసనిచులాత్ = తడితో కూడిన మెట్ట ప్రబ్బలిచెట్లుకల, అస్మాత్ = ఈ, స్థానాత్ = స్థలమునుండి, ఉదఙ్ముఖః = ఉత్తరంవైపు ముఖం కలదానవై, ఖం = ఆకాశంవైపు, పథి = మార్గంలో, దిఙ్నాగానాం = దిగ్గజములయొక్క, స్థూల = లావైన, హస్త+అవలేపాన్ = తొండములు విదుల్చుటను, పరిహరన్ = తప్పించుకొని, ఉత్పత = పైకెగురుము.

తా. : ఓ మేఘమా! నీవు ఈ పర్వతం నుండి కదిలినప్పుడు అమాయకులైన సిద్ధస్త్రీలు, వాయువు పర్వత శిఖరాన్ని తీసుకొనిపోతున్నదాయేమి? అని వింతగా భయంగా



చూస్తారు. దానితో ఉత్సాహము పొందిన నీవు నేల ప్రబ్బలి చెట్లున్న ఈ ప్రదేశం నుండి దారిలో దిగ్గజాల తొండములు విదల్చుటను తప్పించుకొని ఉత్తరం వైపు ఆకాశంలోకి ఎగురుము.

ఈ శ్లోకంలో మరొక అర్థం కూడ గూఢంగా సూచింపబడిందని కొందరు పండితుల అభిప్రాయంగా మల్లినాథసూరి తన వ్యాఖ్యానంలో పేర్కొన్నారు.

కాళిదాసు మిత్రుడు నిచులుడనే వాని నివాసము నీదారిలో ఉంటుంది. అతణ్ణి దర్శించి వెళ్లుము. దిఙ్నాగుడనే మహాపండితుడు, కాళిదాసుకు ప్రతిస్పర్ధి. కాళిదాసు నాక్షేపిస్తుంటాడు. అతని చేతి విదిలింపులను లెక్కచేయక ముందుకు సాగిపొమ్ము అనే విషయాన్ని అన్యాపదేశంగా కవి ప్రయోగించినాడని వారి భావం. ఇది ఎంత వాస్తవమో చెప్పలేము.

అలంకారం : మేఘాన్ని పర్వత శిఖరంగా భ్రమపడినట్లు చెప్పటం వలన భ్రాంతి మదలంకారము.

**శ్లో॥ రత్నచ్ఛాయా వ్యతికర ఇవ ప్రేక్ష్యమేత త్పురస్తా**
**ద్వల్మీకాగ్రా త్ప్రభవతి ధనుఃఖండ మాఖండలస్య**
**యేన శ్యామం వపురతితరాం కాంతి మాపత్స్యతే తే**
**బర్హేణేవ స్ఫురితరుచినా గోపవేషస్య విష్ణోః.** 15

ప్ర.ప. : రత్న...కరఇవ; రత్న = మణుల యొక్క, ఛాయా = కాంతుల, వ్యతికరఇవ = కలయికవలె, ప్రేక్ష్యం = చూడదగిన, ఆఖండలస్య = ఇంద్రునియొక్క, ఏతత్ = ఈ, ధనుః ఖండం = విల్లుముక్క, పురస్తాత్ = ముందుభాగంలో, వల్మీకాగ్రాత్ = పుట్టకొన నుండి, ప్రభవతి = పుట్టుతున్నది, యేన = దేనిచేత, శ్యామం = నల్లనైన, తే = నీయొక్క వపుః = శరీరము, అతితరాం = ఎక్కువగా, కాంతిం = శోభను, గోపవేషస్య = గోపాలుని వేషంలో ఉన్న, విష్ణోః = విష్ణువు యొక్క, వపుః = శరీరము, బర్హేణ ఇవ = నెమలి పింఛముతో వలె, ఆపత్స్యతే = పొందగలదు.

తా. : ఓ జలదా! అదిగో చూడుము! ఎదురుగా పుట్టలో నుండి పైకి వస్తున్నట్లున్న ఇంద్రధనుస్సు. రకరకాల మణుల కాంతుల సమ్మేళనమా అన్నట్లు ఎంత మనోజ్ఞంగా ఉన్నది! నల్లని నీ శరీరం ఇంద్రధనుస్సుతో కూడినప్పుడు నెమలి పింఛముతో కూడిన నల్లని శరీరం కల శ్రీకృష్ణుని శరీరం వలె ప్రకాశిస్తుంది.

ఇక్కడ మేఘుణ్ణి శ్రీకృష్ణునితో పోల్చటం వలన ఉపమాలంకారము.

**శ్లో॥ త్వయ్యాయత్తం కృషిఫలమితి భ్రూవికారానభిజ్ఞైః**
**ప్రీతి స్నిగ్ధై ర్జనపదవధూలోచనైః పీయమానః**
**సద్యః సీరోత్కషణసురభి క్షేత్రమారుహ్య మాలం**
**కించిత్పశ్చా ద్ప్రజ లఘుగతి ర్భూయ ఏవోత్తరేణ** **16**

ప్ర.ప. : కృషిఫలం = వ్యవసాయపుపంట, త్వయి = నీయందు, ఆయత్తం = ఆధారపడి ఉన్నది, ఇతి = అని, ప్రీతి స్నిగ్ధైః = ప్రేమతో నిండిన, భ్రూవికార = కనుబొమ్మల విలాసాలను, అనభిజ్ఞైః = తెలియనటువంటి, జన...లోచనైః, జనపద = పల్లెలలోని, వధూ = స్త్రీల యొక్క, లోచనైః = కన్నులతో, పీయమానః = త్రాగబడుతూ (ఆసక్తితో చూస్తుండగా), మాలం = మాలమనే పేరుకల, క్షేత్రం = ఎత్తయిన ప్రదేశమును, సద్యః = అప్పుడే, సీరో...సురభి, సీర = నాగలి చేత, ఉత్కషణ = దున్నుట వలన, సురభి = భూమిలోని సువాసన వ్యాపించగా, ఆరుహ్య = ఎక్కి, లఘుగతిః = శీఘ్ర గమనం కలవాడవై, కించిత్ = కొంచెము, పశ్చాత్ = పడమరగా, వ్రజ = వెళ్లుము, భూయః = మళ్లీ, ఉత్తరేణ ఏవ = ఉత్తర దిక్కుగానే, వ్రజ = వెళ్లుము.

తా. : మేఘమా! నీవు వర్షిస్తే పంటలు పండుతాయి. పంటలతో మనుష్యులకాహారం లభిస్తుంది. పంటలు పండటం నీ అధీనంలో ఉన్నది. అందువలన నీవు ఆకాశంలో కనబడగానే అమాయకులైన పల్లెపడుచులు ప్రేమగా, ఆసక్తితో చూస్తారు. వారికి కనుబొమ్మలతో వయ్యారాలు చూపటం తెలియదు. వారి చూపులకు ప్రతిఫలంగా అక్కడ మాలమనే ప్రదేశంలో వర్షించి, అంతకుముందే దున్నటం వలన వర్షానికి భూమి నుండి పరిమళం వ్యాపిస్తుంది. అక్కడి నుండి వేగంగా కొంచెం పడమటికి వెళ్లి, మళ్లీ ఉత్తర దిశగానే ప్రయాణం సాగించుము.

**శ్లో॥ త్వామాసార ప్రశమిత వనోపప్లవం సాధు మూర్ధ్నా**
**వక్ష్య త్యధ్వశ్రమపరిగతం సానుమా నామ్రకూటః**
**న క్షుద్రోఽపి ప్రథమ సుకృతాపేక్షయా సంశ్రయాయ**
**ప్రాప్తే మిత్రే, భవతి విముఖః కింపునర్యస్తథోచ్చైః** **17**

ప్ర.ప. : ఆసార...ప్లవం, ఆసార = వర్షధారలతో, ప్రశమిత = చల్లార్చబడిన, వన+ఉపప్లవం = కార్చిచ్చు కల, అధ్వశ్రమ = మార్గంలో కల్గిన ఆయాసముతో, పరిగతం



= కూడుకొన్న, త్వాం = నిన్ను, సాధు = బాగుగా, సానుమాన్ = చరియలతో కూడిన, ఆమ్రకూటః = ఆమ్రకూటమను పర్వతము, మూర్ధ్నా = శిరస్సుతో, వక్ష్యతి = మోయగలదు, క్షుద్రః అపి = నీచుడు కూడ, సంశ్రయాయ = ఆశ్రయముకొరకు, మిత్రే = స్నేహితుడు, ప్రాప్తేసతి = తనను చేరినప్పుడు, ప్రథమ = పూర్వము చేసిన, సుకృత + అపేక్షయా = ఉపకార స్మరణతో, విముఖః = ప్రతికూలుడుగా, నభవతి = ఉండడు, యః = ఏ పర్వతము, తథా = ఆ విధముగా, ఉచ్చైః = ఉన్నతమైనదో (ఎత్తైనదో), కింపునః = (దాని విషయంలో) చెప్పవలసినదేమి?

తా. : ఓమేఘమా! నీవు వెళ్లేదారిలో ఆమ్రకూటమనే పర్వతం వస్తుంది. అక్కడ నీవు ధారాపాతంగా వర్షం కురిస్తే అడవిలోని కార్చిచ్చు చల్లారుతుంది. తనకావిధంగా ఉపకారం చేసిన, ప్రయాణంతో అలసిన నిన్ను ఆ పర్వతము తలపై మోసి నీకు కొంత విశ్రాంతినిస్తుంది. లోకంలో తనకు పూర్వం సహాయం చేసిన వ్యక్తి వచ్చి ఆశ్రయం కోరితే నీచుడు కూడ కాదనడు. ఇక ఉన్నతమైన ఆమ్రకూటము నీకాశ్రయమివ్వటంలో చెప్పవలసినదేమున్నది? తప్పక నీకాశ్రయమివ్వగలదని భావము.

అలంకారం : అర్థాంతరన్యాసాలంకారము. (లక్షణము పూర్వం చెప్పబడింది)

**శ్లో॥ ఛన్నోపాన్తః పరిణతఫలద్యోతిభిః కాననామ్రైః**
**త్వయ్యారూఢే శిఖరమచలః స్నిగ్ధవేణీసవర్ణే**
**నూనం యాస్య త్యమర మిథునప్రేక్షణీయా మవస్థాం**
**మధ్యే శ్యామః స్తన ఇవ భువః శేషవిస్తారపాండుః** **18**

ప్ర.ప. : హేమేఘ! = ఓ మేఘమా! పరి...ద్యోతిభిః, పరిణత = బాగుగా పండిన, ఫల = పండ్లతో ద్యోతిభిః = ప్రకాశిస్తున్న, కాననామ్రైః = అడవిలోని మామిడి చెట్లచేత, ఛన్న+ఉపాంతః = కప్పబడిన ప్రక్క భాగాలు కల్గిన, అచలః = ఆమ్రకూట పర్వతము, స్నిగ్ధవేణి = చిక్కనిజడతో, సవర్ణే = సమానపురంగు కల, త్వయి = నీవు, శిఖరం = పైభాగాన్ని, ఆరూఢేసతి = ఎక్కినప్పుడు, మధ్యే = నడుమ, శ్యామః = నల్లనై, శేష..పాండుః; శేష = మిగిలిన స్థలములో, విస్తార = ఎక్కువగా, పాండుః = పాండు వర్ణము (తెలుపుతో కూడిన ఎరుపు) కలిగిన, భువః = భూమి యొక్క, స్తనః ఇవ = స్తనమువలె, అమర...ప్రేక్షణీయాం; అమర = దేవతల, మిథున = జంటల చేత, ప్రేక్షణీయాం = చూడదగిన, అవస్థాం = దశను, నూనం = నిశ్చయముగా, యాస్యతి = పొందగలదు.

**తా.** : ఆమ్రకూట పర్వతము పైన మామిడి చెట్లు పండ్లతో దట్టంగా వ్యాపించటం చేత ఆ పర్వతపు పక్క భాగాలు కప్పబడి తెల్లగా కనబడుతాయి. చిక్కనైన జడవలె నల్లని నీవు ఆ పర్వతశిఖరం మీద నిలిచినప్పుడు ఆదృశ్యము, మధ్యలో నల్లగా, మిగిలిన భాగమంతా పాండు వర్ణము కలభూమి యొక్క స్తనమువలె దేవతల జంటలు చూచి వినోదించే స్థితిని తప్పక పొందుతుంది. మామిడిపండ్లు పాండు వర్ణంలో ఉంటాయి. పర్వతం చుట్టూ చెట్లపండ్లతో పాండు వర్ణంగా, మధ్యలో మబ్బుతో నల్లగా ఉండటం చేత కవి ఈ విధంగా వర్ణించినాడు.

మేఘమును జడతోపోల్చుట వలన ఉపమాలంకారము. దేవతామిథునాలు పర్వతాన్ని భూమి యొక్క స్తనముగా చూస్తారని ఊహించి చెప్పటం వలన ఉత్ప్రేక్షాలంకారము కూడ ఉన్నది. ఈ రెండిటికి సంసృష్టి ఒకదానిపై మరొకటి ఆధారపడకుండా అలంకారాలుంటే అది సంసృష్టి అని, పరస్పర మాధారపడి వేరు చేయవీలుకాని అలంకారాలకు సంకరమని ఆలంకారికుల లక్షణము.

సంసృష్టి = తిలతండుల న్యాయము, బియ్యము నుండి నువ్వులను వేరుచేయటం సాధ్యమవుతుంది కదా!

సంకరము = క్షీరనీరన్యాయము – పాలలో కలిపిన నీళ్లను వేరుచేయలేనట్లు అలంకార విషయం కూడ అంతే అని భావము.

శ్లో॥ **స్థిత్వా తస్మి న్వనచరవధూ భుక్తకుంజే ముహూర్తం**
**తోయోత్సర్గ ద్రుతతరగతి స్తత్పరం వర్త్మ తీర్ణః**
**రేవాం ద్రక్ష్యస్యుపల విషమే వింధ్యపాదే విశీర్ణాం**
**భక్తిచ్ఛేదై** రివ విరచితాం **భూతిమంగే** గజస్య **19**

ప్ర.ప. : వన...కుంజే; వనచర = కిరాతుల యొక్క వధూ = స్త్రీల చేత, భుక్త = అనుభవించబడిన, కుంజే = పొదరిండ్లుకల, తస్మిన్ = ఆ ఆమ్రకూట పర్వతము మీద, ముహూర్తం = కొంచెంసేపు, స్థిత్వా = నిలిచి, తోయోత్స...గతిః; తోయ = నీటిని, ఉత్సర్గ = (వర్షంతో) విడుచుట వలన, ద్రుతతర = ఎక్కువవేగముకల, గతిః = గమనం కలవాడవై, తత్పరం = దాని తరువాత, వర్త్మ = మార్గాన్ని, తీర్ణః = దాటినవాడవై, ఉపల విషమే = రాళ్లతో ఎగుడుదిగుడుగా ఉన్న, వింధ్యపాదే = వింధ్యపర్వతపు క్రింది భాగంలో, విశీర్ణాః = చెల్లాచెదురుగా వ్యాపించిన, రేవాం = నర్మదానదిని, గజస్య = ఏనుగు యొక్క



అంగే = శరీరమందు, భక్తిచ్ఛేదైః = రచనాశిల్పములతో, విరచితాం = చిత్రించబడిన, భూతిమివ = అలంకారమును వలె, ద్రక్ష్యసి = చూడగలవు.

**తా.** : ఓ మేఘమా! ఆమ్రకూట పర్వతపు పొదరిండ్లలో ఆటవిక స్త్రీలు తమ ప్రియులతో రమింతురు. అక్కడ పర్వతం మీద కొంచెం విశ్రమించి, వర్షం కురవటం వలన నీ బరువు తగ్గి తొందరగా ప్రయాణించి ముందుకువెళ్లి రాళ్లతో ఎత్తుపల్లాలుగా ఉన్న వింధ్య పర్వతపు క్రింద చెదరి ప్రవహిస్తున్న నర్మదానదిని చూడగలవు. అది యేనుగు శరీరంపై చిత్రకళా నైపుణ్యంతో చేసిన అలంకారము వలె కన్పించును. పర్వతము ఏనుగువలె, చెదరిన నర్మదా జలధారలు ఏనుగుల శరీరంపై అలంకారాల వలె పోల్చబడినవి. అందువలన ఉపమాలంకారము.

శ్లో॥ **తస్యా స్తిక్తై ర్వనగజమదై ర్వాసితం వాన్తవృష్టి**
**ర్జంబూకుంజ ప్రతిహతరయం తోయమాదాయ గచ్ఛేః**
**అంతస్సారం ఘన తులయితుం నానిలః శక్ష్యతి త్వాం**
**రిక్తః సర్వోభవతి హి లఘుః పూర్ణతా గౌరవాయ** **20**

ప్ర.ప. : హేఘన! = ఓ మేఘుడా! వాంతవృష్టిఃసన్ = వర్షము కురిసినవాడవై, తిక్తైః = మంచి వాసన కల, వనగజమదైః = అడవి యేనుగుల మదజలములతో, వాసితం = పరిమళము కలిగిన, తస్యాః = ఆ నర్మదానది యొక్క, జంబూ...రయం, జంబూ = నేరేడు చెట్ల యొక్క, కుంజ = పొదలచేత, ప్రతిహత = అడ్డగింపబడిన, రయం = వేగము కలిగిన, తోయం = నీటిని, ఆదాయ = త్రాగి, గచ్ఛేః = వెళ్లుము, అంతస్సారం = లోపల సారము (నీకు) కల, త్వాం = నిన్ను, అనిలః = వాయువు, తులయితుం = త్రోయటానికి, నశక్ష్యతి = సమర్థము కాదు, హి = ఎందుకనగా, రిక్తః = శూన్యమైనది, సర్వః = అంతయు, లఘుః = చులకన (తేలిక)గా, పూర్ణతా = నిండుగా ఉండుట, గౌరవాయ = గొప్పతనానికి (బరువుకు) భవతి = తగినది అవుతుంది.

**తా.** : ఓ మేఘమా! నీవు సువాసనకల అడవి యేనుగుల మదజలధారలతో పరిమళం కలిగినవి, నేరేడు చెట్ల పొదలవల్ల వేగము తగ్గిన నర్మదానది జలాన్ని త్రాగి ముందుకు సాగుము. అంతకు ముందు నీవు వర్షించినావు. కనుక నీలో సారము తగ్గింది. ఇప్పుడు నీలో నీరు నింపుకోవటం వలన వాయువు నిన్ను త్రోసి వేయజాలదు. శూన్యమైన దంతా తేలికగాను, నిండుగా ఉన్నది బరువుగాను ఉంటుంది కదా! లోపల ఏమీలేని

పాత్ర బరువులేక తేలికగా ఉంటుందని, నీరు నిండుగా ఉంటే బరువుంటుందని సామాన్యార్థము.

కవి ఇక్కడ లోకన్యాయ సిద్ధమైన మరొక విషయాన్ని ధ్వనింపజేసినాడు. లోకంలో రిక్త (దరిద్రు)డైన ప్రతివాడు చులకనగా చూడబడుతాడు. సంపదతో నిండుగా ఉన్నవాడు గౌరవాన్ని పొందుతున్నాడు కదా! అని.

అర్థాంతరన్యాసాలంకారము.

**శ్లో॥ నీపం దృష్ట్వా హరితకపిశం కేసరై రర్ధరూఢై**
**రావిర్భూత ప్రథమముకుళాః కందలీశ్చానుకచ్ఛమ్**
**జగ్ధ్వారణ్యే ష్వధిక సురభిం గంధమాఘ్రాయ చోర్వ్యాః**
**సారంగాస్తే జలలవముచః సూచయిష్యన్తి మార్గమ్.** **21**

ప్ర.ప. : సారంగాః = జింకలు, అర్ధరూఢైః = సగము మొలకెత్తిన, కేసరైః = కింజల్కములతో (పూవుల మధ్యభాగంలో సన్నని పుల్లలవంటివి), హరితకపిశం = ఎరుపు పసుపు కలిసిన రంగుకల, నీపం = కడిమి చెట్టును, దృష్ట్వా = చూచి, అనుకచ్ఛం = తడినేలవెంట, ఆవి...ముకుళాః; ఆవిర్భూత = పైకివచ్చిన, ప్రథమ = మొదటి, ముకుళాః = మొగ్గలు కల, కందలీః = నేల అరటి మొక్కలను, జగ్ధ్వా = తిని, అరణ్యేషు = అడవులయందు, అధిక సురభిం = ఎక్కువ సువాసనకల, ఉర్వ్యాః = భూమియొక్క గంధం = వాసనను, ఆఘ్రాయ = మూర్కొని, జలలవముచః = నీటితుంపరను వదులుతున్న, తే = నీకు, మార్గం = దారిని, సూచయిష్యంతి = తెలుపగలవు.

తా. : ఓ మేఘమా! అడవిలో జింకలు సగంపైకి వచ్చిన కేసరాలతో, హరితకపిశ వర్ణము కల కడిమి చెట్టును చూచి, తడినేల మీద తొలిమొగ్గలు కనిపించిన మంచి సువాసనగల అడవిలోని నేల యొక్క పరిమళాన్నాఘ్రాణించి, నీటి బిందువులను సన్నగా వర్షిస్తున్న నీకు దారిచూపుతూ నడుస్తాయి.

**శ్లో॥ అంభోబిందుగ్రహణచతురాంశ్చాతకా న్వీక్షమాణాః**
**శ్రేణీభూతాః పరిగణనయా నిర్దిశన్తో బలాకాః**
**త్వామాసాద్య స్తనితసమయే మానయిష్యన్తి సిద్ధాః**
**సోత్కంఠాని ప్రియసహచరీసంభ్రమాలింగితాని** **22**



ప్ర.ప. : అంభో...చతురాన్, అంభోబిందు = నీటి చుక్కలను, గ్రహణ = స్వీకరించుటలో, చతురాన్ = నేర్పరులయిన, చాతకాన్ = చాతక పక్షులను, వీక్షమాణాః = చూస్తున్న వారు, శ్రేణీభూతాః = వరుసలుగా ఏర్పడ్డ, బలాకాః = బెగ్గురు పక్షుల (ఒకరకం కొంగల)ను, పరిగణనయా = లెక్కపెట్టుతూ, నిర్దిశంతః = చేతితో చూపుతున్న వారు అయిన, సిద్ధాః = సిద్ధులు, స్తనితసమయే = ఉరిమినకాలంలో, సోత్కంఠాని = ఉత్కంఠ (ఎక్కువ కోరిక)తో కూడిన, ప్రియ...లింగితాని; ప్రియ = ఇష్టులైన, సహచరీ = తమకాంతల యొక్క సంభ్రమ = తత్తరపాటుతో కూడిన, ఆలింగితాని = కౌగిలింతలను, ఆసాద్య = పొంది, త్వాం = నిన్ను, మానయిష్యంతి = గౌరవిస్తారు.

తా. : ఓ జలదా! ఆకాశంలో తిరుగుతుండే సిద్ధ దంపతులు నీవు వర్షిస్తున్నప్పుడు వాననీటిని ఆకాశంలోనే తమనోటితో స్వీకరించే చాతక పక్షులను చూస్తూ, ఆకాశంలో బారులు తీరి సంచరిస్తున్న కొంగలను తమ ప్రియురాండ్లకు చేతితో లెక్కించి చూపుతూ, నీవు ఉరిమినప్పుడు తమకాంతలు భయపడి కోరికతో తమనాలింగనము చేసుకోగా, ఉరుము ద్వారా తమకటువంటి సౌఖ్యము కలిగించి సహాయం చేసినందుకు నిన్నువారు గౌరవంతో అభినందిస్తారు.

చాతక పక్షులు నేలమీద పడిననీళ్లను తాగవని వర్షపునీటినే తాగుతాయనేది కవి సమయము.

**శ్లో॥ ఉత్పశ్యామి ద్రుతమపి సఖే మత్ప్రియార్థం యియాసోః**
**కాలక్షేపం కకుభసురభౌ పర్వతే పర్వతే తే**
**శుక్లాపాంగైః సజలనయనైః స్వాగతీకృత్య కేకాః**
**ప్రత్యుద్యాతః కథమపి భవాన్ గన్తుమాశు వ్యవస్యేత్** **23**

ప్ర.ప. : హేసఖే = ఓ మిత్రమా! మత్ప్రియార్థం = నాకు ప్రియము చేయుటకు, ద్రుతం = శీఘ్రముగా, యియాంసో= అపి = వెళ్లగోరుతున్నవాడవైనా, కకుభసురభౌ = కుటజ (కొండమల్లె) పుష్పాలతో సుగంధము కల, పర్వతే పర్వతే = ప్రతి పర్వతమందు, తే = నీకు, కాలక్షేపం = కొంత సమయం గడచుటను, ఉత్పశ్యామి = ఊహిస్తున్నాను, సజల = ఆనంద బాష్పములతో కూడిన, నయనైః = కన్నులుగల, శుక్లాపాంగైః = తెల్లని కనుకొనలు కల నెమళ్లచేత, కేకాః = తమ (నెమళ్ల) అరపులను, స్వాగతీకృత్య = స్వాగత వాక్యాలుగా చేసికొని, ప్రత్యుద్యాతః సన్ = ఎదురుకోలు చేయబడి, భవాన్ = నీవు, కథమపి = ఏ విధముగానైనా, ఆశు = తొందరగా, గంతుం = వెళ్లుటకు, వ్యవస్యేత్ = పూనుకోవలెను.

అలంకారములు : 1. సమాసోక్తి, 2. ఉత్ప్రేక్ష.

1. ప్రస్తుతము వర్ణించినప్పుడు అప్రస్తుతము తోచినట్లయితే సమాసోక్తి.

2. అలలతో కూడిన నీటిని త్రాగుటను కనుబొమలు ముడిచిన ప్రియురాలి ముఖమును చుంబించినట్లు కల్పనతో ఊహించటం వలన ఉత్ప్రేక్షాలంకారము.

శ్లో॥ **నీచైరాఖ్యం గిరిమధివసే స్తత్ర విశ్రామహేతో**
**స్త్వత్సంపర్కాత్పులకితమివ ప్రౌఢపుష్పైః కదంబైః**
**యః పణ్యస్త్రీరతిపరిమళోద్గారిభి ర్నాగరాణా**
**ముద్దామాని ప్రథయతి శిలావేశ్మభి ర్యౌవనాని** **26**

ప్ర.ప. : హేమేఘ = ఓ మేఘమా! తత్ర = ఆ విదిశాపట్టణము దగ్గర, విశ్రామహేతోః = విశ్రాంతి కొరకు, ప్రౌఢపుష్పైః = చక్కగా పూచినపూలు కల, కదంబైః = కడిమిచెట్లతో, త్వత్సంపర్కాత్ = నీకలయిక వల్ల, పులకితమివ = గగుర్పాటు చెందినట్లున్న, నీచైః+ఆఖ్యం = పల్లమైనదను, గిరిం = పర్వతమును, అధివసేః = ఎక్కి నివసించుము, యః = పర్వతము, పణ్య...ద్గారిభిః; పణ్యస్త్రీ = వేశ్యలయొక్క, రతి = సంభోగపు, పరిమళ = సువాసనలను, ఉద్గారిభిః = వెల్లడించుచున్న, శిలావేశ్మభిః = గుహలతో, నాగరాణాం = పట్టణంలోని జనులయొక్క, యౌవనాని = పడుచుతనములను, ప్రథయతి = ప్రకటించుచున్నదో.

**తా.** : ఓ మేఘా! నీవు ఆ విదిశా నగరము దగ్గర కల నీచైర్గిరి (పల్లపుకొండ) అనుదానిపై విశ్రాంతి కొరకు కొంతసేపు ఆగుము. ఆ పర్వతము నీకలయికవల్ల పులకించినదా అన్నట్లు బాగా వికసించిన పూలతో కడిమిచెట్లు కలిగి ఉంటుంది. ఆపర్వత గుహలలో పట్టణపు విలాసపురుషులు వేశ్యలతో రమింతురు. ఆ పర్వతము గుహల ద్వారా నగర జనుల యౌవన క్రీడలను ప్రకటిస్తుంది.

విదిశా నగరములోని పౌరులు భోగలాలసులు కనుక ఆ పర్వత గుహలలో వేశ్యలతో గడిపేవారని, వారుపయోగించిన సుగంధ ద్రవ్యాల పరిమళాన్ని గుహలు వ్యాపింప జేసేవని సూచింపబడింది.

శ్లో॥ **విశ్రాంతః స న్వ్రజ వననదీతీరజాతాని సించ**
**న్నుద్యానానాం నవజలకణై ర్యూథికాజాలకాని**
**గండస్వేదాపనయనరుజా క్లాంత కర్ణోత్పలానాం**
**ఛాయాదానాత్ క్షణపరిచితః పుష్పలావీముఖానామ్** **27**



ప్ర.ప. : హేమేఘ = ఓమేఘమా, విశ్రాంతఃసన్ = కొంచెం విశ్రమించి, వన...జాతాని; వన = అడవులను, నదీ = నదులయొక్క, తీరజాతాని = ఒడ్డునపుట్టిన, ఉద్యానానాం = తోటలయొక్క, యూథికాజాలకాని = గిరిమల్లె మొగ్గలను, నవజలకణైః = తొలకరి నీటి బిందువులతో, సించన్ = తడుపుతూ, గండ...రుజా; గండ = చెక్కిళ్లమీది, స్వేద = చెమటను, అపనయన = తొలగించుటచే కలిగిన, క్లాంత = వాడిన, కర్ణోత్పలానాం = చెవిలో కలువపూలు కలిగిన, పుష్పలావీ ముఖానాం = పూలు కోయువారి ముఖములకు, ఛాయా దానాత్ = నీడనిచ్చుట వలన, క్షణపరిచితః = కొద్దిసేపు పరిచయము పొంది, వ్రజ = వెళ్లుము.

**తా.** : ఓ మేఘమా! ఆ పర్వతము దగ్గర కొంతసేపు విశ్రాంతి తీసుకొని, బయలుదేరి దారిలో అడవులలో, నదీతీరాలలో పుట్టినవి, తోటలలోనివి అయిన గిరిమల్లె మొగ్గలను నీతొలకరి నీటి బిందువులతో తడుపుతూ, తమ చెక్కిళ్ల మీది చెమటను తుడుచుట వలన నలిగిన చెవిలోని కలువలు కలిగిన, పూలుకోసి అమ్మే స్త్రీల ముఖాలకు నీవు నీడను ఇచ్చి వారికి కొద్దిగా పరిచయమై ముందుకు వెళ్లుము.

శ్లో॥ **వక్రః పంథా యదపి భవతః ప్రస్థితస్యోత్తరాశాం**
**సౌధోత్సంగ ప్రణయవిముఖో మాస్మభూరుజ్జయిన్యాః**
**విద్యుద్దామస్ఫురితచకితై ర్యత్ర పౌరాంగనానాం**
**లోలాపాంగై ర్యది న రమసే లోచనైర్వంచితః స్యాః** **28**

**ప్ర.ప.** : ఉత్తరాశాం = ఉత్తర దిక్కును గూర్చి, ప్రస్థితస్య = బయలుదేరిన, భవతః = నీకు, పంథాః = మార్గము, వక్రః యదపి = కొంచెము వంకర అయినప్పటికీ, ఉజ్జయిన్యాః = ఉజ్జయినీ నగరము యొక్క సౌధో...విముఖః, సౌధ = మేడలయొక్క, ఉత్సంగ = పైభాగముల, ప్రణయ = స్నేహమునకు, విముఖః = పెడముఖము కలవాడవు, మాస్మభూః = కాబోకుము, యత్ర = ఏ ఉజ్జయినీ నగరములో, విద్యు...చకితైః; విద్యుద్దామ = మెరుపుతీగల, స్ఫురిత = మిరుమిట్లకాంతితో, చకితైః = భయపడిన, పౌరాంగనానాం = నగరపు స్త్రీల యొక్క, లోలాపాంగైః = చంచలములైన కనుకొనలు కల, లోచనైః = కన్నులతో, న రమసే యది = వినోదించకపోతే, వంచితః = మోసపోయినవాడవు, స్యాః = అగుదువు.

**తా.** : ఓ మేఘమా! నీవు వెళ్లేదారికి కొంచె వంకరగా చుట్టు తిరుగవలసి ఉంటుంది. అయినప్పటికి ఉజ్జయినికి నీవు తప్పకుండా వెళ్లాలి. ఆ నగరంలో భవనాల పై భాగంలో

**తా.** : మిత్రమా! నాకు ప్రియమైన కార్యము చేయటానికి వెళ్లుతున్న నీకు దారిలో కొండమల్లె పూవుల సుగంధముకల ప్రతి పర్వతం వద్ద కొంత జాగుకాగలదని ఊహిస్తున్నాను. ఆ సువాసనకు పరవశమై కొంతసేపు నిలుతువు. నీరాకతో సంతోషించిన నెమళ్లు ఆనందబాష్పాలతో కేకలు వేయగా వాటిని స్వాగత వచనాలుగా భావించి, అక్కడి నుండి ఏవిధంగానైనా తొందరగా ముందుకు వెళ్లే ప్రయత్నం చేయుము.

పరిణామాలంకారము.

నెమలి కేకల యందు స్వాగత వచనాలుగా ఆరోపము చేయబడింది. అది ప్రకృత మేఘ గమనానికుపయోగించినట్లు చెప్పటం వలన పరిణామము.

ఆరోప్యమానము ప్రస్తుతానికి ఉపయుక్తమైనట్లు వర్ణిస్తే పరిణామాలంకారమని లక్షణము.

**శ్లో॥ పాండుచ్ఛాయోపవనవృతయః కేతకైః స్సూచిభిన్నైః**
**నీడారంభై ర్గృహబలిభుజామాకులగ్రామచైత్యాః**
**త్వయ్యాసన్నే పరిణతఫలశ్యామజంబూవనాన్తాః**
**సంపత్స్యంతే కతిపయదినస్థాయిహంసా దశార్ణాః** **24**

ప్ర.ప. : త్వయి = నీవు, ఆసన్నేసతి = సమీపించగా, పాండు...వృతయః; పాండు = తెలుపు ఎరుపు కలిసిన రంగుకల, ఛాయ = కాంతితోకూడిన, ఉపవన = తోటలయొక్క వృతయః = కంచెలుకలవి, సూచిభిన్నైః = కొనలు కొద్దిగా వికసించిన, కేతకైః = మొగలి పూవులతో కూడినవి, గృహబలిభుజాం = ఇంఢ్లవద్ద లభించే బలులను (అన్నం మొ॥ వాటిని) తినే కాకాదుల యొక్క, నీడారంభైః = గూళ్లుకట్టు పనులచేత, ఆకుల = వ్యాపించి ఉన్న, గ్రామచైత్యాః = గ్రామాలమందిరాలు కలవి, దశార్ణాః = అగుదశార్ణ ప్రాంతపు గ్రామాలు, పరి...వనాంతాః; పరిణత = బాగాపండిన, ఫల = పండ్లచేత, శ్యామ = నల్లనైన, జంబూవనాంతాః = నేరేడు చెట్ల వనములతో కూడినవిగా, కతిపయ...హంసాః; కతిపయ = కొన్ని, దిన = రోజులు, స్థాయి = నిలిచి ఉండే, హంసాః = హంసలు కలవిగా, సంపత్స్యన్తే = కాగలవు.

**తా.** : ఓ మేఘమా! నీవు దశార్ణ ప్రాంతానికి చేరగానే అక్కడి గ్రామాలలో మొగలిరేకులు కొద్దిగా విచ్చుకొని తోటలు పాండు వర్ణం కలవౌతాయి. నేరేడు పండ్లు బాగా పండి ఆవనం నల్లగా మార్తుతుంది. హంసలు అక్కడ కొంకాలం వలస పక్షులుగా



ఉంటాయి. పక్షులు నిన్ను చూచి వర్షాకాలము వచ్చినదని తెలుసుకొని వాన నుండి రక్షణ కొరకు మందిరాలలో గూళ్లను ఏర్పరచుకుంటాయి.

ఋణమంటే దుర్గమని ఒక అర్థమున్నది. దశ+ఋణ = దశార్ణ అవుతుంది. అనగా పదిదుర్గములు కల ప్రాంతమని అర్థము. ఇప్పటి ఛత్తీస్‌గఢ్‌లో ఎక్కువ భాగం ఆనాటి దశార్ణమనవచ్చు.

**శ్లో॥ తేషాం దిక్షు ప్రథితవిదిశాలక్షణాం రాజధానీం**
**గత్వా సద్యః ఫలమవికలం కాముకత్వస్య లబ్ధా**
**తీరోపాంత స్తనితసుభగం పాస్యసి స్వాదు యత్త**
**త్సభ్రూభంగం ముఖమివ పయో వేత్రవత్యా శ్చలోర్మి** **25**

ప్ర.ప. : దిక్షు = దిక్కులయందు, ప్రథి...లక్షణాం; ప్రథిత = ప్రసిద్ధమైన, విదిశా = విదిశ అను, లక్షణాం = పేరుగల, తేషాం = ఆదశార్ణజనపదముల, రాజధానీం = ముఖ్య పట్టణమును, గత్వా = చేరి, సద్యః = వెంటనే, కాముకత్వస్య = కాముకుడయిన దానికి, అవికలం = కొరతలేని, ఫలం = లాభమును, లబ్ధా = పొందుదువు, యత్ = ఎందువల్లననగా, తత్ = ఆ, స్వాదు = రుచికరమైన, వేత్రవత్యాః = వేత్రవతి నదియొక్క, చలోర్మి = కదులుతున్న అలలుగల, పయః = నీటిని, సభ్రూభంగం = బొమముడితో కూడిన, ముఖమివ = ముఖమునువలె, పాస్యసి = త్రాగగలవుకదా!

**తా.** : ఓ మేఘా! నీవు వెళ్లేదారిలో విదిశా పట్టణము కలదు. అది దశార్ణదేశానికి రాజధాని. ఆపట్టణము జగత్ప్రసిద్ధము. అక్కడ వేత్రవతి అనే నది ప్రవహిస్తుంది. నీవు అక్కడికి వెళ్లి రసికత్వానికి తగిన ఫలాన్ని పొందుతావు. ఎట్లనగా ఆనది నీరు రుచికరంగా ఉంటుంది. నదిలో తరంగాలు కదులుతుంటాయి. నీవు క్రిందికి దిగి ఆ నది నీరు త్రాగుతున్నప్పుడు విలాసముగా కనుబొమలు ముడిచిన ప్రియురాలి ముఖములోని పెదవులను ముద్దుపెట్టుకున్నట్లుంటుంది. కాముకులకు అధరపానము సురతము కంటె మించినదిగా చెప్పుతారు.

కవులు ఆయా శబ్దాలకున్న లింగాలను బట్టి నాయికా నాయకులుగా ఆరోపించి శృంగారవర్ణన చేయటం సహజం. సంస్కృతంలో మేఘశబ్దం పుం లింగం, నదీశబ్దం స్త్రీ లింగం కనుక ఈ విధమైన వర్ణన చేయబడింది.

ఇప్పటి మధ్యప్రదేశ్‌లోని బిలాసా పట్టణమే పూర్వపు విదిశానగరమని, అక్కడ ప్రవహిస్తున్న బేతవానది వేత్రవతి అని పరిశీలకులు తేల్చారు.

నీవు మెరిసినప్పుడు భయపడిన నగర యువతులు భయంతో చంచలములైన క్రీగంటి చూపులతో నీవైపు చూస్తారు. నీవు అక్కడికి వెళ్లకపోతే అటువంటి గొప్ప అవకాశాన్ని పోగొట్టుకుంటావు. కన్నులున్నందుకు ఆ నగరపు విలాసవతులగు యువతుల చూపులను స్వీకరించి ధన్యుడవు కమ్మని యక్షుని భావము.

శ్లో॥ వీచిక్షోభస్తనితవిహగశ్రేణికాంచీగుణాయాః
సంసర్పంత్యాః స్ఖలిత సుభగం దర్శితావర్తనాభేః
నిర్వింధ్యాయాః పథిభవ రసాభ్యంతరః సన్నిపత్య
స్త్రీణామాద్యం ప్రణయవచనం విభ్రమోహి ప్రియేషు 29

ప్ర.ప. : పథి = మార్గమందు, వీచి...గుణాయాః; వీచి = అలల యొక్క, క్షోభ = తాకిడి వలన, స్తనిత = ధ్వనిచేయుచున్న, విహగశ్రేణి = పక్షుల వరుసయే, కాంచీ గుణాయాః = ఒడ్డాణముగా కలిగినది, స్ఖలితసుభగం = శిలల నుండి జారుటచే మనోహరమైనదిగా, సంసర్పంత్యాః = ప్రవహించుచున్నది, దర్శి...నాభేః; దర్శిత = చూపబడిన, ఆవర్త = నీటి సుడియే, నాభేః = బొడ్డు కలది అగు, నిర్వింధ్యాయాః = నిర్వింధ్య అనే నదియొక్క, సన్నిపత్య = దగ్గరకు చేరి, పథి = దారిలో, రస+అభ్యంతరః = జలమునులోనికి గ్రహించిన వాడవు, భవ = అగుము, స్త్రీణాం = ఆడువారికి, ప్రియేషు = ప్రియులవిషయములో, విభ్రమః = విలాసము, ఆద్యం = మొదటిదైన, ప్రణయవచనం హి = ప్రేమ సల్లాపముకదా!

తా. : నిర్వింధ్య అనే నది ఉజ్జయిని దగ్గర ప్రవహిస్తుంది. ఆ నదిని నాయికగా ఆరోపిస్తూ తరంగాల తాకిడికి ధ్వని చేస్తున్న పక్షుల పంక్తి ఒడ్డాణంగా ఎత్తు పల్లాల ప్రవాహంతో వయ్యారపు నడకలుగా, నీటిలోని సుడిని నాభిగా ఆరోపించి, ఆ నది నీయెదుట తన అనురాగాన్ని వెల్లడిస్తుందని వర్ణించినాడు. స్త్రీలు తమ ప్రేమను మొదట మాటలతో కాక విలాసముతోనే తెలుపుతారు కదా! అని వర్ణించినాడు.

అలంకారములు : 1. చివరిపాదంలో అర్థాంతరన్యాసము. 2. పక్షుల వరుసయందు వడ్డాణాన్ని, నీటి సుడియందు బొడ్డును, ఆరోపించటం వలన రూపకాలంకారం.

శ్లో॥ వేణీభూత ప్రతనుసలిలా సాత్వతీతస్య సింధుః
పాండుచ్ఛాయాతటరుహతరుభ్రంశిభి ర్జీర్ణపర్ణైః
సౌభాగ్యం తే సుభగ విరహావస్థయా వ్యంజయన్తీ
కార్శ్యం యేన త్యజతి విధినా స త్వయైవోపపాద్యః 30



ప్ర.ప. : హేసుభగ = అదృష్టవంతుడవైన మేఘమా! వేణీ...సలిలా; వేణీభూత = జడగా మారిన, ప్రతను = సన్నబడిన, సలిలా = నీటి ప్రవాహము కల, తట...భ్రంశిభిః; తటరుహ = ఒడ్డున పుట్టిన, తరు = చెట్ల నుండి, భ్రంశిభిః = రాలిన, జీర్ణపర్ణైః = పండిన ఆకులతో, పాండుచ్ఛాయా = పాలిపోయిన రంగుకల, సా = ఆ, సింధుః = నిర్వింధ్యానది, విరహావస్థయా = ఎడబాటువలన బాధతో, తే = నీ యొక్క, సౌభాగ్యం = అదృష్టమును, వ్యంజయంతీ = వెల్లడించునదై, యేన = ఏ, విధినా = ఉపాయముచేత, కార్శ్యం = బక్కచిక్కుటను, త్యజతి = వదలునో, సః = ఆ ఉపాయము, త్వయైవ = నీ చేతనే, ఉపపాద్యః = ఏర్పాటు చేయదగినది.

తా. : ఓ మేఘా! నీవానిర్వింధ్యానదిని దాటివెళ్లగా అది నీ విరహము చేత జడవలె సన్నగా కృశించిన నీరుకలదై, తన ఒడ్డున నున్నచెట్ల నుండి రాలిపడిన పండుటాకులచే పాండువర్ణముకల దవుతుంది. తనవిరహ బాధతో నీ అదృష్టాన్ని వెల్లడిస్తుంది. ఆకృశత్వాన్ని వదలటానికి చేయదగినకార్యమును చేయుము.

ఇక్కడ కొందరు తామతీతస్య అనే పాఠాన్ని గ్రహించి, సింధుః అనే పదానికి కాళీ సింధునది అని అర్థము చెప్పినారు. అది దేవగిరి నుండి పుట్టి ఇప్పటికీ ఉన్నది. నిర్వింధ్యను దాటిన నీకు కృశించిన నీరుకల ఆనది కన్పిస్తుంది. అక్కడ వర్షించి విరహ బాధను తీర్చమని కోరినట్లు వ్యాఖ్యానించారు. ఇది కూడ సమంజసంగానే ఉన్నది. ఇప్పటి సింధునది అలకాపురి మార్గంలో రాదు.

శ్లో॥ ప్రాప్యావంతీ నుదయనకథాకోవిద గ్రామవృద్ధాన్
పూర్వోద్దిష్టా మనుసర పురీం శ్రీవిశాలాం విశాలాం
స్వల్పీభూతే సుచరితఫలే స్వర్గిణాం గాం గతానాం
శేషైః పుణ్యై ర్హృతమివ దివః కాంతిమ త్ఖండమేకమ్ 31

ప్ర.ప. : ఉదయ...వృద్ధాన్; ఉదయన = వత్సరాజు యొక్క, కథా = వృత్తాంతములను, కోవిద = బాగుగా తెలిసిన, గ్రామవృద్ధాన్ = పల్లెల పెద్దలు కల, అవంతీన్ = అవంతి రాజ్యమును, ప్రాప్య = చేరి, పూర్వ+ఉద్దిష్టాం = ఇంతకు ముందు తెలుపబడిన, శ్రీవిశాలాం = సంపదలతో సమృద్ధమైన, విశాలాం = ఉజ్జయినీ అను, పురీం = నగరమును, అనుసర = అనుసరించుము, సుచరితఫలే = తాము చేసిన పుణ్యఫలము, స్వల్పీభూతే = కొద్దిగా మిగులగా, గాం = భూమిని, గతానాం = పొందిన, స్వర్గిణాం = స్వర్గమునకు వెళ్లిన వారి, శేషైః = అనుభవించగా మిగిలిన, పుణ్యైః = పుణ్యముల చేత, హృతం = తేబడిన,

కాంతిమత్ = ప్రకాశవంతమైన, దివః = స్వర్గము యొక్క, ఏకం = ముఖ్యమైన, ఖండమివ = తునకవలె, స్థితం = ఆనగరమున్నది.

తా. : ఓ మేఘమా! పూర్వము ఉదయనుడనే వత్సరాజు ఉజ్జయినికి చెందిన వాసవదత్తను ప్రేమించి వివాహమాడినాడు. ఆయనకు సంబంధించిన కథలు అవంతిదేశ పువృద్ధులకు బాగా తెలుసును. అక్కడ ఇంతకు ముందు తెలిపిన ఉజ్జయిని నగరాన్నను సరించివెళ్లుము. దానికి విశాల అని మరొకపేరు కూడ ఉన్నది. ఆ నగరము, పుణ్యము చేసి స్వర్గమునకు వెళ్లినవారు మరికొంత పుణ్యము మిగిలినప్పుడు భూమికి తిరిగివస్తూ తెచ్చిన స్వర్గము యొక్క ప్రకాశవంతమైన ఖండము వలె ఉంటుంది. అనగా ఆ నగరము స్వర్గముతో సమానంగా అన్ని సంపదలకు స్థానమై ఉన్నదని భావము.

విశాలానగరాన్ని స్వర్గఖండమా అన్నట్లున్నదని ఊహించుట వలన ఉత్ప్రేక్షాలంకారము.

శ్లో॥ దీర్ఘీకుర్వ న్పటు మదకలం కూజితం సారసానాం
ప్రత్యూషేషు స్ఫుటితకమలామోదమైత్రీకషాయః
యత్ర స్త్రీణాం హరతి సురతగ్లాని మంగానుకూలః
శిప్రావాతః ప్రియతమ ఇవ ప్రార్థనాచాటుకారః 32

ప్ర.ప. : యత్ర = ఏ ఉజ్జయినీ నగరంలో, ప్రత్యూషేషు = ప్రాతః కాలాలందు, పటు = స్పష్టమైన, మదకలం = మైకముతో అవ్యక్త మధురమైన, సారసానాం = హంసల యొక్క, కూజితం = అరపును, దీర్ఘకుర్వన్ = పొడిగించేది, స్ఫుటిత...కషాయః; స్ఫుటిత = వికసించిన, కమల = తామరపూవుల, ఆమోద = పరిమళము యొక్క, మైత్రీ = సంపర్కము చేత, కషాయః = సుగంధముగలది, అంగానుకూలః = శరీరమునకు అనుకూలముగా ఉండేది, శిప్రావాతః = శిప్రానదిపై నుండి వీచేగాలి, ప్రార్థనా = బ్రతిమిలాడుటతో కూడిన, చాటుకారః = ప్రియవచనములు మాట్లాడు, ప్రియతమః ఇవ = ఇష్టమైన ప్రియునివలె, స్త్రీణాం = వనితలకు, సురతగ్లానిం = సంభోగమువలన కలిగిన ఆయాసమును, హరతి = తొలగించును.

తా. : ఓ మేఘమా! ఉజ్జయినీ నగరం దగ్గర శిప్ర అనే నది ప్రవహిస్తుంది. దాని మీదుగా వీచేగాలి హంసల మధుర ధ్వనిని పొడిగిస్తూ, ప్రొద్దున వికసించిన కమలాల పరిమళాన్ని వ్యాపింపజేస్తుంది. ఆ గాలి శరీరానికి హాయిని కలిగిస్తూ ప్రియవచనాలతో సమాగమానికి ప్రార్థిస్తున్న ప్రియునివలె స్త్రీల యొక్క రతిక్రీడ అలసటను పోగొడుతుంది.

అలంకారం = శిప్రానది వాయువును ప్రియతమునితో పోల్చటం వలన ఉపమాలంకారము.

శ్లో॥ హారాం స్తారాం స్తరళగుటికా న్కోటిశః శంఖశుక్తీః
ఘాసశ్యామా న్మరకతమణీ నున్మయూఖప్రరోహాన్
దృష్ట్వా యస్యాం విపణిరచితా న్విద్రుమాణాం చ భంగాన్
సంలక్ష్యంతే సలిలనిధయ స్తోయమాత్రావశేషాః 33

ప్ర.ప. : యస్యాం = ఏ ఉజ్జయినియందు, కోటిశః = కోట్లకొద్ది, విపణి = అంగళ్లయందు, రచితాన్ = ఉంచబడిన, తరళ = మెరుస్తున్న, గుటికాన్ = నాయకమణులు కల, తారాన్ = మెరుగుపెట్టబడిన, హారాన్ = ముత్యాలహారాలను, శంఖశుక్తీః = శంఖములను, ముత్యపుచిప్పలను, ఘాసశ్యామాన్ = పచ్చిగడ్డివలె శ్యామవర్ణముకల, ఉన్మయూఖప్రరోహాన్ = పైకి ప్రసరించే కిరణాలు కల, మరకతమణీన్ = గరుడపచ్చ మణులను, విద్రుమాణాం = పగడములయొక్క, భంగాన్ = తునకలను, దృష్ట్వా = చూచి, సలిల నిధయః = సముద్రములు, తోయ...శేషాః; తోయమాత్ర = నీరు మాత్రమే, అవశేషాః = మిగిలినవిగా, సంలక్ష్యంతే = కనిపిస్తున్నవి.

తా. : ఓ మేఘమా! ఆ ఉజ్జయినీనగరంలో అంగళ్లలో అమ్మకానికి పరచబడ్డ ముత్యాలహారాలను, కిరణాలను ప్రసరిస్తున్న గరుడపచ్చలను, పగడాల ముక్కలను, చూచినప్పుడు సముద్రాలలో నీళ్లు మాత్రమే మిగిలినవా? అని తోస్తుంది.

సముద్రానికి రత్నాకరమని పేరుకదా! రత్నాలన్నీ ఇక్కడనే ఉంటే ఇక సముద్రంలో నీరే మిగులుతుంది అని భావము.

దీని వలన ఉజ్జయినీ నగరపు అంగళ్లు మణులు మొదలగు వాటితో సమృద్ధంగా ఉన్నవని తెలుస్తుంది.

శ్లో॥ ప్రద్యోతస్య ప్రియదుహితరం వత్సరాజోఽత్ర జహ్రే
హైమం తాళద్రుమవన మభూ దత్ర తస్యైవ రాజ్ఞః
అత్రోద్భ్రాంతః కిల నళగిరిః స్తంభముత్పాట్య దర్పా
దిత్యాగన్తూ న్రమయతి జనో యత్ర, బంధూనభిజ్ఞః 34

ప్ర.ప. : అత్ర = ఈ ఉజ్జయినిలో, వత్సరాజః = వత్సదేశపురాజైన ఉదయనుడు, ప్రద్యోతస్య = ప్రద్యోతరాజు యొక్క ప్రియదుహితరం = ప్రియమైన కూతురు వాసవదత్తను, జహ్రే = అపహరించుకొని వెళ్లినాడు, అత్ర = ఇక్కడ, తస్య = ఆ, రాజ్ఞః ఏవ = రాజుదే అయిన, హైమం = బంగారురంగుకల, తాళ-ద్రుమవనం = తాటిచెట్ల గుంపు, అభూత్ = ఉండెను, అత్ర = ఇక్కడ, నళగిరిః = నళగిరి అనే పేరుకల మదపుటేనుగు, దర్పాత్ = మదమువలన, స్తంభం = కట్టుకొయ్యను, ఉత్పాట్య = పెకిలించుకొని, ఉద్-భ్రాంతః కిల = స్వేచ్ఛగా తిరిగినది కదా! ఇతి = అని, యత్ర = ఏ నగరంలో, అభిజ్ఞః = ఆ విషయాలు తెలిసిన, జనః = జనము, ఆగంతూన్ = బయటినుంచి వచ్చినవారిని, బంధూన్ = బంధువులను, రమయతి = వినోదపరచుచుండును.

తా. : ఈ ఉజ్జయినిలోనే పూర్వము వత్సరాజు మహాసేనుడనే బిరుదుకల ప్రద్యోతుని కుమార్తె వాసవదత్తను ప్రేమించి, ఆమెను రహస్యముగా తీసుకొని వెళ్లినాడు. ఇక్కడనే ఆ రాజుయొక్క బంగారువంటి తాటితోపు ఉండేది. ఇక్కడనే నళగిరి అనే ఏనుగు మదముతో కట్టుకొయ్యను పెకిలించుకొని పరుగెత్తిపోయింది అని ఆ కథలు తెలిసిన జనులు బయటినుంచి వచ్చినవారికి చెప్పి వినోదింపజేయుదురు.

కథాసరిత్సాగరములో ప్రద్యోతుని వృత్తాంతము వర్ణింపబడింది.

తాటివనం బంగారురంగులో ఉండటం కుదరదు కనుక బంగారమువలె మేలైనది అనటం సముచితం. భావికాలంకారము.

శ్లో॥ పత్రశ్యామా దినకరహయస్పర్ధినో యత్ర వాహాః
శైలోదగ్రా స్త్వమివ కరిణో వృష్టిమంతః ప్రభేదాత్
యోధాగ్రణ్యః ప్రతిదశముఖం సంయుగే తస్థివాంసః
ప్రత్యాదిష్టాభరణరుచయ శ్చంద్రహాసవ్రణాంకైః 35

ప్ర.ప. : యత్ర = ఏ ఉజ్జయినిలో, వాహాః = గుర్రాలు, దిన...స్పర్ధినః; దినకర = సూర్యుని యొక్క హయ = గుర్రాలతో, స్పర్ధినః = పోటీపడేవి, పత్రశ్యామాః = ఆకుపచ్చరంగుకలవి, కరిణః = ఏనుగులు, శైల+ఉదగ్రాః = పర్వతమువలె ఎత్తయినవి, ప్రభేదాత్ = మదజలమును స్రవించుట వలన, త్వమివ = నీవలె, వృష్టిమంతః = వర్షించేవి, యోధ+అగ్రణ్యః = శ్రేష్ఠులైన భటులు, సంయుగే = యుద్ధరంగములో, ప్రతిదశముఖం = రావణునికెదురుగా, తస్థివాంసః = నిలబడగలవారు, చంద్ర...ణాంకైః, చంద్రహాస = రావణుని ఖడ్గము చేత, వ్రణాంకైః = గాయముల మచ్చలచేత, ప్రత్యా...రుచయః; ప్రత్యాదిష్ట = తిరస్కరించబడిన, ఆభరణ = నగలయొక్క రుచయః = కాంతికలవారుగా ఉందురో.

తా. : ఆ ఉజ్జయినిలో అశ్వములు ఆకుపచ్చరంగు కలవై, వేగములో సూర్యుని రథాశ్వాలతో పోటీపడేవిగా ఉంటాయి. ఏనుగులు పర్వతాలవలె ఎత్తుగా ఉండి మదము కలిగినప్పుడు నీవలె వర్షించేవిగా ఉంటాయి. అక్కడి సైనికులు యుద్ధరంగంలో రావణునంతటి వాణ్ణి ఎదిరించి నిలబడగల పరాక్రమవంతులు. యుద్ధంలో కలిగిన కత్తివేటుల మచ్చలు నగలను మించిన అలంకారంగా కలవారై ఉంటారు.

ఉజ్జయినీ నగరము పురాణ ప్రసిద్ధం కనుక త్రేతాయుగంలో రావణుని కాలంలో అతనితో ఈ యోధులు పోరాడటం అసంభవం కాదని వ్యాఖ్యాతలు భావించినారు. అయితే వారు యక్ష సందేశకాలం వారు కాకపోవచ్చును. పూర్వ వైభవాన్ని చెప్పినాడనుకోవచ్చును.

ఉపమాలంకారము.

శ్లో॥ జాలోద్గీర్ణై రుపచితవపుః కేశసంస్కారధూపై
ర్బంధుప్రీత్యా భవనశిఖిభి ర్దత్తనృత్యోపహారః
హర్మ్యేష్వస్యాః కుసుమసురభి ష్వధ్వఖేదం నయేథాః
పశ్య ల్లక్ష్మీం లలితవనితాపాదరాగాంకితేషు 36

ప్ర.ప. : హేమేఘ = ఓ మేఘమా! జాల+ఉద్గీర్ణైః = గవాక్షాల నుండి బయటికి వచ్చిన కేశ...ధూపైః; కేశ = వెంట్రుకలకు, సంస్కార = అలంకారము కల్గించు, ధూపైః = సుగంధ వస్తువుల ధూపములతో, ఉపచిత = వృద్ధిపొందిన, వపుః = శరీరము కలవాడవై, బంధుప్రీత్యా = చుట్టరికపు ప్రేమతో, భవనశిఖిభిః = భవనాలలోని నెమళ్లచేత, దత్త...హారః, దత్త = ఈయబడిన, నృత్య = నృత్యమనే, ఉపహారః = కానుక కలవాడవై, అస్యాః = ఈ ఉజ్జయిని యొక్క, కుసుమసురభిషు = పూవుల పరిమళము కలిగిన, హర్మ్యేషు = భవనములందు, లలిత...ంకితేషు; లలిత = కోమలములైన, వనితా = స్త్రీలయొక్క, పాద = కాళ్లకు చెందిన, రాగ = ఎరుపుచేత, అంకితేషు = ముద్రింపబడిన వాటిలో, లక్ష్మీం = శోభను, పశ్యన్ = చూస్తూ, అధ్వఖేదం = ప్రయాణపుబడలికను, నయేథాః = తొలగించుకొమ్ము.

తా. : ఓ మేఘుమా! ఉజ్జయినీ నగరపు భవనాలలో స్త్రీలు తమ కురులకు అలంకారముగా వేసే సుగంధ ధూపాలు గవాక్షాల నుండి ఆకాశంలోనికి చేరటం వల్ల నీ శరీరం కొంతపెరుగుతుంది. నెమళ్లకు నీవు బంధువు కనుక నీరాకతో సంతోషించి అవి నృత్యమును నీకు కానుకగా అర్పిస్తాయి. అప్పుడు సువాసనతో నిండిన, స్త్రీల కోమల పాదాల లాక్షారసముతో పాద ముద్రలు పడిన మేడలమీద నీ ప్రయాణపు ఆయాసమును తీర్చుకుంటూ విశ్రమించుము.

ఉదాత్తాలంకారము.

**శ్లో॥ భర్తుః కంఠచ్ఛవిరితి గణైః సాదరం వీక్ష్యమాణః**
**పుణ్యం యాయా స్త్రిభువనగురో ర్ధామ చండీశ్వరస్య**
**ధూతోద్యానం కువలయరజోగంధిభి ర్గన్ధవత్యా**
**స్తోయక్రీడానిరతయువతిస్నానతిక్తై ర్మరుద్భిః** 37

ప్ర.ప. : భర్తుః = తమ ప్రభువైన శివునియొక్క, కంఠచ్ఛవిః = మెడలోని కాంతి, ఇతి = అని, గణైః = ప్రమథగణముల చేత, సాదరం = గౌరవ పూర్వకంగా, వీక్ష్యమాణః = చూడబడుతూ, కువల...గంధిభిః; కువలయ = కలువపూల యొక్క, రజః = పుప్పొడి యొక్క, గంధిభిః = పరిమళము కలిగిన, తోయ...తిక్తైః; తోయక్రీడా = జలక్రీడలందు, నిరత = ఆసక్తికల, యువతి = పడతుల, స్నాన = స్నానముచేత, తిక్తైః = సుగంధముకల, గంధవత్యాః = గంధవతి నదియొక్క, మరుద్భిః = వాయువుల చేత, ధూత+ఉద్యానం = కదల్చబడిన తోటలు కల, పుణ్యం = పవిత్రమైన, త్రిభువన = మూడు లోకాలకు, గురోః = ప్రభువైన, చండీశ్వరస్య = చండీశ్వరుని, ధామ = మందిరమునకు, యాయాః = వెళ్లుము.

తా. : ఓ మేఘుమా! ఆ ఉజ్జయినీ నగరానికి దగ్గరలో గంధవతి అనే నది ఉన్నది. అక్కడ మహాకాల మందిరమున్నది. అది త్రిలోకాధిపతి అయిన శివుని స్థానము పుణ్యప్రదము. నీవక్కడికి వెళ్లి దర్శించుము. అక్కడ ఈశ్వరుణ్ణి సేవిస్తూ ఉండే ప్రమథ గణాలు నల్లని నిన్నుచూచి తమ ప్రభువు కంఠపురంగు నీకున్నందువలన గౌరవంగా చూతురు. కలువపూవుల పుప్పొడి యొక్క పరిమళము కలిగిన, నదిలో యువతులు స్నానము చేయటం వలన సుగంధముకల గంధవతి నది మీదుగా వీచే గాలులతో తోటలోని చెట్లు కదులుతుంటాయి. చండీశ్వరుడని పిలువబడే ఆ శివుని మందిరానికి తప్పకవెళ్లుము. ఆక్షేత్రము ముక్తిదాయకమని ప్రసిద్ధి.



**శ్లో॥ అప్యన్యస్మిం జలధర మహాకాల మాసాద్య కాలే**
**స్థాతవ్యం తే నయన విషయం యావదత్యేతి భానుః**
**కుర్వ న్సంధ్యాబలి పటహతాం శూలినః శ్లాఘనీయా**
**మామంద్రాణాం ఫలమవికలం లప్స్యసే గర్జితానామ్** 38

ప్ర.ప. : హే జలద = ఓ మేఘుడా! మహాకాళం = మహాకాలక్షేత్రమును, అన్యస్మిన్ = మరియొక, కాలే = సమయంలో, ఆసాద్యఅపి = చేరినప్పటికి, తత్ర = అక్కడ, యావత్ = ఎప్పటివరకు, భానుః = సూర్యుడు, తే = నీ యొక్క, నయనవిషయం = కంటిచూపును, అత్యేతి = దాటిపోవునో, తావత్ = అంతవరకు, స్థాతవ్యం = ఉండవలెను; శ్లాఘనీయాం = కొనియాడదగిన, శూలినః = శివునియొక్క, సంధ్యా...తాం; సంధ్యా = సాయంకాల సంధ్యలో, బలి = పూజలో, పటహతాం = నగారా రూపాన్ని, కుర్వన్ = కలిగిస్తూ, ఆమంద్రాణాం = కొంచెం గంభీరములైన, గర్జితానాం = ఉరుములకు, అవికలం = సంపూర్ణమైన, ఫలం = ఫలితమును, లప్స్యసే = పొందగలవు.

తా. : ఓ మేఘుమా! నీవు ఆ మందిరం దగ్గరకు ఇతర సమయంలో చేరినప్పటికి, అక్కడ సూర్యాస్తమయ సమయం వరకు నిలిచి ఉండుము. ఎందుకంటే సంధ్యాకాలంలో మహాకాలుని పూజా సమయంలో నీవు ఉరిమినట్లైతే అవి నగారాధ్వనులవలె పూజకు సహకరిస్తాయి. ఆ విధంగా భగవంతుని పూజలో పాల్గొన్నందుకు నీకు మంచి ఫలితం తప్పక లభిస్తుంది.

కావ్యలింగాలంకారము. పూర్వార్ధశ్లోకములో చెప్పిన విషయానికి ఉత్తరార్ధంలో కారణాన్ని నిరూపించటం వల్ల కావ్యలింగమవుతుంది.

**శ్లో॥ పాదన్యాసక్వణితరశనా స్తత్ర లీలావధూతైః**
**రత్నచ్ఛాయాఖచితవలిభి శ్చామరైః క్లాంతహస్తాః**
**వేశ్యా స్త్వత్తో నఖపదసుఖా న్ప్రాప్య వర్షాగ్రబిందూ**
**నామోక్ష్యంతే త్వయి మధుకరశ్రేణి దీర్ఘా న్కటాక్షాన్** 39

ప్ర.ప. : తత్ర = ఆ సంధ్యాపూజాకాలంలో, పాద...రశనాః; పాద = అడుగులను, న్యాస = ఉండుటచేత, క్వణిత = ధ్వనిచేస్తున్న, రశనాః = ఒడ్డాణములు కలవారు, లీలా+అవధూతైః = విలాసంగా వీచబడిన, రత్న...వలిభిః; రత్న = మణుల యొక్క, ఛాయా = కాంతులతో, ఖచిత = కూర్చబడిన, వలిభిః = దండములుకల, చామరైః =

చామరముల చేత, క్లాన్తహస్తాః = వాడిపోయిన చేతులుకల, వేశ్యాః = భోగపుస్త్రీలు, త్వత్తః = నీ నుండి, నఖపద = నఖక్షత స్థానములకు (గోటిగాట్ల స్థలాలు), సుఖాన్ = హాయిని కల్గించు, వర్షాగ్ర = వానకాలపు తొలిదశయొక్క, బిందూన్ = చినుకులను, ప్రాప్య = పొంది, త్వయి = నీయందు, మధు...దీర్ఘాన్; మధుకర = తుమ్మెదల యొక్క శ్రేణి = వరుసవలె, దీర్ఘాన్ = పొడవైన, కటాక్షాన్ = కడగంటి చూపులను, ఆమోక్ష్యంతే = ప్రసరింపచేయగలరు.

తా. : ఓ మేఘమా! ఆచండీశ్వరమందిరంలో సాయంకాల పూజా సమయాన వేశ్యలు నృత్యం చేస్తుండగా, వారి వడ్డాణాలు ధ్వనిచేయగా, వారు చామరాలతో విలాసంగా వీస్తుండగా, మణుల కాంతులతో ప్రకాశించే చామరాలు గల దండాలను పట్టుకోవటం వల్ల వాడిన చేతులు కలవారై, నీవు కురిపించే వర్షపు చినుకులతో తమ శరీరంలోని నఖక్షతాల స్థానంలో హాయిననుభవించి ఉపకారానికి కృతజ్ఞతా పూర్వకంగా నీపై తమ కటాక్షాలను (కడగంటి చూపులు) ప్రసరిస్తారు.

**శ్లో॥ పశ్చా దుచ్చైర్భుజతరువనం మండలేనాభిలీనః**
**సాంధ్యం తేజః ప్రతినవజపాపుష్పరక్తం దధానః**
**నృత్యారంభే హర పశుపతే రార్ద్రనాగాజినేచ్ఛాం**
**శాన్తోద్వేగస్తిమితనయనం దృష్టభక్తిర్భవాన్యా** **40**

ప్ర.ప. : పశ్చాత్ = పూజతరువాత, పశుపతేః = శివునియొక్క నృత్యారంభే = నృత్యము మొదలయినప్పుడు, ప్రతి...రక్తం; ప్రతినవ = అప్పుడే వికసించిన, జపాపుష్ప = మంకెన పూవువలె, రక్తం = ఎర్రనైన, సాంధ్యం = సంధ్యాకాలపు, రాగం = ఎరుపును, దధానః = ధరించినవాడవై, ఉచ్చైః = ఎత్తయిన, భుజ = చేతులనే, తరువనం = చెట్లయొక్క వనమును, మండలేన = వలయాకారముతో, అభిలీనః = వ్యాపించినవాడవై, భవాన్యా = పార్వతిచేత, శాంతో...నయనం; శాంత = చల్లారిన, ఉద్వేగ = కలవరముచేత, స్తిమిత = నిశ్చలములైన, నయనం = కన్నులుకలుగునట్లు, దృష్టభక్తిః = గుర్తింపబడిన భక్తికలవాడవుకాగా, పశుపతేః = శివునియొక్క ఆర్ద్రా...చ్ఛాం; ఆర్ద్ర = తడిదైన, నాగ = ఏనుగుయొక్క, అజిన = చర్మముపైన, ఇచ్ఛాం = కోరికను, హర = తొలగించుము.

**తా.** : ఓ మేఘమా! ఆ మహాకాల మందిరంలో సాయంకాలం పూజ తరువాత శివుడు తాండవము చేస్తాడు. ఆ సమయంలో ఎత్తైన ఆయన భుజములు పైకెత్తి నృత్యం చేస్తుండగా, ఎత్తయిన చెట్ల వనముగా కన్పించును. అప్పుడు నీవు సంధ్యాకాలపు కాంతితో ఎర్రబడినవాడవై, వలయాకారముగా ఆయన చేతుల పైన వ్యాపించుము. అందువలన రక్తసిక్తమైన ఎర్రని గజచర్మాన్ని తాండవ సమయంలో ధరించే శివునికి, దానిపై కోరికను పోగొట్టుము. ఎట్లనగా తడిగా, ఎర్రగా ఉండే నీవు తననావరించి ఉన్నప్పుడు ఇక గజ చర్మముపై కోరిక కలుగదు. నీవు అదే రూపంలో ఉంటావు కదా! ప్రతి దినము సాయంకాలం గజచర్మం ధరించిన పతినిచూచి భయంతో కలవరపడే పార్వతి, నీవు చేసిన ఈ ఉపకారానికి సంతోషించి నీకు శుభాలను కలిగిస్తుంది. అందువలన నీవీ పని తప్పక చేయవలెను.

**శ్లో॥ గచ్ఛంతీనాం రమణవసతిం యోషితాం తత్ర నక్తం**
**రుద్ధాలోకే నరపతిపథే సూచిభేద్యై స్తమోభిః**
**సౌదామిన్యా కనకనికషస్నిగ్ధయా దర్శయోర్వీం**
**తోయోత్సర్గస్తనితముఖరో మాస్మభూ ర్విక్లబా స్తాః** **41**

ప్ర.ప. : తత్ర = ఆ నగరంలో, నక్తం = రాత్రిపూట, రమణ వసతిం = తమ ప్రియుల నివాసానికి, గచ్ఛంతీనాం = వెళ్లుతున్న, యోషితాం = స్త్రీలకు, సూచిభేద్యైః = సూదితో భేదింపదగిన (దట్టమైన), తమోభిః = చీకట్లచేత, రుద్ధాలోకే = అడ్డగింపబడిన చూపుకల, నరపతిపథే = రాజమార్గంలో, కనక...స్నిగ్ధయా; కనక = బంగారపు, నికష = వన్నెతెలుపు రాతిమీది గీతవలె, స్నిగ్ధయా = ప్రకాశించు, సౌదామిన్యా = మెరుపుతో ఉర్వీం = నేలను (దారిని), దర్శయ = చూపుము, తోయో...ముఖరాః; తోయ = వర్షపు నీటిని, ఉత్సర్గ = కురియుట, స్తనిత = ఉరుములతో, ముఖరః = ధ్వనిచేస్తూ, తాః = ఆ స్త్రీలను, విక్లబాః = కలవరదునట్లుగా, మాస్మభూః = కాకుము (చేయకుము).

**తా.** : ఓ మేఘమా! ఆ ఉజ్జయినీ నగరంలో రాత్రిపూట తమ ప్రియుల ఇండ్లకు వెళ్లే యువతులకు రాజమార్గము దట్టమైన చీకటి నిండి ఉన్నప్పుడు నీ మెరుపులతో వారికి దారి చూపించు, అంతేకాని వర్షం, ఉరుములతో వారిని కలవరపరచవద్దు సుమా!

కనక నికష స్నిగ్ధయా అనేది ఉపమాలంకారము. వర్షించకుము, ఉరుమవద్దు అనటంలో కావ్యలింగాలంకారము. విక్లబాః అనే పదంతో కారణం చెప్పినందువల్ల పదార్థహేతుకము.

**శ్లో॥ తాం కస్యాంచి ద్భవనవలభౌ సుప్తపారావతాయాం**
**నీత్వా రాత్రిం చిరవిలసనాత్ ఖిన్నవిద్యుత్కళత్రః**

**సూర్యేదృష్టే పునరపి భవా న్వాహయే దధ్వశేషం**
**మందాయన్తే న ఖలు సుహృదా మభ్యుపేతార్థకృత్యాః** 42

ప్ర.ప. : కస్యాంచిత్ = ఏదో ఒక, సుప్తపారావతాయాం = నిద్రించిన పావురాలు కలిగిన, భవనవలభౌ = మేడపై భాగంలో, చిరవిలసనాత్ = చాలాకాలము మెరవటం వలన, ఖిన్న = అలసిన, విద్యుత్కళత్రః = మెరపనే భార్య కల, భవాన్ = నీవు, తాం = ఆ, రాత్రిం = రాత్రిని, నీత్వా = గడిపి, సూర్యే = సూర్యుడు, దృష్టేసతి = కనబడగా, పునరపి = మరల, అధ్వశేషం = దారిలో మిగిలినభాగాన్ని, వాహయేత్ = ప్రయాణించవలెను, సుహృదాం = మిత్రులయొక్క అభ్యుపే...కృత్యాః; అభ్యుపేత = అంగీకరించబడిన, అర్థ = విషయము యొక్క కృత్యాః = కార్యముకలవారు, నమందాయన్తేఖలు = అశ్రద్ధతో ప్రవర్తించరు కదా!

తా. : ఓ మేఘమా! ఆ రాత్రి ఆ నగరంలోని ఏదో భవనం పై భాగంలో పావురాలు పడుకొనే చోట విశ్రాంతి తీసుకొని, సూర్యోదయంకాగానే తిరిగి నీ ప్రయాణాన్ని కొనసాగించుము. ఉత్తములైన వారు మిత్రుల కార్యమును చేస్తానని ఒప్పుకొని, ఆ విషయంలో బద్ధకించరు కదా! నీవు నామిత్రుడవు కనుక నాపని విషయంలో ఆలస్యం చేయక త్వరగా వెళ్లుము.

అర్థాంతర న్యాసాలంకారము.

**శ్లో॥ తస్మిన్కాలే నయనసలిలం యోషితాం ఖండితానాం**
**శాంతిం నేయం ప్రణయిభిరతో వర్త్మ భానో స్త్యజాశు**
**ప్రాలేయాస్రం కమలవదనా త్సోఽపి హర్తుం నలిన్యాః**
**ప్రత్యావృత్త స్త్వయి కరరుధి స్యా దనల్పాభ్యసూయః** 43

ప్ర.ప. : తస్మిన్ = ఆ, కాలే = ప్రాతః కాలంలో, ప్రణయిభిః = ప్రియులచేత, ఖండితానాం = కోపముతో ఉన్న, యోషితాం = స్త్రీల యొక్క, నయనసలిలం = కన్నీరు, శాంతిం = ఊరటను, నేయం = పొందించదగినది, అతః = అందువలన, భానోః = సూర్యుణి యొక్క, వర్త్మ = దారిని, ఆశు = తొందరగా, త్యజ = విడువుము, సః+అపి = సోఽపి = ఆ సూర్యుడు కూడ, నలిన్యాః = తామరతీగ యొక్క, కమల వదనాత్ = తామరపూవనే ముఖము నుండి, ప్రాలేయ+అస్రం = మంచు అనే కన్నీటిని, హర్తుం = తొలగించుటకు, ప్రత్యావృత్తః = తిరిగి వచ్చుచున్నాడు, త్వయి = నీవు, కరరుధిసతి = చేతుల (కిరణాల) ను అడ్డగించినట్లయితే, అనల్ప = అధికమైన, అభ్యసూయః = అసహనము కలవాడుగా, స్యాత్ = కాగలడు.

**తా.** : ఓ మేఘమా! నీవు బయలుదేరిన ప్రాతఃకాలము, తమపై కోపించిన స్త్రీల కన్నీళ్లను తుడుచుటకు ప్రియులు పూనుకోదగినది. సూర్యుడు, గతరాత్రి అంతా తనకు దూరంగా ఉన్నందున తన ప్రియురాలైన నళిని (తామరతీగ) కోపించి ఖండిత అయినది. మంచు బిందువులను కన్నీరుగా ధరించింది. ఆమెనోదార్చుటకు వచ్చు సూర్యునికి నీవు అడ్డురావద్దు. వచ్చినట్లయితే నీపై సూర్యునికి ఎక్కువ వ్యతిరేకభావం కలుగుతుంది. కనుక అటువంటి పని చేయవద్దు.

కాళిదాసు శృంగార ప్రియుడు కనుక ఈ శ్లోకంలో కవి సమయాలను బట్టి సూర్యుణ్ణి నాయకునిగా, నళిని (తామరతీగ)ని నాయికగా వర్ణించినాడు. రాత్రంతా తనకు దూరంగా ఉన్నందుకు సూర్యునిపై కోపంతో నళిని మంచుబిందువులనే కన్నీళ్లుగా పెట్టుకుంది. సూర్యుడు తన కరాల (కిరణాల)తో వాటిని తుడవటానికి వస్తున్నాడు. నీవు సూర్యునికి అడ్డంగా వెళ్లవద్దు అని యక్షునితో చెప్పించినాడు.

ఖండిత అనగా శృంగార నాయికలలో ఒక భేదం. తన భర్త రాత్రంతా వేరే చోట గడిపి ప్రొద్దున ఇంటికి రాగా పరస్త్రీతో కూడిన చిహ్నాలను చూచి అతనిపై కోపించిన స్త్రీ ఖండిత అని అలంకార శాస్త్ర లక్షణం. సూర్య నళినులు ప్రాణులు కాకున్నా వాటియందు నాయికా నాయకత్వాలారోపించి కవి సహజరీతిలో చెప్పటం జరిగింది.

**శ్లో॥ గంభీరాయాః పయసి సరిత శ్చేతసీవ ప్రసన్నే**
**ఛాయాత్మాఽపి ప్రకృతిసుభగో లప్స్యతే తే ప్రవేశమ్**
**తస్మా దస్యాః కుముదవిశదా న్యర్హసి త్వం న ధైర్యా**
**న్మోఘీకర్తుం చటులశఫరోద్వర్తన ప్రేక్షితాని.** 44

ప్ర.ప. : గంభీరాయాః = గంభీర అనబడు, సరితః = నది యొక్క, ప్రసన్నే = నిర్మలమైన, పయసి = నీటియందు, ప్రసన్నే = స్వచ్ఛమైన, చేతసీవ = మనస్సులోవలె, ప్రకృతిసుభగః = సహజముగా అందమైన, తే = నీ యొక్క, ఛాయాత్మాపి = నీడ రూపమైన శరీరమైనా, ప్రవేశం = ప్రవేశాన్ని, లప్స్యతే = పొందగలదు, తస్మాత్ = అందువలన, అస్యాః = ఈ నదియొక్క, కుముద = తెల్లకలువలవలె, విశదాని = తెల్లనైన, చటుల...ప్రేక్షితాని; చటుల = చంచలమైన, శఫర = చేపలయొక్క, ఉద్వర్తన =

పైకెగురుటవంటి (మిట్టిపడు) ప్రేక్షితాని = చూపులను, ధైర్యాత్ = దుడుకుతనముతో, మోఘీకర్తుం = వ్యర్థము చేయుటకు, న+అర్హసి = తగవు.

తా. : ఓ మేఘమా! మహాకాలక్షేత్రానికి కొంతదూరంలో గంభీర అనే నది వస్తుంది. దాని నీరు స్వచ్ఛమైన మనస్సువలె నిర్మలంగా ఉంటుంది. దానిలో నీ నీడ ప్రతిబింబిస్తుంది. ఆ నదిలో చేపలు మాటి మాటికి పైకెగురుతుంటాయి. వాటిని ఆ నది యొక్క చంచలమైన, తెల్లని చూపులుగా స్వీకరించుము. ధూర్తత్వంతో ఆ చూపులను వ్యర్థము చేయవద్దు...

ఆ నది నీ ఛాయ స్పర్శచే పులకించి నీపైన తన అనురాగాన్ని తెల్లని చేపల మిడిసిపాట్లే కడగంటి చూపులుగా ప్రసరిస్తుందని, ఆ ప్రణయాన్ని నీవు నిరాకరించటం తగదని నాయికానాయకభావాన్ని చక్కగా వర్ణించినాడు కవి.

**శ్లో॥ తస్యాః కించి త్కరధృత మివ ప్రాప్తవానీరశాఖం**
**హృత్వా నీలం సలిలవసనం ముక్తరోధోనితంబమ్**
**ప్రస్థానం తే కథమపి సఖే లంబమానస్య భావి**
**జ్ఞాతాస్వాదో వివృతజఘనాం కో విహాతుం సమర్థః** **45**

ప్ర.ప. : హేసఖే = ఓ మిత్రమా! ప్రాప్త...శాఖం; ప్రాప్త = పొందబడిన, వానీర = ప్రబ్బలిచెట్టు యొక్క, శాఖం = కొమ్మలు కలది, కించిత్ = కొంచెము, కరధృతం ఇవ = చేతిలో ధరించినదివలె ఉన్నది, ముక్త...తంబం; ముక్త = వదలబడిన, రోధః = ఒడ్డులనే, నితంబం = పిరుదులు కలది అగు, తస్యాః = ఆ నదియొక్క, నీలం = నల్లని, సలిలవసనం = నీరు అనే బట్టను, హృత్వా = తొలగించి, లంబమానస్య = వ్రేలాడుతున్న, తే = నీకు, ప్రస్థానం = ప్రయాణము, కథమపి = అతికష్టతరము, భావి = కాగలదు, జ్ఞాతాస్వాదః = శృంగారరసానుభవము కల, కః = ఎవడు, వివృతజఘనాం = ఆచ్ఛాదనములేని కటి ప్రదేశముకల స్త్రీని, విహాతుం = విడిచిపెట్టుటకు, సమర్థః = సమర్థుడు కాగలడు?

తా. : ఓ మిత్రమా! నీవు ఆ గంభీరానదిలోకి వంగి నల్లని నీరు అనే వస్త్రమును తొలగించగా (త్రాగగా) ఒడ్డున ఉన్న ప్రబ్బలి చెట్టనే చేతితో పట్టుకున్న దానిని హరించినట్లయినది. అప్పుడు వస్త్ర శూన్యమైన నడుముకల ఆ గంభీరనదిని (నాయికను) చూచిన నీకు తరువాత ప్రయాణము కష్టమే... ఎందుకనగా రసికుడైనవాడు ఎవడు నగ్నమైన కటి ప్రదేశము కల వనితను విడిచి వెళ్లగలడు?

ఇక్కడ కూడ కవి నదిని నాయికగాను మేఘుని నాయకునిగాను కల్పించి శృంగార పరంగా వర్ణించినాడు. ఒడ్డునందు నితంబాన్ని, నీటియందు వస్త్రాన్ని, నదియందు నాయకత్వాన్ని ఆరోపించటం వలన రూపకాలంకారము. నాలుగోపాదంలో అర్థాంతరన్యాసాలంకారము.

**శ్లో॥ త్వన్నిష్యందోచ్ఛ్వసిత వసుధాగంధసంపర్క రమ్యః**
**స్రోతోరంధ్రధ్వనితసుభగం దంతిభిః పీయమానః**
**నీచై ర్వాస్య త్యుపజిగమిషో ర్దేవపూర్వం గిరింతే**
**శీతోవాతః పరిణమయితా కాననోదుంబరాణామ్** **46**

ప్ర.ప. : త్వన్నిష్యం...రమ్యః; త్వత్ = నీయొక్క నిష్యంద = వర్షముచేత, ఉచ్ఛ్వసిత = పైకి ఉబికిన, వసుధా = భూమియొక్క గంధ = పరిమళము యొక్క సంపర్క = సంబంధముచేత, రమ్యః = మనోహరమైన, స్రోతో...సుభగం, స్రోతోరంధ్ర = నాసికారంధ్రాల నుండి, ధ్వనిత = శబ్దముచేత, సుభగం = అందముగా, దంతిభిః = ఏనుగులచేత, పీయమానః = ఆస్వాదింపబడుతూ, శీతః = చల్లనైన, వాతః = గాలి, కాననోదుంబరాణాం = అడవిలోని మేడి పండ్లను, పరిణమయితా = పక్వమగునట్లు చేస్తూ, దేవపూర్వం = దేవశబ్దము ముందుకల, గిరిం = పర్వతమును (దేవగిరిని గూర్చి), ఉపజిగమిషోః = వెళ్లగోరుతున్న, తే = నీకు, నీచైః = క్రింది భాగములో, వాస్యతి = వీచగలదు.

**తా.** : ఓ మేఘమా! నీవు మొదటిసారి వర్షించినప్పుడు భూమిలో నుండి పైకి ఎగసిన పరిమళముతో కలిసి హాయిని గల్గించేది, చల్లనిది అగు గాలిని ఏనుగులు తమ ముక్కురంధ్రాల నుండి కమ్మని ధ్వని కలుగునట్లు ఆఘ్రాణింపబడుతుంటాయి. ఆగాలి స్పర్శకు అడవిలోని మేడి ఫలాలు పక్వమవుతాయి. అక్కడి నుండి దేవగిరికి వెళ్లబోవు నీకు ఆ చల్లనిగాలి క్రింది భాగము నుండి వీచి హాయిని కల్గిస్తుంది. అది నీకు శుభ సూచకము. సుఖముగా నీ ప్రయాణము సాగగలదు.

ఈ శ్లోకంలో 'స్రోతోరంధ్ర' అనేచోట స్రోతశ్శబ్దానికి ఇంద్రియమనే అర్థమైనప్పటికి ఇంద్రియ విశేషమైన నాసికను చెప్పటం సందర్భాన్ని బట్టి లక్షణావృత్తి నాశ్రయించవలెను. దేవపూర్వం అనే స్థలంలో కూడ లక్షణతోనే చెప్పవలెను. దేవశబ్దము పూర్వమందు కలది దేవగిరి శబ్దమవుతుంది కాని, దేవగిరి పర్వతము కాదు కదా! అందువల్ల ఇక్కడ వాచ్యార్థము కుదరదు.

అలంకారము : స్వభావోక్తి.

సహజ స్థితిని మనోహరంగా వర్ణిస్తే స్వభావోక్త్యలంకారమౌతుంది.

**శ్లో॥ తత్ర స్కందం నియతవసతిం పుష్పమేఘీకృతాత్మా**
**పుష్పాసారైః స్నపయతు భవాన్ వ్యోమగంగా జలార్ద్రైః**
**రక్షాహేతో ర్నవశశిభృతా వాసవీనాం చమూనా**
**మత్యాదిత్యం హుతవహముఖే సంభృతం తద్ధి తేజః** 47

ప్ర.ప. : తత్ర = ఆ దేవగిరిపైన, నియత = నిశ్చయమైన, వసతిం = నివాసముకల, స్కందం = కుమారస్వామిని, భవాన్ = నీవు, పుష్ప...తాత్మా: పుష్ప = పూవులను వర్షించు, మేఘీకృత = మేఘముగా చేసుకున్న, ఆత్మా = స్వరూపము కలవాడవై, వ్యోమ...ర్ద్రైః; వ్యోమగంగా = ఆకాశగంగ యొక్క జల = నీటితో, ఆర్ద్రైః = తడిసిన, పుష్పాసారైః = పూల జల్లులతో, స్నపయతు = స్నానము చేయించుము, తత్ = ఆ, తేజః = కుమారస్వామి రూపమైన తేజస్సు, వాసవీనాం = ఇంద్రునికి సంబంధించిన, చమూనాం = సైన్యముల యొక్క రక్షాహేతోః = కాపాడుట కొరకు, నవశశి భృతా = బాలచంద్రుణ్ణి ధరించిన శివుని చేత, హుతవహముఖే = అగ్నియొక్క నోటియందు, సంభృతం = ఉంచబడిన, అత్యాదిత్యం = సూర్యుణ్ణిమించిన, తేజఃహి = తేజస్సుకదా!

తా. : ఓ జలదా! ఆ దేవగిరి దగ్గర కుమారస్వామి ఎల్లప్పుడు నివాసము కలిగి ఉంటాడు. నీవు కామరూపుడవు కనుక పూల మేఘముగా మారి, ఆకాశగంగా జలముతో తడిసిన పుష్పాల జల్లును కుమారస్వామిపైన కురిపించి పూజించుము. ఆ కుమారస్వామి, పూర్వము తారకాసురుని ధాటి నుండి దేవసైన్యాలను కాపాడదలచి శివుడు తన తేజస్సునగ్ని యందుంచగా జన్మించిన వాడు కదా!

పూర్వము తారకాసుర సంహారము కొరకు దేవతలర్థింపగా, శివుడు తన వీర్యము నగ్నియందుంచగా, అగ్ని భరింపలేక గంగయందు వేయగా, ఆ గంగ రెల్లువనమునం దుంచగా, తరువాత కృత్తికా నక్షత్ర దేవతలు అతనిని పెంచినారని పురాణగాథ ఉన్నది. కృత్తికలచే పెంచబడినందుకు కార్తికేయుడనే పేరు వచ్చింది.

**శ్లో॥ జ్యోతిర్లేఖా వలయి గళితం యస్య బర్హం భవానీ**
**పుత్రప్రేమ్ణా కువలయదళప్రాపి కర్ణే కరోతి**
**ధౌతాపాంగం హరశశిరుచా పావకే స్తం మయూరం**
**పశ్చాదద్రిగ్రహణగురుభిర్గర్జితై ర్నర్తయేథాః** 48



ప్ర.ప. : జ్యోతి...వలయి; జ్యోతిః = కాంతియొక్క, లేఖా = కిరణాల, వలయి = వలయాలు కలది, గళితం = జారినది అగు, యస్య = ఏ నెమలి యొక్క బర్హం = పింఛమును, భవానీ = పార్వతీదేవి, పుత్రప్రేమ్ణా = కుమారునిపై గల ప్రేమచేత, కువ... ప్రాపి; కువలయ = కలువపూవు యొక్క దళ = రేకుతో, ప్రాపి = జతచేసి, కర్ణే = చెవియందు, కరోతి = ధరించునో, హరశశిరుచా = శివుని తలమీది చంద్రుని కాంతిచేత, ధౌతాపాంగం = తెల్లనైన కంటికొనలు కల, పావకేః = కుమారస్వామి యొక్క తం = పూర్వము చెప్పబడిన, మయూరం = నెమలిని, పశ్చాత్ = తరువాత, అద్రి...గురుభిః; అద్రి = (దేవగిరి) పర్వతము యొక్క గ్రహణ = గుహలయందు ప్రతిధ్వనించుట చేత, గురుభిః = బిగ్గరగా అయిన, గర్జితైః = ఉరుములచేత, నర్తయేథాః = నృత్యము చేయింపుము.

తా. : మేఘమా! కుమారస్వామి వాహనం నెమలి. దాని పింఛము కాంతులు ప్రసరించే వలయాలు కలది. అది కింద రాలిపడినప్పుడు పార్వతీదేవి పుత్రుని పై ఉండే ప్రేమతో దానిని తీసుకొని చెవిలో కలువపూవుతో కలిపి అలంకరించుకుంటుంది. శంకరుని తలమీది చంద్రుని వెన్నెలతో తెల్లనైన కనుకొనలు కలిగిన కుమారస్వామి వాహనమైన నెమలితో పర్వత గుహలలో ప్రతిధ్వనించిన నీ ఉరుముల ద్వారా నృత్యము చేయించుము. సాధారణంగా నెమలి మబ్బును చూచి సంతోషంతో నృత్యం చేస్తుంది. దానికి నీ ఉరుము వాద్యమువలె సహకరించగలదని భావము.

**శ్లో॥ ఆరాధ్యైనం శరవణభవం దేవ ముల్లంఘితాధ్వా**
**సిద్ధద్వంద్వై ర్జలకణభయా ద్వీణిభి ర్ముక్తమార్గః**
**వ్యాలంబేథాః సురభితనయాలమ్భజాం మానయిష్యన్**
**స్రోతోమూర్త్యా భువి పరిణతాం రంతిదేవస్యకీర్తిమ్.** 49

ప్ర.ప. : ఏనం = ఇంతకు ముందు చెప్పిన, శరవణభవం = రెల్లువనము నుండి పుట్టిన, దేవం = కుమారస్వామిని, ఆరాధ్య = పూజించి, వీణిభిః = వీణలను ధరించిన, సిద్ధ ద్వంద్వైః = సిద్ధ దంపతులచేత, జలకణభయాత్ = నీటిబిందువుల భయం వలన, ముక్తమార్గః = విడువబడిన దారి కలవాడవై, ఉల్లంఘిత+అధ్వా = దాటిన మార్గము కలవాడవై, సురభి...లంభజాం; సురభి = కామధేనువు యొక్క, తనయా = సంతానమైన గోవులను, ఆలంభజాం = (యాగములందు) చంపుటవలన కలిగిన, రంతిదేవస్య = రంతిదేవుడనే రాజు యొక్క, కీర్తిం = కీర్తిని, భువి = భూమియందు, స్రోతోమూర్త్యా = ప్రవాహరూపముతో, (చర్మణ్వతినదిగా) పరిణతాం = మారిన దానిని, మానయిష్యన్ = గౌరవించుచు, వ్యాలంబేథాః = నమ్రుడవై వేలాడుము.

తా. : ఓ మేఘమా! అక్కడ దేవగిరిలో కుమారస్వామిని సేవించి, తరువాత కొంత మార్గము దాటి, ఆకాశంలో వీణలు ధరించి తిరిగే సిద్ధుల జంటలకు నీ వర్షబిందువుల భయము కలుగకుండా వారి మార్గాన్ని వదలుము. తరువాత నీ మార్గంలో చర్మణ్వతి అనే నది వస్తుంది. అది పూర్వము రంతిదేవుడనే రాజు అనేక యాగములలో గోవులనాహుతి చేసి సంపాదించిన కీర్తి భూమిపై నదిగా పరిణమించినది. అందువలన ఆకీర్తికి మర్యాద చూపుతూ అక్కడ నీవు వినయముతో క్రిందికి వంగి ముందుకు ప్రయాణము సాగించుము.

భారతీయులకు పూజనీయములైన గోవులను యాగరూపంలో అనేకములను బలి యిచ్చుట విచారకరము. అది కీర్తి దాయకమని ఆనాడు భావించుట ఆలోచింపదగిన విషయమే.

అలంకారము : అభేదాతిశయోక్తి.

కీర్తి, చర్మణ్వతీ నదులకు భేదమున్నను అభేదముగా వర్ణించుట వలన అభేదాతిశయోక్తి.

**శ్లో॥ త్వయ్యాదాతుం జలమవనతే శార్ఙ్గిణో వర్ణచౌరే**
**తస్యాః సింధోః పృథుమపి తనుం దూరభావా త్ప్రవాహమ్**
**ప్రేక్షిష్యంతే గగనగతయో నూనమావర్జ్య దృష్టీ**
**రేకం ముక్తాగుణ మివ భువః స్థూలమధ్యేంద్ర నీలమ్** 50

ప్ర.ప. : శార్ఙ్గిణః = విష్ణువు యొక్క, వర్ణచౌరే = రంగును దొంగిలించిన, త్వయి = నీవు, జలం = నీటిని, ఆ దాతుం = స్వీకరించుటకు, అవనతేసతి = క్రిందికి చేరినప్పుడు, పృథుం+అపి = పెద్దదయినప్పటికి, దూరభావాత్ = దూరముగా ఉండుటవలన, తనుం = సన్నగా ఉన్నట్టి, తస్యాః = ఆ, సింధోః = నది యొక్క, ప్రవాహం = ప్రవాహమును, గగన గతయః = ఆకాశ సంచారులగుదేవతలు, స్థూల...నీలం; స్థూల = లావైన, మధ్య = నడుమనున్న, ఇంద్రనీలం = ఇంద్రనీలమణి కలిగిన, ఏకం = ఒక, భువః = భూమి యొక్క ముక్తాగుణం ఇవ = ముత్యాలహారమును వలె, దృష్టీః = చూపులను, ఆ వర్జ్య = కుంచించుకొని, నూనం = నిశ్చయముగా, ప్రేక్షిష్యంతే = చూడగలరు.

తా. : ఓ మేఘమా! నీవు ఆచర్మణ్వతి నదిలో నీరు త్రాగటానికి క్రిందికి దిగినప్పుడు నల్లని నీ శరీరం నది మధ్యలో ఉండగా ఆకాశంలో సంచరించే దేవతలకు నదీ ప్రవాహము దూరంగా ఉండటం వలన సన్నగా కన్పిస్తుంది. అప్పుడు వారికి నదీ ప్రవాహము మధ్య



ఇంద్రనీలమణి కలిగిన ముత్యాలహారము వలె కన్పిస్తుంది. రంతిదేవుని కీర్తి నదిగా మారినట్లు పూర్వం చెప్పినందున కీర్తి తెల్లగా ఉంటుందనేది కవి సమయం కనుక, ప్రవాహం ముత్యాలహారం వలె, నల్లని మేఘం ఇంద్రనీలమణి అని కవి భావము.

1. విష్ణువు రంగును మేఘము దొంగిలించినట్లు వర్ణించబడినది. అది అసంభవమగుట వలన తత్సమానవర్ణమనే అర్థము బోధింపబడటం వల్ల నిదర్శనాలంకారము.
2. మేఘముతో కూడిన ప్రవాహము నీలమణి కూర్చిన ముత్యాలహారమా అన్నట్లున్నదని సంభావించటం వలన ఉత్ప్రేక్షాలంకారము. ఇవ శబ్దం ప్రయోగించటం చేత వాచ్యోత్ప్రేక్ష.

ఈ రెండింటికి పరస్పర సంబంధముండుట చేత సంకరాలంకారము.

SANSKRIT LIBRARY
BOOK No. KY63
NAGARJUNA UNIVERSITY
(A. P) - 522 510.

**శ్లో॥ తాముత్తీర్య వ్రజ పరిచితభ్రూలతావిభ్రమాణాం**
**పక్ష్మోత్క్షేపా దుపరివిలసత్కృష్ణసారప్రభాణామ్**
**కుందక్షేపానుగమధుకరశ్రీముషా మాత్మబింబం**
**పాత్రీకుర్వ న్దశపురవధూనేత్రకౌతూహలానామ్** 51

ప్ర.ప. : తాం = ఆచర్మణ్వతి నదిని, ఉత్తీర్య = దాటి, పరి...భ్రమాణాం; పరిచిత = బాగుగా తెలిసిన, భ్రూలతా = తీగలవంటి కనుబొమ్మల యొక్క, విభ్రమాణాం = విలాసాలు కలిగిన, పక్ష్మ+ఉత్క్షేపాత్ = రెప్పలను పైకెత్తటం వలన, ఉపరి = పైభాగంలో, విలసత్ = ప్రకాశిస్తున్న, కృష్ణసార = చిత్రవర్ణపు, ప్రభాణాం = కాంతులు కలిగిన, కుంద...ముషాం; కుంద = మొల్ల పూవుల, క్షేప = కదలికలను, అనుగ = అనుసరించి వెళ్లు, మధుకర = తుమ్మెదల యొక్క, శ్రీముషాం = కాంతినపహరించిన, దశ...హలానాం, దశపుర = దశపురమనే పట్టణంలోని, వధూ = స్త్రీల యొక్క, నేత్ర = కన్నుల, కౌతూహలానాం = కోరికలకు, ఆత్మబింబం = నీ ప్రతి బింబాన్ని, పాత్రీ కుర్వన్ = విషయముగా చేయుచు, వ్రజ = వెళ్లుము.

తా. : ఓ మేఘమా! నీవు ఆ చర్మణ్వతీనదిని దాటి ముందుకువెళ్లి దశపురమనే పట్టణంలోని స్త్రీల కుతూహలంతో కూడిన చూపులకు పాత్రుడవు కాగలవు. నీప్రతిబింబాన్ని ఆనదీజలాల్లో వారు కుతూహలంతో చూస్తారు. ఆచూపులెట్లా ఉంటాయంటే, కనుబొమ్మలు తిప్పే విలాసాలతో, మొల్లపూవులపై వాలుతున్న తుమ్మెదల శోభ కలిగి, రెప్పలు పైకెత్తటం వలన రంగు రంగుల కాంతులతో కూడి ఉంటాయి. నీటిలో నీబింబాన్ని చూచి వేడుకతో

ఆకాశంలో నీవైపు చూస్తారు. ఆ అవకాశాన్ని నీవు వదులుకో వద్దు సుమా! రంతిదేవుని రాజధాని దశపురము.

అలంకారము : తుమ్మెదల శోభను దొంగిలించుట అసంభవం కనుక దానివంటి శోభ అని పర్యవసించుటచే నిదర్శనాలంకారము.

**శ్లో॥ బ్రహ్మావర్తం జనపద మథ చ్ఛాయయా గాహమానః**
**క్షేత్రం క్షత్రప్రధనపిశునం కౌరవం తద్భజేథాః**
**రాజన్యానాం శితశరశతై ర్యత్ర గాండీవధన్వా**
**ధారాపాతై స్త్వమివ కమలాన్యభ్యవర్ష న్ముఖాని** **52**

ప్ర.ప. : అథ = తరువాత, బ్రహ్మావర్తం = బ్రహ్మావర్తమను పేరుగల, జనపదం = ప్రదేశమును, ఛాయయా = నీడతో, గాహమానః = ప్రవేశించినవాడవై, క్షత్ర...పిశునం; క్షత్ర = క్షత్రియులయొక్క, ప్రధన = యుద్ధమును, పిశునం = సూచించేది అగు, తత్ = ఆ, కౌరవం = కురువంశ సంబంధమైన, క్షేత్రం = కురుక్షేత్రమును, భజేథాః = సేవింపుము, యత్ర = ఏ స్థలములో, గాండీవధన్వా = గాండీవమనే ధనుస్సుగల అర్జునుడు, శిత = వాడియైన, శరశతైః = వందలకొద్ది బాణాలతో, రాజన్యానాం = రాజుల యొక్క, ముఖాని = ముఖములను, త్వం = నీవు, ధారాపాతైః = వర్షపు ధారలతో, కమలాని ఇవ = పద్మములను వలె, అభ్యవర్షత్ = వర్షముగా కురిపించెనో;

**తా.** : దశపురాన్ని దాటిన తరువాత బ్రహ్మావర్తమనే ప్రాంతానికి చేరి నీడను ప్రసరించి కురుక్షేత్రాన్ని చేరుకుంటావు అది కురువంశపు వారికి సంబంధించిన స్థలము. అక్కడ పూర్వము క్షత్రియులు పోరాడిన గుర్తులు కన్పించును. ఆ స్థలంలో ఒకప్పుడు అర్జునుడు తన ధనుస్సుతో శత్రురాజుల ముఖాలపై నీవు కమలాల మీద వర్షం కురిపించినట్లు బాణముల వర్షము కురిపించినాడు.

మేఘుని వర్షధారాపాతానికి, అర్జునుని బాణ పరంపర వర్షానికి ఔపమ్యం చెప్పుట వలన ఉపమాలంకారము.

**శ్లో॥ హిత్వా హాలా మభిమతరసాం రేవతీలోచనాంకాం**
**బంధుప్రీత్యా సమరవిముఖో లాంగలీ యాః సిషేవే**
**కృత్వా తాసా మభిగమ మపాం సౌమ్య సారస్వతీనా**
**మన్తశ్శుద్ధ స్త్వమసి భవితా వర్ణమాత్రేణ కృష్ణః** **53**



ప్ర.ప. : హే సౌమ్య! = ఓ సజ్జనుడా? బంధుప్రీత్యా = బంధువులపై ప్రేమతో, సమరవిముఖః = యుద్ధమందు ఆసక్తి తొలగి, లాంగలీ = నాగలి ఆయుధముగా కల బలరాముడు, అభిమతరసాం = ఇష్టమైన రుచి కలిగిన, రేవ...కాం; రేవతీ = తన భార్య రేవతి యొక్క, లోచన = కన్నులు, అంకాం = గుర్తుగా కలిగిన, హాలాం = మద్యమును, హిత్వా = వదిలి, యాః = ఏ నది జలములను, సిషేవే = సేవించెనో, తాః = ఆ, సారస్వతీనాం = సర్వసతీనదికి సంబంధించిన, అపాం = జలముల యొక్క, అభిగమం = ఎదురుగా వెళ్లి సేవించుటను, కృత్వా = చేసి, త్వం = నీవు, వర్ణమాత్రేణ = కేవలం రంగుచేత, కృష్ణః = నల్లని వాడవు, అంతశ్శుద్ధః = లోపల నిర్మలమైన (తెల్లని) వాడవు, భవితాఽసి = కాగలవు.

**తా.** : సాధుస్వభావం కల ఓ మేఘుమా! ఆ కురుక్షేత్రానికి సమీపంలో సరస్వతీ నది ప్రవహించుచుండును. పూర్వము బలరాముడు కౌరవపాండవుల యందు సమాన ప్రేమకలవాడై మహాభారత యుద్ధానికి దూరంగా వెళ్లుతూ, అప్పటి వరకు తనకు చాల ఇష్టమైన మద్యపానమును వదిలి సరస్వతీనది జలములను త్రాగెనట. అటువంటి పవిత్రమైన సరస్వతీ నదికి ఎదురుగా వెళ్లి నీటి నాస్వాదించి లోపల పరిశుద్ధుడవౌతావు. కేవలం పైన మాత్రం నలుపురంగు కలిగి ఉంటావు.

**శ్లో॥ తస్మాద్గచ్ఛే రనుకనఖలం శైలరాజావతీర్ణాం**
**జహ్నోః కన్యాం సగరతనయస్వర్గసోపానపంక్తిమ్**
**గౌరీవక్త్రభ్రుకుటిరచనాం యా విహస్యేవ ఫేనైః**
**శంభోః కేశగ్రహణ మకరో దిందులగ్నోర్మిహస్తా** **54**

ప్ర.ప. : తస్మాత్ = ఆ కురుక్షేత్రము నుండి, అనుకనఖలం = కనఖలమనే ప్రదేశము వెంట ప్రవహించేది, శైలరాజ+అవతీర్ణాం = పర్వతరాజైన హిమాలయము నుండి దిగినది, జహ్నోః = జహ్నువనే మునియొక్క, కన్యాం = కూతురైనది, సగర...పంక్తిం, సగర = సగరుడనే రాజు యొక్క, తనయ = కుమారుల, స్వర్గ = స్వర్గము వెళ్లుటకు, సోపాన పంక్తిం = మెట్ల వరుసవంటి గంగానదిని గూర్చి, గచ్ఛేః = వెళ్లుము, యా = ఏ గంగ, ఫేనైః = నురుగులతో, గౌరీ...రచనాం; గౌరీ = పార్వతి యొక్క, వక్త్ర = ముఖములోని, భ్రుకుటి = బొమముడి యొక్క, రచనాం = కూర్పును, విహస్యఇవ = అపహాస్యము చేసినట్లు, ఇందు...హస్తా; ఇందు = చంద్రుని యందు, లగ్న = తాకిన, ఊర్మిహస్తా =

తరంగాలనే చేతులు కలదై, శంభోః = శివునియొక్క, కేశగ్రహణం = తల వెంట్రుకలను గ్రహించుటను, అకరోత్ = చేసెనో!

**తా.** : ఓ మేఘుమా! ఆ కురుక్షేత్రాన్ని దాటి కనఖలమనే క్షేత్రము ద్వారా ప్రవహించే గంగానదిని చేరుము. ఆ నది జహ్నుముని పుత్రిక, సగర కుమారుల స్వర్గ గమనానికి సాధనమైనది. ఆ నది శివుని శిరస్సున చేరినది. పార్వతి యొక్క కనుబొమ్మలు ముడుచుటను తన తెల్లని నురుగుతో నవ్వుతున్నట్లుంటుంది. తన అలలతో శివుని తలమీది చంద్రుణ్ణి తాకుతూ శివుని తలవెంట్రుకలను గ్రహించింది.

**విశే.** : 1. పూర్వము గంగానది భూమికి వచ్చేటప్పుడు దారిలో జహ్నుముని ఆశ్రమాన్ని ముంచివేసింది. అప్పుడా ముని కోపించి గంగానదిని తనలోనికి పీల్చుకున్నాడు. భగీరథుని ప్రార్థనతో మళ్లీ తన చెవుల ద్వారా గంగను విడిచినాడని పురాణకథ.

2. పూర్వము సగరుడనేరాజు అశ్వమేధ యాగము చేసి గుర్రాన్ని వదలగా, ఇంద్రుడు శంకతో దాన్నపహరించి పాతాళంలో కపిలముని ఆశ్రమం దగ్గర బంధించి వెళ్లినాడు. సగరుని కుమారులు అశ్వాన్ని వెతికి చివరకు కపిలముని దగ్గర చూచి ఆయనే దాన్నపహరించి నాడనుకొని దుర్భాషలాడగా, ఆయన వారిని భస్మము కమ్మని శాప మిచ్చినాడు. తరువాత వారికి పుణ్యలోకప్రాప్తి గంగాజలంతో కలుగుతుందని కపిలముని చెప్పినాడు. అప్పుడు సగరుని మరొక కొడుకు, ఆయన కుమారుడు తపస్సు చేసినా ఫలించలేదు. చివరకు భగీరథుడు ఘోర తపస్సుతో గంగను భూమికి, పాతాళానికి కూడ తీసుకువచ్చి మృతులను గంగోదకముతో తడుపగా వారికి స్వర్గప్రాప్తి కలిగినదని రామాయణ గాథ.

3. గంగానది ప్రవాహరూపమైన ఒక దేవతగా, స్త్రీగా వర్ణించిన కథలు పురాణాల్లో ఉన్నాయి. శివుని రెండో భార్యగా కూడ చెప్పటం జరిగింది. వాటి ఆధారంగా ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. దాన్ననుసరించి కాళిదాసు కూడ పార్వతి గంగలను సవతులుగా చిత్రిస్తూ గంగ తనభర్త తల మీదికెక్కినందుకు అసూయతో కనుబొమలు ముడిచిందనీ, గంగ తన నురుగనే నవ్వుతో అపహసించి శివుని తలపై కూర్చున్నదని సవతి పోరుగా వర్ణించినాడు.

ఫేనైః విహస్యేవ (నురుగులతో నవ్వినదివలె) అనే చోట ఉత్ప్రేక్షాలంకారము.

శ్లో॥ తస్యాః పాతుం సురగజ ఇవ వ్యోమ్ని పశ్చార్ధలంబీ
త్వం చే దచ్ఛస్ఫటికవిశదం తర్కయే స్తిర్యగంభః



**సంసర్పంత్యా సపది భవతః స్రోతసి చ్ఛాయయాఽ సౌ**
**స్యాదస్థానోపగతయమునాసంగమేవాభిరామా.** **55**

ప్ర.ప. : సురగజః ఇవ = దేవతల ఏనుగు ఐరావతము వలె, వ్యోమ్ని = ఆకాశంలో, పశ్చార్ధలంబీసన్ = వెనుక సగభాగము వ్రేలాడుతూ, తస్యాః = ఆ గంగానది యొక్క, అచ్ఛ = నిర్మలమైన, స్ఫటిక = స్ఫటికమణివలె, విశదం = తెల్లని, అంభః = నీటిని, తిర్యక్ = అడ్డముగా, పాతుం = త్రాగుటకు, త్వం = నీవు, తర్కయేః+చేత్ = ఆలోచించి నట్లయితే, సపది = వెంటనే, స్రోతసి = ప్రవాహమందు, సంసర్పంత్యా = కదులుతున్న, భవతః = నీయొక్క, ఛాయయా = నీడచేత, అసౌ = ఈగంగ, అస్థా...గమేవ; అస్థాన = తగని స్థానములో, ఉపగత = పొందిన, యమునాసంగమా+ఇవ = యమునానది సంగమము కలదివలె, అభిరామా = మనోహరమైనదిగా, స్యాత్ = అవుతుంది.

**తా.** : ఓ మేఘూ! నీవు స్ఫటిక మణివలె నిర్మలమైన గంగానది జలమును వెనుక భాగమున వ్రేలాడి ఐరావతము వలె త్రాగదలచినట్లయితే ఆ నదిలో కదులుతున్న నీ ప్రతి బింబముతో గంగానది తగనిచోట యమునా నదితో కలిసిన దానివలె అందముగా కన్పించును.

గంగనీరు తెల్లగా ఉంటుంది. యముననీరు నల్లనిది – మేఘుని నల్లని నీడ గంగలో పడి యమున నీటివలె కన్పించునని అభిప్రాయము.

అలంకారములు : ఐరావతమువలె అనుచోట ఉపమాలంకారము.

“అస్థానోపగత యమునాసంగమేవ” అనే చోట ఉత్ప్రేక్ష.

శ్లో॥ **ఆసీనానాం సురభితశిలం నాభిగన్ధై ర్మృగాణాం**
**తస్యా ఏవ ప్రభవ మచలం ప్రాప్యగౌరం తుషారైః**
**వక్ష్యస్యధ్వశ్రమవినయనే తస్యశృంగే నిషణ్ణః**
**శోభాం శుభ్రత్రినయన వృషోత్ఖాత పంకోపమేయామ్.** **56**

ప్ర.ప. : ఆసీనానాం = కూర్చుని ఉన్న, మృగాణాం = కస్తూరి మృగముల యొక్క, నాభిగంధైః = బొడ్డులోని కస్తూరి పరిమళాల చేత, సురభిత = సువాసన పొందిన, శిలం = శిలలు కలిగినది, తుషారైః = మంచులచేత, గౌరం = తెల్లనైనది, తస్యాఃఏవ = ఆగంగా నదికే, ప్రభవం = జన్మస్థానమైన, అచలం = హిమాలయ పర్వతమును, ప్రాప్య = చేరి, అధ్వ...నయనే; అధ్వ = మార్గప్రయాణపు, శ్రమ = అలసటను, వినయనే =

తొలగించే నిమిత్తము, తస్య = ఆ పర్వతము యొక్క శృంగే = శిఖరం మీద, నిషణ్ణః = కూర్చుండి, శుభ్ర...మేయాం; శుభ్ర = తెల్లని, త్రినయన = శంకరుని యొక్క వృష = నందిచేత, ఉత్ఖాత = పెకలింపబడిన, పంకోపమేయాం = బురదతో సమానమైన, శోభాం = కాంతిని, వక్ష్యసి = వహించగలవు.

తా. : ఓ మేఘమా! ఆ హిమాలయ పర్వత శిలల మీద కూర్చున్న కస్తూరి మృగముల నాభి గంధముతో ఆ శిలలు పరిమళ భరితములవుతాయి. ఆ గంగానది జన్మస్థానమైన హిమాలయ పర్వతము చేరుకొని, ప్రయాణపు బడలిక తీర్చుకోవడానికి దాని శిఖరము మీద నీవు కూర్చున్నప్పుడు, తెల్లని నందికొమ్ములతో పైకి చిమ్మబడిన బురదతో సామ్యం పొందుతావు. అదృశ్యం అందంగా ఉంటుంది.

హిమాద్రిని నందితోను, మేఘాన్ని బురదతోను, పోల్చి వర్ణించటంవలన ఉపమా లంకారము.

**శ్లో॥ తం చేద్వాయౌ సరతి సరళస్కంధ సంఘట్టజన్మా**
**బాధేతోల్కాక్షపితచమరీవాలభారో దవాగ్నిః**
**అర్హస్యేనం శమయితు మలం వారిధారా సహస్రై**
**రాపన్నార్తి ప్రశమనఫలాః సంపదో హ్యుత్తమానామ్** 57

ప్ర.ప. : వాయౌ = అడవిగాలి, సరతిసతి = వీచుచుండగా, సరళ...జన్మా; సరళ = దేవదారు చెట్లయొక్క స్కంధ = కొమ్మల యొక్క సంఘట్ట = రాపిడి వలన, జన్మా = పుట్టినది, ఉల్కా...భారః; ఉల్కా = నిప్పురవ్వల చేత, క్షపిత = కాల్చబడిన, చమరీ = చమరీ మృగముల యొక్క, వాలభారః = ఈకల సముదాయముకల, దవాగ్నిః = కార్చిచ్చు, తం = ఆ పర్వతాన్ని, బాధేతచేత్ = బాధించినట్లయితే, ఏనం = ఈ కార్చిచ్చును, వారి ధారాసహస్రైః = అనేకములైన నీటి ధారలతో, శమయితుం = చల్లార్చుటకు, అలం = చాలినంతగా, అర్హసి = తగి ఉన్నావు, ఉత్తమానాం = ఉత్తముల యొక్క, సంపదః = సంపదలు, ఆప...ఫలాః హి; ఆపన్న = ఆపదలో ఉన్నవారి యొక్క, ఆర్తి = బాధను, ప్రశమన తొలగించుటయే, ఫలాః హి = ఫలముగా కలవి కదా!

తా. : ఓ మేఘమా! ఆ హిమాలయ పర్వతముపైన దేవదారు వృక్షాలు ఎక్కువగా ఉంటాయి. గాలికి ఆ చెట్ల కొమ్మల రాపిడి వలన పుట్టిన దావాగ్ని పెరిగి చమరీ మృగాల తోకల కుచ్చులను కాల్చి ఆ పర్వతాన్ని కూడ బాధించవచ్చు. అప్పుడు నీవు వర్ష ధారలను తీవ్రంగా కురిపించి ఆ దవాగ్నిని చల్లార్చుము. ఉత్తముల సంపదలు కష్టంలో ఉన్నవారి బాధలను తొలగించుటకే కదా! నీవు ఉత్తముడవు కనుక నీ జలసంపదతో హిమాలయ తాపాన్ని పోగొట్టుము అని యక్షుడు మేఘాన్ని ప్రశంసించి చెప్పినాడు.

అర్థాంతరన్యాసాలంకారము.

**శ్లో॥ యే సంరంభోత్పతన రభసాః స్వాంగభంగాయ తస్మి**
**న్ముక్తాధ్వానం సపది శరభా లంఘయేయు ర్భవన్తమ్**
**తాన్కుర్వీథా స్తుములకరకావృష్టిపాతావకీర్ణాన్**
**కేవా నస్యుః పరిభవపదం నిష్ఫలారంభయత్నాః** 58

ప్ర.ప. : తస్మిన్ = ఆ పర్వతమందు, సంరం...రభసాః; సంరంభ = ఉత్సాహముతో, ఉత్పతన = పైకెగురుటలో, రభసాః = వేగముకల, యే = ఏ, శరభాః = శరభ మృగాలు, ముక్తాధ్వానం = వాటికి దారి వదలిన, భవంతం = నిన్ను, స్వాంగభంగాయ = తమ శరీరావయములు విరుగుటకు, సపది = అప్పుడే, లంఘయేయుః = దూకును, తాన్ = ఆశరభమృగములను, తుముల...కీర్ణాన్; తుముల = తీవ్రమైన, కరకా = వడగండ్ల యొక్క వృష్టిపాత = వర్షము కురియటంతో, అవకీర్ణాన్ = చెదరిపోవునట్లుగా, కుర్వీథాః = చేయుము, నిష్ఫల...యత్నాః; నిష్ఫల = ఫలములేని, ఆరంభ = పనులను మొదలు పెట్టటంలో, యత్నాః = ప్రయత్నము కలవారు, కేవా = ఎవరు, పరిభవపదం = పరాభవానికి పాత్రులు, నస్యుః = కాకుందురు?

తా. : ఆ హిమాలయ పర్వతపు అడవులలో ఎనిమిది కాళ్ల శరభ మృగాలుంటాయి. అవి ఉత్సాహంతో ఎగురుతుంటాయి. నీవు వాటికి దారి విడిచి వెళ్లినా నీపైకి దూకే ప్రయత్నం చేస్తాయి. కిందపడి అవయవాలు విరుగగొట్టుకుంటాయి. అప్పుడు నీవు తీవ్రంగా వడగండ్ల వాన కురిపించి వాటిని చెల్లాచెదురుగా తొలగేటట్లు చేయుము. వ్యర్థమైన పనులకు పూనుకునేవారు పరాభవానికి పాత్రులు కాకుండా ఎవరు ఉంటారు?

అర్థాంతరన్యాసాలంకారము.

భకారము చాలాసార్లు ప్రయోగించబడటం వల్ల అనుప్రాసమనే శబ్దాలంకారము కూడ ఉన్నది.

**శ్లో॥ తత్ర వ్యక్తం దృషది చరణన్యాస మర్ధేందుమౌళేః**
**శశ్వత్సిద్ధై రుపచితబలిం భక్తినమ్రః పరీయాః**

యస్మిన్దృష్టే కరణవిగమా దూర్ధ్వ ముద్ధూతపాపాః
కల్పిష్యంతే స్థిరగణపదప్రాప్తయే శ్రద్ధధానాః 59

ప్ర.ప. : తత్ర = ఆ హిమాలయ పర్వతమందు, దృషది = ఒకో శిలపైన, వ్యక్తం = ప్రకటితమైన, శశ్వత్ = ఎల్లప్పుడు, సిద్ధైః = సిద్ధులచేత, ఉపచిత బలిం = చేయబడిన పూజ గలది అగు, అర్ధేందుమౌళేః = బాలచంద్రుని తలపైన ధరించిన శివుని యొక్క చరణన్యాసం = పాదముల ముద్రను, భక్తినమ్రః = భక్తితోవంగిన దానవై, పరీయాః = ప్రదక్షిణము చేయుము, యస్మిన్ = ఏ పాదముద్రస్థలము, దృష్టేసతి = చూడబడగా, ఉద్ధూత పాపాః = పాపములు తొలగిన వారై, శ్రద్ధధానాః = శ్రద్ధకల భక్తులు, కరణవిగమాత్ = శరీర త్యాగమునకు, ఊర్ధ్వం = తరువాత, స్థిర...ప్రాప్తయే; స్థిర = శాశ్వతమైన, గణపద = ప్రమథగణములలో స్థానమును, ప్రాప్తయే = పొందుటకు, కల్పిష్యంతే = సమర్థులగుదురో;

తా. : ఆ హిమాలయ పర్వతంలో ఒకచోట రాతి మీద శివుడు సంచరించిన పాదముద్రలు అంకితమై ఉన్నాయి. ఆ స్థలాన్ని సిద్ధులు ఎప్పుడూ పూజిస్తుంటారు. అక్కడ నీవు భక్తితో వినయపూర్వకంగా ప్రదక్షిణలు చేయుము. శ్రద్ధకల భక్తులు ఆ ప్రదేశాన్ని చూచిన మాత్రాన తమ పాపాలు నశించిపోగా, శివుని ప్రమథ గణాలలో స్థానం పొందగల్గుతారు. అందువలన నీవు కూడా ఆ అవకాశాన్ని వదులుకోవద్దు.

శ్లో॥ శబ్దాయన్తే మధురమనిలైః కీచకాః పూర్యమాణాః
సంసక్తాభి స్త్రిపురవిజయో గీయతే కిన్నరీభిః
నిర్హ్రాదస్తే మురజ ఇవ చేత్కన్దరేషు ధ్వనిః స్యా
త్సంగీతార్థో నను పశుపతే స్తత్ర భావీ సమగ్రః 60

ప్ర.ప. : తత్ర = ఆ హిమాలయమందు, అనిలైః = గాలుల చేత, పూర్యమాణాః = నింపబడుతున్న, కీచకాః = వెదురు కాండములు (రంధ్రములున్నవి), మధురం = కమ్మని స్వరంతో, శబ్దాయంతే = ధ్వని చేయును, సంసక్తాభిః = వేణువులందాసక్తి కల, కిన్నరీభిః = కిన్నరస్త్రీల చేత, త్రిపుర విజయః = త్రిపురాసురుల గెలిచిన గాథ, గీయతే = పాడబడుతుంది, కందరేషు = పర్వతగుహలందు, తే = నీ యొక్క, నిర్హ్రాదః = ఉరుము, మురజే = మృదంగమందలి, ధ్వనిః ఇవ = చప్పుడువలె, స్యాత్చేత్ = అయినట్లయితే, పశుపతేః = శంకరుని యొక్క, సంగీతార్థః = సంగీత సామగ్రి, సమగ్రః = సంపూర్ణమైనది, భావీ = కాగలదు.

తా. : ఓ మేఘమా! ఆ హిమాలయ ప్రాంతంలో కిన్నర స్త్రీలు సంచరిస్తుంటారు. వారు సంగీత ప్రియులు. వారు పాటలు పాడుతుంటే అక్కడి ఎండిన వెదురు బొంగుల రంధ్రములలో గాలి నిండి కమ్మని శ్రుతివలె వారిపాటలకు సహకరిస్తుంది. శివుని సాయంకాల పూజా సమయంలో కిన్నర స్త్రీలు భక్తితో త్రిపురాసుర గాథను పాడుతుంటే వేణువుల ధ్వనితోపాటు నీ గర్జన గుహలలో ప్రతిధ్వనించి మృదంగ ధ్వనివలె రాణించును. దానితో శివపూజా సమయపు సంగీత సామగ్రి సంపూర్ణంగా సమకూరుతుంది.

శ్లో॥ ప్రాలేయాద్రే రుపతట మతిక్రమ్య తాంస్తా న్విశేషాన్
హంసద్వారం భృగుపతియశోవర్త్మ యత్క్రౌంచరంధ్రమ్
తేనోదీచీం దిశ మనుసరే స్తిర్యగాయామశోభీ
శ్యామః పాదో బలినియమ నాభ్యుద్యతస్యేవ విష్ణోః 61

ప్ర.ప. : ప్రాలేయాద్రేః = ఆ మంచుకొండ యొక్క, ఉపతటం = చరియల వెంట, తాన్తాన్ = ఆయా, విశేషాన్ = విశేషాలను, అతిక్రమ్య = దాటివెళ్లి, భృగు...వర్త్మ; భృగుపతి = పరశురామునియొక్క, యశోవర్త్మ = కీర్తి మార్గము, హంసద్వారం = హంసల ప్రయాణ ద్వారము అగు, యత్ = ఏ, క్రౌంచరంధ్రం = క్రౌంచపర్వతగుహ, వర్తతే = కలదో, తేన = ఆ మార్గముతో, బలి...ద్యతస్య; బలి = బలిచక్రవర్తి యొక్క, నియమన = అణచివేయుటకు, అభ్యుద్యతస్య = పైకెత్తబడిన, విష్ణోః = నారాయణుని యొక్క, శ్యామః = నల్లని, పాదః ఇవః = కాలువలె, తిర్యక్ = అడ్డముగా, ఆయామ = పొడవుగా సాగటం వలన, శోభీ = ప్రకాశించువాడవై, ఉదీచీం = ఉత్తర దిక్కును, అనుసరేః = అనుసరించి ముందుకు వెళ్లుము.

తా. : ఓ మేఘమా! ఆ హిమాలయ పర్వతము దగ్గర ఆయా విశేషాలను చూస్తూ ముందుకు సాగి పూర్వము పరశురాముని కీర్తికి కారణము, హంసలు నడిచే ద్వారమని చెప్పబడే, క్రౌంచపర్వత రంధ్రాన్ని (గుహను) దాటుతూ, బయటికి వెళ్లినప్పుడు బలి చక్రవర్తి నణచటానికి ముందుకు పొడవుగా చాపిన విష్ణువు నల్లని పాదము వలె ప్రకాశిస్తూ ఉత్తరదిక్కుగా ముందుకు సాగిపొమ్ము.

పూర్వము పరశురాముడు శివుని వద్ద విలు విద్య నేర్చుకొని కుమారస్వామితో పోటీ పడి ఒక్కబాణముతో క్రౌంచ పర్వతమును భేదించి రంధ్రము చేసినాడని పురాణ కథ.

ఆ మార్గము గుండా హంసలు మానస సరస్సుకు పయనిస్తాయని ప్రసిద్ధి.

ఉపమాలంకారము. మేఘము విష్ణువు పాదముతో పోల్చబడినది. అందువలన ఉపమ.

**శ్లో॥ గత్వా చోర్ధ్వం దశముఖభుజోచ్ఛ్వాసితప్రస్థసంధేః**
**కైలాసస్య త్రిదశవనితాదర్పణ స్యాతిథిః స్యాః**
**శృంగోచ్ఛ్రాయైః కుముదవిశదై ర్యోవితత్య స్థితః ఖం**
**రాశీభూతః ప్రతిదినమివ త్ర్యంబకస్యాట్టహాసః** **62**

ప్ర.ప. : ఊర్ధ్వం = పైభాగానముందుకు, గత్వా = వెళ్లి, దశ...సంధేః; దశముఖ = రావణుని యొక్క భుజ = చేతులచేత, ఉచ్ఛ్వాసిత = కదిలించబడిన, ప్రస్థ = చరియల యొక్క సంధేః = కుదుళ్లకలది, త్రిదశ...దర్పణస్య; త్రిదశ = దేవతల, వనితా = స్త్రీలకు, దర్పణస్య = అద్దము వంటిదైన, కైలాసస్య = కైలాస పర్వతానికి, అతిథిః = అతిథిగా, స్యాః = అగుము, యః = ఏకైలాసము, శృంగ+ఉచ్ఛ్రాయైః = శిఖరములతో ఎత్తైన, కుముదవిశదైః = తెల్లకలువల వలె స్వచ్ఛమైన శిఖరాలతో, ఖం = ఆకాశమును, వితత్య = వ్యాపించి, ప్రతిదినం = ప్రతిరోజు, రాశీభూతః = కుప్పగా ఏర్పడిన, త్ర్యంబకస్య = శంకరుని యొక్క, అట్టహాసః ఇవ = బిగ్గరగా నవ్విన నవ్వువలె, స్థితః = ఉన్నదో.

**తా.** : ఓ మేఘమా! అక్కడి నుండి పై భాగాన ముందుకు వెళ్లి కైలాస పర్వతానికి చేరుము. ఆ పర్వతము పూర్వమొకసారి రావణునిచే గర్వముతో పైకెత్తబడి చరియల సంధులు కదల్చబడ్డాయి. తెల్లకలువల వలె ఎత్తయిన శిఖరాలతో, దేవతాస్త్రీలకు అద్దమువలె ఉపయోగపడే కైలాస పర్వతము, శంకరుడు ప్రతిదినము తాండవ సమయములో చేసే అట్టహాసము (బిగ్గరగా నవ్వు) కుప్పగా అయినదివలె ఉంటుంది.

నవ్వు తెల్లగా ఉంటుందని వర్ణించటం కవి సమయము. కైలాస పర్వతాన్ని అట్టహాసముల రాశియా అన్నట్లున్నదని ఊహించుటవలన ఉత్ప్రేక్షాలంకారము.

**శ్లో॥ ఉత్పశ్యామి త్వయి తటగతే స్నిగ్ధభిన్నాంజనాభే**
**సద్యఃకృత్త ద్విరదరదనచ్ఛేదగౌరస్య తస్య**
**శోభా మద్రేః స్తిమితనయనప్రేక్షణీయాం భవిత్రీ**
**మంసన్యస్తే సతి హలభృతో మేచకే వాససీవ** **63**

ప్ర.ప. : స్నిగ్ధ...నాభే; స్నిగ్ధ = నునుపుగా, భిన్న = మర్దింపబడిన, అంజన+ఆభే = కాటుకవంటి కాంతికల, త్వయి = నీవు, తటగతేసతి = కొండచరియపై కెక్కినప్పుడు, సద్యః...గౌరస్య; సద్యః = అప్పుడే, కృత్త = ఖండింపబడిన, ద్విరద = ఏనుగు యొక్క రదన = దంతము యొక్క ఛేద = ముక్కవలె, గౌరస్య = తెల్లగా ఉన్న, తస్య = ఆ, అద్రేః = కైలాస పర్వతము యొక్క, శోభాం = కాంతిని, మేచకే = నల్లని, వాససి = వస్త్రము, అంసన్యస్తే సతి = భుజముపైన వేసుకోగా, హలభృతః = నాగలి ధరించే బలరాముని యొక్క, శోభామివ = అందమును వలె, స్తిమిత...ణీయాం; స్తిమిత = నిశ్చలములైన, నయన = కన్నులతో, ప్రేక్షణీయాం = చూడదగినదిగా, భవిత్రీం = కాగలదానినిగా, ఉత్పశ్యామి = ఊహించుచున్నాను.

**తా.** : ఓ మేఘమా! నల్లని చిక్కని కాటుకవంటి రంగుకల నీవు, అప్పుడే ఖండించిన ఏనుగు దంతపు ముక్కవలె తెల్లగా ఉన్న కైలాస పర్వతపు చరియ పైకెక్కినప్పుడు ఆ దృశ్యము తెల్లని బలరాముడు తన నల్లని వస్త్రమును భుజముపై వేసుకున్నప్పటి వలె అందముగా మనోహరముగా ఉంటుందని ఊహిస్తున్నాను. మేఘమును కాటుకతో, నల్లని వస్త్రముతోను, బలరాముణ్ణి కైలాసపర్వతముతోను రమ్యముగా పోల్చటం వలన ఉపమాలంకారమున్నది.

రెండవ పాదంలో దకారం చాలాసార్లు ఆవృత్తి అయినందున వృత్త్యనుప్రాస అనే శబ్దాలంకారము.

**శ్లో॥ హిత్వా తస్మి న్భుజగవలయం శంభునా దత్తహస్తా**
**క్రీడాశైలే యది చ విహరే త్పాదచారేణ గౌరీ**
**భంగీభక్త్యా విరచితవపుః స్తంభితాన్తర్జలౌఘః**
**సోపానత్వం కురు మణితటారోహణా యాగ్రయాయీ** **64**

ప్ర.ప. : తస్మిన్ = ప్రసిద్ధమైన ఆ, క్రీడాశైలే = కైలాస పర్వతమనే విహార శైలమందు, భుజగవలయం = సర్ప కంకణమును, హిత్వా = విడిచి, శంభునా = శివుని చేత, దత్తహస్తా = చేయూత ఇవ్వబడిన, గౌరీ = పార్వతి, పాదచారేణ = కాలి నడకతో, విహరేద్యది = సంచరించినట్లయితే, స్తంభి...జలౌఘః; స్తంభిత = బిగించబడిన, అంతః = లోపలి, జల+ఓఘః = నీటి ప్రవాహము కలవాడవై, త్వం = నీవు, అగ్రయాయీ = ముందు వెళ్లుచు, భంగీభక్త్యా = గణుపుల పద్ధతిలో, విరచిత = చేయబడిన, వపుఃసన్ = శరీరము కలవాడవై, మణితట = మణుల చరియలను, ఆరోహణాయ = ఎక్కుటకు, సోపానత్వం = మెట్లరూపమును, కురు = చేయుము (పొందుము).

**తా.** : ఓ మేఘమా! ఆ కైలాసపర్వతము పార్వతీ పరమేశ్వరుల నివాసము. దానిపై వారప్పుడప్పుడు విహారము చేస్తారు. పార్వతి కాలినడకతో అక్కడి క్రీడా పర్వతము పైకి వెళ్లేటప్పుడు శంకరుడామెకు చేతిని ఆసరాగా అందిస్తాడు. పార్వతికి భయము కలుగకుండా తన చేతి సర్పకంకణాన్ని తొలగించి రాగలడు. వారు విహారము తరువాత తిరిగి వచ్చేటప్పుడు అలసి ఉన్న పార్వతికి సౌకర్యంగా నీలోని నీటిని ఘనీభవింపజేసి శరీరాన్ని మెట్లరూపంలో మలచి సహాయము చేయుము. ఆ విధంగా వారికి సహకరించి తగిన పుణ్యఫలాన్ని పొందుతావు. ఈ అవకాశాన్ని జారవిడుచుకోకు సుమా.

**శ్లో॥ తత్రావశ్యం వలయకులిశోద్ఘట్టనోద్గీర్ణతోయం**
**నేష్యంతి త్వాం సురయువతయో యంత్రధారాగృహత్వమ్**
**తాభ్యో మోక్ష స్తవ యది సఖే ఘర్మలబ్ధస్య న స్యా**
**త్క్రీడాలోలాః శ్రవణపరుషై ర్గర్జితై ర్భాయయేస్తాః** 65

ప్ర.ప. : తత్ర = ఆకైలాస పర్వతమందు, సురయువతయః = దేవతావనితలు, అవశ్యం = తప్పక, వలయ..తోయం; వలయ = కంకణములోని, కులిశ = వజ్రముతో, ఉద్ఘట్టన = రాపిడి వలన, ఉద్గీర్ణ = బయటికి కారుచున్న, తోయం = నీరుకల, త్వాం = నిన్ను, యంత్ర ధారాగృహత్వం = మరలతో జలధారలు కురిపించు గృహరూపమును, నేష్యంతి = పొందించగలరు, హేసఖే = ఓ మిత్రమా! ఘర్మలబ్ధస్య = ఎండాకాలములో లభించిన, తవ = నీకు, తాభ్యః = ఆదేవయువతుల నుండి, మోక్షః = విడుదల, నస్యాత్ యది = కాకున్నట్లయితే, క్రీడాలోలాః = వినోదాల యందాసక్తులైన, తాః = ఆ స్త్రీలను, శ్రవణపరుషైః = చెవులకు కఠోరంగా ఉండే, గర్జితైః = ఉరుములతో, భాయయేః = భయపెట్టుము.

**తా.** : మిత్రమా! ఆకైలాస పర్వతము మీద విహారము కొరకు క్రీడా పర్వతాలున్నవి. దేవతా యువతులు అక్కడికి విహారము కొరకు వస్తారు. ఇవి వేసవి కాలపు చివరి రోజులు. వారు కొంతసేపు ఆడిపాడి ఎండతాపంతో అలసి ఉంటారు. అటువంటి సమయంలో వారు నీ రాకను చూడగానే సంతోషంతో తమ చేతి మణికంకణాలతో నీపై మొత్తుతారు. అప్పుడు నీనుండి నీటి బిందువులు సన్నని జలధారగా వారిపైపడి వారి తాపాన్ని పోగొట్టుతాయి. ఇక నిన్ను వారు తొందరగా విడిచిపెట్టరు. అందువలన నీవు కర్ణకఠోరంగా ఉరిమి వారిని భయకంపితులను చేసి ముందుకు సాగిపొమ్ము - ఇదే చక్కని ఉపాయము.



**శ్లో॥ హేమాంభోజప్రసవి సలిలం మానసస్యాదదానః**
**కుర్వ న్కామం క్షణముఖపటప్రీతి మైరావతస్య**
**ధున్వ న్కల్పద్రుమకిసలయా న్యంశుకాని స్వవాతైః**
**నానాచేష్టై ర్జలద లలితై ర్నిర్విశే స్తం నగేంద్రమ్** 66

ప్ర.ప. : హేమాం...ప్రసవి; హేమ = బంగారుమయమైన, అంభోజ = తామర పూలను, ప్రసవి = అందించు, మానసస్య = మానస సరస్సుయొక్క, సలిలం = నీటిని, ఆదదానః = స్వీకరించుచు, ఐరావతస్య = దేవతల ఏనుగుకు, క్షణ...ప్రీతిం; క్షణ = కొంచెంసేపు, ముఖపట = ముఖమునకాచ్ఛాదన వస్త్రపు, ప్రీతిం = ప్రేమను, కుర్వన్ = కల్గించినవాడవై, కల్పద్రుమ = కల్పవృక్షము యొక్క, కిసలయాని = చిగురాకులనే, అంశుకాని ఇవ = వస్త్రములను వలె, వాతైః = గాలులతో, ధున్వన్ = కదిలించుచు, లలితైః = మనోహరములైన, నానాచేష్టైః = బహువిధముల పనులతో, (క్రీడలతో), తం = ఆ, నగేంద్రం = కైలాస పర్వతమును, కామం = మిక్కిలి, నిర్విశేః = సుఖమునకు ఉపయోగించుకొమ్ము.

**తా.** : ఓ మేఘమా! మానస సరోవరంలో బంగారం వంటి కమలాలు వికసిస్తాయి. స్వచ్ఛమైన ఆ సరస్సు నీరు త్రాగి, అక్కడ నీరు త్రాగటానికి వచ్చిన ఐరావతానికి కొంచెం సేపు ముఖానికి ఎండను తప్పించే ఆచ్ఛాదన వస్త్రంగా ఉండి, అక్కడి కల్పవృక్షపు చిగురాకులను నీ వాయువులచే కదిలించుము విసనకర్రతో విసరినట్లుంటుంది. ఇంకా ఇటువంటి ఎన్నో విలాస చేష్టలతో కైలాస పర్వతమున నీ మనస్సుకు సంతోషము కలుగునట్లు అనుభవించుము.

**శ్లో॥ తస్యోత్సంగే ప్రణయిన ఇవ స్రస్తగంగాదుకూలాం**
**న త్వం దృష్ట్వా న పునరలకాం జ్ఞాస్యసే కామచారిన్**
**యా వః కాలే వహతి సలిలోద్గార ముచ్చై ర్విమానా**
**ముక్తాజాలగ్రథిత మలకం కామినీ వాభ్రబృందమ్** 67

ప్ర.ప. : హేకామచారిన్! = ఓ స్వేచ్ఛాసంచారీ; ప్రణయినః = ప్రియుని యొక్క ఉత్సంగే ఇవ = ఒడిలో వలె, తస్య = ఆ కైలాసము యొక్క, ఉత్సంగే = ఒడిలో, స్రస్త...కూలాం; స్రస్త = జారిన, గంగా = గంగానది అనే, దుకూలాం = పట్టువస్త్రముకల, అలకాం = అలకా పట్టణమును, దృష్ట్వా = చూచి, పునః = మరల, నజ్ఞాస్యసే ఇతిన = గుర్తించలేవనేది లేదు. (తప్పక గుర్తించెదవు) ఉచ్చైర్విమానా = ఎత్తైన అంతస్తులు కల,

యా = ఏ అలకాపురి, వః = మీ (మేఘముల) యొక్క కాలే = వర్షాకాల మందు, సలిల+ఉద్గారం = నీటిని వర్షించు, అభ్రబృందం = మేఘముల సమూహమును, కామినీ ఇవ = కాముకురాలైన యువతివలె, ముక్తా...గ్రథితం; ముక్తా = ముత్యముల, జాల = సరులతో, గ్రథితం = పొదుగబడిన, అలకం = ముంగురుల ప్రదేశమును, వహతి = ధరించును.

తా. : స్వేచ్ఛగా విహరించే ఓ మేఘమా! ఆ కైలాస పర్వతపు ఒడిలో, ప్రియుని ఒడిలో ప్రియురాలివలె అలకాపట్టణము ఉన్నది. అక్కడ గంగ ప్రవహిస్తుంటే జారిన వస్త్రము కల నాయికవలె అలకాపురి ఉంటుంది. అటువంటి స్థితిలో చూచిన నీవు ఆ నగరాన్ని తప్పక గుర్తించగలవు. వర్షాకాలంలో వాన చినుకులు మీరు కురిపించే టప్పుడు, ఎత్తైన భవనములతో ఉండే ఆ అలకాపురి ఆ బిందువులను ముత్యాలసరులుగా తన ముంగురులకు కాముక స్త్రీ వలె ధరించి శోభిస్తుంది.

ఈ శ్లోకంలో అలకాపురిని ఒకనాయికగా, కాముక స్త్రీతో పోల్చి, మేఘుణ్ణి నాయకునిగా వర్ణించి శ్లేషపదాలతో రచించినాడు.

ఉపమాలంకారము.

ప్రథమసర్గ (పూర్వమేఘము) సమాప్తము.



# మేఘసందేశమ్

## ద్వితీయ సర్గ

శ్లో॥ విద్యుద్వంతం లలితవనితాః సేంద్రచాపం సచిత్రాః
సంగీతాయ ప్రహతమురజాః స్నిగ్ధగంభీరఘోషం
అంతస్తోయం మణిమయభువ స్తుంగ మభ్రం లిహాగ్రాః
ప్రాసాదా స్త్వాం తులయితుమలం యత్ర తైస్తైర్విశేషైః 1

ప్ర.ప. : యత్ర = ఏ అలకాపురిలో, లలితవనితాః = కోమలమైన స్త్రీలు కలవి, సచిత్రాః = చిత్తరువులతో కూడినవి, సంగీతాయ = సంగీతము కొరకు, ప్రహతమురజాః = మ్రోగించబడిన మృదంగాలు కలవి, మణిమయభువః = మణులు పొదిగిన నేలభాగము కలవి, అభ్రం లిహ = ఆకాశమును తాకుచున్న, అగ్రాః = పైభాగముకలవి అగు, ప్రాసాదాః = భవనములు, విద్యుద్వంతం = మెరుపుతీగలు కలిగిన, సేంద్రచాపం = ఇంద్ర ధనుస్సుతో కూడిన, స్నిగ్ధ...ఘోషం; స్నిగ్ధ = వినుటకింపైన, గంభీర = దిట్టమైన, ఘోషం = ధ్వని కలిగిన, అంతస్తోయం = లోపల నీరు కలిగిన, త్వాం = నిన్ను, తైస్తైః = ఆయా, విశేషైః = ప్రత్యేకతలతో, తులయితుం = పోల్చుటకు, అలం = తగి ఉన్నవి.

తా. : ఓ మేఘమా! ఆ అలకానగరంలోని భవనాలు అందమైన కోమలమైన యువతులతో కూడినవి, రంగురంగుల చిత్తరువులు కలవి, సంగీత సమయాలలో మృదంగ వాద్యములు వినిపించేవి, మణులు కూర్చిన నేలభాగము కలవి, ఎత్తుగా ఆకాశాన్నంటే కొనలు కలిగి ఉంటాయి. అవి అన్ని విధాల నీతోసామ్యము పొందటానికి తగి ఉంటాయి. ఎట్లనగా నీలో మెరుపు తీగలుండగా అక్కడ మెరుపులవంటి సుందరాంగనలు, నీలో రంగు రంగుల ఇంద్రధనుస్సుంటే అక్కడ చిత్రవిచిత్రపు చిత్తరువులు, నీ గర్జనలవంటి మృదంగనాదాలక్కడ, నీలో నీరు ఉండగా అక్కడ మణులు కూర్చిన నేలలు, నీవు ఆకాశంలో సంచరిస్తే అవి ఎంతో ఎత్తుగా, ఆకాశాన్నితాకే విధంగా అంతస్తులతో ఉంటాయి. అందువలన అక్కడి భవనాలు అన్ని విధాల నీకు సాటిగా ఉంటాయి.

అలంకారము : పూర్ణోపమ.

శ్లో॥ హస్తే లీలాకమల మలకే బాలకుందానువిద్ధం
నీతా లోధ్రప్రసవరజసా పాండుతా మాననే శ్రీః
చూడాపాశే నవకురవకం చారు కర్ణే శిరీషం
సీమంతే చ త్వదుపగమజం యత్ర నీపం వధూనామ్ 2

ప్ర.ప. : యత్ర = ఏ అలకాపట్టణంలో, వధూనాం = స్త్రీలయొక్క, హస్తే = చేతియందు, లీలాకమలం = విలాసముగా ధరించు పద్మము, అలకే = ముంగురుల యందు, బాలకుందానువిద్ధం = లేతమొల్లపూల కూర్పు, ఆననే = ముఖమునందు, లోధ్ర...రజసా; లోధ్ర = లొద్దుగు అనే, ప్రసవ = పూలయొక్క, రజసా = పుప్పొడితో, పాండుతాం = పాండు (తెలుపు+పసుపు) వర్ణమును, నీతా = పొందింపబడిన, శ్రీః = కాంతి, చూడాపాశే = సిగముడిలో, నవకురవకం = నూతనమైన గోరింట పువ్వు, కర్ణే = చెవియందు, చారు = అందమైన, శిరీషం = దిరిశెన పువ్వు, సీమంతే = పాపటయందు, త్వదుపగమజం; త్వత్ = నీయొక్క, ఉపగమ = రాకసమయమందు, జం = పుట్టునదగు, నీపం = కడిమి పూవు, భవంతి = అగుచున్నవో, ఇది అధ్యాహారము.

కవి ప్రయోగించకున్నా సందర్భాన్ని బట్టి ఊహించి చేర్చుకునే పదము అధ్యాహారము ఇక్కడ 'భవంతి' అటువంటిది.

**తా.** : ఓ మేఘమా! ఆ అలకాపట్టణంలో స్త్రీలు సౌందర్య ప్రియులు. వారికి చేతిలో కమలము, ముంగురులలో అప్పుడే వికసించిన మొల్లపూవు, ముఖంలో లొద్దుగు పూల పరాగముతో వచ్చిన పాండువర్ణ శోభ, కొప్పులో గోరెంట పూవు, చెవిలో అందమైన దిరిసెనపూవు, పాపటలో వర్షాకాలంలో వచ్చే కడిమిపూవు అలంకారాలుగా ఉంటాయి.

ఈ విధంగా చెప్పటం వలన వారికి పూలపైన ఉండే మక్కువతో పాటు, అలకా పట్టణంలో ఎల్లప్పుడు అన్ని ఋతువుల పుష్పాలు లభిస్తాయని తెలిపినట్లయింది.

ఈ శ్లోకము నుండి కొన్ని శ్లోకాలలో అలకాపురి సౌందర్యాన్ని, అక్కడి వారి సంపత్స మృద్ధి, జీవన విధానము వర్ణింపబడింది.

శ్లో॥ యత్రోన్మత్తభ్రమర ముఖరాః పాదపా నిత్యపుష్పాః
హంసశ్రేణీరచితరశనా నిత్యపద్మా నళిన్యః
కేకోత్కంఠా భవనశిఖినో నిత్యభాస్వత్కలాపాః
నిత్యజ్యోత్స్నాః ప్రతిహతతమోవృత్తిరమ్యాః ప్రదోషాః 3



ప్ర.ప. : యత్ర = ఏ అలకాపురిలో, పాదపాః = చెట్లు, ఉన్మత్త...ముఖరాః; ఉన్మత్త = మత్తెక్కిన, భ్రమర = తుమ్మెదలచేత, ముఖరాః = ధ్వనితోకూడినవి, నిత్యపుష్పాః = ఎల్లప్పుడు పువ్వులతో కూడినవిగా, నలిన్యః = తామర తీగలు, హంస...రశనాః; హంస = హంసలయొక్క, శ్రేణీ = వరుసతో, రచిత = కూర్చబడిన, రశనాః = మొలనూలు కలవిగా, భవనశిఖినః = గృహములపెంపుడు నెమళ్లు, కేకోత్కంఠాః = గొంతెత్తి కేకారవము చేయునవి, నిత్య...కలాపాః; నిత్య = ఎల్లప్పుడు, భాస్వత్ = ప్రకాశించు, కలాపాః = పింఛములు కలవిగా, ప్రదోషాః = రాత్రులు, నిత్యజ్యోత్స్నాః = ఎల్లప్పుడు వెన్నెల కలిగి, ప్రతి...రమ్యాం; ప్రతిహత = నిర్మూలించబడిన, తమోవృత్తి = చీకటి యొక్క వ్యాప్తి కలవి కనుక, రమ్యాః = సుందరములుగా ఉండును.

**తా.** : ఓ మేఘమా! అలకా పట్టణము అన్ని విధముల ప్రశస్తి కలిగి ఉంటుంది. అక్కడ చెట్లు అన్ని కాలాల్లో పూవులతో కూడి తుమ్మెదల ఝుంకారాలు కలవిగా ఉంటాయి. కొలనులో తామర తీగలు, హంసలపంక్తి మొలనూలుగా కలిగి ఎల్లప్పుడు కమలాలతో ఒప్పుతుంటాయి. అక్కడ ఇండ్లలో పెంచబడే నెమళ్లు ప్రకాశించే పింఛాలతో సంతోషంతో కేకారవాలు చేస్తుంటాయి. రాత్రులందు చంద్రుని వృద్ధిక్షయాలు లేకుండా సర్వదా వెన్నెలతో చీకటి తొలగి మనోహరంగా ఉంటాయి.

సమృద్ధి కల వస్తువర్ణనం వలన ఉదాత్తాలంకారము.

శ్లో॥ **ఆనందోత్థం నయనసలిలం యత్ర నాన్యై ర్నిమిత్తైః**
**నాన్య స్తాపః కుసుమశరజా దిష్టసంయోగసాధ్యాత్**
**నాప్యన్యస్మా త్ప్రణయకలహా ద్విప్రయోగోపపత్తిః**
**విత్తేశానాం న చ ఖలు వయో యౌవనా దన్యదస్తి** 4

ప్ర.ప. : యత్ర = ఏ అలకాపట్టణంలో, విత్తేశానాం = ధనాధిపతులయిన యక్షులకు, నయనసలిలం = కన్నీరు, ఆనందోత్థం = సంతోషము వలన పుట్టినదే, అన్యైః = ఇతరములైన, నిమిత్తైః = కారణాలతో, న = కాదు, ఇష్ట...సాధ్యాత్; ఇష్ట = ఇష్టులయిన వారి యొక్క, సంయోగ = కలయికచేత, సాధ్యాత్ = నివారింపదగిన, కుసుమశరజాత్ = మన్మథబాణము వలన కలిగే దానికంటె, అన్యః = ఇతరమైన, తాపః = బాధ, న = లేదు, ప్రణయ కలహాత్ = ప్రేమ సంబంధమైన కలహము కంటె, అన్యస్మాత్ = ఇతరమువలన, విప్రయోగ = ఎడబాటు యొక్క, ఉపపత్తిః = ప్రాప్తి, న = లేదు, యౌవనాత్ = పడుచుతనము కంటె, అన్యత్ = భిన్నమైన, వయః = వయస్సు, నాస్తి = లేదు.

తా. : ఆ అలకాపురిలో యక్షులు బాగా ధనవంతులు. వారికి ఆనందబాష్పాలు తప్ప వేరే కన్నీళ్లుండవు. ప్రేయసీ ప్రియుల కలయికతో తొలగిపోయే విరహతాపము తప్ప మరొకతాపముండదు. ఎప్పుడైనా ప్రణయ కలహంతోనే కాని మరొక విధంగా దంపతులకు ఎడబాటు కలుగదు. అక్కడి వారికి యౌవనము తప్ప మరొక వయస్సుండదు. వారు నిత్యయౌవనులని భావము.

2వ, 3వ శ్లోకములు ప్రక్షిప్తములని మల్లినాథ సూరి భావించి కూడ వ్యాఖ్యానము చేసినాడు.

అలంకారము. పరిసంఖ్య. ఒక విషయాన్ని ఒకచోట నిషేధించి మరొక చోట మాత్రం ఉన్నట్లు వర్ణిస్తే అది పరిసంఖ్యాలంకారమవుతుంది.

శ్లో॥ **యస్యాం యక్షాః సితమణిమయాన్యేత్య హర్మ్యస్థలాని**
**జ్యోతిశ్ఛాయాకుసుమరచితా న్యుత్తమస్త్రీసహాయాః**
**ఆసేవంతే మధు రతిఫలం కల్పవృక్ష ప్రసూతం**
**త్వద్గంభీర ధ్వనిషు శనకైః పుష్కరేష్వాహతేషు** 5

ప్ర.ప. : యస్యాం = ఏ అలకాపురి యందు, యక్షాః = యక్షులు, ఉత్తమస్త్రీ సహాయాః = ఉత్తములయిన స్త్రీలు తోడుగా కలవారై, సిత = తెల్లని, మణిమయాని = స్ఫటికమణులతో నిర్మించిన, జ్యోతి...రచితాని; జ్యోతిః = నక్షత్రముల యొక్క ఛాయా = ప్రతిబింబమువలె, రచిత = కూర్చబడిన, కుసుమరచితాని = పుష్పములచే అలంకరింపబడిన, హర్మ్యస్థలాని = మేడలపై భాగాలను, ఏత్య = చేరి, త్వత్ = నీయొక్క గంభీర ధ్వనిషు = గంభీరధ్వని వంటి ధ్వనికల, పుష్కరేషు = పుష్కర (మృదంగ) వాద్యములు, శనకైః = మెల్లగా, ఆహతేషు సత్సు = మ్రోగింపబడుచుండగా, కల్పవృక్ష = కల్పవక్షము నుండి, ప్రసూతం = పుట్టినది, రతిఫలం = సంభోగము ఫలముగాకల, మధు = మద్యమును, ఆసేవంతే = పానము చేయుదురు.

తా. : ఓ మేఘమా! అలకాపట్టణములో యక్షులు భోగలాలసులు. ఎక్కువ ధనవంతులు కనుక వారికి కొదువలేదు. వారు స్ఫటికమణులు కూర్చికట్టిన తమ మేడలపై భాగాలకు చేరి విహరిస్తారు. ఆ మేడలపైన నక్షత్రాలవంటి పూవులు పరచిఉండగా తమ సహచరులయిన స్త్రీలతో వెళ్లి, మేఘ గర్జనవంటి మృదంగ ధ్వనులు మోగుతుండగా మద్యమును సేవిస్తూ వినోదిస్తారు. ఆ మద్యము కల్ప వృక్షము నుండి సిద్ధము చేయబడినది. దానిని సేవించుట వలన స్త్రీ పురుషులలో కామోద్దీపనం కలుగుతుంది.



ఉదాత్తాలంకారము.

శ్లో॥ **మందాకిన్యాః సలిలశిశిరైః సేవ్యమానా మరుద్భి**
**ర్మందారాణా మనుతటరుహాం ఛాయయా వారితోష్ణాః**
**అన్వేష్టవ్యైః కనకసికతాముష్టినిక్షేపగూఢైః**
**సంక్రీడంతే మణిభిరమరప్రార్థితా యత్ర కన్యాః** 6

ప్ర.ప. : యత్ర = ఏ అలకానగరిలో, అమరప్రార్థితాః = దేవతలచే కోరబడిన, కన్యాః = యక్షకన్యలు, మందాకిన్యాః = ఆకాశగంగ యొక్క, సలిలశిశిరః = నీటిచేత చల్లనైన, మరుద్భిః = వాయువులచేత, సేవ్యమానాః = సేవింపబడుతూ, అనుతట రుహాం = ఒడ్డున మొలిచిన, మందారాణాం = మందార వృక్షముల యొక్క, ఛాయయా = నీడచేత, వారితోష్ణాః = తొలగించబడిన వేడికలవారై, కనక...గూఢైః; కనక = బంగారు మయమైన, సికతాముష్టి = పిడికిలితో ఇసుకను, నిక్షేప = దాచుటచేత, గూఢైః = మరుగుపడిన, మణిభిః = మణులతో, సంక్రీడంతే = వినోదముగా ఆడుకొందురు.

తా. : ఓ మేఘమా! అలకానగరంలో యక్షకన్యలు దేవతల ప్రార్థన వలన వచ్చి వారితో వినోద క్రీడలలో పాల్గొంటారు. అక్కడ గంగానది జలాల మీదుగా వీచే చల్లని గాలులతో వేడిమి తగ్గించుకొని పిడికిళ్లతో ఇసుకను, దానిలో మణులను రహస్యముగా దాచి వాటిని గుర్తించే ఆటతో వినోదిస్తారు. పూర్వకాలపు ఆటలలో ఇది ఒకటి. సాధారణంగా ఒకరి కన్నులకు గంతలు కట్టి ఇతరులు పిడికిళ్లతో ఇసుక కుప్పలు అక్కడక్కడ పెట్టిరాగా, గంతలు కట్టుకున్న వ్యక్తి గంతలు విప్పి ఆ ఇసుక కుప్పలను గుర్తించటం ఒక వినోదము. ధనవంతులు కనుక వారు మణులు కలిపి ఆడుకొని ఉందురు. కవికాలంలో కూడ ఈ ఆట వాడుకలో ఉండటం వలన వర్ణించటం జరిగింది.

శ్లో॥ **నీవీబంధోచ్ఛ్వసితశిథిలం యత్ర బింబాధరాణాం**
**క్షౌమం రాగాదనిభృత కరేష్వాక్షిపత్సు ప్రియేషు**
**అర్చిస్తుంగా నభిముఖ మపి ప్రాప్య రత్నప్రదీపాన్**
**హ్రీమూఢానాం భవతి విఫలప్రేరణా చూర్ణముష్టిః** 7

ప్ర.ప. : యత్ర = ఏ అలకాపురంలో, అనిభృత = చంచలములైన, కరేషు = చేతులుకల, ప్రియేషు = తమ ప్రియులు, నీవీ...శిథిలం; నీవీబంధ = పోకముడియొక్క ఉచ్ఛ్వసిత = సడలుటచేత, శిథిలం = వదులైన, క్షౌమం = పట్టు వస్త్రమును, రాగాత్ = ప్రేమవలన, ఆక్షిపత్సు = లాగుచుండగా, హ్రీమూఢానాం = సిగ్గుచేత బేలలయిన, బింబాధరాణాం = దొండపండువంటి పెదవులు కల స్త్రీల యొక్క, చూర్ణముష్టిః =

పిడికిటిలోని కుంకుమ మొదలగు పొడులు, అర్చిస్తుంగాన్ = కాంతులతో అధికమైన, రత్న ప్రదీపాన్ = మణిదీపాలను, అభిముఖం = ఎదురుగా ఉండునట్లు, ప్రాప్య అపి = పొంది కూడ, విఫలప్రేరణా = వ్యర్థ ప్రయత్నము కలదిగా, భవతి = అగుచున్నది.

తా. : ఓ మేఘమా! ఆ పట్టణములోని స్త్రీ పురుషులు భోగలాలసులు. శృంగార చేష్టలతో వినోదింతురు. ప్రేయసీ ప్రియులు కలిసి విహరించేటప్పుడు మోహావేశముతో ప్రియులు తమ నీవీబంధాన్ని సడలింపగా పట్టువస్త్రము జారుతుండును. అప్పుడా కాంతలు తమ శరీరాలు ప్రియులకు కనబడకుండా దీపాలను ఆర్పివేయాలనుకొందురు. అందుకొరకు కుంకుమవంటి పొడులను దీపాలవైపు గుప్పింతురు. కాని ఆ దీపాలు నూనె దీపాలు కాక మణుల దీపాలు కనుక చూర్ణాలు వాటిని మలుపలేకపోయినవి. అందువలన దీపాలనార్పాలనే వారి ప్రయత్నము వ్యర్థమయింది. ఇది అక్కడ వారి శృంగారమయ జీవితము.

**శ్లో॥ యత్ర స్త్రీణాం ప్రియతమభుజోచ్ఛ్వాసితాలింగితానా**
**మంగగ్లానిం సురతజనితాం తన్తుజాలావలంబాః**
**త్వత్సంరోధాపగమవిశదై శ్చంద్రపాదై ర్నిశీథే**
**వ్యాలుంపన్తి స్ఫుటజలలవస్యందినశ్చంద్రకాన్తాః** 8

ప్ర.ప. : యత్ర = ఏ అలకానగరమందు, నిశీథే = అర్ధరాత్రి సమయములో, త్వత్సంరో...విశదైః; త్వత్ = నీయొక్క, సంరోధ = అడ్డుపడుట, అపగమ = తొలగుట చేత, విశదైః = స్వచ్ఛముగా ఉన్న, చంద్రపాదైః = చంద్రుని కిరణములచేత, స్ఫుట... స్యందినః; స్ఫుట = నిర్మలములైన, జలలవ = నీటి బిందువులను, స్యందినః = కార్చుచున్న, తన్తు...లంబాః; తన్తుజాల = దారముల మొత్తములు, అవలంబాః = ఆధారములుగా గల, చంద్రకాంతాః = చంద్రకాంతమణులు, ప్రియ...లింగితానాం; ప్రియతమ = తమపతుల యొక్క, భుజ = చేతులచేత, ఉచ్ఛ్వాసిత = శిథిలము చేయబడిన, ఆలింగితానాం = ఆలింగనములు కల, స్త్రీణాం = స్త్రీలయొక్క, సురత జనితాం = సంభోగము వలన కలిగిన, అంగగ్లానిం = శరీరపు అలసటను, వ్యాలుంపంతి = తొలగించుచుండును.

తా. : ఓ మేఘమా! అలకా పట్టణములో మధ్యరాత్రి సమయంలో నీ అడ్డు తొలగటం వలన స్వచ్ఛంగా ప్రసరిస్తున్న వెన్నెలతో చంద్రకాంత శిలలు నిర్మలమైన నీటి చుక్కలను స్రవించును. ఆ చంద్రకాంత శిలలు గోడలలో అమర్చి ఉండటం వలన శయ్యాగృహంలో ప్రియుల సంగమంతో అలసట చెందిన స్త్రీల శరీరాలపై ఆ నీటి బిందువులు చల్లగా స్రవించి వారికి హాయిని కలిగించును.

చంద్రకాంతశిలలు వెన్నెలలో నీటిబిందువులను స్రవిస్తాయనేది కవి సమయము.

**శ్లో॥ నేత్రా నీతాః సతతగతినా యద్విమానాగ్రభూమీ**
**రాలేఖ్యానాం స్వజలకణికా దోషముత్పాద్య సద్యః**
**శంకాస్పృష్టా ఇవ జలముచ స్త్వాదృశో జాలమార్గై**
**ర్ధూమోద్గారానుకృతినిపుణా జర్జరా నిష్పతంతి.** 9

ప్ర.ప. : నేత్రా = ముందు నడిపించేదైన, సతతగతినా = వాయువుచేత, యత్ = ఏ పట్టణము యొక్క, విమానాగ్రభూమీః = పెక్కు అంతస్తుల భవనాలపై భాగాలను, నీతాః = పొందించబడినవి, త్వాదృశః = నీవంటివి అగు, జలముచః = మేఘములు, ఆలేఖ్యానాం = చిత్తరువులకు, స్వజలకణికా = తమనీటి బిందువులతో, దోషం = నష్టమును, ఉత్పాద్య = కలిగించి, సద్యః = వెంటనే, శంకాస్పృష్టాః ఇవ = జంకుతాకినవివలె, జాలమార్గైః = గవాక్షమార్గములతో, ధూమో...నిపుణాః; ధూమ = పొగయొక్క, ఉద్గార = బయటికి వెడలుటను, అనుకృతి = అనుకరించుట యందు, నిపుణాః = నేర్పుకలవై, జర్జరాః = శిథిలరూపాలై, నిష్పతంతి = బయటికి వెళ్లుచుండును.

తా. : ఓ మేఘమా! అలకాపట్టణంలోని ఎత్తయిన భవనాల పై భాగాలకు గాలిచేత తీసుకురాబడిన నీవంటి మబ్బులు భవనాలలోపల గోడలమీద చిత్రింపబడ్డ చిత్తరువుల పై నీటిబిందువులతో లోపాన్ని కలిగిస్తాయి. ఆ వెంటనే ఏదో జంకు కలిగినట్లుగా గవాక్ష రంధ్రాల ద్వారా పొగబయటికి వెళ్లినట్లు చిన్న చిన్న ముక్కలుగా బయటికి వెళ్లిపోతాయి.

మేఘములు భయముతో పారిపోతున్నట్లు కిటికీల నుండి బయటకు వెళ్లుతాయని చెప్పటం వలన ఉత్ప్రేక్షాలంకారము.

**శ్లో॥ అక్షయ్యాంతర్భవననిధయః ప్రత్యహం రక్తకంఠై**
**రుద్గాయద్భి ర్ధనపతియశః కిన్నరై ర్యత్ర సార్ధమ్**
**వైభ్రాజాఖ్యం విబుధవనితావారముఖ్యా సహాయాః**
**బద్ధాలాపా బహిరుపవనం కామినో నిర్విశంతి.** 10

ప్ర.ప. : యత్ర = ఏ అలకాపట్టణంలో, అక్ష...నిధయః; అక్షయ్య = ఎప్పటికీ తరగని, అంతర్భవన = భవనములలోపల, నిధయః = నిధులు కలిగిన, విబుధ...సహాయాః; విబుధ వనితా = దేవతా స్త్రీలైన, వారముఖ్యా = వేశ్యలు (అప్సరసలు), సహాయాః = తోడుగా కలవారై, బద్ధాలాపాః = సంభాషణలలో నిమగ్నులై, కామినః = కాముకులు, ప్రత్యహం = ప్రతిదినము, రక్తకంఠైః = కమ్మని కంఠస్వరములతో, ధనపతియశః =

కుబేరుని కీర్తిని, ఉద్గాయద్భిః = బిగ్గరగా పాడుతున్న, కిన్నరైః సార్ధం = కిన్నరులతో కూడ, వైభ్రాజాఖ్యం = వైభ్రాజమనుపేరు కల, బహిరుపవనం = బయటి ఉద్యానవనాన్ని, నిర్విశంతి = ప్రవేశింతురు.

తా. : అలకాపురము ధనవంతుల స్థానము కనుక అక్కడి వారెక్కువ భోగలాలసులు. అందువలన వారు దేవజాతికి చెందిన అప్సరసలను తోడుగా తీసుకొని నగరం వెలుపల తోటలకు విహారం కొరకు వెళ్లుతుంటారు. ఆ సమయంలో కిన్నరులు ధనపతి యగు కుబేరుని గొప్పతనాన్ని పాటలుగా పాడుతుంటే, విలాసవంతులైన యక్షులు సరససల్లాపాలతో విహారం చేస్తుంటారు. వారి భవనాలలో ఎప్పటికీ తరగనంత ధనరాశులున్నాయి. అందువలన వారి విహారాలకు ఏ లోపమూ కలుగదు. వైభ్రాజమనే పేరు కల ఒకపెద్ద ఉద్యానవనం నగరం బయట ఉన్నది. యక్షులు తరుచుగా అక్కడ విహరించటానికి వెళ్తుంటారు.

వస్తువుల సమృద్ధిని, సుఖజీవనాన్ని వర్ణించటం వలన ఉదాత్తాలంకారము.

**శ్లో॥ గత్యుత్కంపా దలకపతితై ర్యత్ర మందారపుష్పైః**
**పత్రచ్ఛేదైః కనకకమలైః కర్ణవిభ్రంశిభిశ్చ**
**ముక్తాజాలైః స్తనపరిసరచ్ఛిన్నసూత్రైశ్చ హారై**
**ర్నైశో మార్గః సవితు రుదయే సూచ్యతే కామినీనామ్. 11**

ప్ర.ప. : యత్ర = ఏ అలకా పట్టణములో, కామినీనాం = కాముక స్త్రీల యొక్క నైశః = రాత్రికి సంబంధించిన, మార్గః = త్రోవ, సవితుః = సూర్యుని యొక్క ఉదయే = ఉదయించిన కాలంలో, గతి+ఉత్కంపాత్ = నడకవేగము వలన, అలకపతితైః = ముంగురుల నుండి జారిపడిన, మందార పుష్పైః = మందార పూవుల చేత, పత్రచ్ఛేదైః = పూలరేకుల చేత, కర్ణ విభ్రంశిభిః = చెవుల నుండి జారిన, కనకకమలైః = బంగారు కమలముల చేత, ముక్తాజాలైః = ముత్యాల సరములచేతను, స్తన...హారైః; స్తనపరిసర = స్తన ప్రదేశముల నుండి, ఛిన్న = తెగిన, సూత్రైః = దారములు గల, హారైశ్చ = హారముల చేతను, సూచ్యతే = సూచింప బడుతుంది.

తా. : మేఘమా! అలకాపురిలో విలాసవంతులైన కాముక స్త్రీలు ఎక్కువగా ఉంటారు. వారు రాత్రులందు రహస్యంగా తమ ప్రియుల దగ్గరికి వెళ్లేటప్పుడు చక్కగా అలంకరించుకొని వెళుతారు. తమనెవరైనా గుర్తిస్తారనే శంకతో వేగంగా నడవటం వల్ల ముంగురుల నుండి మందార పూలు, పూలరేకులు, చెవుల నుండి తామరపూలు, స్తనాల రాపిడివలన హారాలు తెగిముత్యాలు జారి దారిలో పడుతాయి. మరునాడు సూర్యోదయం తరువాత,అవి బాటసారులకు ఇది గతరాత్రి కాముక స్త్రీలు సంచరించిన మార్గమని తెలియజేస్తాయి.



**శ్లో॥ మత్వా దేవం ధనపతిసఖం యత్ర సాక్షాద్వసంతం**
**ప్రాయశ్చాపం న వహతి భయా న్మన్మథః షట్పదజ్యం**
**సభ్రూభంగప్రహితనయనైః కామిలక్ష్యే ష్వమోఘై**
**స్తస్యారంభ శ్చతురవనితావిభ్రమైరేవ సిద్ధః 12**

ప్ర.ప. : యత్ర = ఏ అలకానగరంలో, మన్మథః = మన్మథుడు, ధనపతి సఖం = కుబేరునికి మిత్రుడైన, దేవం = శంకరుణ్ణి, సాక్షాత్ = స్వయంగా, వసంతం = ఉంటున్న వానిగా, మత్వా = తలచి, భయాత్ = భయంవలన, ప్రాయః = బహుశః, షట్పదజ్యం = తుమ్మెదలు అల్లెత్రాడుగా కల, చాపం = ధనుస్సును, నవహతి = ధరించుటలేదు కాబోలు, తస్య = ఆ మన్మథుని యొక్క, ఆరంభః = ప్రయత్నము, కామిలక్ష్యేషు = కాముకులనే లక్ష్యములందు, అమోఘైః = వ్యర్థముకాని, సభ్రూభంగ...నయనైః; సభ్రూభంగ = కనుబొమలు ముడుచుటతో, ప్రహిత = ప్రయోగింపబడిన, నయనైః = కన్నులు (చూపులు) కల, చతుర...విభ్రమైః ఏవ; చతుర = నేర్పరులైన, వనితా = స్త్రీల యొక్క, విభ్రమైరేవ = విలాసముల చేతనే, సిద్ధః = సఫలమవుతున్నది.

తా. : అలకాపట్టణం సమీపంలో కైలాసపర్వతం మీద, ప్రభువైన కుబేరునికి మిత్రుడైన శంకరుడు స్వయంగా నివసిస్తాడు. ఆభయం వలన మన్మథుడు యువతీ యువకుల మీద తన బాణాలు ప్రయోగించటానికి విల్లు ఎక్కుపెట్టడు. కాని, ఆ పని మరొక విధంగా నెరవేరుతుంది. ఆ నగరంలోని స్త్రీలు, కాముకులపై గురి తప్పనివి, కనుబొమ్మలను ముడిచి చూపులను ప్రసరించే చాతుర్య విలాసాలతోనే యువతీ యువకులలో శృంగార భావాన్ని కలిగిస్తారు. ఇక మన్మథునికా అవసరమేలేదు.

పూర్వము శంకరుడు, తన తపోభంగము చేసినందుకు కోపముతో మూడవ కంటిని తెరచి మన్మథుణ్ణి దహించినట్లు పురాణగాథ. అందువలన మన్మథునికి శంకరుని భయము.

అలంకారము - అతిశయోక్తి.

**శ్లో॥ వాస శ్చిత్రం మధు నయనయో ర్విభ్రమాదేశ దక్షం**
**పుష్పోద్భేదం సహ కిసలయై ర్భూషణానాం వికల్పాన్**
**లాక్షారాగం చరణకమలన్యాసయోగ్యం చ యస్యా**
**మేకః సూతే సకల మబలామండనం కల్పవృక్షః 13**

ప్ర.ప. : యస్యాం = ఏ అలకాపురి యందు, చిత్రం = రంగురంగుల, వాసః = వస్త్రమును, నయనయోః = కన్నులకు, విభ్రమ...దక్షం; విభ్రమ = విలాసములను,

ఆదేశ = బోధించుటలో, దక్షం = సమర్థమైన, మధు = మద్యమును, చరణ...యోగ్యం; చరణకమల = పద్మముల వంటి పాదముల యందు, న్యాస = అలంకరించుటకు, యోగ్యం = తగిన, లాక్షారాగం = లత్తుకద్రవమును, కిసలయైః సహ = చిగురాకులతో కూడ, పుష్పోద్భేదం = పూవుల వికాసాన్ని, భూషణానాం = అలంకారముల యొక్క, వికల్పాన్ = భేదములను, సకలం = సమస్తమైన, అబలామండనం = స్త్రీల అలంకార సామగ్రిని, ఏకః = ఒక్క, కల్పవృక్షః = కల్పవృక్షము, సూతే = పుట్టించుచున్నది.

తా. : అలకానగరం దగ్గర కల్పవృక్షమనే చెట్టు ఉన్నది. అది స్త్రీలకు అవసరమైన అలంకార వస్తువులన్నిటిని ఒక్కచోటనే అందిస్తుంది. రంగురంగుల బట్టలు, మత్తును కలిగించే మద్యం, చిగురాకులు, పూవులు, రకరకాల నగలు, పాదాలనలంకరించే లత్తుక రసము - వీటన్నిటిని కోరినంతనే అందిస్తుంది.

దేవతలకు కల్పవృక్షము, కామధేనువు, చింతామణి అనే మూడు ఉన్నాయని, అవి ఎప్పుడు ఏది కోరినా కోరిన వారికి వెంటనే ఇస్తాయని పురాణాలలో ప్రసిద్ధి.

**శ్లో॥ తత్రాగారం ధనపతిగృహా నుత్తరేణా స్మదీయం**
**దూరాల్లక్ష్యం సురపతిధనుశ్చారుణా తోరణేన**
**యస్యోపాన్తే కృతకతనయః కాంతయా వర్ధితో మే**
**హస్తప్రాప్యస్తబకనమితో బాలమందారవృక్షః** **14**

ప్ర.ప. : తత్ర = ఆ అలకానగరంలో, ధనపతి గృహాన్ = కుబేరుని ఇంటికి, ఉత్తరేణ = ఉత్తరపు దిక్కున, సుర...చారుణా; సురపతి = దేవతల ప్రభువైన ఇంద్రుని, ధనుః = విల్లువలె, చారుణా = అందమైన, తోరణేన = ముఖ ద్వారముతో, దూరాత్ = దూరము నుండి, లక్ష్యం = గుర్తింపదగిన, అస్మదీయం = మాకు సంబంధించిన, అగారం = ఇల్లు, (కలదు), యస్య = ఏ ఇంటికి, ఉపాన్తే = దగ్గరలో, మే = నాయొక్క, కాంతయా = భార్యచేత, వర్ధితః = పెంచబడిన, కృతకతనయః = పెంపుడు కొడుకుగా తలచబడిన, హస్త...నమితః; హస్తప్రాప్య = చేతులతో అందుకోగలిగిన, స్తబక = పూలగుత్తులతో, నమితః = వంగి ఉన్న, బాలమందార వృక్షః = లేత మందారపు చెట్టు, అస్తి = ఉన్నది.

తా. : ఓ మేఘమా! అలకానగరంలో యక్షరాజు కుబేరుని భవనాని కుత్తరంగా మా ఇల్లుంటుంది. దానికి ఇంద్రధనుస్సు ఆకారంలో అందంగా ఉండే సింహద్వారమున్నది కనుక దూరం నుండి సులభంగా గుర్తుపట్టవీలున్నది. మరొక గుర్తు కూడ చెప్పుతాను వినుము. ఆ ఇంటి ముందు నా భార్య కొడుకుతో సమానంగా ప్రేమతో పెంచిన లేత



మందారపు చెట్టు కూడ ఉన్నది. ఈ గుర్తులతో నీవు మా ఇంటిని తొందరగా గుర్తించ వచ్చును.

**శ్లో॥ వాపీ చాస్మి న్మరకతశిలాబద్ధ సోపానమార్గా**
**హైమైశ్ఛన్నా వికచకమలైః స్నిగ్ధవైదూర్యనాళైః**
**యస్యాస్తోయే కృతవసతయో మానసం సన్నికృష్టం**
**నాధ్యాస్యంతి వ్యపగతశుచ స్త్వామపి ప్రేక్ష్య హంసాః** **15**

ప్ర.ప. : అస్మిన్ = ఈ మాభవనములో, మరకత...మార్గః; మరకతశిలా = మరకత మణుల (పచ్చల)తో బద్ధ = కూర్చబడిన, సోపానమార్గాం = మెట్ల వరుసకల్గిన, వాపీచ = దిగుడుబావి కూడ, హైమైః = బంగారు మయములైన, స్నిగ్ధవైదూర్యనాళైః = నున్నటి వైదూర్యపు కాడలు కల, వికచకమలైః = వికసించిన పద్మముల చేత, ఛిన్నా = కప్పబడినదై, అస్తి = ఉన్నది, యస్యాః = దేనియొక్క తోయే = నీటియందు, కృతవసతయః = నివాసము కల్పించుకున్న, హంసాః = హంసలు, త్వాం = నిన్ను, ప్రేక్ష్య అపి = చూచికూడ, వ్యపగత శుచః = తొలగిన విచారముకలవై, సన్నికృష్టం = దగ్గరలో ఉన్న, మానసం = మానస సరస్సును, న+అధ్యాస్యంతి = చేరబోవు. (తలచుకోవు)

తా. : ఓ మేఘమా! అక్కడ మా ఇంటిలో ఒక దిగుడు బావి కూడ ఉన్నది. దానికి పచ్చమణులు పొదిగిన మెట్లవరుస ఉన్నది. దానిలో బంగారు కాంతి కలవి, సన్నని వైదూర్యముల వంటికాడలు కలిగి వికసించిన తామరపూలు వ్యాపించి ఉంటాయి. ఆ బావిలో నివసించే హంసలు వర్షాకాలంలో నిన్ను చూచి కూడ ఎటువంటి విచారము పొందక, మానస సరస్సు దగ్గరలోనే ఉన్నా అక్కడికి వెళ్లాలని అనుకోవు.

వర్షాకాలంలో భూమిమీద నదుల నీరు మురికిగా ఉంటుందని, స్వచ్ఛమైన నీటి కొరకు హంసలు మానస సరస్సుకు వెళ్లుతాయని ప్రసిద్ధి, కాని యక్షుని ఇంటి బావినీరు దానివలె నిర్మలం కనుక హంసలు ఆ బావిని విడిచి వెళ్లవని భావము.

**శ్లో॥ తస్యాస్తీరే రచితశిఖరః పేశలై రింద్రనీలైః**
**క్రీడాశైలః కనకకదళీవేష్టనప్రేక్షణీయః**
**మద్గేహిన్యాః ప్రియ ఇతి సఖే చేతసా కాతరేణ**
**ప్రేక్ష్యోపాంతస్ఫురితతటితం త్వాం తమేవ స్మరామి** **16**

ప్ర.ప. : తస్యాః = ఆ దిగుడు బావియొక్క తీరే = ఒడ్డున, పేశలైః = కోమలములైన, ఇంద్రనీలైః = ఇంద్రనీల మణులతో, రచితశిఖరః = కల్పించబడిన శిఖరముకల, కనక...ప్రేక్షణీయః; కనక = బంగారము వంటి, కదళీ = అరటి చెట్లయొక్క వేష్టన = వ్యాప్తిచేత, ప్రేక్షణీయః = చూడదగిన, క్రీడాశైలః = విహారము కొరకైన పర్వతము, అస్తి = ఉన్నది, హేసఖే = ఓ మిత్రమా! ఉపాంత...తటితం; ఉపాంత = సమీపంలో, స్ఫురిత = ప్రకాశింపజేసిన, తటితం = మెరుపుతీగకల, త్వాం = నిన్ను, ప్రేక్ష్య = చూచి, మద్గేహిన్యాః = నా ఇల్లాలికి, ప్రియః ఇతి = ఇష్టమైనదని, తంఏవ = ఆ క్రీడా పర్వతమునే, కాతరేణ = భయముతో కూడిన, చేతసా = మనస్సుతో, స్మరామి = తలచుకుంటున్నాను.

**తా. :** ఓ మిత్రమా! మా ఇంటి బావి ఒడ్డున ఒక విహారార్థమైన చిన్న పర్వతమున్నది. అది ఇంద్ర నీలమణులతో చేయబడిన శిఖరము కలిగి ఉన్నది. బంగారు రంగుకల అరటి బోదెలు చుట్టూ వ్యాపించటం చేత చూడటానికి అందంగా ఉంటుంది. నీవు నాకు ప్రక్కనే మెరుపుతీగను ప్రసరించినప్పుడు నీతో సామ్యము గల ఆ క్రీడా పర్వతమే స్మరణకు వస్తుంది. నా భార్యకు ఆ క్రీడాశైలము చాల ఇష్టమైనది. నల్లని ఇంద్రనీల మణుల వంటి మేఘపు రంగు, బంగారు రంగు అరటి చెట్లవంటి మెరుపుతీగలను చూడటం వలన ఆ పర్వతం గుర్తుకు వస్తుందని భావము.

స్మరణాలంకారము : ఒక వస్తువును చూచినప్పుడు దానితో సమానమైన మరియొక దాన్ని స్మరించుటను వర్ణిస్తే స్మరణాలంకారము.

**శ్లో॥ రక్తాశోక శ్చలకిసలయః కేసరశ్చాత్ర కాన్తః**
**ప్రత్యాసన్నౌ కురవకవృతే ర్మాధవీ మండపస్య**
**ఏకః సఖ్యా స్తవ సహమయా వామపాదాభిలాషీ**
**కాంక్ష త్యన్యో వదనమదిరాం దోహదచ్ఛద్మనాస్యాః** **17**

ప్ర.ప. : అత్ర = ఈ క్రీడా పర్వతమందు, కురవక వృతేః = ఎర్రగోరంట మొక్కల ఆవరణము కల, మాధవీ మండపస్య = పూలగురివింద మంటపానికి, ప్రత్యాసన్నౌ = దగ్గరలో కల, చలకిసలయః = కదలుచున్న చిగురాకులు కలిగిన, రక్తాశోకః = ఎర్రని అశోక వృక్షము, కాంతః = మనోహరమైన, కేసరశ్చ = పొగడ చెట్టుకూడ, స్తః = ఉన్నవి, ఏకః = వాటిలో ఒకటి (ఎర్ర అశోకము), మయాసహ = నాతోపాటు, తవ = నీకు, సఖ్యాః = మిత్రురాలైన నాభార్య యొక్క, వామపాద = ఎడమకాలిని, అభిలాషీ = కోరుతున్నది, అన్యః = మరి ఒకటి (పొగడచెట్టు), దోహదచ్ఛద్మనా = పోషణ క్రియ నెపంతో, అస్యాః = ఈ నాభార్య యొక్క, వదనమదిరాం = నోటిలోని మద్యమును, కాంక్షతి = కోరుతుంది.

**తా. :** మా ఇంటి బావి దగ్గర ఉన్న క్రీడా పర్వతము మీద గోరింట చెట్లు, చుట్టూ ఉన్న మాధవీలతా మండపం ప్రక్కన ఎర్ర అశోక వృక్షం కదులుతున్న చిగురాకులతో ఉంటుంది. దానితోపాటు అందమైన పొగడ చెట్టు కూడ ఉన్నది. వాటిలో అశోక వృక్షము దోహదమనే వంకతో నా భార్యయొక్క ఎడమపాదమును నావలెనే కోరుతుంది. ఇక పొగడ చెట్టు ఆమె త్రాగిన పుక్కిటి మద్యాన్ని అదే కారణంగా కోరుతుంది.

చెట్లు అకాలంలో పుష్పించాలంటే కొన్ని పద్ధతులు చెప్పినారు. వాటిని దోహద క్రియలంటారు.

స్త్రీలు ఎడమపాదంతో తన్నితే అశోకము, పుక్కిటి మద్యం దానిపై వదిలితే పొగడచెట్టు అకాలంలో కూడ పూలు పూస్తుందని ఒక నమ్మకం.

ఇక్కడ యక్షుడు తాను కూడ అశోక వృక్షంతో పాటు ఆమె వామపాద తాడనాన్ని కోరేవాడనని చెప్పటం కవి చమత్కారం.

అలంకారము : సహోక్తి.

**శ్లో॥ తన్మధ్యే చ స్ఫటికఫలకా కాంచనీ వాసయష్టి**
**ర్మూలేబద్ధా మణిభి రనతిప్రౌఢవంశ ప్రకాశైః**
**తాలైః శింజావలయసుభగై ర్నర్తితః కాంతయా మే**
**యా మధ్యాస్తే దివసవిగమే నీలకంఠః సుహృద్వః** **18**

ప్ర.ప. : కించ = మరియు, తన్మధ్యే = ఆ అశోక, కేసర వృక్షాల నడుమ, అనతి...ప్రకాశైః; అనతి ప్రౌఢ = ఎక్కువగా ముదురని, వంశప్రకాశైః = వెదుళ్ల ఛాయవంటి ఛాయకల, మణిభిః = పచ్చమణుల చేత, మూలే = మొదటియందు, బద్ధా = నిర్మించబడినదగు, స్ఫటిక ఫలకా = స్ఫటిక మణుల గద్దె కలది, కాంచనీ = బంగారుమయమైన, వాసయష్టిః = నివాస స్తంభము, అస్తి = కలదు, శింజా...సుభగైః; శింజావలయ = ధ్వనితో కూడినకంకణములతో, సుభగైః = మనోహరములైన, తాలైః = తాళములతో, మే = నా యొక్క, కాంతయా = భార్యచేత, నర్తితః = నృత్యము చేయించబడిన, వః = మీకు (మబ్బులకు) సుహృత్ = మిత్రమైన, నీలకంఠః = నెమలి, దివసవిగమే = సాయంకాలమున, యాం = ఏ స్తంభమును, అధ్యాస్తే = ఎక్కి కూర్చునునో;

తా. : మేఘమా! మా ఇంట్లో అశోక కేసర వృక్షాల మధ్య భాగంలో ఒక స్తంభమున్నది. అది బంగారు రంగు కలిగి అడుగున పచ్చమణులతో నిర్మించబడిన గద్దెతో ఉంటుంది. పైన స్ఫటికమణుల పలక ఉన్నది.

ప్రతిదినము సాయంకాలము నాభార్య తన చేతుల కంకణధ్వనులతో పాటు తాళం వేయగా, మా ఇంటి నెమలి నృత్యము చేస్తుంది. నృత్యము తరువాత అలసిపోయిన నెమలి విశ్రాంతి కొరకు ఆస్తంభము పై కూర్చుంటుంది. అప్పుడా దృశ్యము మనోహరంగా ఉంటుంది.

సమృద్ధి కల వస్తువర్ణనచే ఉదాత్తాలంకారము.

**శ్లో॥ ఏభిః సాధో హృదయనిహితై ర్లక్షణై ర్లక్షయేథాః**
**ద్వారోపాన్తే లిఖితవపుషౌ శంఖపద్మౌచ దృష్ట్వా**
**క్షామచ్ఛాయం భవన మధునా మద్వియోగేన నూనం**
**సూర్యాపాయే న ఖలు కమలం పుష్యతి స్వామభిఖ్యామ్** 19

ప్ర.ప. : హేసాధో! = ఓ సజ్జనుడా!, ఏభిః = ఈ పూర్వము చెప్పబడిన, హృదయ నిహితైః = మనస్సులో ఉంచుకున్న, లక్షణైః = గుర్తులతో, ద్వారోపాన్తే = ద్వారానికిరువైపుల, లిఖితవపుషౌ = చిత్రింపబడిన ఆకారముకల, శంఖ పద్మౌచ = శంఖము, పద్మము అనునిధులను, దృష్ట్వా = చూచి, నూనం = నిశ్చయముగా, అధునా = ఇప్పుడు, మద్వియోగేన = నా ఎడబాటుతో, క్షామచ్ఛాయం = కాంతితగ్గిన, భవనం = మా ఇంటిని, లక్షయేథాః = గుర్తుపట్టగలవు, సూర్యాపాయే = సూర్యుడు అస్తమించినప్పుడు, కమలం = పద్మము, స్వాం = తనదైన, అభిఖ్యాం = శోభను, నపుష్యతిఖలు = పోషించదు కదా!

తా. : ఓ మేఘమా! నేను ఇప్పటివరకు చెప్పిన తోరణాలు మొదలైన గుర్తులతోను, ద్వారానికి రెండు పక్కల ఉన్న శంఖము, పద్మము అనే నిధుల చిత్రాలతోను మా ఇంటిని నీవు సులభంగా గుర్తు పట్టగలుగుతావు. ఇంటి యజమాని నైన నేను లేకపోవటం వల్ల ఆ ఇల్లు కళతప్పి ఉంటుంది. సూర్యుడు లేకుండా పద్మము తన శోభను ప్రకాశింపజేయదు కదా!

దృష్టాంతాలంకారము : బింబ ప్రతిబింబ భావంతో ఉపమానోపమేయాలను రెండు వాక్యాలలో చెప్పితే దృష్టాంతాలంకారమవుతుంది.

**శ్లో॥ గత్వా సద్యః కలభతనుతాం శీఘ్రసంపాత హేతోః**
**క్రీడాశైలే ప్రథమకథితే రమ్యసానౌ నిషణ్ణః**



**అర్హస్యంతర్భవనపతితాం కర్తు మల్పాల్పభాసం**
**ఖద్యోతాలీవిలసితనిభాం విద్యుదున్మేషదృష్టిమ్** 20

ప్ర.ప. : శీఘ్ర సంపాతహేతోః = తొందరగా దిగుట కారణముగా, సద్యః = వెంటనే, కలభతనుతాం = ఏనుగు గున్నవంటి చిన్న శరీరమును, గత్వా = పొంది, ప్రథమకథితే = ఇంతకు ముందు చెప్పబడిన, రమ్యసానౌ = అందమైన చరియలుగల, క్రీడాశైలే = విహారపర్వతము మీద, నిషణ్ణః = కూర్చున్నవాడవై, అల్పాల్పభాసం = కొద్ది కొద్ది కాంతిగల, ఖద్యో...నిభాం; ఖద్యోతాలీ = మిణుగురు పురుగుల, విలసిత = అందముతో, నిభాం = సమానమైన, విద్యు...దృష్టిం; విద్యుత్ = మెరుపుయొక్క ఉన్మేష = ప్రకాశమనే, దృష్టిం = చూపును, అంత...పతితాం; అంతర్భవన = ఇంటిలోపలి భాగములో, పతితాం = పడినదానినిగా, కర్తుం = చేయుటకు, అర్హసి = తగియున్నావు.

తా. : ఓ మేఘమా! నీవు మా ఇంటి దగ్గరికి చేరిన తరువాత అక్కడ తొందరగా కిందికి దిగటానికి వీలుగా నీ శరీరాన్ని చిన్నగా తగ్గించుకుని, మా ఇంటిలోని అందమైన చరియలున్న క్రీడా పర్వతం మీద కూర్చొని, మిణుగురు పురుగుల గుంపువలె ప్రకాశించే అల్పకాంతిగల నీ మెరపు చూపులను మా ఇంటిలోపలికి ప్రసరించుము. దాని వలన నీరాక నా భార్యకు తెలుస్తుంది.

**శ్లో॥ తన్వీ శ్యామా శిఖరిదశనా పక్వబింబాధరోష్ఠీ**
**మధ్యే క్షామా చకితహరిణీప్రేక్షణా నిమ్ననాభిః**
**శ్రోణీభారా దలసగమనా స్తోకనమ్రా స్తనాభ్యాం**
**యా తత్ర స్యా ద్యువతివిషయే సృష్టిరాద్యేవ ధాతుః** 21

ప్ర.ప. : తన్వీ = సన్నని శరీరముకలది, శ్యామా = యౌవనమధ్యంలో ఉన్నది, శిఖరిదశనా = కొనలు తీరిన దంతములు కలది, పక్వ...రోష్ఠీ; పక్వ = బాగాపండిన, బింబ = దొండపండువంటి, అధరోష్ఠీ = క్రింది పెదవికలది, మధ్యే = నడుము భాగంలో, క్షామా = కృశించినది, చకిత...క్షణా; చకిత = భయపడిన, హరిణీ = ఆడులేడి వంటి, ప్రేక్షణా = చూపులు కలది, నిమ్న నాభిః = లోతైన బొడ్డుకలది, శ్రోణీభారాత్ = పిరుదుల బరువు వలన, అలసగమనా = మెల్లగా నడచేది, స్తనాభ్యాం = పాలిండ్లవలన, స్తోకనమ్రా = కొద్దిగా వంగినది, యువతి విషయే = యువతుల విషయంలో, ధాతుః = బ్రహ్మయొక్క ఆద్యా = మొట్టమొదటి, సృష్టిః ఇవ = నిర్మాణమువలె, యా = ఎవతె, తత్ర = అక్కడ మా ఇంటిలో, స్యాత్ = ఉండునో, (ఆమెయే నాభార్య అని గుర్తించుము).

తా. : మిత్రమా! నా భార్యను నీవు తెలుసుకునే గుర్తులు చెప్పుతాను వినుము. ఆమె సన్నని దేహం కలది, నడియౌవనంలో ఉన్నది, మొనదేరిన పలువరుసగలది, దొండపండు వంటి పెదవి కలది. సన్నని నడుము, లేడివంటి బెదురు చూపులు, లోతైన నాభికలది, పిరుదుల బరువువల్ల మెల్లగా నడిచేది, స్తనభారంతో కొంచెం అణగి ఉండేది. సృష్టి కర్త బ్రహ్మదేవుని మేలైన సృష్టిగా, అక్కడ నీకు కనిపించే యువతిని నా భార్యగా తెలుసుకొమ్ము.

ఉత్ప్రేక్షాలంకారము : తన భార్యను బ్రహ్మయొక్క ఉత్తమ సృష్టియా అన్నట్లు ఊహించటం వలన ఉత్ప్రేక్ష.

**శ్లో॥ తాం జానీథాః పరిమితకథాం జీవితం మే ద్వితీయం**
**దూరీభూతే మయి సహచరే చక్రవాకీ మివైకామ్**
**గాఢోత్కంఠాం గురుషు దివసే ష్వేషు గచ్ఛత్సు బాలాం**
**జాతాం మన్యే శిశిరమథితాం పద్మినీం వా న్యరూపామ్** **22**

ప్ర.ప. : సహచరే = కలిసి జీవించుచున్న, మయి = నేను, దూరీభూతేసతి = దూరముకాగా, చక్రవాకీం ఇవ = ఆడుచక్రవాకమువలె, ఏకాం = ఒంటరి అయిన, పరిమితకథాం = మితముగా మాట్లాడునదగు, తాం = ఆ నాభార్యను, మే = నాయొక్క ద్వితీయం = రెండవదైన, జీవితం = ప్రాణముగా, జానీథాః = తెలుసుకొమ్ము, గాఢోత్కంఠాం = తీవ్రమైన విరహతాపముకల, బాలాం = ఆయువతిని, గురుషు = బరువైన, ఏషు = ఈ, దివసేషు = దినములు, గచ్ఛత్సు = గడచుచుండగా, శిశిర మథితాం = మంచుతో పీడింపబడిన, పద్మినీం వా = తామరతీగను వలె, అన్యరూపాం = వేరురూపము కలది, జాతాం = అయినదిగా, మన్యే = తలచుచున్నాను.

తా. : ఓ మేఘమా! నా భార్య మితంగా మాట్లాడే స్వభావం కలది. భర్తనైన నేను శాపం వలన తనకు దూరమైనాను. అందువలన తన జోడు పక్షి ఎడబాటు వలన ఆడు చక్రవాకపక్షివలె విరహబాధతో, తీవ్రమైన ఉత్కంఠతో ఇన్ని రోజులు గడిపిన తరువాత దీనురాలైన, నారెండవ ప్రాణమైన ఆమె మంచుతో నలిగిపోయిన తామరతీగవలె రూపము మారి గుర్తింపరాని వేరు రూపము కలదై ఉంటుందని ఊహిస్తున్నాను.

చక్రవాకితో తన భార్యను పోల్చటం వలన ఉపమాలంకారము.

**శ్లో॥ నూనం తస్యాః ప్రబలరుదితోచ్ఛూననేత్రం ప్రియాయాః**
**నిశ్వాసానా మశిశిరతయా భిన్నవర్ణాధరోష్ఠమ్**



**హస్తన్యస్తం ముఖమసకలవ్యక్తి లంబాలకత్వా**
**దిందోర్దైన్యం త్వదనుసరణక్లిష్టకాన్తే ర్బిభర్తి.** **23**

ప్ర.ప. : ప్రబల...నేత్రం; ప్రబల = తీవ్రమైన, రుదిత = రోదనము చేత, ఉచ్ఛూన = వాచిన, నేత్రం = కన్నులు కలిగిన, నిశ్వాసానాం = నిట్టూర్పుల యొక్క, అశిశిరతయా = వేడిమిచేత, భిన్న...రోష్ఠం; భిన్నవర్ణ = రంగుమారిన, అధరోష్ఠమ్ = క్రింది పెదవి కల, హస్తన్యస్తం = అరచేతి యందుంచబడినది, లంబాలకత్వాత్ = వ్రేలాడు ముంగురులు కలదగుట వలన, అసకలవ్యక్తి = పూర్తిగా కన్పించనిదగు, తస్యాః = నాభార్య యొక్క ముఖం = ముఖము, త్వదను...కాంతేః; త్వత్ = నీయొక్క, అనుసరణ = అడ్డుపడుట వలన, క్లిష్ట = మాసిన, కాంతేః = ప్రకాశముకల, ఇందోః = చంద్రునియొక్క, దైన్యం = దీనత్వమును (కాంతి తగ్గుటను) బిభర్తి = ధరించి ఉంటుంది.

తా. : మిత్రమా! జలదా! నాభార్య నా వియోగం వల్ల ఎల్లప్పుడు రోదించటంతో ఆమె కన్నులు వాచి ఉంటాయి. వేడి నిట్టూర్పులధికంగా విడువటం వల్ల ఆమె పెదవులు వాడి రంగు మారుతాయి. విచారంతో ముఖాన్ని అరచేతిలో ఉంచుకున్నప్పుడు కురులు వేలాడుతుండటం వలన పూర్తిగా కనబడని ముఖంతో ఆమె, నీవు అడ్డుపడటం వలన మసకబారిన చంద్రబింబంవలె కాంతి తగ్గి దీనంగా ఉండి నీకు కనబడుతుంది. నీవు భ్రమపడక ఆమెను గుర్తించుము.

ఒకరి ధర్మమును మరొకరు ధరించుట సాధ్యము కాదు కనుక చంద్రుని దైన్యం వంటి దైన్యమని భావం కనుక ఇది నిదర్శనాలంకారము.

**శ్లో॥ ఆలోకే తే నిపతతి పురా సా బలివ్యాకులా వా**
**మత్సాదృశ్యం విరహతను వా భావగమ్యం లిఖన్తీ**
**పృచ్ఛంతీ వా మధురవచనాం శారికాం పంజరస్థాం**
**కచ్చిద్భర్తుః స్మరసి రసికే త్వం హి తస్య ప్రియేతి** 24

ప్ర.ప. : సా = ఆ నాభార్య, బలివ్యాకులావా = దేవతారాధనలో నిమగ్నమై కాని, విరహతను = ఎడబాటు వలన కృశించిన, భావగమ్యం = ఊహచే తెలియదగిన, మత్సాదృశ్యం = నా పోలిక (చిత్తరువు)ను, లిఖంతీవా = చిత్రించుచుకాని, హేరసికే = ఓ రసికురాలా!, భర్తుః = నాపతిని, స్మరసి కచ్చిత్ = తలచుకుంటున్నావా? త్వం = నీవు, తస్య = ఆయనకు, ప్రియా = ఇష్టురాలవుకదా!, ఇతి = అని, మధురవచనాం = కమ్మని పలుకులు కలదైన, శారికాం = గోరువంకను, పృచ్ఛంతీవా = అడుగుచుకాని, సా = ఆమె, తే = నీ యొక్క, ఆలోకే = దృష్టియందు, పురానిపతతి = పడగలదు.

తా. : ఓ మేఘమా! నీవు మా ఇంటి దగ్గరికి వెళ్లేటప్పటికి నాభార్య ఏ దేవతారాధనలోనో నిమగ్నురాలై కాని, విరహంతో చిక్కిపోయిన నాచిత్ర పటాన్ని ఊహతో చిత్రిస్తూ కాని ఉంటుంది. లేదా పంజరంలోని గోరువంకను, "నీవు నీయజమానిని స్మరిస్తున్నావా? నీవు ఆయనకు చాలా ప్రియమైనదానివి కదా!" అని ప్రశ్నిస్తూ ఐనా ఉంటుంది. అని యక్షుడు తన ప్రియురాలే స్థితిలో ఉంటుందో ఊహించి చెప్తుతున్నాడు.

శ్లో॥ ఉత్సంగే వా మలినవసనే సౌమ్య నిక్షిప్య వీణాం
మద్గోత్రాంకం విరచితపదం గేయ ముద్గాతుకామా
తంత్రీమార్ద్రాం నయనసలిలైః సారయిత్వా కథంచి
ద్భూయోభూయః స్వయమపి కృతాం మూర్ఛనాం విస్మరన్తీ 25

ప్ర.ప. : హే సౌమ్య = ఓసజ్జనుడా! మలినవసనే = మాసిన వస్త్రముకల, ఉత్సంగే = ఒడియందు, వీణాం = వీణను, నిక్షిప్య = ఉంచి, మద్గోత్రాంకం = నాపేరు గుర్తుగా కలదిగా, విరచితపదం = కూర్చబడిన పదములు కల, గేయం = పాటను, ఉద్గాతుకామా = బిగ్గరగా పాడదలచినదై, నయనసలిలైః = కన్నీళ్లతో, ఆర్ద్రాం = తడిసిన, తంత్రీం = వీణ తీగను, కథంచిత్ = అతికష్టముగా, సారయిత్వా = మీటి, భూయోభూయః = మాటిమాటికి, స్వయం = తానే, కృతామపి = చేసినదైనను, మూర్ఛనాం = స్వరముల కూర్పును, విస్మరన్తీ = మరచిపోతూ, (నీకంటికి కనబడును అని పూర్వశ్లోకములో అన్వయము.)

తా. : సాధుస్వభావం కల ఓ మేఘుడా! నీవక్కడికి వెళ్లేటప్పటికి నాభార్య, విషాదంతో మాసిన బట్టలతో తన ఒడిలో వీణను ధరించి ఉండవచ్చును. ఆ వీణ మీద నా పేరుతో కూర్చబడిన పాటను పాడదలచి అతికష్టంగా తీగను సవరించి, ఇంతకు ముందు ఎన్నోసార్లు తానే కూర్చిన స్వరముల కల్పనను అన్యమనస్కంగా ఉండటం వల్ల మరచిపోతూ ప్రయత్నిస్తూ నీకు కన్పించవచ్చు.

సంగీతములోని సప్తస్వరాల ఆరోహణావరోహణ క్రమాన్ని మూర్ఛన అని అంటారు.

శ్లో॥ శేషాన్మాసాన్విరహదివస స్థాపితస్యావధేర్వా
విన్యస్యంతీ భువి గణనయా దేహళీ దత్తపుష్పైః
సంభోగం వా హృదయనిహితారంభ మాస్వాదయన్తీ
ప్రాయేణైతే రమణవిరహే ష్వంగనానాం వినోదాః 26



ప్ర.ప. : అథవా = లేనిచో, విరహ...తస్య; విరహ = ఎడబాటు యొక్క, దివస = మొదటినాడు, స్థాపితస్య = ఏర్పరచబడిన, అవధేః = గడువుకు, శేషాన్ = మిగిలిన, మాసాన్ = నెలలను, దేహళీ...పుష్పైః; దేహళీ = గడపయందు, దత్త = ఉంచబడిన, పుష్పైః = పూలతో, గణనయా = లెక్కించుటతో, భువి = నేలయందు, విన్యస్యంతీ = కూర్చున్నదిగా కాని, హృదయ...రంభం; హృదయం = మనస్సులో, నిహిత = ఉంచబడిన, ఆరంభం = సంకల్పముకల, సంభోగం = రతిసుఖమును, ఆస్వాదయన్తీ = వాః = అనుభవించు చున్నదిగా కాని, (తే ఆలోకేనిపతతి = నీ చూపులో పడుతుంది అని పూర్వంతో అన్వయము)

తా. : ఓ మేఘమా! నీవు మాయింటికి వెళ్లినప్పుడు నా భార్య ఏ విధంగా ఉండవచ్చునో మరికొన్ని వికల్పాలను తెలుపుతాను. నాశాపము సమాప్తము అయ్యే గడువు ఇంకెన్ని నెలలున్నది ప్రతిదినము ఇంటి గడపలో పెట్టిన పూలను లెక్కించి నేల మీద గుర్తుగా పెట్టుకుంటూ ఉండవచ్చు. లేదా భౌతికంగా దూరంగా ఉన్న మాయొక్క శృంగార క్రీడలను మనస్సులో ఊహించుకుంటూ పారవశ్యాన్ననుభవిస్తూ కాని ఉంటుంది. సాధారణంగా తమపతులనెడబాసి విరహంలో ఉన్న స్త్రీలకు కాలము గడుపు సాధనాలిటువంటివే కదా!

అర్థాంతరన్యాసాలంకారము. సామాన్యము చేత విశేషమును సమర్థించుట దీనిలో కలదు.

శ్లో॥ సవ్యాపారామహని న తథా పీడయేద్విప్రయోగః
శంకేరాత్రౌ గురుతర శుచం నిర్వినోదాం సఖీం తే
మత్సందేశైః సుఖయితుమలం పశ్య సాధ్వీం నిశీథే
తామున్నిద్రా మవనిశయనాం సద్మవాతాయనస్థః 27

ప్ర.ప. : అహని = పగటియందు, సవ్యాపారాం = ఏదో ఒక పనిలో ఉన్నందువలన, విప్రయోగః = ఎడబాటు, తథా = ఆవిధంగా, నపీడయేత్ = బాధించదు, రాత్రౌ = రాత్రియందు, నిర్వినోదాం = కాలక్షేప సాధనము లేనందువలన, తే = నీ యొక్క, సఖీం = మిత్రురాలైన నా భార్యను, గురుతరశుచం = ఎక్కువ దుఃఖము కలదాన్నిగా, శంకే = సందేహించుచున్నాను, నిశీథే = అర్ధరాత్రి యందు, ఉన్నిద్రాం = నిద్రలేనిది, అవనిశయనాం = నేలమీద పడుకున్నది, సాధ్వీం = పతివ్రత అయిన, తాం = ఆమెను, మత్సందేశైః = నాక్షేమ సమాచారపు మాటలతో, అలం = చాలినంతగా, సుఖయితుం = సుఖము కలిగించుటకు, సద్మవాతాయనస్థః = ఇంటి కిటికీవద్ద ఉండి, పశ్య = చూడుము.

తా. : ఓ మేఘమా! నా భార్య పగటిపూట గృహ కృత్యాలలో, చిత్రలేఖనాదులలో నిమగ్నమై ఉంటుంది కనుక వియోగబాధ ఆమెను అంతగా బాధించదు. రాత్రులందు కాలక్షేప కారణాలేమీ లేనందున, నిద్రరాక నేలపైశయనించి బాధపడుతుంటుంది. అటువంటి దశలో నీవు మధ్య రాత్రి అక్కడికి వెళ్లి మాయింటి కిటికీ పక్కన నిలిచి ఆమెకు నాకుశల సమాచారము చెప్పి ఆమెకు కొంత సుఖము కలిగించే ప్రయత్నము చేయుము.

శ్లో॥ అధిక్షామాం విరహశయనే సన్నిషణ్ణైక పార్శ్వాం
ప్రాచీమూలే తనుమివ కళామాత్రశేషాం హిమాంశోః
నీతా రాత్రిః క్షణఇవ మయా సార్థమిచ్ఛాదతైర్యా
తామేవోష్ణైర్విరహమహతీ మశ్రుభిర్యాపయన్తీమ్ **28**

ప్ర.ప. : ఆధిక్షామాం = మనస్తాపముతో కృశించినది, విరహశయనే = ఎడబాటు కాలములోని శయ్యమీద, సన్ని...పార్శ్వాం; సన్నిషణ్ణ = బాగుగా ఒదిగిన, ఏకపార్శ్వాం = ఒక పక్కభాగము కలది, ప్రాచీమూలే = తూర్పుదిక్కు ఒక అంచున, కళామాత్రశేషాం = ఒక కళమాత్రం మిగిలిన, హిమాంశోః = చంద్రునియొక్క, తనుమివ = బింబమువలె ఉన్న, యా = ఏరాత్రి, మయాసార్థం = నాతోకూడ, ఇచ్ఛారతైః = కోరుకున్న రతిక్రీడలతో, క్షణఇవ = క్షణకాలమువలె, నీతా = గడుపబడినదో, తామేవ = ఆరాత్రినే, విరహమహతీం = ఎడబాటుచే పెద్దదైనదిగా, ఉష్ణైః = వేడివైన, అశ్రుభిః = కన్నీళ్లతో, యాపయంతీం = గడుపుచున్న, (తాం = నాభార్యను, పశ్య = చూడుము)

తా. : మిత్రమా! నీవు మాఇంటి దగ్గర నా భార్యను ఏ రూపంలో చూడగలవో నేనూహించి చెప్తాను. ఆమె మనోవ్యథతో బాగా బక్కచిక్కి ఉంటుంది. ఒంటరి శయ్యపైన ఒక ప్రక్కకు ఒదిగి పడుకొని ఉండవచ్చును. తూర్పు దిక్కున ఒకమూల ఒక్కకళ మాత్రం మిగిలిన చంద్రుని బింబమువలె కాంతిహీనంగా ఉంటుంది. పూర్వము నేనక్కడ ఉన్నప్పుడు నాతో కలిసి రాత్రిని ఇష్టమైన శృంగార విలాసాలతో క్షణకాలమువలె గడిపిన ఆమె ఇప్పుడు నా వియోగముతో దుర్భరమైన రాత్రిని వేడి కన్నీళ్లతో కష్టముగా గడుపుతుంటుంది.

ఉపమాలంకారము : కళామాత్రశేష చంద్రునితో యక్షపత్నిని పోల్చటం జరిగింది.

శ్లో॥ పాదానిందోరమృతశిశిరా న్జాలమార్గప్రవిష్టాన్
పూర్వప్రీత్యా గతమభిముఖం సన్నివృత్తం తథైవ
ఖేదాచ్చక్షుః సలిలగురుభిః పక్ష్మభిశ్ఛాదయన్తీం
సాభ్రేఽహ్నీవ స్థలకమలినీం న ప్రబుద్ధాం న సుప్తామ్ **29**



ప్ర.ప. : జా...విష్టాన్; జాలమార్గ = గవాక్షములద్వారా, ప్రవిష్టాన్ = ప్రవేశించిన, అమృతశిశిరాన్ = అమృతమువలె చల్లనైన, ఇందోః = చంద్రునియొక్క, పాదాన్ = కిరణములను, పూర్వప్రీత్యా = ఇంతకుముందున్న ప్రేమతో, అభిముఖం = ఎదురుగా, ఆగతం = వచ్చినది, తథా+ఏవ = తథైవ = అదే విధముగా, సన్నివృత్తం = వెనుకకు తిరిగినది అగు, చక్షుః = కంటిని, ఖేదాత్ = దుఃఖమువలన, సలిలగురుభిః = కన్నీళ్లతో బరువైన, పక్ష్మభిః = రెప్పలతో, ఛాదయంతీం = కప్పివేయుచున్నది, సాభ్రే = మేఘములతో కూడిన, అహ్ని = పగటి యందు, నప్రబుద్ధాం = వికసించనిది, నసుప్తాం = ముకుళించనిది అయిన, స్థలకమలినీం ఇవ = మెట్టతామరతీగవలె ఉన్నటువంటి, (తాం = నాభార్యను, పశ్య = చూడుము)

తా. : ఓ మేఘమా! మా ఇంటిలో గవాక్షరంధ్రముల ద్వారా వెన్నెల లోపలికి ప్రసరించినప్పుడు పూర్వము నాభార్య వెన్నెలను ఎంతో ప్రేమతో స్వాగతించి కొంతసేపు వెన్నెలతో వినోదించేది. ఇప్పుడు కూడ పూర్వస్నేహముతో అక్కడికి వెళ్లి వెంటనే తానిప్పుడు ఒంటరిగా నున్నానని గుర్తించి వెనక్కు మళ్లుతుంది. పాతరోజులు స్మరణకు వచ్చి దుఃఖముతో కన్నీళ్లురాగా బరువైన రెప్పలతో కండ్లు మూయగా, మబ్బులు కమ్మిన పగటిపూట వికసించకుండా, మొగ్గగా కాకుండా ఉన్న పూలు కల మెట్ట తామర తీగ వలె నా భార్య దీన స్థితిలో నీకు కనబడవచ్చును.

ఉపమాలంకారము : యక్షపత్నికి మెట్టతామరతీగకు సామ్యము వర్ణించబడింది.

శ్లో॥ నిశ్వాసేనాధరకిసలయక్లేశినా విక్షిపంతీం
శుద్ధస్నానా త్పరుషమలకం నూనమాగండలంబమ్
మత్సంభోగః కథముపనయే త్స్వప్నజోఽపీతినిద్రా
మాకాంక్షంతీం నయనసలిలోత్పీడ రుద్ధావకాశామ్ **30**

ప్ర.ప. : శుద్ధస్నానాత్ = కేవలము నీటితో స్నానం వలన, పరుషం = గరుకుగా అయిన, ఆగండలంబం = చెక్కిళ్లవరకు వ్రేలాడుతున్న, అలకం = ముంగురులను, అధర...క్లేశినా; అధరకిసలయ = చిగురాకువంటి క్రింది పెదవిని, క్లేశినా = బాధించుచున్న; నిశ్వాసేన = నిట్టూర్పుతో, విక్షిపంతీం = తొలగజేయుచున్న, స్వప్నజః అపి = కలలో కలిగినదైనా, మత్సంభోగః = నా కలయిక, కథం = ఎట్లు, ఉపనయేత్ = కలుగునో, ఇతి = అని, నయన...కాశాం; నయన = కన్నులలోని, సలిల = నీటియొక్క, ఉత్పీడ = ఒత్తిడిచేత, రుద్ధ = అడ్డగింపబడిన, అవకాశాం = వీలుకల, నిద్రాం = నిద్రను, ఆకాంక్షంతీం = కోరుతున్న, (తాంపశ్య = ఆ నాభార్యను చూడుము)

తా. : ఓ మేఘమా! నావియోగం వలన దఃఖముతో నాభార్య తైలాది సంస్కారం లేక కేవలం నీటితో స్నానం చేయటం వలన ఆమె తలవెంట్రుకలు కర్కశంగా అవుతాయి. అవి ముఖం మీద చెక్కిళ్ల వరకు వ్రేలాడుచుండగా, పెదవులక్తు తాపము కలిగిస్తున్న వేడి నిట్టూర్పుతో వెంట్రుకలను తొలగిస్తూ, కలలోనైనా నాతో సమాగమము కలుగుటకు నిద్రను కోరుకుంటుంది. కన్నీళ్ల ఒత్తిడి వల్ల ఆ నిద్రకవకాశం లేక బాధపడుతున్న ఆమెను నీవు చూడగలవు.

**శ్లో॥ ఆద్యే బద్ధా విరహదివసే యా శిఖా దామ హిత్వా**
**శాపస్యాన్తే విగళితశుచా తాం మయో ద్వేష్టనీయామ్**
**స్పర్శక్లిష్టా మయమితనఖే నాసకృ త్సారయన్తీం**
**గండాభోగా త్కఠినవిషమా మేకవేణీం కరేణ** **31**

ప్ర.ప. : ఆద్యే = మొదటిదైన, విరహదివసే = వియోగపురోజున, దామ = పూలదండను, హిత్వా = విడిచి, యాశిఖా = ఏసిగ, బద్ధా = ముడువబడినదో, శాపస్య = శాపముయొక్క, అంతే = సమాప్తియందు, విగళితశుచా = తొలగిన దుఃఖముకల, మయా = నాచేత, ఉద్వేష్టనీయాం = విడదీయదగినది, స్పర్శక్లిష్టాం = తాకుటకు కష్టమైనది, కఠిన విషమాం = కఠినముగా, అస్తవ్యస్తముగా ఉన్నట్టి, తాం = ఆ, ఏకవేణీం = ఒంటి జడను, అయమిత నఖేన = సంస్కారములేనిగోళ్లు కల, కరేణ = చేతితో, గండాభోగాత్ = విశాలమైన చెక్కిళ్లనుండి, అసకృత్ = చాలాసార్లు, సారయన్తీం = తొలగించుచున్న, (తాం = ఆమెను, పశ్య = చూడుము)

తా. : ఓ మేఘమా! శాపమువలన మేము విడిపోయిన మొదటి రోజున పతివ్రత అయిన నాభార్య, అలంకరించిన పూలదండను తీసి జుట్టు ముడివేసింది. అప్పటి నుండి ఆమె తైలాది సంస్కారము లేకుండా జుట్టును అదే విధంగా ఉంచింది. శాపం పూర్తయిన తరువాత నేను వచ్చి ఆ జుట్టు ముడివిప్పవలసి ఉన్నది. ఈలోగా ఆమె బాగా బిరుసుగా తాకుటకు కష్టంగా ఉండే తన కురులు చెక్కిళ్ల మీద పడుతుంటే మాటిమాటికి తన చేతితో తొలగించుకుంటూ ఉంటుంది. అటువంటి స్థితిలో నీకామె కనిపించవచ్చును.

స్వభావోక్త్యలంకారము.

**శ్లో॥ సా సన్న్యస్తాభరణ మబలా పేశలం ధారయన్తీ**
**శయ్యోత్సంగే నిహిత మసకృ ద్దుఃఖదుఃఖేన గాత్రమ్**
**త్వామ ప్యస్రం నవజలమయం మోచయిష్యత్యవశ్యం**
**ప్రాయ స్సర్వో భవతి కరుణావృత్తి రార్ద్రాన్తరాత్మా** **32**



ప్ర.ప. : అబలా = బలహీనురాలైన, సన్యస్తా భరణం = విడువబడిన ఆభరణములు కలదిగా, అసకృత్ = చాలసార్లు, దుఃఖదుఃఖేన = అధిక దుఃఖము చేత, పేశలం = కోమలమైన, శయ్యోత్సంగే = శయ్యమీద, నిహితం = ఉంచబడిన, గాత్రం = శరీరమును, ధారయన్తీ = ధరించుచున్న, సా = ఆ నాభార్య, త్వామపి = నిన్నుకూడ, నవజలమయం = కొత్తనీటి రూపమైన, అస్రం = కన్నీటిని, అవశ్యం = తప్పక, మోచయిష్యతి = విడుచునట్లు చేయగలదు, తథాహి = అదియుక్తమే కదా! ప్రాయః = తరచుగా ఆర్ద్రాంతరాత్మా = జాలిగుండె కలిగిన, సర్వః = ప్రతివాడు, కరుణావృత్తిః = దయతో ప్రవర్తించు వాడుగా, భవతి = ఉండును.

తా. : మేఘమా! నా వియోగము వలన దుఃఖముతో ఆభరణములు తొలగించి, సుకుమారమైన తన శరీరమును మాటి మాటికి శయ్యమీద చేర్చి అతికష్టము మీద దానిని ధరిస్తుంటుంది. నీవు అక్కడికి వెళ్లినప్పుడు ఆమె దయనీయ పరిస్థితిని చూచి నీహృదయము కరిగి, తొలకరి జల్లు రూపంలో కన్నీరుపెట్టుకోగలవు. ఎందుకనగా లోకంలో జాలిగుండె కలవారెవరైనా ఇతరుల కష్టాలు చూచినప్పుడు దయతో ప్రవర్తిస్తారు. నీవు సహజంగా మృదు హృదయం కలవాడవు కనుక ఆమెను చూచి కన్నీరు విడువగలవని భావము.

అర్థాంతరన్యాసాలంకారము.

**శ్లో॥ జానే సఖ్యా స్తవ మయి మనః సంభృతస్నేహ మస్మా**
**దిత్థంభూతాం ప్రథమవిరహే తా మహం తర్కయామి**
**వాచాలం మాం న ఖలు సుభగమ్మన్యభావః కరోతి**
**ప్రత్యక్షం తే నిఖిల మచిరా ద్భ్రాత రుక్తం మయా యత్** **33**

ప్ర.ప. : హేభ్రాతః = ఓ సోదరా! తవ = నీయొక్క, సఖ్యాః = మిత్రురాలైన నా భార్యయొక్క, మనః = మనస్సు, మయి = నాయందు, సంభృతస్నేహం = బాగుగా కుదిరిన స్నేహము కలదని, జానే = తెలియుదును, అస్మాత్ = అందువలన, ప్రథమ విరహే = మొదటి ఎడబాటులో, తాం = ఆమెను, ఇత్థం భూతాం = ఈ రీతిగా ఉండునని, తర్కయామి = ఊహించుచున్నాను, సుభగంమన్యభావః = అదృష్టవంతుడనని తలచుట, మాం = నన్ను, వాచాలం = ఎక్కువమాట్లాడువానినిగా, నకరోతి = చేయుట లేదు, ఖలు = కదా! యత్ = ఏది, మయా = నాచేత, ఉక్తం = చెప్పబడినదో, తత్ = అది, నిఖిలం = సమస్తము, అచిరాత్ = తొందరలోనే, తే = నీకు, ప్రత్యక్షం = కంటికి కనిపించునది, భవిష్యతి = కాగలదు.

**తా.** : సోదరా, మేఘూ! నా భార్య మనస్సు నాపై గాఢమైన అనురాగము కలది. అందువలన మొట్టమొదటిసారి కలిగిన నాయెడబాటుతో సంతాపం వలన ఆమె ఆవిధంగా ఉంటుందని ఊహిస్తున్నాను. అంతేకాని నేను అదృష్టవంతుడనని తలచి ఎక్కువగా మాట్లాడటం లేదు. ఆమె ప్రస్తుత స్థితిని గూర్చి నేను నీకు ఏ విషయాలను చెప్పినానో, వాటన్నిటిని నీవు త్వరలో అక్కడికి చేరి ప్రత్యక్షంగా చూడగలవు. నా ఊహ అతిశయోక్తి కాదని గ్రహిస్తావు.

మూడవ పాదంలో చెప్పిన విషయాన్ని నాలుగవ పాదంలో సమర్థించటం వలన ఇక్కడ కావ్యలింగాలంకారము.

శ్లో॥ **రుద్ధాపాంగప్రసర మలకై రంజనస్నేహశూన్యం**
**ప్రత్యాదేశా దపి చ మధునో విస్మృతభ్రూవిలాసమ్**
**త్వయ్యాసన్నే నయన ముపరిస్పంది శంకే మృగాక్ష్యాః**
**మీనక్షోభా చ్చలకువలయశ్రీతులా మేష్యతీతి** **34**

**ప్ర.ప.** : అలకైః = ముంగురులచేత, రుద్ధా....సరం; రుద్ధ = అడ్డగింపబడిన, అపాంగ = క్రీగంటిచూపుల, ప్రసరం = వ్యాప్తికలది, అంజన...శూన్యం; అంజన = కాటుక యొక్క, స్నేహ = చిక్కదనం, శూన్యం = లేనటువంటి, అపిచ = మరియు, మధునః = మద్యము యొక్క ప్రత్యాదేశాత్ = నిరాకరణ వలన, విస్మృత = మరువబడిన, భ్రూవిలాసం = కనుబొమ్మల విలాసములు కలిగినది, ఉపరిస్పంది = పై భాగమున అదురుచున్న, మృగాక్ష్యాః = లేడి కన్నులవంటి కన్నులు కల ఆమె యొక్క, నయనం = కన్ను, త్వయి = నీవు, ఆసన్నేసతి = సమీపించగా, మీనక్షోభాత్ = చేపల కదలికవలన, చల...తులాం; చల = కదులుచున్న, కువలయ = కలువ యొక్క, శ్రీ = కాంతితో, తులాం = పోలికను, ఏష్యతి = పొందగలదు, ఇతి = ఇట్లు, శంకే = ఊహించుచున్నాను.

**తా.** : ఓ మేఘుమా! నా వియోగముతో బాధపడుతున్న నా భార్యకు అలంకారములపై ఆసక్తి తొలగుతుంది. అందువలన తైలాది సంస్కారము లేక ముంగురులు కన్నులపై వ్రేలాడుతుంటాయి. ఆమె కాటుక ధరించకపోవటంతో, మధువును సేవించటం మానుకోవటం వలన కనుబొమ్మలతో విలాసాలు చూపటం మరచిపోయి ఉంటుంది. అటువంటి సమయంలో నీవామె దగ్గరికి వెళ్లగా చూచి, ఎడమకన్ను పైభాగము అదురుతుంది. అప్పుడామె కన్ను జలాశయంలో చేపల కదలికతో కదులుతున్న కలువ వంటి శోభను పొందుతుందని ఊహిస్తున్నాను. నీవు నాకుశల వార్తను తెలుపబోతున్నావు



కనుక ఆ శుభసూచన కామె ఎడమ కన్ను అదురుతుందని తలుస్తాను. స్త్రీలకు ఎడమకన్ను, పురుషులకు కుడికన్ను అదరటం శుభ సూచకమని మన పూర్వుల విశ్వాసము.

యక్షపత్ని కన్నును కలువతో పోల్చటం వల్ల ఇది ఉపమాలంకారము.

శ్లో॥ **వామ శ్చాస్యాః కరరుహపదై ర్ముచ్యమానో మదీయై**
**ర్ముక్తాజాలం చిరపరిచితం త్యాజితో దైవగత్యా**
**సంభోగాన్తే మమ సముచితో హస్తసంవాహనానాం**
**యాస్య త్యూరుః సరసకదళీస్తంభగౌర శ్చలత్వమ్** **35**

**ప్ర.ప.** : మదీయైః = నాకు సంబంధించిన, కరరుహ = గోళ్లయొక్క, పదైః = స్థానముల (గుర్తుల) చేత, ముచ్యమానః = విడువబడినది, దైవగత్యా = విధికారణముతో, చిరపరిచితం = చాలకాలముగా అలవాటైన, ముక్తాజాలం = ముత్యాలతో కూర్చిన మొలదారమును, త్యాజితః = విడుచునట్లు చేయబడిన, సంభోగాన్తే = సంభోగము చివరి దశలో, మమ = నాయొక్క, హస్త సంవాహనానాం = చేతి మర్దనములకు, సముచితః = యోగ్యమైనది అగు, అస్యాః = ఈ నాభార్యయొక్క, సరస...గౌరః; సరస = తడితో కూడిన, కదళీ = అరటియొక్క, స్తంభగౌరః = బోదెవలె గౌరవర్ణము (లేత పసుపురంగు) కల, వామః = ఎడమదైన, ఊరుః = తొడ, చలత్వం = చంచల భావమును, యాస్యతి = పొందగలదు.

**తా.** : జలదా! మా దంపతులము కలిసి ఉన్నప్పుడు ఆమె ఊరువులపై నా నఖక్షతాలకు స్థానముండేది. ఇప్పుడు వియోగదశలో వాటికవకాశము లేదు కదా! ఎంతో కాలముగా ఆమె అలవాటుగా ముత్యాలు కూర్చిన ఒడ్డాణము ధరించేది. అది కూడ కృశించటం చేత విడువబడింది. మా సమాగమంలో రతిక్రీడ తరువాత నాచేతులతో ఆమె ఊరువులను మర్దన చేసేవాడను. అవేవియు లేని ఆమె అరటి స్తంభము వలె సరసమై, గౌరవర్ణము కల వామభాగపు తొడ, నీ రాకకు ముందు అదురుతుంది. ఎడమ కన్నువలె, ఎడమ తొడ అదురుట కూడ శుభసూచకం కదా! నీ రాకవలన తన భర్త క్షేమవార్త, సందేశము తెలియబోతున్నందుకు శుభసూచన ముందుగా అందుతుందని యక్షుని అభిప్రాయము.

ఊరువును అరటి స్తంభముతో పోల్చి వర్ణించటం వలన ఉపమాలంకారము.

శ్లో॥ **తస్మిన్కాలే జలద యది సా లబ్ధనిద్రాసుఖా స్యా**
**దన్వాస్యైనాం స్తనితవిముఖో యామమాత్రం సహస్వ**

మాభూదస్యాః ప్రణయిని మయి స్వప్నలబ్ధే కథంచి
త్సద్యః కంఠచ్యుత భుజలతాగ్రంథి గాఢోపగూఢమ్ 36

ప్ర.ప. : హేజలద = ఓ మేఘమా! తస్మిన్కాలే = నీవు అక్కడికి వెళ్లినప్పుడు, సా = ఆమె, లబ్ధ...సుఖా; లబ్ధ = పొందబడిన, నిద్రాసుఖా = నిద్రయొక్క సుఖము కలదిగా, స్యాద్యది = ఉన్నట్లయితే, ఏనాం = ఆమెను, అన్వాస్య = అనుసరించి ఉండి, స్తనిత విముఖః = గర్జనకు పూనుకొనక, యామమాత్రం = ఒకజాము కాలము, సహస్వ = ఓపికపట్టుము, అస్యాః = ఈమెకు, ప్రణయిని = ప్రియుడనైన, మయి = నేను, కథంచిత్ = అతికష్టముగా, స్వప్నలబ్ధే సతి = కలలో లభించినవాడను కాగా, గాఢోపగూఢమ్ = గాఢమైన ఆలింగమును, సద్యః = వెంటనే, కంఠ...గ్రంథి; కంఠ = మెడనుండి, చ్యుత = జారిన, భుజలతా = తీగలవంటి చేతులయొక్క, గ్రంథి = ముడి కలదిగా, మాభూత్ = కాకుండుగాక.

తా. : ఓ మేఘమా! నీవు వెళ్లిన సమయంలో ఒకవేళ ఆమె నిద్రలో మునిగి ఉన్నట్లయితే కొంచెంసేపు ఉరుములు లేకుండా ఒక జాముసేపు ఓపిక పట్టుము. ఎందుకంటే ఒకవేళ నిద్రలో ఆమెకు కలవచ్చి, కలలో తన చేతులతో నాకంఠాన్ని ఆలింగనము చేసుకున్నట్లయితే నీ ఉరుము వలన కల చెదిరిపోయి, అతికష్టంగా లభించిన స్వప్నాలింగన సుఖం కూడ ఆమెకు లేకుండా పోకూడదు.

ఇక్కడ "యామమాత్రం సహస్వ" అనే దానికి 3,4 పాదాలలో కారణం (స్వప్నభంగం) చెప్పటం వలన కావ్యలింగాలంకారము.

శ్లో॥ తాముత్థాప్య స్వజలకణికా శీతలేనానిలేన
ప్రత్యాశ్వస్తాం సమమభినవై ర్జాలకైర్మాలతీనామ్
విద్యుద్గర్భః స్తిమితనయనాం త్వత్సనాథే గవాక్షే
వక్తుం ధీరః స్తనితవచనై ర్మానినీం ప్రక్రమేథాః 37

ప్ర.ప. : తాం = ఆ నాభార్యను, స్వజల...శీతలేన; స్వ = నీయొక్క, జలకణికా = నీటి బిందువుల చేత, శీతలేన = చల్లనైన, అనిలేన = వాయువుతో, ఉత్థాప్య = నిద్రలేపి, అభినవైః = నూతనములైన, మాలతీ జాలకైః సమం = జాజిమొగ్గలతో పాటు, ప్రత్యాశ్వస్తాం = తిరిగి కోలుకున్నట్టి, త్వత్సనాథే = నీతోకూడిన, గవాక్షే = కిటికీయందు, స్తిమితనయనాం = నిశ్చలమైన చూపులు కల, మానినీం = అభిమానవతి అయిన నా భార్యను గురించి, విద్యుద్గర్భః = మెరుపు తీగ లోపల కలిగిన, ధీరః = స్థిర చిత్తము కలవాడవై, స్తనితవచనైః = ఉరుములనెడి మాటలతో, వక్తుం = మాటలాడుటకు, ప్రక్రమేథాః = ప్రారంభించుము.



తా. : ఓ మేఘమా! నీవు నీటి బిందువులతో చల్లనైన గాలితో నా భార్యను నిద్రలేపుము. ప్రాతః కాలము చల్లటి గాలికి జాజిమొగ్గలు వికసించినట్లు ఆమె కూడ కొంత స్తిమిత పడుతుంది. అప్పుడు నీవు మెరుపుతీగెను లోపలదాచుకొని సన్నని ఉరుముల రూపంలో నీవున్న గవాక్షం వైపు నిశ్చలంగా చూస్తున్న నా ప్రియురాలికి నా కుశల వార్తతో కూడిన సందేశాన్ని వినిపించుము.

జాజిమొగ్గలతో పాటు ఆమె తెలివి తెచ్చుకుంటుందనటం వలన సహోక్త్యలంకారము. ఉరుముల యందు మాటలుగా ఆరోపించటం ప్రస్తుతానికుపయోగించేదిగా వర్ణించటం వలన పరిణామాలంకారము కూడ.

శ్లో॥ భర్తుర్మిత్రం ప్రియమవిధవే విద్ధి మామంబువాహం
తత్సన్దేశైర్హృదయనిహితై రాగతం త్వత్సమీపమ్
యో బృందాని త్వరయతి పథి శ్రామ్యతాం ప్రోషితానాం
మంద్రస్నిగ్ధైర్ధ్వనిభి రబలావేణిమోక్షోత్సుకాని 38

ప్ర.ప. : హే అవిధవే = ఓసుమంగళీ! మాం = నన్ను, ప్రియం = ఇష్టమైన, మిత్రం = స్నేహితుడైన, అంబువాహం = మేఘునిగా, హృదయనిహితైః = మనస్సులో ఉంచబడిన, తత్సందేశైః = అతని క్షేమవార్తలతో, త్వత్సమీపం = నీ దగ్గరికి, ఆగతం = వచ్చిన వానిగా, విద్ధి = తెలుసుకొనుము, యః = ఏమేఘుడు, అబలా...కాని; అబలా = స్త్రీల యొక్క వేణి = జడలను, మోక్ష = విడదీయుట యందు, ఉత్సుకాని = కుతూహలము కల, పథి = దారియందు, శ్రామ్యతాం = బాధపడుతున్న, ప్రోషితానాం = ప్రవాసంలో ఉన్నవారి, బృందాని = సమూహములను, మంద్ర = గంభీరములు, స్నిగ్ధైః = మధురములు అగు, ధ్వనిభిః = ఉరుములతో, త్వరయతి = తొందరపెట్టునో, (ఆమేఘుడను నేను అని సమన్వయము)

తా. : మేఘుడు తన సందేశాన్ని తన భార్యకు అందించవలసిన విధానం యక్షుడీ విధంగా తెలుపుతున్నాడు. "ఓ సుమంగళీ! నన్ను నీ భర్తకు ప్రియమైన మిత్రుడనుగా, నా మనస్సులో భద్రపరచిన నీ భర్త కుశల వృత్తాంతము తెచ్చిన వాణ్ణిగా గుర్తించుము. నా వంటి మేఘాలు, తమ భార్యలకు దూరంగా ప్రవాసంలో ఉన్న భర్తలను మా దర్శనం చేత తమ గృహాలకు తిరిగి వెళ్లటానికి తొందర పెట్టుతుంటాయి కదా! అటువంటి మేఘజాతికి చెందినవాణ్ణి" అని తెల్పుము.

శ్లో॥ ఇత్యాఖ్యాతే పవనతనయం మైథిలీవోన్ముఖీ సా
త్వాముత్కంఠోచ్ఛ్వసిత హృదయా వీక్ష్య సంభావ్య చైవ

**శ్రోష్యత్యస్మా త్పరమవహితా సౌమ్య సీమంతినీనాం**
**కాంతోదన్త స్సుహృదుపనతః సంగమాత్కించిదూనః** 39

ప్ర.ప. : ఇతి = ఈ విధముగా, ఆఖ్యాతేసతి = నా సందేశము చెప్పబడగా, పవనతనయం = హనుమంతుణ్ణి, మైథిలీవ = సీతాదేవివలె, ఉన్ముఖీ = ముఖముపైకెత్తిన, సా = ఆ నాభార్య, ఉత్కం...హృదయా; ఉత్కంఠ = కుతూహలము చేత, ఉచ్ఛ్వసిత = ఓదార్చబడిన, హృదయా = మనస్సుకలదై, త్వాం = నిన్ను, వీక్ష్య = చూచి, సంభావ్యచ = గౌరవించియు, అస్మాత్ = ఈ కారణము (భర్తకు మిత్రుడని) వలన, పరం = తరువాత, అవహితా = సావధానురాలై, శ్రోష్యత్యేవ = తప్పక వినగలదు, హేసౌమ్య = ఓ సజ్జనుడా! సీమంతినీనాం = స్త్రీలకు, సుహృదుపనతః = మిత్రుని చేత వచ్చిన; కాంతోదన్తః = తమ ప్రియుని కుశల వార్త, సంగమాత్ = కలయికకంటె, కించిత్+ఊనః = కొంచెము తక్కువైనది.

తా. : సజ్జనుడవైన మేఘమా! పైవిధముగా నీవు పరిచయ వాక్యాలు చెప్పగానే, లంకలో సీతాదేవి హనుమంతుని మాటలు విన్నప్పటివలె ముఖం పైకెత్తి ఆసక్తిగా నీవైపు చూస్తుంది. నిన్ను గౌరవిస్తుంది కూడ. ఎందుకనగా, వియోగంలో ఉన్న స్త్రీలకు తమ భర్తల క్షేమ సమాచారము ఎవరి ద్వారానైనా తెలిసినప్పుడు అది తమ సమాగమముకంటె కొంచెం తక్కువగా సంతోషాన్ని కలిగిస్తుంది. కావున నీ మాటలు శ్రద్ధగా వింటుంది.

అర్థాంతరన్యాసాలంకారము.

**శ్లో॥ తా మాయుష్మ న్మమ చ వచనా దాత్మనశ్చోపకర్తుం**
**బ్రూయా ఏవం తవ సహచరో రామగిర్యాశ్రమస్థః**
**అవ్యాపన్నః కుశల మబలే పృచ్ఛతి త్వాం వియుక్తః**
**పూర్వాభాష్యం సులభవిపదాం ప్రాణినా మేతదేవ** 40

ప్ర.ప. : హే ఆయుష్మన్ = దీర్ఘాయువు కల ఓమేఘుడా!, మమ = నాయొక్క వచనాత్ = మాటవలన, ఆత్మనః = నీ యొక్క, ఉపకర్తుంచ = పరోపకారభావనతో కాని, తాం = ఆమెను, గూర్చి, ఏవం = ఈవిధముగా, బ్రూయాః = చెప్పుము, హే అబలే = ఓ అబలా! తవ = నీయొక్క, సహచరః = భర్త, రామగిర్యాశ్రమస్థః = చిత్రకూట పర్వతపు ఆశ్రమములందుండి, అవ్యాపన్నః = జీవించియే ఉన్నాడు, త్వాం = నిన్ను, కుశలం = క్షేమవార్తను, పృచ్ఛతి = అడుగుచున్నాడు, సులభవిపదాం = తేలికగా ఆపదలకు గురి అయ్యే, ప్రాణినాం = జీవులకు, పూర్వాభాష్యం = ముందుగా మాట్లాడదగినది, ఏతదేవ = ఇదే కదా!



తా. : దీర్ఘాయువు కల మేఘుడా! నేను కోరినందువలనగాని, నీ పరోపకార స్వభావము చేతగాని, నా భార్యతో నా సందేశము నీ విధంగా తెలుపుము. "ఓ అబలా! నీ భర్త చిత్రకూట పర్వతప్రాంతం ఆశ్రమాలలో నివసిస్తున్నాడు, క్షేమంగా ఉన్నాడు. నీకుశల వార్తను తెలుపుమని కోరుతున్నాడు. స్వల్పకారణంతోనే ఆపదల పాలయ్యే ప్రాణులకు ముందుగా తెలుపవలసిన విషయము జీవించి ఉండటమే కదా!"

అర్థాంతరన్యాసాలంకారము.

**శ్లో॥ అంగే నాంగం ప్రతను తనునా గాఢతప్తేన తప్తం**
**సాస్రే ణాశ్రు ద్రుత మవిరతోత్కంఠ ముత్కంఠితేన**
**ఉష్ణోచ్ఛ్వాసం సమధికతరోచ్ఛ్వాసినా దూరవర్తీ**
**సంకల్పైస్తై ర్విశతి విధినా వైరిణా రుద్ధమార్గః** 41

ప్ర.ప. : వైరిణా = శత్రువైన, విధినా = దైవముచేత, రుద్ధమార్గః = అడ్డగింపబడిన దారికలవాడై, దూరవర్తీ = దూరమందున్న (నేను) తనునా = బక్కచిక్కిన, గాఢతప్తేన = మిక్కిలి తపించిన, సాస్రేణ = కన్నీటితో గూడిన, ఉత్కంఠితేన = ఉత్సుకతకలిగిన, సమధి...చ్ఛ్వాసినా; సమధికతర = మిక్కిలి ఎక్కువగా, ఉచ్ఛ్వాసితేన = నిట్టూర్పులతో కూడిన, అంగేన = శరీరముతో, ప్రతను = మిక్కిలి శుష్కించిన, తప్తం = తాపము చెందిన, అశ్రుద్రుతం = కన్నీరు కార్చునది, అవిరతోత్కంఠం = ఎడతెగని ఆతురతకలది, ఉష్ణోచ్ఛ్వాసం = వేడి నిట్టూర్పులు కలది అగు, తవ = నీ యొక్క, అంగం = శరీరమును, తైస్తైః = పూర్వమనుభవించిన, ఆయాసంకల్పైః = కోరికలతో, విశతి = ప్రవేశించుచున్నాను.

తా. : ఓ జలదా! నా పక్షమున ఇంకా నా భార్యతో ఈ విధంగా చెప్పుము. "దైవము శత్రు భావముతో మీకు ఎడబాటు కలిగించింది. నీ భర్త, విరహముతో కృశించిన, తీవ్రంగా తాపముచెందిన, కన్నీరుతో కూడిన, కుతూహలము కల, వేడి నిట్టూర్పులు విడుస్తున్న తన శరీరముతో, అటువంటి లక్షణాలే కలిగి ఉన్న నీ శరీరాన్ని దూరంగా ఉన్నందువలన పూర్వమనుభవించిన విషయాలను స్మరిస్తూ సంకల్పాలతో ప్రవేశిస్తున్నాడు." అని.

**శ్లో॥ శబ్దాఖ్యేయం యదపి కిల తే యః సఖీనాం పురస్తాత్**
**కర్ణే లోలః కథయితు మభూ దాననస్పర్శలోభాత్**
**సోఽతిక్రాంతః శ్రవణవిషయం లోచనాభ్యా మదృశ్యః**
**త్వా ముత్కంఠా విరచితపదం మన్ముఖేనేద మాహ** 42

ప్ర.ప. : యః = ఏ నీపతి, తే = నీయొక్క సఖీనాం = చెలులయొక్క పురస్తాత్ = ఎదుట, యత్ = ఏది, శబ్దాఖ్యేయమపి = మాటలతో వెల్లడించదగినదైనప్పటికి, తదపి = దానిని గూడ, ఆనన స్పర్శలోభాత్ = ముఖము యొక్క స్పర్శపై ఆశవలన, కర్ణే = చెవిలో, కథయితుం = చెప్పుటకు, లోలః = చపలుడుగా, అభూత్ = ఆయెనో, శ్రవణ విషయం = చెవుల ప్రదేశమును, అతిక్రాంతః = దాటినటువంటి, లోచనాభ్యాం = కన్నులచేత, అదృశ్యః = చూడ శక్యము కానివాడు అయిన, సః = ఆ నీభర్త, త్వాం = నిన్ను గూర్చి, ఉత్కంఠా = ఆతురతతో, విరచిత = కూర్చబడిన, పదం = మాటలు కల, ఇదం = ఈ చెప్పబోవు సందేశమును, మన్ముఖేన = నా ద్వారా, ఆహ = చెప్పినాడు.

**తా.** : ఓ మేఘమా! ఇంకా ఆమెతో ఈ విధంగా చెప్పుము. "పూర్వము మీరు కలిసి ఉన్నప్పుడు నీభర్త ఒక విషయము చెప్పదలచి, అది చెలికత్తెలయెదుట చెప్పదగినదైనా, రహస్యముకాకున్నా, నీముఖాన్ని తాకవచ్చుననే ఆశతో చెవిలో చెప్పేవాడు... అంతచాపల్యము కల అతడు నీకు ఇప్పుడు చాలాదూరంగా చెవులకు, కంటికి గూడ అందని దూరంలో ఉన్నాడు. కనుక ఎంతో ఆతురతతో కూడిన పదాలను కూర్చి తన సందేశాన్ని నా ద్వారా నీకు పంపినాడు." అని.

**శ్లో॥ శ్యామా స్వంగం చకితహరిణీప్రేక్షణే దృష్టిపాతం**
**వక్త్రచ్ఛాయాం శశిని శిఖినాం బర్హభారేషు కేశాన్**
**ఉత్పశ్యామి ప్రతనుషు నదీవీచిషు భ్రూవిలాసాన్**
**హన్తై కస్మి న్క్వచిదపి న తే చండి సాదృశ్యమస్తి.** **43**

ప్ర.ప. : శ్యామాసు = తీగలయందు, అంగం = నీ శరీరమును, చకిత...ప్రేక్షణే; చకిత = భయముతో కూడిన, హరిణీ = ఆడులేడి యొక్క ప్రేక్షణే = చూపులలో, తే = నీ యొక్క దృష్టిపాతం = వీక్షణమును, శశిని = చంద్రుని యందు, వక్త్రచ్ఛాయాం = ముఖకాంతిని, శిఖినాం = నెమళ్ల యొక్క బర్హభారేషు = పింఛముల సమూహములందు, కేశాన్ = నీ వెంట్రుకలను, ప్రతనుషు = బాగా పలుచబడిన, నదీవీచిషు = నదుల యొక్క అలలయందు, భ్రూవిలాసాన్ = కనుబొమల విలాసాలను, ఉత్పశ్యామి = ఊహించుచున్నాను, హేచండి = ఓ ప్రణయ కోపము కలదానా! క్వచిత్ = ఎక్కడ కూడ, ఏకస్మిన్నపి = ఒక్కదాని యందు కూడ, తే = నీ యొక్క సాదృశ్యం = సాదృశ్యము, నాస్తి = లేదు, హంత = అయ్యో! ఎంత దురదృష్టము!

**తా.** : "ప్రణయ కోప స్వభావము కల ప్రేయసీ! కోమలమైన లతలలో నీ శరీరాన్ని, భయపడిన జింక కన్నులలో నీచూపును, చంద్రునిలో నీముఖశోభను, నెమలి పింఛములలో



నీతల వెంట్రుకలను, సన్నబడిన నదుల తరంగాలలో నీకనుబొమల విలాసాలను ఊహించుకుంటున్నాను. కాని ఏ ఒక్కదాని యందు కూడ నీతో సాదృశ్యము కనిపించదు. ఎంత విషాదము!" అని నామాటలుగా నా భార్యకు వినిపింపుమని యక్షుడు మేఘునితో చెప్పినాడు.

తన భార్య రూపమును ఆయా వస్తువులను దర్శించి స్మరించినట్లు వర్ణించటం వలన స్మరణాలంకారము.

**శ్లో॥ త్వా మాలిఖ్య ప్రణయకుపితాం ధాతురాగై శ్శిలాయా**
**మాత్మానం తే చరణపతితం యావ దిచ్ఛామి కర్తుమ్**
**అస్రైస్తావ న్ముహు రుపచితై ర్దృష్టి రాలుప్యతే మే**
**క్రూర స్తస్మిన్నపి న సహతే సంగమం నౌ కృతాన్తః** **44**

ప్ర.ప. : ధాతురాగైః = గైరికాది ధాతు ద్రవములతో, ప్రణయకుపితాం = ప్రణయ కోపముతో ఉన్న, త్వాం = నిన్ను, శిలాయాం = రాతిమీద, ఆలిఖ్య = చిత్రించి, ఆత్మానం = నన్ను, తే = నీ యొక్క చరణపతితం = పాదములపై పడినవానినిగా, కర్తుం = చేయుటకు (చిత్రంలో) యావత్ = ఎప్పుడు, ఇచ్ఛామి = కోరుచున్నానో, తావత్ = అంతలో, ముహుః = మాటిమాటికి, ఉపచితైః = పెరుగుచున్న, అస్రైః = కన్నీళ్లతో, మే = నాయొక్క దృష్టిః = చూపు, ఆలుప్యతే = తగ్గుచున్నది; క్రూరః = కఠిన స్వభావముకల, కృతాంతః = దైవము, తస్మిన్నపి = ఆ చిత్రపటమందు కూడ, నౌ = మన యొక్క సంగమం = కలయికను, నసహతే = ఓర్చుటలేదు.

**తా.** : యక్షుడు తన సందేశంలో భార్యతో ఈవిధంగా చెప్పుతున్నాడు. "ప్రియతమా! నీవు నాపై ప్రణయకోపము పూని ఉన్న రూపాన్ని ఒక శిలపైన గైరికాది ధాతువుల ద్రవంతో చిత్రించి, అప్పుడు నిన్ను ప్రసన్నం చేసుకోవటానికి నీ పాదములపై నేను పడిన దృశ్యాన్ని చిత్రించాలనుకుంటాను. అంతలో నీరూపాన్ని చూడగానే విరహ బాధతో నా కన్నుల నుండి బాష్పధారలు కురుస్తాయి. దాని వలన నాచూపు మందగించి చిత్ర రచన ఆగిపోతుంది. విధి చాలా క్రూరమైంది కదా! చిత్రపటంలో కూడ మనమిద్దరం కలిసి ఉండటాన్ని సహించటంలేదు.

**శ్లో॥ మా మాకాశ ప్రణిహితభుజం నిర్దయాశ్లేషహేతో**
**ర్లబ్ధాయా స్తే కథమపి మయా స్వప్నసందర్శనేషు**
**పశ్యంతీనాం న ఖలు బహుశో న స్థలీదేవతానాం**
**ముక్తాస్థూలాం స్తరుకిసలయే ష్వశ్రులేశాః పతన్తి** **45**

ప్ర.ప. : స్వప్న సందర్శనేషు = కలలో కనిపించిన సందర్భాలలో, మయా = నా చేత, కథమపి = అతికష్టముపైన, లబ్ధాయాః = లభించినట్టి, తే = నీయొక్క నిర్దయాశ్లేషహేతోః = గాఢమైన ఆలింగన కారణమున, ఆకాశ...భుజం; ఆకాశ = ఆకాశమందు, ప్రణిహిత = చాపబడిన, భుజం = చేతులు కలిగిన, మాం = నన్ను, పశ్యంతీనాం = చూచుచున్న, స్థలీదేవతానాం = వనదేవతల యొక్క, ముక్తాస్థూలాః = ముత్యములంత పెద్దవైన, అశ్రులేశాః = కన్నీటి చుక్కలు, తరుకిసలయేషు = చెట్ల చిగుళ్ల యందు, బహుశః = ఎక్కువగా, నపతంతి నఖలు = పడకుండా ఉండవుకదా! తప్పక పడుతాయని భావము.

తా. : "ప్రేయసీ! ఎప్పుడైనా నాకు కలలో నీవు కనిపించినప్పుడు ఎంతో కష్టముగా లభించిన నిన్ను గాఢముగా ఆలింగనము చేయదలచి శూన్య స్థలంలో చేతులు చాపుతాను. అప్పటి నాదయనీయపరిస్థితిని చూచినప్పుడు ఇక్కడి వనదేవతలు జాలితో కన్నీరు కారుస్తారు. అవి అక్కడి చెట్ల చిగురాకులపై తప్పక పడుతాయి." (అని నా సందేశంగా నా భార్యకు వినిపింపుమని యక్షుడు మేఘునికి తెలిపినాడు.)

శ్లో॥ **భిత్త్వా సద్యః కిసలయపుటా న్దేవదారు ద్రుమాణాం**
**యే తత్క్షీరస్రుతిసురభయో దక్షిణేన ప్రవృత్తాః**
**ఆలింగ్యంతే గుణవతి మయా తే తుషారాద్రివాతాః**
**పూర్వం స్పృష్టం యది కిల భవే దంగ మేభి స్త వేతి** 46

ప్ర.ప. : దేవదారు ద్రుమాణాం = దేవదారు వృక్షముల యొక్క, కిసలయ పుటాన్ = చిగురుటాకు దొప్పలను, సద్యః = అప్పుడే, భిత్త్వా = భేదించి, తత్...సురభయః; తత్ = వాని నుండి, క్షీరస్రుతి = పాలుకారుట చేత, సురభయః = పరిమళము కలిగిన, యే = ఏ, తుషారాద్రి = హిమాలయ పర్వతపు, వాతాః = గాలులు, దక్షిణేన = దక్షిణపు వైపు, ప్రవృత్తాః = ప్రసరించినవో, హేగుణవతి = మంచి గుణములు కలదానా! ఏభిః = ఈవాయువుల చేత, పూర్వం = ముందుగా, తవ = నీయొక్క, అంగం = శరీరము, స్పృష్టం = తాకబడినదిగా, భవేద్యది కిల = అయిఉండును కదా! ఇతి = అని, తే = ఆ వాయువులు, మయా = నాచేత, ఆలింగ్యంతే = కౌగిలించుకొన (ఆస్వాదింప) బడుచున్నవి.

తా. : ఓ గుణవంతురాలా! హిమాలయ పర్వతము నుండి వీచే గాలులు దేవదారు వృక్షాల చిగుళ్లను ఛేదించటం వలన పాలుకారి కమ్మని పరిమళము వచ్చును. ఆ సువాసనతో కూడిన వాయువులు దక్షణ దిశగా ప్రసరించి నా దగ్గరికి చేరుతున్నవి.



హిమాలయానికి దగ్గరలో ఉన్న నిన్ను ముందుగా తాకి ఇక్కడికి వచ్చినాయనే భావంతో, నీస్పర్శ కలిగిన వాయువులని వాటిని అనురాగంతో ఆస్వాదించి ఆనందిస్తున్నాను.

రెండవ సర్గలో 38వ శ్లోకము నుండి 53వ శ్లోకము వరకు 16 శ్లోకములలో యక్షుని సందేశము వివరించబడింది.

శ్లో॥ **ధారాసిక్తస్థలసురభిణ స్త్వన్ముఖస్యాస్య బాలే**
**దూరీభూతం ప్రతను మపి మాం పంచబాణః క్షిణోతి**
**ఘర్మాంతేఽస్మి న్విగణయ కథం వాసరాణి వ్రజేయు**
**ర్దిక్సంసక్తప్రవితతఘనవ్యస్తసూర్యాతపాని** **47**

ప్ర.ప. : హేబాలే = ఓ చిన్నవయసుదానా! పంచబాణః = మన్మథుడు, ధారా...సురభిణః; ధారా = వర్ష ధారలచేత, సిక్త = తడుపబడిన, స్థల = నేల యొక్క సురభిణః = పరిమళముకల, అస్య ః ఈ, తవ = నీయొక్క ముఖస్య = ముఖమునకు, దూరీభూతం = దూరముగా అయిన, ప్రతనుం అపి = బాగా కృశించినప్పటికి, మాం = నన్ను, క్షిణోతి = బాధించుచున్నాడు, అస్మిన్ = ఈ, ఘర్మాంతే = ఎండాకాలపు చివరలో, దిక్సంస...తపాని; దిక్సంసక్త = దిక్కుల నంటిన, ప్రవితత = బాగుగా వ్యాపించిన, ఘన = మేఘములచేత, వ్యస్త = తొలగించబడిన, సూర్యాతపాని = సూర్యుని ఎండగల, వాసరాణి = దివసములు, కథం = ఎట్లు, వ్రజేయుః = గడచును, ఇతి = అని, విగణయ = ఆలోచింపుము.

తా. : ఓబాలా! తొలకరి వర్షధారలతో తడిసిన భూమి నుండి పరిమళము వ్యాపిస్తుంది. దాని చేత నీ ముఖము కూడ సుగంధము కలదౌతుంది. అటువంటి నీ ముఖానికి నేను దూరమై ఉన్నాను. అటువంటి నన్ను, విరహతాపముతో కృశించిన వాణ్ణి మన్మథుడు బాధిస్తున్నాడు. ఓప్రేయసీ! వేసవి గడిచి వర్షాకాలమారంభమైనది. దట్టమైన మేఘాలు దిక్కులంతటా వ్యాపించి ఎండను కప్పివేసినవి. ఇటువంటి దివసాలను నీయెడబాటులో ఎట్లు గడపగలనో ఆలోచింపుము. అదినాకు దుర్భరమైన విషయము కదా!

శ్లో॥ **సంక్షిప్యేత క్షణ ఇవ కథం దీర్ఘయామా త్రియామా**
**సర్వావస్థా స్వహరపి కథం మందమందాతపం స్యాత్**
**ఇత్థం చేత శ్చటులనయనే దుర్లభప్రార్థనం మే**
**గాఢోష్మాభిః కృత మశరణం త్వద్వియోగవ్యథాభిః** 48

ప్ర.ప. : దీర్ఘయామా = పొడవైన జాములు కల్గిన, త్రియామా = రాత్రి, క్షణః ఇవ = క్షణకాలమువలె, కథం = ఎట్లు, సంక్షిప్యేత = తగ్గించబడును? సర్వాసు = అన్ని, అవస్థాసు = పరిస్థితులందు, అహః అపి = పగలుకూడ, కథం = ఏ విధముగా, మందమంద +ఆతపం = తక్కువ ఎండకలదిగా, స్యాత్ = అగునో? హే చటులనయనే = చంచలమైన కన్నులు కలదానా! ఇత్థం = ఈ విధముగా, దుర్లభప్రార్థనం = పొందుటకు వీలుకాని కోరికగల, మే = నాయొక్క, చేతః = మనస్సు, గాఢోష్ణాభిః = తీవ్రమైన వేడిమి కల, త్వద్వియోగ = నీ విరహము వలన కలిగిన, వ్యథాభిః = చింతలతో, అశరణం = దిక్కులేనిదిగా, కృతం = చేయబడినది.

తా. : చంచలమైన కన్నులు కల ప్రేయసీ! చాలా పొడవుగా తోస్తున్న ఈ రాత్రి ఎట్లు పొట్టిగా చేయబడుతుంది? అన్ని దశలలో కూడ పగటి పూట తీవ్రము కాని ఎండ ఎట్లు కలుగుతుంది? అని నా మనస్సు దుర్లభమైన కోరికతో తపిస్తూ, నీయెడబాటు వలన కలిగిన వేడి నిట్టూర్పులతో దిక్కులేనిదిగా చేయబడింది. నా మనస్సు తీవ్ర వేదనతో చేయునది లేక పరితపిస్తున్నది.

**శ్లో॥ నన్వా త్మానం బహు విగణయ న్నాత్మనైవా వలంబే**
**తత్కల్యాణి! త్వమపి నితరాం మాగమః కాతరత్వమ్**
**కస్యై కాంతం సుఖ ముపనతం దుఃఖ మేకాన్తతో వా**
**నీచై ర్గచ్ఛ త్యుపరి చ దశా చక్రనేమిక్రమేణ 49**

ప్ర.ప. : నను = ఓ ప్రేయసీ! బహు = అనేక విధములుగా, విగణయన్ = ఆలోచించుచు, ఆత్మానం = నన్ను, ఆత్మనైవ = స్వయముగానే, అవలంబే = ధరించు (జీవించు) చున్నాను, తత్ = అందువలన, హే కల్యాణి = ఓ సుమంగళీ! త్వం అపి = నీవు కూడ, నితరాం = మిక్కిలి, కాతరత్వం = అధైర్యమును, మాగమః = పొందకుము, కస్య = ఎవనికి, ఏకాంతం = కేవలము, సుఖం = సుఖము, ఉపనతం = ప్రాప్తించినది, ఏకాంతతః = కేవలముగా, దుఃఖంవా = దుఃఖముకాని, ఉపనతం = కలిగినది, దశా = అవస్థ, చక్రనేమి క్రమేణ = బండి చక్రపు అంచు పద్ధతిలో, నీచైః = క్రిందికి, ఉపరిచ = పైకిగూడ, గచ్ఛతి = వెళ్లును.

తా. : ఓ ప్రియురాలా! శాపము పూర్తయిన తరువాత మనము ఏయే విధాల విహరించవలెనో, అనేక విధాల ఊహించుకుంటూ నన్ను నేనే ధైర్యముతో నిలుపు కుంటున్నాను. నా శాపము చివరికి వచ్చింది కనుక నీవు కూడ పిరికితనము పొందకుండా ధైర్యముతో జీవించుము. ప్రపంచంలో ఎవరికి మాత్రం ఎల్లప్పుడు సుఖముకాని, దుఃఖము



కాని కలుగుతుంది? మానవ జీవితదశ చక్రము అంచువలె కిందికి పైకి తిరుగుతుంటుంది కదా!

అలంకారము - అర్థాంతరన్యాసము.

**శ్లో॥ శాపాంతో మే భజగశయనా దుత్థితే శార్ఙ్గపాణౌ**
**శేషా న్మాసా న్గమయ చతురో లోచనే మీలయిత్వా**
**పశ్చా దావాం విరహగణితం తం త మాత్మాభిలాషం**
**నిర్వేక్ష్యావః పరిణతశరచ్చంద్రికాసు క్షపాసు 50**

ప్ర.ప. : శార్ఙ్గపాణౌ = శార్ఙ్గమనే ధనుస్సుచేతి యందు ధరించిన విష్ణువు, భుజగశయనాత్ = ఆదిశేషుడను సర్పశయ్యనుండి, ఉత్థితేసతి = లేచినప్పుడు, మే = నా యొక్క, శాపాంతః = శాపము యొక్క ముగింపు, శేషాన్ = మిగిలినటువంటి, చతురః = నాలుగు, మాసాన్ = నెలలను, లోచనే = కన్నులను, మీలయిత్వా = మూసుకొని, గమయ = గడుపుము, పశ్చాత్ = తరువాత, ఆవాం = మనమిద్దరము, విరహ గణితం = ఎడబాటు కాలంలో ఆలోచించుకున్న, తంతం = ఆయా, ఆత్మాభిలాషం = మనస్సులోని కోరికను, పరి...కాసు; పరిణత = నిండుగా ఉన్న, శరత్ = శరత్కాలపు, చంద్రికాసు = వెన్నెలలు కల, క్షపాసు = రాత్రులయందు, నిర్వేక్ష్యావః = అనుభవించగలము.

తా. : ఓ ప్రేయసీ! శ్రీమహావిష్ణువు ఆదిశేషుని పాన్పుపై నుండి నిద్రలేచిననాడు, అనగా కార్తీక శుద్ధ ఏకాదశి నాడు నా శాపము సమాప్తమవుతుంది. ఇంకా నాలుగు నెలల కాలము మిగిలింది. అంతవరకు కన్నులు మూసుకొని ఎట్లో గడుపుము. ఆ తరువాత మనము కలుసుకున్నప్పుడు ఇంతకాలంగా మనం మనస్సులో సంకల్పించుకున్న కోరికలను శరత్కాలపు నిండు వెన్నెల రాత్రులలో అనుభవించి ఆనందమును పొందుదము.

**శ్లో॥ భూయ శ్చాహ త్వమపి శయనే కంఠలగ్నా పురా మే**
**నిద్రాం గత్వా కిమపి రుదతీ సస్వరం విప్రబుద్ధా**
**సాంతర్హాసం కథిత మసకృ త్పృచ్ఛతశ్చ త్వయా మే**
**దృష్టః స్వప్నే కితవ రమయ న్కామపి త్వం మయేతి. 51**

ప్ర.ప. : భూయశ్చ = ఇంకను, ఆహ = పలికెను (నీపతి), పురా = పూర్వము, శయనే = పడకమీద, మే = నాయొక్క, కంఠలగ్నాపి = కంఠమునకు తగిలి యున్నప్పటికి, త్వం = నీవు, నిద్రాం = నిద్రను, గత్వా = పొంది, కిమపి = ఎందువలననో, సస్వరం = బిగ్గరగా, రుదతీ = ఏడ్చుచు, విప్రబుద్ధా = మేల్కొన్నావు, అసకృత్ = చాలమార్లు,

పృచ్ఛతః = (కారణము) అడుగుచున్న, మే = నాకు, హేకితవ = ఓ ధూర్తుడా! త్వం = నీవు, కామపి = ఎవరో ఒక యువతిని, రమయన్ = ఆనందపరచుచు, మయా = నాచేత, స్వప్నే = కలతో, దృష్టః = చూడబడినావు, ఇతి = అని, త్వయా = నీచేత, సాంతర్హాసం = లోనవ్వుతో గూడ, కథితంచ = ఇట్లుచెప్పబడినది.

తా. : యక్షుడు మేఘుని ద్వారా ఇంకా ఇట్లు చెప్పినాడు. ఓ ప్రేయసీ! పూర్వము ఒకనాడు నీవు శయ్యపై నాకంఠమునాలింగనము చేసుకొని నిద్రించితివి. అప్పుడు కొంతసేపటికి బిగ్గరగా ఏడుస్తూ నిద్రనుండి మేల్కొన్నావు. అప్పుడు నేను అందుకు కారణము పెక్కుసార్లు అడిగిన తరువాత, "ఓ ధూర్తుడా! నీవు మరొక స్త్రీతో సంతోషంగా రమించినట్లు నాకు కలలో కన్పించినావు" అని బదులు చెప్పినావు. దానికి నేను లోలోపల నవ్వుకుంటూ ఈవిధంగా చెప్పుచున్నాను. (తరువాత శ్లోకముతో సంబంధము)

**శ్లో॥ ఏతస్మా న్మాం కుశలిన మభిజ్ఞానదానా ద్విదిత్వా**
**మా కౌలీనా దసితనయనే మయ్య విశ్వాసినీ భూః**
**స్నేహానాహుః కిమపి విరహే ధ్వంసిన స్తే త్వభోగా**
**దిష్టే వస్తు న్యుపచితరసాః ప్రేమరాశీ భవన్తి** **52**

ప్ర.ప. : హే అసితనయనే = నల్లని కన్నులు కల ప్రేయసీ, ఏతస్మాత్ = ఇప్పుడు తెలిపిన, అభిజ్ఞాన దానాత్ = మన ప్రణయ రహస్యమైన గుర్తువలన, మాం = నన్ను, కుశలినం = క్షేమముగా ఉన్నవానినిగా, విదిత్వా = తెలుసుకొని, కౌలీనాత్ = లోకపు వాడుకనుబట్టి, మయి = నాయందు, అవిశ్వాసినీ = నమ్మకములేని దానివిగా, మాభూః = కాకుము, విరహే = ఎడబాటునందు, స్నేహాన్ = అనురాగములను, కిమపి = ఎందువలననో, ధ్వంసినః = నశించు వానినిగా, ఆహుః = చెప్పుదురు, తు = కాని, తే = ఆస్నేహములు, అభోగాత్ = అనుభవములేక పోవుట వలన, ఇష్టే = నచ్చిన, వస్తుని = వస్తువునందు, ఉపచితరసాః = వృద్ధి పొందిన ప్రేమకలవిగా, ప్రేమరాశీభవన్తి = అనురాగపురాశిగా మారును.

తా. : నల్లని కన్నులు కల ప్రియసఖీ! ఈ మేఘుని ద్వారా పంపిన మన ప్రణయ రహస్యాన్ని ఆనవాలుగా గ్రహించి, నేను క్షేమంగా ఉన్నానని తెలిసికొనుము... లోకములోని జనుల ప్రవాదాన్ని బట్టి నన్ను అన్యకాంతలతో రమించేవాణ్ణిగా తలచవద్దు. నాపై నమ్మకముంచుము. వియోగకాలములో అనురాగాలు క్షీణిస్తాయని ఎందువల్ల అంటారో కాని, వాస్తవానికి అది అనుభవశూన్యత వలన ఇష్ట వస్తువుపై అనురాగం వృద్ధి చెంది



ప్రేమరాశిగా ఏర్పడుతుంది. వియోగకాలంలో అనురాగం తగ్గకపోగా అది మరింత వృద్ధిపొందుతుందని భావము.

**శ్లో॥ ఆశ్వాస్యైవం ప్రథమవిరహోదగ్రశోకాం సఖీం తే**
**శైలా దాశు త్రినయనవృషోత్ఖాత కూటా న్నివృత్తః**
**సాభిజ్ఞానం ప్రహితకుశలై స్తద్వచోభి ర్మమాపి**
**ప్రాతఃకుందప్రసవశిథిలం జీవితం ధారయేథాః** **53**

ప్ర.ప. : ప్రథమ...శోకాం; ప్రథమ = మొట్టమొదటి, విరహ = ఎడబాటు చేత, ఉదగ్ర = అధికమైన, శోకాం = దుఃఖము కలిగిన, తే = నీయొక్క, సఖీం = మిత్రురాలైన నా భార్యను, ఏవం = ఈప్రకారము (నేను చెప్పిన విధము)గా, ఆశ్వాస్య = ఓదార్చి, త్రినయ...కూటాత్; త్రినయన = మూడుకన్నులు గల శంకరుని యొక్క వృష = నందిచేత, ఉత్ఖాత = పెకలింపబడిన, కూటాత్ = శిఖరములు కల, శైలాత్ = కైలాస పర్వతము నుండి, ఆశు = తొందరగా, నివృత్తః = మరల బయలుదేరి, సాభి...కుశలైః; సాభిజ్ఞానం = సంకేతముతో కూడ, ప్రహిత = పంపబడిన, కుశలైః = క్షేమ సమాచారముకల, తద్వచోభిః = ఆమె మాటలతో, ప్రాతః...శిథిలం; ప్రాతః = ఉదయకాలపు, కుందప్రసవ = మొల్లపూవు వలె, శిథిలం = వడలిపోయిన, మమ = నాయొక్క, జీవితమపి = ప్రాణమును కూడ, ధారయేథాః = నిలుపుదువుగాక.

తా. : మిత్రమా, ఓ మేఘుమా! మొట్టమొదటి విరహము కనుక ఎక్కువ దుఃఖముతో ఉన్న నా భార్యను, నేను ఇంతకు ముందు చెప్పిన విధముగా, నాక్షేమ సమాచారముతో ఓదార్చుము. తరువాత శివుని నందిచేత త్రవ్వబడిన శిఖరములున్న కైలాస పర్వతము నుండి శీఘ్రముగా వెనుకకు మళ్లుము. నా భార్య చెప్పిన గుర్తుతో కూడ ఆమె కుశల వార్తకల మాటలతో ఉదయ కాలమున మొల్లపూవువలె వాడిపోయిన నా ప్రాణములకు ఊరటకలిగించుము. నాకు ప్రాణదాతవు అగుము.

జీవితమును కుంద పుష్పముతో పోల్చటం వలన ఉపమాలంకారము.

**శ్లో॥ కచ్చి త్సౌమ్య వ్యవసిత మిదం బన్ధుకృత్యం త్వయా మే**
**ప్రత్యాదేశా న్నఖలు భవతో ధీరతాం కల్పయామి**
**నిశ్శబ్దోఽపి ప్రదిశసి జలం యాచిత శ్చాతకేభ్యః**
**ప్రత్యుక్తం హి ప్రణయిషు సతా మీప్సితార్థక్రియైవ** **54**

ప్ర.ప. : హేసౌమ్య! = ఓ మంచి స్వభావం కల మేఘుడా!, ఇదం = ఈ, మే = నాయొక్క, బంధుకృత్యం = మిత్రుని కార్యము, త్వయా = నీచేత, వ్యవసితం కచ్చిత్ = అంగీకరింపబడినదా? ప్రత్యాదేశాత్ = బదులు చెప్పుట వలన, భవతః = నీ యొక్క ధీరతాం = ధైర్యమును, నకల్పయామి ఖలు = సమర్థించనుకదా! యాచితః సన్ = యాచింపబడినవాడవై, నిశ్శబ్దోఽపి = ధ్వనించనివాడవైనను (ఇచ్చెదనని ప్రతిజ్ఞ చేయకుండినా), చాతకేభ్యః = వానకోయిలల కొరకు, జలం = నీటిని, ప్రదిశసి = ఇచ్చుచున్నావు, హి = ఎందుకనగా, సతాం = మంచివారికి, ప్రణయిషు = అనురాగము కలవారి యందు, ఈప్సితార్థక్రియాఏవ = వారుకోరిన ప్రయోజనము నెరవేర్చుటే, ప్రత్యుక్తం = బదులు పలుకుట అగును.

తా. : మంచి స్వభావముకల మేఘుడా! నేను కోరిన బంధు కార్యము, అనగా నా సందేశ వార్తను అలకానగరంలోని నా భార్యకు అందజేయుటను నీవు ఒప్పుకున్నట్లేనా? నీవు దీనిని తిరస్కరిస్తావని నేను నీవిషయంలో సందేహించను... చాతక పక్షులు నిన్ను యాచింపగానే వాటికి నీవు నీరందిస్తున్నావు కదా! నోటితో అంగీకారము తెలుపకున్నా, సజ్జనులు, బంధువులు కోరిన కార్యము నెరవేర్చుట అనే క్రియ ద్వారానే బదులు చెప్తుతారు.

అలంకారము : అర్థాంతరన్యాసము.

శ్లో॥ **ఏతత్కృత్వా ప్రియ మనుచితం ప్రార్థనాదాత్మనో మే**
**సౌహార్ద్రా ద్వా విధుర ఇతి వా మయ్య నుక్రోశబుద్ధ్యా**
**ఇష్టాన్దేశాన్ జలద విచర ప్రావృషా సంభృతశ్రీ**
**ర్మాభూ దేవం క్షణమపి చ తే విద్యుతా విప్రయోగః** 55

ప్ర.ప. : హే జలద = ఓ మేఘమా! సౌహార్ద్రాద్వా = స్నేహభావం వలన కాని, విధుర ఇతి వా = భార్యనెడ బాసి ఉన్నాడని కాని, మయి = నాయందు, అనుక్రోశ బుద్ధ్యావా = దయాస్వభావముతో కాని, ఆత్మనః = నీకు, అనుచితం అపి = తగనిదైనప్పటికి, మే = నాకు, ప్రార్థనాత్ = ప్రార్థనవలన, ప్రియం = ఇష్టమైన, ఏతత్ = ఈ దూతకార్యమును, కృత్వా = చేసి, ప్రావృషా = వర్ష ఋతువుతో, సంభృతశ్రీః = వృద్ధిపొందిన కాంతికలవాడవై, ఇష్టాన్ = కోరుకున్న, దేశాన్ = ప్రదేశములను, విచర = సంచరించుము, క్షణ మపి = క్షణకాలము కూడ, తే = నీకు, విద్యుతా = మెరుపుతీగతో, విప్రయోగః = ఎడబాటు, మాభూత్ = కలుగకుండునుగాక.

తా. : ఓ మేఘమా! నేను చెప్పిన ఈ దూతకార్యము నీకు తగనిది కాకపోయినా, నా ప్రార్థనవలన కాని, భార్యనెడబాసి ఉన్నందున నాపై దయతో కాని ఈ సహాయము



చేయుము. ఆ తరువాత వర్షాకాలపు జలసంపదతో శోభను పొంది నీకు నచ్చిన ప్రదేశాలలో స్వేచ్ఛగా సంచరింపుము. నీ ప్రియురాలైన విద్యుల్లత (మెరుపుతీగ)తో నీకు ఎప్పుడు కూడ వియోగము కలుగకుండుగాక. నావలె నీకు ప్రియావిరహము కలుగక సుఖముగా జీవించుము అని యక్షుని శుభకామన.

శ్లో॥ **తత్సందేశం జలధరవరో దివ్యవాచాఽచచక్షే**
**ప్రాణాం స్తస్యా జనహితరవో రక్షితుం యక్షవధ్వాః**
**ప్రాప్యోదన్తం ప్రముదితమనాః సాపి తస్థౌ స్వభర్తుః**
**కేషాం న స్యాదభిమతఫలా ప్రార్థనా హ్యుత్తమానామ్** 56

ప్ర.ప. : తత్సందేశం = యక్షుడు చెప్పిన ఆసందేశమును, జలధరవరః = శ్రేష్ఠమైన మేఘుడు, తస్యాః = ఆ, యక్షవధ్వాః = యక్షుని భార్యయొక్క, ప్రాణాన్ = ప్రాణములను, రక్షితుం = కాపాడుట కొరకు, జనహితరవః = జనులకింపైన ధ్వనికలవాడై, దివ్యవాచా = దేవతల భాషతో, ఆచచక్షే = చెప్పెను, సాఅపి = ఆ యక్షుని భార్యకూడ, స్వభర్తుః = తన భర్తయొక్క, ఉదంతం = కుశల వృత్తాంతమును, ప్రాప్య = పొంది, ప్రముదిత మనాః = సంతోషించిన మనస్సు కలదై, తస్థౌ = నిలిచి ఉండెను, ఉత్తమానాం = ఉత్తములైన, కేషాం = ఎవరియొక్క, ప్రార్థనా = కోరిక, అభిమతఫలా = కోరుకున్న ఫలము కలది, నస్యాత్ = కాకుండును?

తా. : శ్రేష్ఠమైన ఆమేఘుడు యక్షుడు పంపిన సందేశవార్తను శ్రావ్యమైన ధ్వనితో దేవతల భాషలో యక్షపత్నికి వినిపించాడు. అది ఆమె ప్రాణములు నిలుచుటకాధారమైంది. యక్షపత్ని కూడ తన భర్త యొక్క క్షేమ సమాచారము విని, చాలా సంతోషించి పతిరాకకై నిరీక్షిస్తూ నిలిచి ఉండెను.

ఉత్తమజనుల ప్రార్థన ఎవరి విషయంలో సఫలం కాకుండా ఉంటుంది?

సామాన్యము చేత విశేషమును సమర్థించినందున అర్థాంతరన్యాసాలంకారము.

విశేషమనగా ఒక వ్యక్తి లేక ఒక ఘటనకు సంబంధించినది. సామాన్యమనగా అన్నిటికి సముదాయపరంగా సంబంధించినది.

శ్లో॥ **శ్రుత్వా వార్తాం జలదకథితాం తాం ధనేశోఽపి సద్యః**
**శాపస్యాన్తం సదయహృదయః సన్నిధాయా స్తకోపః**
**సంయోజ్యైతౌ విగళితశుచౌ దంపతీ హృష్టచిత్తౌ**
**భోగా నిష్టా నభిమతసుఖా న్ప్రాపయామాస భూయః** 57

ప్ర.ప. : ధనేశః అపి = సంపదల కధిపతి అయిన కుబేరుడు కూడ, జలదకథితాం = మేఘుని చేత చెప్పబడిన, తాం = ఆ, వార్తాం = యక్షుని విరహ వృత్తాంతమును, శ్రుత్వా = విని, సదయ హృదయః = దయతో కూడిన మనస్సు కలవాడై, అస్తకోపః = నశించిన కోపము కలవాడై, సద్యః = వెంటనే, శాపస్య = శాపము యొక్క, అంతం = చివరి గడువును, సన్నిధాయ = దగ్గరికి రప్పించి, విగళితశుచౌ = తొలగిపోయిన శోకము కల, ఏతౌ = ఈ, దంపతీ = భార్యాభర్తలను, సంయోజ్య = కలిపి, భూయః = మరల, ఇష్టాన్ = కోరుకున్న, అభిమత సుఖాన్ = నచ్చిన సుఖముకల, భోగాన్ = ఆనందానుభవములను, ప్రాపయామాస = పొందింపజేసెను.

తా. : మేఘుడు యక్షపత్నికి వినిపించిన యక్షుని సందేశాన్ని, అతని విరహ దశ దైన్యవృత్తాంతాన్ని యక్షులరాజైన కుబేరుడు కూడ విన్నాడు. వెంటనే అతని మనస్సు దయతో నిండి, యక్షునిపైన కోపము తొలగిపోయింది. యక్షుని శాపపు సమయాన్ని తగ్గించి ఆ దంపతులను కలిపినాడు. ఆ విధంగా వారి మనస్సులు సంతోషించే విధంగా;వారు తమకు నచ్చిన విధంగా, కోరుకున్న సుఖానుభవాలు పొంది చింతారహితులై జీవితం గడిపే అవకాశం కల్పించినాడు. కాళిదాసు చివరకు యక్ష దంపతులకు పునస్సమాగమం కల్పించి కావ్యాన్ని సుఖాంతంగా ముగించినాడు.

**మహాకవి శ్రీకాళిదాస విరచితమైన**
**మేఘ సందేశ కావ్యము రెండవ సర్గ సమాప్తము.**

# ముందుమాట

సంస్కృతవాఙ్మయమున గద్యరచనకు కూడా పద్య కావ్యాలతో సమాన గౌరవాన్ని కల్గించినవాడు **బాణభట్టారకుడు. హర్షచరిత్ర** మరియు **కాదంబరీ**, అనునవి అతడు రచించిన గద్య కావ్యాలు. అందు హర్షచరిత్ర ఆతనికి ఆశ్రయుడైన శ్రీహర్షదేవుని జీవిత చరిత్ర. రెండవది అయిన కాదంబరీ చాలా భాగం కల్పితమైనది. గుణాఢ్యుని బృహత్కథామంజరి యందలి మకరిందికా వృత్తాంతమునకును ఇందలి కథకును కొంతపోలిక ఉన్నమాట సత్యమే. అయినను ఇందు బాణుని ఉపజ్ఞయే హెచ్చు.

అద్భుతమైన కథా సంవిధానము చేతను ప్రౌఢమనోహరమైన భావసంపదచేతను, లలిత గంభీరపదప్రయోగంచేతను, సహజ రమ్యములైన సంభాషణాదులచేతను, అనన్య సాధ్యములైన వర్ణనా విశేషములచేతను ఈ కథాకావ్యం సంస్కృత గద్యకావ్యములందే కాక సర్వకావ్య జాలమునందును ప్రశస్తమై ప్రసిద్ధిగాంచినదిః- **బాణోచ్ఛిష్టం జగత్సర్వమ్. కాదంబరీ రసజ్ఞానామాహారోఽపి న రోచతే,** అను నానుడులు ఆ కవిశేఖరుకునికి ఆ కావ్యరత్నమునకును లోకమున గల గౌరవమునకు తార్కాణములు.

బాణుడు క్రీ॥శ॥ 7వ శతాబ్దంలో జీవించెను. అతడు శోణానదీ తీరమందలి ప్రీతి పృథుకూటాగ్రహారమున జీవించెననియు మొదట శ్రీహర్షునిచే సమ్మానితుడు కాకపోయినను తర్వాత ఆతని అనుగ్రహానికి పాత్రమై అఖండ సత్కారములు అందెననియు హర్షచరిత్ర పూర్వభాగమున తెలియుచున్నది.

**బాణుడు** కాదంబరీయందలి పూర్వభాగమును మాత్రమే రచించి దివంగతుడు కాగా అతని పుత్రుడు **భూషణభట్టు** దానిని గ్రహించి తండ్రి ప్రతిభకు ఎందును లోపమురాని విధంగా ఉత్తరభాగమును కూడా పూర్తిచేసి, తాను పితృఋణ విముక్తుడై లోకమును ఋణగ్రస్తము కావించెనని తెలియుచున్నది. తండ్రికొడుకులు సమాన ప్రతిభులు అగుట ఇట్లు ఎప్పుడో కదాచిత్కముగా మాత్రమే సంభవించుచుండును.



## బాణభట్టు యొక్క వంశానుక్రమణిక




పార్వతీపరిణయమను నాటకమును, చండీశతకమును కూడా బాణుడు రచించెనని చెప్పుదురు. కాని అతని కీర్తి లత అవలంబన వృక్షాలు ప్రధానంగా కాదంబరీ, హర్షచరిత్రాలే.

మదిర–చిత్రరథ గంధర్వుల కూతురైన కాదంబరిని నాయికగా చేసుకొని బాణుడు ఈ కావ్యాన్ని వ్రాసి **కాదంబరీ** అను పేరు పెట్టినాడు. మహాశ్వేత ఉపనాయిక, కాదంబరిసఖి, మహాశ్వేత తండ్రి హంసుడు, గౌరి–మహాశ్వేత తల్లి, చంద్రాపీడుడు నాయకుడు, విలాసవతీ తారాపీడుల పుత్రుడు పుండరీకుడు ఉపనాయకుడు శ్వేతకేతు పుత్రుడు, కపిఞ్జలుడు–ఋషి కుమారుడు పుండరీకుని మిత్రుడు శుకనాసుడు, తారాపీడుని మంత్రి అతని భార్య మనోరమ వీరి పుత్రుడు వైశంపాయనుడు పుండరీకుని అవతారము చంద్రాపీడుని మిత్రుడు.

ఇంద్రాయుధము చంద్రాపీడుని అశ్వము (కపిఞ్జలుని అవతారము) పత్రలేఖ చంద్రాపీడుని దాసి(రోహిణి అవతారము) మదలేఖ కాదంబరి దాసి, తరళిక–మహాశ్వేత దాసి, కేయూరకుడు కాదంబరీ వీణావాహకుడు– మేఘనాథుడు–తారాపీడుని సేనాని.

శుకము వైశంపాయనుని అవతారము. జాబాలి మహర్షి శ్వేతకేతు మహర్షి హరీతుడు జాబాలిపుత్రుడు చండాలకన్య – పుండరీకుని తల్లి అయిన లక్ష్మీ రూపాంతరము శూద్రకుడు ఉజ్జయినిరాజు చంద్రాపీడుని అవతారము.

## జన్మల వివరము

| | | |
|---|---|---|
| చంద్రుడు | - | చంద్రాపీడుడు, శూద్రకుడు |
| పుండరీకుడు | - | వైశంపాయనుడు, శుకము |
| కపిఞ్జలుడు | - | ఇంద్రాయుధము |
| రోహిణి | - | పత్రలేఖ |
| చంద్రాపీడుడు | - | కాదంబరిని, పుండరీకుడు–మహాశ్వేతను వివాహ మాడుతారు. |

కాదంబరియందలి కథ చాల మనోహరమైనది. కానీ పాత్రలు జన్మాంతరము వృత్తాంతాలతో కూడియుండుట చేత కొంచెము క్లిష్టముగా ఉండును. దీర్ఘసుదీర్ఘములైన వర్ణనములును, ప్రౌఢ గంభీరములైన సమాసములను, అక్లిష్టతకు కొంత ఆధిక్యమును ఆపాదించినది -- "ప్రాగల్భ్యమధికమాప్తుం వాణీబాణో బభూవేతి అను గోవర్ధనాచార్యుల వాక్యము అతిశయోక్తి అయినప్పటికిని చదువు వారలకు విశ్వసనీయముగానే తోచును.

బాణుని కాదంబరీ కథను సుగ్రహము కావించుటకై కొందరు మహనీయులు వర్ణనాదులను సంక్షేపించి దానికి సంగ్రహరూపములను వెలయించియుండిరి.



| | | | |
|---|---|---|---|
| 1. | కాదంబరీ | బాణభట్టు | వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, వావిళ్ళ ప్రెస్ మదరాస్ - 1951 |
| 2. | కాదంబరీ | బాణభట్టు | (విద్వాన్ విశ్వం - తెలుగు అనువాదం ) సేకరణ : శ్రీరామవర్మల శ్రీశైలం, మల్కాజగిరి, హైదరాబాద్. |
| 3. | కాదంబరీ - కావ్య సుషమ | డా॥ కమల, | 1981, హైదరాబాద్ |
| 4. | కాదంబరీ శుకనాసోపదేశః- | బాణభట్టః | చౌఖమ్బా విద్యా భవన్ వారాణసీ - 2014. |
| 5. | శుకనాసోపదేశము | శ్రీ కె.వి.ఎస్. ఆచార్యులు, | ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాదు 1988. |
| 6. | కాదంబరీ కళ్యాణము | నరసింహకవి | (కాకతీయ యుగము) ఆంధ్రానువాదము - సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి. |
| 7. | కాదంబరీ | బాణకవి | కె.యస్.శర్మ భారతి 1929 జూన్. |
| 8. | కాదంబరీ కావ్య మధుర సందేశము | | భట్ట బాణుడు సాహిత్య వాల్లభ్యం-1968. |
| 9. | బాణభట్టారకుని సూక్తి వైచిత్రి | డా॥ యన్.వి. జోగారావు | భారతి 1962 మార్చి. |
| 10. | శుకనాసోపదేశము | ఆర్.వి.కృష్ణమాచార్యులు | కాదంబరీ సంగ్రహము |

బాణమహాకవియొక్క కాదంబరి యందలి శుకనాసోపదేశాన్ని సులభ పదాలతో, ఆంధ్ర లోకానికి అందించుటయే నా ఈ అనువాదానికి ప్రధాన ప్రయోజనము. ఇది బాణుని కథా కథనమున అభిరుచి కల్గించి క్రమంగా పఠితల మానసమును మూల గ్రంథము వంకకు మరల్పజాలునేని నా ప్రయత్నము ఫలమంత మైనదని సంతోషింతును.

కాదంబరీ రసభరేణ సమస్త ఏవ మత్తో
న కించిదపి చేతయతే జనో౽యమ్,
భీతో౽స్మి యన్న రసవర్ణవివర్జితేన
తచ్ఛేషమాత్మ వచసా౽ప్యను సందధానః ॥ (కా. ఉ 7)

నాకృషిని ప్రోత్సహించి అనురాగంతో ఆశీర్వదించిన అస్మద్గురువర్యులు, ఆచార్యవర్యులైన శ్రీ బూరుగడ్డ నరసింహాచార్యులుగారికి నా భక్తిపూర్వక వందనములు.

నా ఈ రచన ముద్రణకు అనుకూలమైన వాతావరణాన్ని కూర్చి నా కృషికి విశేష ప్రోత్సాహమిచ్చిన లాలాగూడ రైల్వేమిక్స్‌డ్ హైస్కూల్ ప్రధాన అధ్యాపకులు (నాన్‌గెజిటెడ్) మధురమనస్వియైన డా॥ శ్రీ దీవి శ్రీనివాసాచార్యులు వారికి నా మనస్సుమాంజలులు.

ఈ గ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయకురాలైన ప్రేరకులైన స్నేహశీలి, సౌజన్యమూర్తి, ఆంగ్లోపన్యాసకులు, సంస్కృతాభి మానులైన శ్రీమతి డా॥ నిరీష గారికి నా శుభకామనలు.

అనతికాలంలోనే గ్రంథాన్ని అత్యంత నిర్దుష్టంగా సుందరంగా డిటిపి చేసినటువంటి సమంతగ్రాఫిక్స్ వారికి, గ్రంథమును సర్వాంగ సుందరముగా ముద్రించి యిచ్చిన కళాంజలి గ్రాఫిక్స్ వారికి నా నమోవాకాలు.

బుధజన విధేయుడు
**లంక వేఙ్కట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ**



# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | కాదంబరీ మంగళమ్ | v |
| 2. | ముందుమాట | vi |
| 3. | కాదంబరీ అన్తర్గత పాత్ర పరిచయము | xii |
| 4. | సంస్కృతమూలము | 1 |
| 5. | సంస్కృతాంధ్రానువాదము | 8 |
| 6. | శుకనాసోపదేశము | 22 |
| 7. | సందర్భవాక్యములు | 33 |
| 8. | ప్రశ్నలు | 36 |

## కాదంబరీఅన్తర్గత పాత్ర పరిచయము

1. శూద్రకుడు - విదిశానగరియొక్కరాజు, చంద్రావతారము, చంద్రాపీడుడు.
2. వైశంపాయనుడు - (శుకుడు) శ్వేతకేతుపుత్రుడు - పుండరీకుడు - శుకనాసపుత్రుడు - వైశంపాయనుడు.
3. కపిఞ్జలుడు - పుండరీకుని చెలికాడు, చంద్రాపీడుని వాహనము అశ్వము.
4. పత్రలేఖ - రోహిణ్యానియొక్క అవతారం, చంద్రాపీడుని తాంబూలకరంక వాహిని.
5. తారాపీడుడు - ఉజ్జయినికి రాజు, చంద్రాపీడుని యొక్క తండ్రి.
6. చంద్రాపీడుడు - తారాపీడుని పుత్రుడు, కాదంబరియొక్క భర్త, శూద్రకరాజు.
7. విలాసవతి - తారాపీడుని భార్య, చంద్రాపీడుని తల్లి.
8. శుకనాసుడు - తారాపీడుని మంత్రి, వైశంపాయనునితండ్రి
9. మనోరమ - శుకనాసుని భార్య, వైశంపాయనుని తల్లి
10. మహాశ్వేత-గన్ధర్వరాజైన హంసయొక్క పుత్రీ, పుండరీకుని (వైశంపాయనుని) భార్య
11. కాదంబరి - గన్ధర్వరాజైన చిత్రరథుని బిడ్డ, చంద్రాపీడుని భార్య
12. తరలిక - మహాశ్వేతయొక్క చెలికత్తె, తాంబూలకరంకవాహిని
13. మదలేఖ - కాదంబరియొక్క ప్రియ చెలికత్తె
14. కేయూరకుడు - కాదంబరియొక్క అప్త సేవకుడు
15. శ్వేతకేతువు - మహర్షి, పుండరీకుని తండ్రి
16. చండాల కన్యక - లక్ష్మీదేవి, పుండరీకుని తల్లి
17. మేఘనాధుడు - చంద్రాపీడుని సేవకుడు
18. జాబాలి - మహర్షి, హారీతుని తండ్రి

# बाणभट्टः

# कादम्बरी-शुकनासोपदेशः

(गद्यं कवीनां निकषं वदन्तीति आभाणकं प्रसिद्धम् । गद्यलेखनं कष्टसाध्यमिति तस्य आभाणकस्य अभिप्रायः । अतः संस्कृतगद्यकवयः अतीव विरलाः । तेषु बाणभट्टः संस्कृतगद्यलेखने नितरां दक्षः । अयं हर्षवर्धनस्य आस्थाने कान्यकुब्जे आसीत् । अस्य समयः क्रिस्तोः षष्ठशतकम्। अनेन **हर्षचरितम्, कादम्बरी, चण्डीशतकमिति** ग्रन्थत्रयं विरचितम् । तत्र कादम्बरी प्रौढा सरसा कविता च भवति । 'कादम्बरीरसास्वादे आहारोऽपि न रोचते' इति आभाणकं प्रसिद्धम् । विदिशां राजधानीकृत्य शूद्रकः राज्यं करोति स्म । तस्य राजसभायां काचन चण्डालकन्यका शुकनासनामकं शुकमुपायनीकृत्य गतवती । अयं शुकः स्वकीयं जन्मवृत्तान्तं मानुषवाचा विवृणोति यथा -

उज्जयिनीं राजधानीकृत्य राजा तारापीडः महीं प्रशास्ति स्म । तस्य मन्त्री भवति शुकनासः । तारापीडस्य चिराय पुत्राः नासन् । अन्ततो गत्वा चन्द्रापीडनामकः पुत्रः अजायत । स च उपनीतः गुरुकुलं प्रेषितः । स च सम्यगधीत्य यदा राजमन्दिरमागतः तदा अयं यौवराज्यपदव्यामारोपितः । तदा मन्त्री शुकनासः धनमदस्य राज्यमदस्य यौवनमदस्य च कारणेन युवानः कथं भ्रष्टा भवन्तीति सूचयन्नुपदिशति। स एव शुकनासोपदेशः । स चायं भागः पाठ्यांशरूपेण निर्धारितः। अत्र गद्यांशं प्रतिपदं सम्यगनुपठनीयम्। )

**एवं समतिक्रामत्सु केषुचित् दिवसेषु राजा चन्द्रापीडस्य यौवराज्याभिषेकं चिकीर्षुः प्रतीहारानुपकरणसम्भारसङ्ग्रहार्थमादिदेश : समुपस्थित यौवराज्याभिषेकञ्च तं कदाचिद्दर्शनार्थमागतमारूढविनयमपि विनीततरं कर्त्तुमिच्छन् शुकनासः सविस्तरमुवाच ।**

**'तात ! चन्द्रापीड । विदितवेदितव्यस्य अधीतसर्वशास्त्रस्य ते नाल्पमप्युपदेष्टव्यमस्ति। केवलञ्च. निसर्गत एव अभानुभेद्यमरत्नालोकच्छेद्यमप्रदीपप्रभापनेयमतिगहनं तमो यौवनप्रभवम् । अपरिणामोपशमो**

# కాదంబరీ

# శుకనాసోపదేశః

మూ॥ ఏవం సమతిక్రామత్సు కేషుచిత్ దివసేషు రాజా చంద్రాపీడస్య యౌవరాజ్యాభిషేకం చికీర్షుః, ప్రతీహారాన్ ఉపకరణసమ్భారసంగ్రహార్థమ్ ఆదిదేశ. సముపస్థితయౌవరాజ్యాభిషేకం చ తం కదాచిద్దర్శనార్థమాగతమ్ ఆరూఢ వినయమపి వినీతతరం కర్తుమిచ్ఛన్ శుకనాసః సవిస్తరమువాచ.

తా॥ ఇట్లు కొన్ని దినములు గడువగా రాజు, చంద్రాపీడునకు యువరాజ పట్టాభిషేకము చేయగోరి ఏర్పాట్లకు ఆజ్ఞాపించెను. ఒకమారు తనవద్దకు వచ్చిన చంద్రాపీడునితో శుకనాసుడు ఉపదేశ వాక్యములను ఇట్లు చెప్పెను !

**"తాత ! చంద్రాపీడ! విదితవేదితవ్యస్యాధీత సర్వశాస్త్రస్య తే నాల్పమపి ఉపదేష్టవ్యమస్తి. కేవలం చ నిసర్గత ఏవ అభానుభేద్యమ్, అరత్నాలోక చ్ఛేద్యమ్ అప్రదీపప్రభాపనేయమ్ అతిగహనం తమో యౌవనప్రభవమ్, అపరిణామోపశమో దారుణో లక్ష్మీమదః. కష్టమనంజనవర్తిసాధ్యమపరమైశ్వర్య తిమిరాన్ధత్వమ్, అశిశిరోపచార హార్యోऽతితీవ్రోదర్పదాహజ్వరోష్మా, సతతమ మూలమన్త్రశమ్యః విషమో విషయవిషాస్వాదమోహః. నిత్యమస్నాన శౌచబధ్యో బలవాన్ రాగమలావలేపః. అజస్రమక్షపావసానప్రబోధా, ఘోరా చ రాజ్యసుఖసన్నిపాతనిద్రా భవతి, ఇత్యతః విస్తరేణాభిధీయసే.**

"కుమార! చంద్రాపీడ! అన్ని శాస్త్రములు చదివి విషయములను తెలిసికొన్న నీకు చెప్పవలసినది లేదు. కాని యౌవనమువలన కలుగు అజ్ఞానాంధకారము సూర్యునిచేత, రత్నకాంతులచేత తొలగింపరానిది. సంపదవలన కలిగిన గర్వము నివారింపబడదు. ఐశ్వర్యమువలన కలిగిన గ్రుడ్డితనము కాటుక చేత కూడ నిర్మూలింపబడదు. అహంకారపు వేడిమి శీతలోపచారములవలన తొలగదు. సంసారసుఖమునందలి మోహము విషమువలె మంత్రముచేత నివారింపబడదు. కోరికల మాలిన్యము స్నానము చేయుటచేత కడిగివేయబడదు. రాజ్యసుఖములవలన కలిగెడు మైకము తెల్లవారినను విడిచిపోదు. అందువలన కొన్ని మాటలు చెప్పదలచినాను.



**గర్భేశ్వరత్వమ్ అభినవయౌవనత్వం, అప్రతిమరూపత్వం అమానుష శక్తిత్వం చేతి మహతీయం ఖల్వనర్థపరంపరా, సర్వావినయానామేకైకమ్ అప్యేషా మాయతనం, కిముత సమవాయః. యౌవనారమ్భే చ, ప్రాయః శాస్త్రజలప్రక్షాళన నిర్మలాపి కాలుష్య ముపయాతి బుద్ధిః, అనుజ్ఝిత ధవళతాపిసరాగైవ భవతి యూనాం దృష్టిః, అపహరతి చ వాత్యేవ శుష్కపత్రం సముద్భూతరజో భ్రాంతిః అతిదూర మాత్మేచ్ఛయా యౌవనసమయే పురుషం ప్రకృతిః. ఇంద్రియహరిణ హారిణీ చ సతతమతిదురన్తేయముపభోగమృగతృష్ణికా, నవయౌవనకషాయి తాత్మనశ్చ సలిలానీవ తాన్యేవ విషయస్వరూపాణ్యా స్వాద్యమానాని మధురతరాణి ఆపతంతి మనసః. నాశయతి చ దిఙ్మోహ ఇవ ఉన్మార్గప్రవర్తకః పురుష మత్యాసఙ్గో విషయేషు, భవాదృశా ఏవ భవన్తి భాజనాని ఉపదేశానామ్.**

పుట్టుకతోవచ్చిన అధికారము, నూతన యౌవనము, సాటిలేని అందము, అసాధారణమైన బలము, అనునవి అనర్థమును కలిగించును. వీనిలో ఒక్కొక్కటి అన్ని అనర్థములకు మూలము. అన్ని కలిసినచో ఇక చెప్పవలసినదేమి ? యవ్వనము మొదట శాస్త్రములను నీటితో కడుగబడినను బుద్ధిమాలిన్యమును పొందును. తెల్లదనమును విడువకనే రాగమును పొందును. పెనుగాలి, ఎండిన ఆకును వలె రజోగుణముయొక్క భ్రమను కలిగించి, పురుషుని, ప్రకృతి యవ్వనకాలమున దూరము కొనిపోవును. సుఖాభిలాషయను ఎండమావి ఇంద్రియములను జింకలను ఎల్లప్పుడు ఆకర్షించును. యౌవనముచేత వగరైన స్వభావము కలవానికి నీళ్ళవలె కోరికలు తీయగా అనిపించును. విషయము లందు ఎక్కువ కోరిక మార్గము తప్పి నడిపించును. నీవంటివారే ఉపదేశమునకు యోగ్యులు.

**అపగతమలే హి, మనసి స్ఫటికమణావివ రజనికరగభస్తయో విశంతి సుఖముపదేశగుణాః. గురువచనమమలమపి సలిలమివ మహదుపజనయతి శ్రవణస్థితం శూలమభవ్యస్య, ఇతరస్య తు కరిణ ఇవ శంఖాభరణం ఆననశోభా సముదయ మధికతర ముపజనయతి, హరతి చ సకలమతిమలినమపి అంధకార మివ దోషజాతం ప్రదోషసమయనిశాకర ఇవ. గురూపదేశః ప్రశమహేతుః వయః పరిణామ ఇవ పలితరూపేణ శిరసిజజాలమమలీకుర్వన్ గుణరూపేణ తదేవ పరిణమ(య)తి, అయమేవ చానాస్వాదిత విషయరసస్య తే కాల ఉపదేశస్య, కుసుమశర – శరప్రహారజర్జరితే హి హృదయే జలమివగళతి ఉపదిష్టం,**

**అకారణం చ భవతి దుష్ప్రకృతేరన్వయః శ్రుతం వా వినయస్య, చన్దన ప్రభవో న దహతి కిమనలః ? కిం వా ప్రశమ హేతునాపి న ప్రచండతరో భవతి బడబానలో వారిణా? గురూపదేశశ్చ నామ పురుషాణామఖిలమల ప్రక్షాళనక్షమ మజలం స్నానం, అనుపజాతపలితాదివైరూప్యమజరం వృద్ధత్వం, అనారోపిత మేదో దోషం గురూకరణం. అసువర్ణ విరచన మగ్రామ్యం కర్ణాభరణమ్.**

స్ఫటికమువలె నిర్మలమైన మనస్సులో సూర్య కిరణములవలె ఉపదేశములు సులభంగా ప్రవేశించును. పెద్దల మాట స్వచ్ఛమైనను అయోగ్యునకు చెవికి కటువుగా నుండును. మంచివానికి శంఖాభరణము వలె ముఖమునకు శోభను కలిగించును. సాయంకాలపు చంద్రునివలె గురువుల ఉపదేశము చీకటివంటి దోషములను తొలగించును. వయసు యొక్క మార్పు శాంత గుణమునకు హేతువైనట్లు తలవెంట్రుకలను తెల్లబరుచుచూ తెల్లని గుణములుగా పరిణమించును. విషయసుఖములను అనుభవింపని నీకు ఉపదేశయోగ్య సమయము ఇదియే. మన్మథుని బాణములచే శిథిలమైన మనస్సులో ఉపదేశము జారిపోవును.

చెడు స్వభావము కలవాని వంశము, విద్య కూడా వినయమునకు కారణము కాదు. చందన వృక్షము నుండి పుట్టిన అగ్ని కాల్చదా ? బడబాగ్ని చల్లదనమునకు కారణమైన నీటిచేత తీవ్రము కాదా ? గురువుల ఉపదేశము మనుష్యులకు అన్ని మలినములను పోగొట్టు నీరు లేని స్నానము, తలనెరియుట మొదలగు మార్పులు లేని పెద్దతనము, క్రొవ్వులో వికారము కల్గించని గురుత్వము, బంగారంతో చేయబడని కర్ణాభరణము.

**అతీతజ్యోతిరాలోకః నోద్వేగకరః ప్రజాగరః, విశేషేణ తు రాజ్ఞాం, విరళా హి తేషాముపదేష్టారః. ప్రతిశబ్దక ఇవ రాజవచనమనుగచ్ఛతి జనోభయాత్, ఉద్దామదర్పశ్వయ థుస్థగిత శ్రవణవివరాశ్చ ఉపదిశ్యమానమపి, తే న శృణ్వంతి శృణ్వంతోఽపి చ గజనిమీలితేన అవధీరయంతః ఖేదయంతి హితోపదేశదాయినో గురూన్, అహంకార దాహ జ్వర-మూర్ఛాంధకారితా విహ్వలా హి రాజప్రకృతిః అలీకాభిమానోన్మదకారీణి ధనాని, రాజ్యవిషవికార తంద్రీప్రదా రాజలక్ష్మీః. ఆలోకయతు తావత్కల్యాణాభినివేశీ లక్ష్మీమ్ ఏవ ప్రథమమ్.**

తేజోమండలములేని వెలుగు, వికారము కలిగించని మెలకువ,



ప్రత్యేకంగా రాజులకు ఇవి ముఖ్యము, వారికి ఉపదేశించువారు అరుదు. భయమువలన రాజు మాటనే ఇతర జనులు ఆమోదింతురు. తీవ్రమైన గర్వంచే చెవులు మూసుకొని ఉపదేశములను వారువినరు. ఒకవేళ వినబడినను చెప్పినవారిని బాధింతురు. రాజుల స్వభావము అహంకారపు వేడిజ్వరంతో మూర్ఛపొంది యుండును. ధనములు కృత్రిమమైన అభిమానమును, ఉన్మాదమును కలిగించును. రాజ్యసంపద విషమువలె వికారమును కలిగించును. ముందుగా మంచి గుణములను కోరువాడవై లక్ష్మిని గమనించుము.

**ఇయం హి సుభటఖడ్గమండలోత్పల వన విభ్రమభ్రమరీ లక్ష్మీః క్షీరసాగరాత్పారిజాత పల్లవేభ్యో రాగమిందు శకలాత్ ఏకాంతవక్రతామ్, ఉచ్చైః శ్రవసః చంచలతాం, కాలకూటాత్ మోహశక్తిమ్, మదిరాయా మదం, కౌస్తుభమణే రతినైష్ఠుర్యం ఇత్యేతాని సహవాసపరిచయవశాద్విరహవినోద చిహ్నాని గృహీత్వేవోద్గతా.**

ఈమె మంచి యోధుల ఖడ్గముల యందు తిరుగునది. పాలసముద్రమునుండి పారిజాతపు చిగుళ్ళ నుండి రాగమును, చంద్రకళనుండి వంకరతనమును, ఉచ్చై శ్రవము నుండి చంచలత్వమును, కాలకూటము నుండి మోహింపజేయు శక్తిని, మద్యమునందు మైకమును కౌస్తుభము నుండి కఠినత్వమును, సహవాసమువలన గ్రహించి పుట్టినదివలె తోచును.

న హ్యేవంవిధ మపరమపరిచితమ్ ఇహ జగతి కించిదస్తి, యథేయ మనార్యాలబ్ధాఽపి ఖలు దుఃఖేన పరిపాల్యతే, దృఢగుణపాశసందాననిష్పందీ కృతాఽపి నశ్యతి, ఉద్దామ-దర్ప భటసహస్రోల్లాసితాసిలతా పంజరవిధృతాఽపి అపక్రామతి, మదజలదుర్దినాంధకార గజఘటితఘనఘటాపరిపాలితాఽపి ప్రపలాయతే న పరిచయం రక్షతి, నాభిజనమీక్షతే న రూపమాలోకయతేన కులక్రమ మనువర్తతే,న శీలం పశ్యతి, న వైదగ్ధ్యం గణయతి, న శ్రుతమాకర్ణయతి, న ధర్మమనురుధ్యతే, న త్యాగ మాద్రియతే, న విశేషజ్ఞతాం విచారయతి, నాచారం పాలయతి, న సత్యమవబుధ్యతే, న లక్షణం ప్రమాణీకరోతి, గంధర్వనగర లేఖేవ పశ్యత ఏవ నశ్యతి. అద్యాపి ఆరూఢమందర పరివర్తావర్త భ్రాంతి జనిత సంస్కారేవ పరిభ్రమతి, కమలినీ సంచరణ వ్యతికరలగ్న నళినానాళకంటక క్షతేవ న క్వచిత్అపి నిర్భరమాబద్నాతి పదం, అతిప్రయత్న విధృతాఽపి పరమేశ్వర గృహేషు వివిధగంధగజగండ మధుపాన మత్తేవ పరిస్ఖలతి.

ఈ లక్ష్మివలె మరియొకటి లోకంలో కనిపించదు. లభించినను కాపాడుట కష్టము. గట్టిగుణములతో కట్టివేయబడినను తొలగిపోవును. బలాఢ్యులైన వేలకొలది భటుల ఖడ్గములను పంజరంలో బంధించినను తప్పించుకొనిపోవును. ఏనుగుల బలంతో ఆడంబరంగా రక్షించినను నిలువదు. పరిచయమును గుర్తించదు. వంశమును చూడదు, సౌందర్యమును, వంశమర్యాదను, స్వభావమును పరిశీలించదు. పాండిత్యమును, చాతుర్యమును, ధర్మమును, త్యాగమును ఆదరించదు. ఎక్కువ జ్ఞానమును, ఆచారమును, సత్యవ్రతమును గమనించదు. మంచిలక్షణమును లెక్కింపదు. గంధర్వ నగరపు వ్రాతవలె చూచుచుండగనే నశించును. మంధర పర్వతము తిరుగుటవలన కలిగిన సంస్కారము చేతవలె ఇప్పటికిని తిరుగుచుండును. తామరవనంలో తిరుగుట వలన కాడలలోని ముళ్ళు బాధించినట్లు నిలకడగా ఎక్కడను అడుగును ఉంచదు. రాజుల ఇండ్లయందు మదపుటేనుగుల మదజలమును ఆస్వాదించుట వలన మదించినట్లు ఎంత వారించినను జారిపోవుచుండును.

**పారుష్యమివోపశిక్షితుమ్ అసిధారాసు నివసతి. విశ్వరూపత్వమివ గ్రహీతు మాశ్రితా నారాయణమూర్తిమ్, అప్రత్యయ బహులా చ దివసాంత కమలమివ సముపచిత మూలదండకోశమండలమపి ముంచతి భూభుజం, లతేవ విటపకానధ్యారోహతి; గంగేవ వసుజనన్యపి తరంగబుద్బుద చంచలా, దివసకర గతిరివ ప్రకటితవివిధసంక్రాన్తిః, పాతాళగుహేవ తమోబహులా, హిడింబేవ భీమసాహసైకహార్యహృదయా, ప్రావృడివ అచిరద్యుతికారిణీ, దుష్టపిశాచీవ దర్శితానేక పురుషోచ్ఛ్రాయా స్వల్పసత్త్వం ఉన్మత్తీకరోతి.**

కఠినత్వమును నేర్చుకొనుటకు వలె కత్తుల అంచులో నివసించును. విశ్వరూపము స్వీకరించుటకు నారాయణుని శరీరమును ఆశ్రయించును. సాయంకాలపు పద్మమువలె కోశము అధికముగానున్నను, రాజును విడిచిపెట్టును. తీగవలె కొమ్మలను ఆశ్రయించును. గంగానది వలె అలలతో, బుడగలతో చంచలమైనది. సూర్యగమనమువలె అనేక సంక్రాంతులు కలది. పాతాళగుహవలె తమస్సు నిండినది. హిడింబివలె సాహసమునకు వశమైన హృదయము కలది. వర్షాకాలమువలె కొద్ది కాలము మెరుపుతో కూడినది. బలహీనుని పిశాచమువలె భ్రాంతికొలిపి పిచ్చివానినిగా చేయును.



**సరస్వతీపరిగృహీతమ్ ఈర్ష్యయేవ నాలింగతి జనమ్, గుణవంతమ్ అపవిత్రమివ న స్పృశతి. ఉదారసత్వం అమంగళమివ న బహు మన్యతే, సుజనం అనిమిత్తమివ న పశ్యతి, అభిజాతం అహిమివ లంఘయతి, శూరం కంటక మివ పరిహరతి, దాతారం దుస్స్వప్న మివ న స్మరతి, వినీతం పాతకిన మివనోపసర్పతి మనస్వినం ఉన్మత్తమివోప హసతి.**

విద్యావంతుడైన మనుష్యుని వద్దకు అసూయ చేతవలె చేరదు. గుణవంతుని అపవిత్రునివలె తాకదు. గొప్ప మనోబలము కలవానిని గౌరవించదు. మంచివానిని అపశకునమువలె చూడదు. గొప్పవంశమున బుట్టినవానిని పామువలె దాటవేయును. శూరుని ముల్లువలె విడుచును. దానము చేయువానిని చెడుకలనువలె స్మరించదు. వినయవంతుని పాపాత్ముని వలె దరిచేరదు. అభిమానవంతుని పిచ్చివానివలె హేళన చేయును.

**పరస్పర విరుద్ధం చ ఇంద్రజాలమివ దర్శయన్తీ ప్రకటయతి జగతి నిజం చరితం, తథాహి సతతమూష్మాణ మారోపయన్త్యపి జాడ్యమువపజనయతి, ఉన్నతిమాదధానాఽపి నీచస్వభావతాం ఆవిష్కరోతి, తోయరాశి సంభవాఽపి తృష్ణాం సంవర్ధయతి, ఈశ్వరతాం దధానాపి అశివప్రకృతిత్వం ఆతనోతి, బలోపచయమాహరంత్యపి లఘిమానం ఆపాదయతి, అమృతసహోదరాఽపి కటువిపాకా, విగ్రహవత్యపి– అప్రత్యక్ష దర్శనా, పురుషోత్తమరతాఽపి ఖలజన ప్రియా, రేణుమయీవ స్వచ్ఛమపి కలుషీకరోతి.**

పరస్పరము వ్యతిరేకములైన తన చేష్టలను ఇంద్రజాలమునువలె లోకమున ప్రకటించును. ఎల్లప్పుడు వేడిని కలిగించుచు కూడా జడత్వమును పుట్టించును. ఔన్నత్యమును కలిగించుచు నీచ స్వభావమును ఏర్పఱచును. సముద్రమునుండి పుట్టినదైనను తృష్ణను పెంచును. ఈశ్వరత్వమును ధరించికూడా శివప్రవృత్తికి దూరమగును. ఎక్కువ బలము కలిగికూడా తేలికదనమును పొందించును. అమృతమునకు తోడబుట్టినదైనను కటురసము కలది. విగ్రహమును ధరించికూడ ప్రత్యక్షము కానిది. పురుషోత్తముని యందు ఆసక్తి కలదైనను దుష్టజనులను అభిమానించునది. నిర్మలుని కూడా మలినంగా చేయును.

**యథా యథా చేయం చపలా దీప్యతే తథా తథా దీపశిఖేవ కజ్జల**

మలినమేవ కర్మ కేవలం ఉద్వమతి, తథాహి- ఇయం సంవర్ధన వారిధారా తృష్ణావిషవల్లీనాం, వ్యాధగీతిరింద్రియ మృగాణాం, పరామర్శ ధూమలేఖా సచ్చరితచిత్రాణాం, విభ్రమ శయ్యామోర్ఘ నిద్రాణాం, నివాసః జీర్ణవలభీ ధనమదపిశాచికానాం, తిమిరోద్గతిః శాస్త్రదృష్టీనామ్, పురఃపతాకా సర్వావినయానామ్, ఉత్పత్తి నిమ్న క్రోధావేగ గ్రాహాణాం, ఆపానభూమిః విషయమధూనాం, సంగీతశాలాభ్రూవికారనాట్యానాం, ఆవాసదరీ దోషాశీవిషాణాం, ఉత్సారణ వేత్రలతా సత్పురుషవ్యవహారాణాం, అకాలప్రావృట్ గుణకలహంసకానాం, విసర్పణ భూమిః, లోకాపవాదవిస్ఫోటానాం, ప్రస్తావనా కపటనాటకస్య, కదళికా కామకరిణః, వధ్యశాలా సాధుభావస్య, రాహుజిహ్వా ధర్మేన్దుమణ్డలస్య.

చంచలమైన ఈ లక్ష్మి వెలుగుచున్న కొలది దీపము వలె నల్లని మసిని వెడల గ్రక్కును. ఈ రాజ్యలక్ష్మి ఆశ అను తీగలకు నీటిధార, ఇంద్రియములను మృగములకు బోయవాని పాట సత్పురుషుల చిత్తములకు పొగరాశి, మోహములు అను నిద్రలకు చక్కనిశయ్య, ధనమను పిశాచములకు నివాసస్థానము. శాస్త్రంతో చూచువారికి చీకటివంటిది. అన్ని అవినయములకు పతాకము, క్రోధము, ఆవేశము, అను మొసళ్ళకు జన్మనది. సుఖములను మద్యములకు పానశాల. కనుబొమ్మల నాట్యమునకు సంగీతశాల. దోషములనెడి సర్పములకు పుట్ట. మంచివారి ఉపదేశములకు బెత్తముకర్ర, గణములనెడు హంసలకు అకాల వర్షఋతువు. లోకాపవాదనములకు ప్రచార స్థానమ్ము. మాయానాటకమునకు ప్రస్తావన. కోరిక అను ఏనుగునకు అరటిచెట్టు. మంచితనమునకు వధ్యశాల, ధర్మము అనెడు చంద్రమండలమునకు రాహువు నాలుక వంటిది.

న హి తం పశ్యామి, యో హి అపరిచితయా అనయా, న నిర్భర ముపగూఢో యో వా న విప్రలబ్ధః (యతో హి) నియతమియం ఆలేఖ్యగతాఽపి చలతి, పుస్తకమయ్యపి ఇంద్రజాలమాచరతి, ఉత్కీర్ణాఽపి విప్రలభతే, శృతాఽపి అభిసన్ధత్తే, చింతితాఽపి వఞ్చయతి, ఏవం విధయాఽపి చ అనయా దురాచారయా కథమపి దైవవశేన పరిగృహీతాః విక్లవాః భవన్తి రాజానః సర్వావినయాధిష్ఠానతాం చ గచ్ఛన్తి తథాహి.

ఈ సంపదచేత ప్రేమతో ఆదరింపబడనివాడు, తరువాత మోసగింపబడనివాడు లోకమున కనిపించడు. చిత్రపటంలో ఉన్నను ఇది కదలును.



పుస్తకంలో ఉన్నను ఇంద్రజాలము చేయును చెక్కబడినను మోసగించును. వినబడి కూడా భ్రమింప జేయును ఆలోచించినను వంచించును. ఇటువంటి దుష్టవర్తనముగల రాజ్యలక్ష్మిచేత దైవవశమున స్వీకరింపబడిన రాజులు మూఢులగుచున్నారు. అన్నివిధముల అవినయములకు స్థానమగుచున్నారు.

అభిషేకసమయ ఏవచైషాం మంగళకలశజలైరివ ప్రక్షాళ్యతే దాక్షిణ్యం, అగ్నికార్యధూమేనేవ మలినీక్రియతే హృదయం, పురోహితకుశాగ్ర సమ్మార్జనీభిః ఇవ అపనీయతే క్షాంతిః, ఉష్ణీషపట్టబంధేనేవ అవచ్ఛాద్యతే జరాగమనస్మరణమ్, ఆతపత్రమండలేనేవ అపవార్యతే పరలోక దర్శనమ్, చామరపవనైరివ అపహ్రియతే సత్యవాదితా, వేత్రదండై రివ ఉత్సార్యన్తే గుణాః, జయశబ్దకలకలైరివ తిరస్క్రియంతే సాధువాదాః, ధ్వజ పటపల్లవైరివ పరామృశ్యతే యశః.

పట్టాభిషేక సమయముననే కలశ జలములచేత దాక్షిణ్యము కడిగివేయబడినట్లు కనబడును. హోమధూమముచేత రాజు హృదయములు మలినములగునట్లు ఉండును. వారి సహనము పురోహితుల చేతి దర్భలతో తొలగింపబడును. తలపాగాను కట్టుటచేత వార్ధక్య స్మరణమును కప్పివేయునట్లుండును. గొడుగుపట్టి పరలోక దర్శనము కనబడకుండునట్లు చేయబడును. సత్యగుణము చామరములగాలితో త్రోసివేయబడునట్లు ఉండును. మంచి గుణములు భటులబెత్తముల చేత తొలగించబడును. మంచి ఉపదేశములు జయజయధ్వానములచే కప్పివేయబడును. జండామీది వస్త్రంతో కీర్తి తుడిచి వేయబడునట్లు తోచును.

తథాహిః- కేచిచ్ఛ్రమవశశిథిలశకునిగళపుటచపలాభిః ఖద్యోతోన్మేష ముహూర్తమనో హరాభిర్మనస్విజన గర్హితాభిః సంపద్భిః ప్రలోభ్యమానాః, ధనలవలాభావలేపవిస్మృతజన్మానః అనేక దోషోపచితేన దుష్టా సృజేన రాగావేశేన బాధ్యమానాః, వివిధ విషయరసగ్రాసలాలసైః పంచభిః అపి అనేక సహస్రసంఖ్యైః ఇవ ఇంద్రియైరాయాస్యమానాః, ప్రకృతిచంచలతయా లబ్ద ప్రసరేణ ఏకేనాపి శతసహస్రతాం ఇవ ఉపగతేన, మనసాఽఽకులీక్రియమాణాః విహ్వలతా ముపయాన్తి.

కొందరు అలసిపోయిన పక్షిమెడవలె, చంచలములైన మిణుగురు పురుగులవలె కొద్దికాలము ప్రకాశించునవై ఉత్తములచేత నిందింపబడు

ధనసంపదలచేత ఆకర్షింపబడి, ధనములభించిన గర్వంచే పూర్వవృత్తాంతము మరచి, అనేక దోషములతో, కోరికలతో పీడింపబడుచూ, ఇంద్రియములచేత ఆయాస పెట్టబడుచు, స్వభావముచేత చంచలమైనందున మనస్సుచేత కలతచెందినవారై పరవశమగుదురు.

**కెఇచ్ఛి గ్రహైరివ గృహ్యన్తే, భూతైరివ అభిభూయన్తే, మన్త్రైరివ అవేశ్యంతే సత్త్వైరివ అవష్టభ్యన్తే, వాయునేవ విడంబ్యన్తే, పిశాచైరివ గ్రస్యన్తే, మదనశరైః మర్మాభిహతా ఇవ ముఖభఙ్గ సహస్రాణి కుర్వతే ధనోష్మణా పచ్యమానా ఇవ విచేష్టన్తే, గాఢ ప్రహారాభిహతా ఇవాఙ్గాని న ధారయన్తి, కుళీరా ఇవ తిర్యక్పరిభ్రమన్తి, అధర్మభగ్నగతయః పఙ్గవ ఇవ పరేణ సఞ్చార్యన్తే, మృషావాదవిష విపాకసంజాతముఖరోగా ఇవ అతికృచ్ఛ్రేణ జల్పన్తి, సప్తచ్ఛదతరవ ఇవ కుసుమరజోవికారైః ఆసన్నవర్తినాం శిరశ్శూలం ఉత్పాదయన్తి, ఆసన్నమృత్యవ ఇవ బన్ధుజనమపినాభిజానన్తి, ఉత్కుపిత లోచనా ఇవ తేజస్వినః నేక్షన్తే, కాలదష్టా ఇవ మహామన్త్రైరపి న ప్రతిబుధ్యన్తే, జాతుషాభరణాఇవ సోష్మాణం న సహన్తే, దుష్టవారణా మివమహామానస్తంభనిశ్చలీకృతాఽపి న గృహ్ణన్తి ఉపదేశం, అతితృష్ణావిషవేగమూర్ఛితాః కనకమయమివ సర్వం పశ్యన్తి, ఇషవ ఇవ పాన వర్ధితతైక్ష్ణ్యాః పరప్రేరితాః వినాశయన్తి, దూరస్థితాన్యపి ఫలానీవ దణ్డవిక్షేపైః మహాకులాని శాతయన్తి.**

వారు గ్రహములు పట్టుకొన్నట్లు, భూతములు ఆక్రమించినట్లు, మంత్రముల చేత ఆవేశింపబడినట్లు, గాలిచేత పీడింపబడినట్లు, పిశాచములు వశము చేసుకొన్నట్లు, మన్మథబాణములచేత తీవ్రంగా కొట్టబడినట్లు ముఖంలో అనేక చేష్టలను చూపుదురు. సంపదయొక్క వేడిచేత కాగినట్లు కదలకుందురు. తీవ్రంగా దెబ్బలు తిన్నట్లు అవయవములను ధరింపలేరు. ఎండ్రికాయలవలె అడ్డంగా సంచరింతురు. అధర్మముచేత గతి తప్పి కుంటివానివలె ఇతరులచేత నడిపింపబడుదురు. అసత్యవచనములచే నోటికి రోగమువచ్చినట్లు తక్కువగా మాట్లాడుదురు. ఏడాకుల అరటిచెట్లవలె తమ రజస్సు చేత సమీపంలో నున్నవారికి తలనొప్పిని కలిగించుదురు. మరణమాసన్నమైనవారి వలె ఎదురుగా ఉన్న బంధుజనులను గుర్తించరు. తేజస్సుకలవారిని కంటిజబ్బు కల వారివలె చూడజాలరు. కాలసర్పంచే కరువబడినవారివలె మహామంత్రములచే కూడా మేల్కొల్పబడరు. లక్కబొమ్మలవలె వేడిమిని సహింపరు. దుష్టగజములవలె





ఉపదేశమును గ్రహింపరు. ఆశ అనువిషంతో మూర్ఛితులై సమస్తము బంగారు మయంగా చూతురు. ఖడ్గములవలె పానంచే పెంచబడిన పదునుకలవారు ఇతరులచే ప్రేరేపింపబడి నశింపజేయుదురు. దూరంలో నున్న పండ్లను కట్టెలతో వలె దండములతో ఉన్నత కులముల వారిని బాధింతురు.

**అకాల కుసుమప్రసవా ఇవ మనోహరాకృతయోఽపి లోకవినాశ హేతవః, శ్మశానాగ్నయ ఇవ అతిరౌద్ర భూతయః, తైమిరికా ఇవ అదూర దర్శినః, ఉపసృష్టా ఇవ క్షుద్రాధిష్ఠితభవనాః, శ్రూయమాణా అపి ప్రేతపటహా ఇవ ఉద్వేజయన్తి, చింత్యమానా అపి మహాపాతకాధ్యవసాయా ఇవ ఉపద్రవం ఉపజనయన్తి, అనుదివసం ఆపూర్యమాణాః పాపేన ఇవ అధ్మాతమూర్తయో భవన్తి, తదవస్థాంచ వ్యసనశతశరవ్యతాముపగతాః వల్మీకతృణాగ్రావస్థితాః జలబిన్దవః ఇవ పతితమపి ఆత్మానం నావగచ్ఛన్తి.**

అకాలంలో పూచిన పూవులవలె అందంగా ఉన్నను లోకనాశనము కలిగింతురు. స్మశానంలోని అగ్నులవలె అతిభయంకరరూపము కలవారు, చీకటిలో సంచరించుచున్నట్లు దూరదృష్టిలేనివారు, క్షుద్రులచేత ఆశ్రయింపబడిన భవనము కలవారు. వినబడినంతనే ప్రేతధ్వనుల వలె వెగటు కలిగింతురు. తలచుకొన్నంతనే మహాపాపమువలె చేయుకోరికవలె ఉపద్రవము కలిగింతురు. ప్రతిదినము పాపముచేత నింపబడినట్టు బలసిన శరీరము కలవారు. అనేక వ్యసనములకు గురియై పుట్టమీది గడ్డిపోచపై నున్న నీటిబిందువులవలె తమ పతనమును తాము గుర్తించరు.

**అపరే తు స్వార్థనిష్పాదనపరైః ధనపిశితగ్రాసగృధ్రైరాస్థాన నళినా ధూర్తబకైః ద్యూతం వినోద ఇతి, పరదారాభిగమనం వైదగ్ధ్యమితి, మృగయా శ్రమ ఇతి, పానం విలాస ఇతి, ప్రమత్తతా శౌర్యమితి, స్వదారపరిత్యాగోఽ వ్యసనితేతి, గురువచనావధీరణ మపరప్రణేయత్వ మితి, అజితభృత్యతా సుఖోపసేవ్యత్వమితి, నృత్య గీత వాద్య వేశ్యాభిసక్తిః రసికతేతిః మహాపరాధానా కర్ణనం మహానుభావతేతి, పరిభవసహత్వం క్షమేతి, స్వచ్ఛందతా ప్రభుత్వమితి, దేవావమాననం మహాసత్త్వతేతి, వందిజనఖ్యాతిర్యశ ఇతి, తరళతా ఉత్సాహ ఇతి, అవిశేషజ్ఞతా అపక్షపాతిత్వం ఇతి, దోషానపి గుణపక్షం అధ్యారోపయద్భిః అంతస్స్వయమపి విహసద్భిః ప్రతారణకుశలైః ధూర్తైః అమానుషోచితాభిః స్తుతిభిః**

ప్రతార్యమాణా విత్తమదమత్తచిత్తా నిశ్చేతనతయా తథైవేత్యాత్మన్యారోపితాలీకాభిమానాః మర్త్యధర్మాణో అపి దివ్యాంశావతీర్ణమివ, సదైవతం ఇవ, అతిమానుషమాత్మానం ఉత్ప్రేక్షమాణాః, ప్రారబ్ధ దివ్యోచిత చేష్టానుభావాః, సర్వ జనస్య ఉపహాస్యతా ముపయాన్తి.

మరికొందఱు స్వార్థ సంపాదనపరులు ధనాశతో రాజాస్థానములలో చేరి జూదము వినోదమనియు, ఇతర స్త్రీలను పొందుట నేర్పరితనమని, వేట వ్యాయామమని, పానము విలాసమని, ఉదాసీనంగా నుండుట శౌర్యమని, తన భార్యను ఉపేక్షించుట వైరాగ్యమని,పెద్దలమాటలను తిరస్కరించుట స్వతంత్ర ప్రవృత్తి అని, సేవకులను విధేయులుగా చేయుట సుఖంగా సేవింపబడుట అని, నాట్యము, గీతవాద్యములు వేశ్యలయందు ఆసక్తి రసికత్వమని, అపరాధములను గూర్చి వినకపోవుట గొప్ప స్వభావమని, పరాభవములను సహించుట ఓర్పు అని, స్వేచ్ఛగా ప్రవర్తించుట ప్రభువు లక్షణమని, దేవతలను అగౌరవించుట గొప్ప బలమని భట్రాజులతో పొగడించుకొనుట కీర్తి అని, చంచలత్వము ఉత్సాహమని, భేదము చూడకపోవుట సమబుద్ధి అని దోషములను కూడా గుణములుగా చెప్పుచు మనస్సులో తాము కూడా నవ్వుకొను వంచనపరుల చేత మోసగింపబడుచు, ధనమదంతో మత్తెక్కి కల్పితమైన అభిమానంతో తమను తామే దేవతల అంశములుగా భావించుచు వారివలె చేష్ట చేయబూని అందరిచేత పరిహసింపబడుదురు.

ఆత్మవిడంబనాం చ అనుజీవినా జనేన క్రియమాణామభినన్దన్తి, మనసా దేవతాధ్యారోపణ ప్రతారణా సంభూత సంభావనోపహతాశ్చాంతః ప్రవిష్టాపరభుజ ద్వయమివ ఆత్మ బాహుయుగళం సంభావయన్తి, త్వగంతరిత తృతీయ లోచనం స్వలలాటమాశఙ్కన్తే, దర్శన ప్రదానమపి అనుగ్రహం గణయన్తి, దృష్టిపాతమపి ఉపకారపక్షే స్థాపయన్తి, సమ్భాషణమపి సంవిభాగమధ్యే కుర్వన్తి, ఆజ్ఞామపి వరప్రదానం మన్యన్తే, స్పర్శమపి పావనమాకలయన్తి, మిథ్యామాహాత్మ్యగర్వ నిర్భరాశ్చ న ప్రణమన్తి దేవతాభ్యః.

ఆశ్రితులు చేయు తమ పొగడ్తలను మెచ్చుకొందురు. తమను తాము దేవతలుగా భావించుకొని నాలుగు భుజములు, మూడు కన్నులు కలవారినిగా ఊహించుకొందురు. జనులకు దర్శనమిచ్చుట అనుగ్రహంగా లెక్కింతురు. వారిని చూచుట ఉపకారమని, మాట్లాడుట గౌరవించుట అని, ఆజ్ఞాపించుట



వరదానమని తలంతురు. తమ స్పర్శ పవిత్రమని అసత్యమైన గొప్పతనమును ఆరోపించుకొని దేవతలకు నమస్కరింపరు.

కించ – న పూజయన్తి ద్విజాతీన్, న మానయన్తి మాన్యాన్, నార్చయన్తి అర్చనీయాన్, నాభివాదయన్తి అభివాదనార్హాన్, నాభ్యుత్తిష్ఠన్తి గురూన్, అనర్థకాయాసాంతరిత విషయోపభోగః సుఖమితి ఉపహసన్తి విద్వజ్జనం, జరావైక్లవ్యప్రలపితమితి పశ్యన్తి వృద్ధజనోపదేశం, ఆత్మప్రజ్ఞా పరిభవ ఇతి అసూయన్తి సచివోపదేశాయ కుప్యన్తి హితవాదినే, సర్వథా తం అభినన్దన్తి, తమాలపన్తి, తం పార్శ్వే కుర్వన్తి, తం సంవర్ధయన్తి, తేన సహసుఖ మవ తిష్ఠన్తే, తస్మై దదతి, తం మిత్రతాముపజనయన్తి, తస్య వచనం శృణ్వన్తి, తత్ర వర్షన్తి, తం బహుమన్యన్తే, తం అప్రతిమ ఆపాదయన్తి, యోఽహర్నిశ మనవరత ముపరచితాంజలిః అధిదైవతమివ విగతాన్య కర్తవ్యః స్తౌతి యో వా మాహాత్మ్యం ఉద్భావయతి.

బ్రాహ్మణులను పూజింపరు. పెద్దలను గౌరవింపరు. నమస్కరింపదగిన వారికి నమస్కారము చేయరు. పెద్దలకు ఎదురుగా వెళ్ళరు. తమ సుఖములకు ఆటంకంగా వచ్చినారని పండితులను పరిహసింతురు. వారి ఉపదేశములు ముసలితనంతో పలికిన ప్రలాపములని భావింతురు. మంత్రుల సూచనలను తమ తెలివికి అవమానమని నిరాకరింతురు. మంచి చెప్పువారిని కోపింతురు. ఎవడు రాత్రింబవళ్ళు చేతులు జోడించి తనను దేవునివలె పూజించుచు పొగడుచుండునో వానిని రాజులు మెచ్చుకొందురు. వానితో మాట్లాడుదురు, వానిని ప్రక్కన చేర్చుకొందురు. వానిని పెంచుదురు, వానికి దానము చేయుదురు, మైత్రిని పొందుదురు. వానిమాటలే విందురు.

కిం వా తేషాం సాంప్రతం యేషామతినృశంసప్రాయోపదేశనిర్ఘృణం కౌటిల్యశాస్త్రం ప్రమాణం, అభిచారక్రియాక్రూరైకప్రకృతయః పురోధసో గురవః, పరాభిసన్ధానపరా మంత్రిణ ఉపదేష్టారః నరపతిసహస్రభుక్తోజ్ఝితాయాం లక్ష్మ్యామాసక్తిః, మారణాత్మకేషు శాస్త్రేషు అభియోగః, సహజప్రేమార్ద్ర హృదయానురక్తాః భ్రాతరః ఉచ్ఛేద్యాః.

ఎవరికి క్రూరమైన ఉపదేశములచేత దయాహీనమైన కౌటిల్యుని రాజనీతి ప్రమాణమో, చేతబడులందు ఆసక్తి గల పురోహితులు గురువులో, ఇతరులను వంచించు స్వభావముకలవారు మంత్రులు ఉపదేశకులో, అనేక

రాజులచేత అనుభవింపబడి విడువబడిన లక్ష్మియందు ఆసక్తికలదో, హింసా రూపమైన శాస్త్రములందు అభిమానముకలదో, ప్రేమతోకూడిన సోదరులుకూడా చంపదగినవారో అట్టివారికి యుక్తాయుక్తములు ఏమి తెలియును.

**తదేవం ప్రాయే అతికుటిలకష్టచేష్టా సహస్రదారుణే రాజ్యతంత్రే అస్మిన్ మహామోహాంధకారిణి చ యౌవనే, కుమార! తథాప్రయతేథాః యథా నోపహస్యసే జనైః, న నింద్యసే సాధుభిః, న ధిక్క్రియసే గురుభిః, నోపాలభ్యసే సుహృద్భిః, న శోచ్యసే విద్వద్భిః, యథా చ న ప్రకాశ్యసే విటైః, న ప్రహస్యసే కుశలైః, నాస్వాద్యసే భుజంగైః, నా వలుప్యసే సేవకవృకైః, న వంచ్యసే ధూర్తైః, న ప్రలోభ్యసే వనితాభిః, న విడంబ్యసే లక్ష్మ్యా, న నర్త్యసే మదేన, నోన్మత్తీ క్రియసే మదనేన, నాక్షిప్యసే విషయైః, నావకృష్యసే రాగేణ నాపహ్రియసే సుఖేన, కామం భవాన్ ప్రకృత్యైవ ధీరః, పిత్రా చ మహతా ప్రయత్నేన సమారోపితసంస్కారః, తరళహృదయమప్రతిబుద్ధిఞ్చ మదయన్తి ధనాని, తథాపి భవద్గుణ సంతోషో మాం ఏవం ముఖరీకృతవాన్.**

ఇటువంటి కుటిలమైన క్రూరమైన పనులచేత ఘోరమైన రాజ్యపాలన మున మోహమును కలిగించు యౌవ్వనదశయందు కుమార! జనులచేత పరిహసింపబడకుండునట్లు, సజ్జనులచేత నిందింపబడనట్లు, పెద్దలచేత ధిక్కరింప బడనట్లు మిత్రులచేత నిందింపబడనట్లు, పండితులచేత జాలి చూపబడనట్లు, విటులచేత మోసగింపబడకుండ, నేర్పరులచేత పరిహసింపబడక, వంచకులచే వశముచేసి కొనబడక, సేవకులను తోడేళ్ళచే మ్రింగబడక, ధూర్తులచేత మోసగింప బడక, స్త్రీలచేత ఆకర్షింపబడక, సంపదచేత గంతులువేయక, మన్మథునిచే పిచ్చివానిగా చేయబడక, ఇంద్రియసుఖములకు లోబడక, కోరికల చేత లొంగబడక. సుఖముచేత పరవశముకాక ఉండునట్లు ప్రవర్తించుము. నీవు స్వభావము చేత ధీరుడవు. తండ్రిగారి గొప్ప ప్రయత్నంచే సంస్కారము పొందింప బడితివి. ధనములు, చంచలమనస్సుకలవానిని, అవివేకిని మదింపజేయును. నీ గుణములయందలి సంతోషము నన్నిట్లు మాటలాడించు చున్నది.

**ఇదమేవ చ పునః పునరభిధీయసే, విద్వాంసమపి సచేతనమపి, మహాసత్త్వమపి అభిజాతమపి, ధీరమపి, ప్రయత్నవంతమపి పురుషమియం దుర్వినీతా ఖలీకరోతి లక్ష్మీ రితి', సర్వథాకల్యాణైః పిత్రా క్రియమాణమనుభవతు**



**భవాన్ నవయౌవన రాజ్యాభిషేకమంగళమ్. కులక్రమాగతా ముద్వహ పూర్వపురుషైరూఢాం ధురమ్, అవనమయ ద్విషతాం శిరాంసి, ఉన్నమయ స్వబంధువర్గం, అభిషేకానంతరం చ ప్రారబ్ధదిగ్విజయః పరిభ్రమన్ విజితామపి తవ పిత్రాసప్తద్వీపసముద్రభూషణాం పునర్విజయస్వ వసుంధరామ్. అయం చ తే కాలః ప్రతాపమారోపయితుమ్, ఆరూఢ ప్రతాపో హి రాజా త్రైలోక్యదర్శీవ సిద్ధాదేశో భవతి. "ఇత్యేతావత్ అభిధాయోపశశామ"**

పండితుడైనను, జ్ఞానవంతుడైనను, గొప్పమనోబలము కలవాడైనను, ఉన్నత వంశజాతుడైనను, ధైర్యము కలవాడైనను, కృషిపరుడైనను మనుష్యుని దుష్ట స్వభావముగల రాజ్యలక్ష్మి దుర్మార్గునిగా చేయును. మాటిమాటికి దీనినే చెప్పుచున్నాను. తండ్రి చేత చేయబడు యౌవరాజ్య పట్టాభిషేకమును మంగళములతో అనుభవించుము. వంశక్రమమున వచ్చిన రాజ్యభారమును వహింపుము. శత్రువుల తలలను వంచుము. బంధు సమూహమును పైకి తెమ్ము. అభిషేకముతర్వాత దిగ్విజయము నారంభించి మీ తండ్రి చేత జయింప బడినదైనను భూమిని మరల గెలువుము. ఇది నీ ప్రతాపమును నిరూపించు కొనుటకు తగిన కాలము. ప్రదర్శింపబడిన పరాక్రమముగల రాజు ముల్లోకము లను దర్శించు సిద్ధుల వాక్యము వంటిది". అని చెప్పి శుకనాసుడు విరమించెను.

**ఉపశాంతవచసి శుకనాసే చన్ద్రాపీడః తాభిరమలాభిః ఉపదేశవాగ్భిః ప్రక్షాళిత ఇవ, ఉన్మీలిత ఇవ, స్వచ్ఛీకృత ఇవ, నిర్మృష్ట ఇవ, అభిషిక్త ఇవ, అభిలిప్త ఇవ, అలంకృత ఇవ, పవిత్రీకృత ఇవ, ఉద్భాసిత ఇవ ప్రీతహృదయో ముహూర్తం స్థిత్వా స్వభవన మాజగామ.**

ఈ విధంగా శుకనాసుని ఉపదేశమును పొందిన చంద్రాపీడుడు, శుకనాసుని యొక్క స్వచ్ఛమైన ఉపదేశవాక్కులచే ప్రక్షాళన చేయబడిన వానివలెను, జ్ఞానజ్యోతిని పొందినవారివలెను, అన్య విషయములయందు ఆసక్తి లేనివాని వలెను, అభిషేకము చేయబడిన వానివలెను, విద్యా సుగంధముచేత పూయబడిన వానివలెను, అలంకరింపబడిన వానివలెను, పవిత్రం చేయబడిన వానివలెను, ప్రకాశింపబడినవానివలెను, సంతోషాంతరంగితుడై నిర్మలుడై కొద్దికాలము నిలిచి తన మందిరమును చేరెను.

# శుకనాసోపదేశము

కాదంబరిలో బాణభట్టు (సమయోజితంగా) మానవజీవితమునకు దిశా-నిర్దేశము చేయునట్టుగా "సమయోచితమైన" అనేక సారగర్భిత ఉపదేశములను కూడా సమావిష్టము చేసెను. వానిలో రాజకుమారుడు చంద్రాపీడునికి మహామంత్రి శుకనాసునిచే చేయబడిన ఉపదేశము మహోత్కృష్టము, మరియు తన అనుపమానమైన వైశిష్ట్యంచే బహు ప్రసిద్ధము. ప్రస్తుత ప్రబంధమునకు పునాది కూడా ఈ ఉపదేశమే.

**ఉపదేశసారము :-** రాజకుమారుడు చంద్రాపీడుడు గురుకులంలో యథావిధిగా విద్యార్జనముచేసి రాజభవనమునకు తిరిగి వచ్చెను. పట్టాభిషేక మహోత్సవము కూడా దగ్గర పడింది. చంద్రాపీడుడు మహామంత్రి శుకనాసుని దర్శనార్థం వెళ్ళెను.ఆ సమయము యువరాజునకు ఉపదేశము చేయుటకు తగిన అవకాశముగానెంచి మంత్రి శుకనాసుడు వినయవర్తనమునకు సంబంధించి ఇట్లు ఉపదేశించెను.

నాయనా ! చంద్రాపీడా! తమరు సర్వశాస్త్రములలోను, విద్యలలోను, కళలలోను, ఆరితేరి మనము, యథార్థదర్శనముచేసియున్నారు. మీకు తెలియని విషయము ఏదియును లేదు. కాబట్టి మీకు చెప్పుటకు నా వద్ద ఏమియును లేదు. కానీ యౌవ్వనావస్థలో స్వభావసిద్ధంగా ఒక్క అంధకారము ఉత్పన్నమగును. అది సూర్యకాంతిచే తొలగిపోదు. అది రత్నప్రభచేగానీ, దీపకాంతిచేగానీ తొలగింపబడదు. లక్ష్మీకటాక్షంచే ఉత్పన్నమైన మదము దారుణమై చిట్ట చివరకు శాంతిని భంగం చేయును. ఐశ్వర్యంచే కనుల ముందు అంధకారము అలముకొనును. ఇంద్రియ సుఖము మరియు తదాస్వాదనచే అట్టి మోహము పెరుగును. అవి మంత్ర ఔషధ ప్రభావములకు కూడా లొంగనివి. రాజ్యసుఖము అనెడిఘోర నిద్ర సమయమునకు విడవక పీడించును. జన్మసిద్ధమైన రాజ్యాధికారము కొత్తగా ప్రవేశించిన యౌవ్వనము అనుపమానమైన సౌందర్యము అసాధారణశక్తి, ఇవన్నియు అనర్థమునకు మూలములు. వీనిలో ప్రతి ఒక్కటి విడిగా కూడా అన్ని రకముల చెడు పనులను చేయించును. మరి ఈ అన్నింటి సమూహముయొక్క ప్రభావము చెప్పనేల ? శాస్త్రమనెడి జలములచే కడుగబడి నిర్మల బుద్ధి సంపన్నులైన పురుషుల బుద్ధికూడా ఇంద్రియ విషయ భోగ మృగ



తృష్ణలో మునిగి తేలును. కామిని, కాంచనముల (బంగారం) పట్ల ఆసక్తి మనుష్యుని పథభ్రష్టుని చేయును. గురువులయొక్క ఉపదేశమును తమవంటి నిర్మల చిత్తము గల పురుషులు మాత్రమే గ్రహింపగలరు. క్షుద్ర ప్రకృతిగల పురుషులు గురూపదేశమును శూలమువలె భావింతురు. **గురూపదేశము సమస్త దోషములను గుణములుగా మార్చివేయును.** అది ఒక దివ్య ప్రకాశము ఆ ప్రకాశము సూర్యచంద్రుల ప్రకాశమును మించినది. గురూపదేశము మనుష్యుని అజ్ఞానజనిత అంధకారమును సాయం సంధ్యా కాలమున ఉదయించు చంద్రునివలె దూరము చేయును. ఆ ఉపదేశము రాజులకు విశేష ఉపయోగకరము, ఎందుకనగా - వారికి భయము వలన ఎవ్వరూ ఉపదేశింప సాహసించరు. ఒక వైపు రాజులు ఉపదేశ వచనమును వినుటకు సిద్ధంగా నుండరు లేక రాజమదంచే విని కూడా కళ్ళు మూసుకొందురు. రాజ్యలక్ష్మి రాజమదమను విషమును వ్యాపింపచేసి భోగములయొక్క మత్తును కలిగించును.

యువరాజ! మీకు శుభమగుకాక ! మీరు అన్నింటి కంటే ముందు లక్ష్మినే పరీక్షించి చూడండి. సముద్ర-మథన కాలమున ఆమె ఉద్భవించినపుడే, క్షీర సాగరము నుండి పుట్టిన పారిజాత పల్లవముల నుండి రాగమును, చంద్రుని వంపు నుండి వక్రతను, ఉచ్చై శ్రవము నుండి చంచలత్వమును, కాలకూట విషము నుండి మోహశక్తిని, మదిర నుండి మదమును, కౌస్తుభమణి నుండి కఠోరత్వమును సొంతము చేసుకొని ఆ యా వస్తువుల విరహమునకు కూడా తన వినోదము కొరకు వాని వాని చిహ్నముల గ్రహించి బయటకు వచ్చినది. ఆమె చాలా చంచల స్వభావమును మరియు అస్థిరత్వమును కలిగి యున్నది. దృఢమైన పాశములతో బంధించినప్పటికిని ఆమె పారిపోవును. ఆమె ఎవరితోకానీ, పరిచయమును గానీ, ఎవరిదైనా కుల శీలాదులుకానీ, విచారింపదు. రాజుల ద్వారా ప్రయత్నపూర్వకంగా తమ వద్ద ఉంచుకొనబడి వారిని కూడా బురిడీ కొట్టించగలదు. తన యొక్క వివిధ మాయావీ రూపములను (లోకములు) చూపుట కొరకే అనునట్లు ఈమె విరాట్ రూపుడైన విష్ణువును ఆశ్రయించెను. ఈమెకు స్థిరమైన తావు ఏదియును లేదు. ఎప్పుడు ఉండునో ఎప్పుడు ఉండదో? ఈ లక్ష్మీ మూర్ఖుల వద్దనే ఉండవలయునని కోరుకొనును కానీ, సరస్వతీపాసకులు నుండి దూరంగా ఉండును. ఈమె తన యొక్క పరస్పర విరుద్ధమైన చరిత్రచే ఈ ప్రపంచమున ఒక వలను పరిచి యున్నది చూడు

రాజకుమారా! ఆమె జలము నుండి పుట్టికూడా తృష్ణను పెంచును. ఊర్ధ్వలోకము నుండి వచ్చియు స్వభావంలో నీచత్వమునే తీసుకొని వచ్చును. ఆమె అమృతపు సోదరి అయి ఉండి కూడా చేదు ఫలములనే ఇచ్చును. ఈ చంచల అధికంగా నడచిన కొద్దీ అట్లే **దీపశిఖవలె** ఇందు కాటుకవలె మలిన కర్మలే బయలు వెడలును. ఈ విధంగా శాస్త్ర - చక్షువుల పాలిటికి ఇది రేచీకటిని పుట్టించును. శిష్టాచారమును దూరంగా తొలగించుట కొరకు **పేము బెత్తము** వంటిది. మరి ధర్మ రూపమగు చంద్రుని గ్రసించుటకు రాహువుయొక్క నాలుక వంటిది.

ఈమె స్వభావము గుర్తించలేని వ్యక్తి ఎవరు ? ఎవరికి ఈమె అపరిచితురాలైన, సుందరమగు ఆమె గట్టిగా ఎవరినీ గుండెలకు హత్తుకొని ఆలింగనమును చేసి ఉండలేదు. మరి తనకు ప్రీతిపాత్రుడుగా చేసుకొని ఈమె ఎవ్వరిని వదిలి వేయలేదు. ఈరకమైన దురాచారిణి అయిన లక్ష్మి దైవవశమున రాజులను పరిగ్రహించి కూడా వారిని దుఃఖితులుగా చేసి వేయును. లక్ష్మీ యొక్క దుష్ప్రభావము చేతనే వారు అనేక రకములైన దుర్వినీత కార్యములకు అధిష్ఠాతలు అగుచున్నారు. రాజ్యాభిషేకము సమయముననే మంగళ కలశములోని జలంచే అభిసించనము చేయబడుటతోడనే వారిలో ఉన్న దాక్షిణ్యము కడిగి వేయబడుచున్నది. పట్టు వస్త్రముల తలపాగా చుట్టబడిన వెంటనే రాబోవు వార్ధక్యపు జ్ఞాపకములు తొలగి పోవుచున్నవి. శ్వేత ఛత్రం పట్టబడిన తోడనే పరలోకము కానుపింపదు. రాజును ప్రశంసించుచూ చేసెడి **జయజయశబ్దముల** కలరవముచే సజ్జనత్వపు వాణి తిరస్కరింపబడుచున్నది. మరియు ఈ విధంగా రాజోచితగుణములనుండి వంచింపబడుట జరుగుచున్నది. ఈ లక్ష్మీ ఎందరిని తన మధుర ప్రలోభములకు బలియిచ్చినదో ! లక్ష్మీ యొక్క ప్రలోభములలో పడివారు దుష్టగ్రహములచే నిగ్రహింపబడిన వారివలె విహ్వలులు అగుచున్నారు. మన్మథుని బాణములచే మార్మికాఘాతమును పొంది వివిధ భావ భంగిమలను ప్రదర్శించుచుందురు. సప్తపర్ణవృక్షమువలెవారు రజోగుణ వికారములచే సమీపమున ఉన్నవారికి తలనొప్పిని తెప్పించెదరు. మరియు మరణాసన్నపురుషులవలె తన సమీపముననున్న స్వీయ సంబంధీకులను కూడా గుర్తించలేరు. అలంకార రూపమున నిలిపిన స్తంభములకు కట్టబడిన దుష్టగజములవలె వారు ఉపదేశవచనములను ఉపేక్షించెదరు. తృష్ణ అనెడి



విష-వల్లికచే చుట్టు కొనబడియుండుటచే ఈ ప్రపంచములోనే అన్ని వస్తువులను కనకమయముగానే చూచుట జరుగును. మదపానముచే వైభవము పెరిగిన బాణమువలె కుటిల స్వభావులై విధ్వంసకర కార్యములలో తమబుద్ధిని దురుపయోగము చేయుచున్నారు. మరి ఆ సమయమున పూచిన పూలవలె లోకమును నాశనము చేయుటకు సిద్ధంగా ఉన్నారు. స్మశానాగ్నివలె వారి సంపదలు కూడా లోకులకు భయోత్పాతములు గూర్చుచున్నవి. వారిఇండ్లలో వార వనితల ప్రవేశము జరుగుచున్నది. ఈ ప్రకారంగా ఉండెడివారి చర్చలోకూడా ఉద్వేగము ఉత్పన్నమగుచ్చుది. వారిని గూర్చి కొంచమైన ఆలోచించుట కూడా మహాపాతకములవలె ఉపద్రవములకు దారిదీయును. వందలాది దుర్వ్యసనము లచే వారు చుట్టుముట్టబడి ఉందురు. మరియు పుట్టమీద గడ్డిపై పేరుకొనిన జలకణములవలె తన పతనమును కూడావారు చూడలేరు.

స్వార్థ సాధనలో నిరంతరము ధనము పోగుచేయుటకు గ్రద్దవలె విరుచుకుపడు స్వభావము గలవాడు, సభామండలీ రూపమైన సరోవరంలో కొంగవలె ప్రవేశించి, దోషములను కూడా సబబని చెప్పు ధూర్తులవలె, జూదము ఆడుట వినోదము, వ్యసనము కాదు, పరుల భార్యలను సంగమించుట చతురత అని, వ్యభిచారము కాదని, వేట ఆడుట వ్యాయామమే కానీ హింస కాదు, గురువచనములను ఉపేక్షించుట, స్వాతంత్ర్యమేకానీ అవజ్ఞకాదు, నృత్య-గీత -వాద్య వేశ్యాదులయందు ఆసక్తి రసికతయేకానీ వాసనామయత్వముకాదు, ఇటువంటి వ్యతిరిక్తమైన మాటలను చెప్పిరాజులకు వీరు చెడుమార్గము నిర్దేశించుచుందురు. ధూర్తులైన వారు ఈ రకమైన మాటలతో రాజులను మోసగించి లోలోపల వారిని అపహసించుచుందురు. అంతేకాని ప్రశంసలనెడి వంతెనలు కట్టి తమలో తాము ఉబ్బి తబ్బిబ్బులగుచుందురు. లక్ష్మీ మదముచే కొందరు రాజులు తమ పరిజనముల నోట అబద్ధపు ప్రశంసలను సంతోషంగా వినెదరు. వారు నిజంగా వందిమాగధుల అబద్ధపు వందనములలో చెప్పినట్లు తమను తాము విష్ణువో, శివుడో వంటి దేవతల అవతారంగా గుర్తింప ప్రారంభింతురు. కొందరు రాజులు ప్రజలకు దర్శనము ఇచ్చుటను కూడా తమ కృపగా భావించి పలుకుచుందురు. ఎవరితోనైన మాట్లాడుట బహుమతులు ఇచ్చుటగా భావింతురు. తమ ఆజ్ఞను వారికి వరదానంగా భావింతురు. అబద్ధపు పెద్దరికమును గర్వముచేత వారు దేవతలకు కూడా నమస్కారము చేయరు,

బ్రాహ్మణ పూజచేయరు, మరి లేచి గురుజనకులకు అభిముఖంగా వెళ్ళి నమస్కరించరు. వారు మంత్రులయొక్క హితవచనములను అవహేళన చేయుదురు. మరియు తమను ప్రశంసించు మోసగాళ్ళను నమ్మి వారినే తమవద్ద కూర్చుండపెట్టుకొందురు. ఎవరైతే నిష్కరుణగా అత్యంత ఉపదేశదాయకంగా కౌటిల్యుని అర్థశాస్త్రమునకు చెందిన విషయములను మాత్రమే ప్రామాణికమని ఎంచుదురో పశుబలిచేయుచు పురోహితులనే తమ గురువులుగా గౌరవింతురో, ధూర్తులైన మిత్రులే వారికి ఉపదేశకులు అగుచున్నారు. అనేకమంది రాజులచేత ఉపభోగింపబడి వదిలివేయబడిన రాజ్యలక్ష్మియందే ఎవరికి ఆసక్తియుండునో స్వభావసిద్ధంగా స్నేహపూర్వకమైన వ్యవహారము చేయు సోదరులను సమూలముగా నాశనము చేయవలెనని ఎవరికి బుద్ధిపుట్టునో అటువంటి రాజులయందు ఉచితానుచిత వివేకము ఎక్కడ ఉండును ? రాజకుమారా ! ఈ రకమైన అతికుటిలము కష్టదాయకము అగు శతాధిక చేష్టలచే భీషణమైన రాజతంత్రము తన విషయంగా చేసికొనును. మరియు అతిశయమోహ కారియైన ఈ యౌవ్వనంలో లోకులు తమను నవ్వులపాలు చేయకుండునట్లు తమరు ఈ రకమైన వ్యవహారము చేయగోరుదురు. తమరు గురుజనులయొక్క తిరస్కారము వినకుందురు గాక! మరియు విద్వాంసులు తమ వ్యవహారంచే దుఃఖితులు కాకుందురు గాక ! మీరు మోసగాళ్ళయొక్క జిత్తులు చెల్లకుండునట్టి ఉపాయము చేయుదురు గాక ! లంపటులు అయిన సేవకులు తమ ధనము దోచుకొనుటకు అవకాశము లభింపకుండుగాక ! లలనలు తమ రూపమనెడి వలలో మిమ్ములను బంధింపకుందురుగాక ! లక్ష్మీ తమ స్వభావమును పాడుచేయకుండుగాక ! సుఖాభిలాష తమను కుకర్మగామిగా చేయకుండుగాక!

కుమారా ! నేను ఇది చక్కగా నెరుగుదును, తమరు స్వభావముచేతనే ధీరులు మరియు శాస్త్రీయమైన సంస్కారములచే సంస్కృతులైనవారు తమ వద్ద రాజమదగంధలేశము కూడా లేదు. అయినప్పటికి తమ గుణగ్రాహ్యతచే సంతుష్టుడనై మాత్రమే నేను ఈ రకంగా చెప్పియుంటిని. మరియు మరల మరల ఇదియే చెప్పుదును. విద్వాంసుడు, శూరుడు, ధీరుడు, క్రియాశీలుడైన పురుషునికూడా ఈ రాజ్యాధికారము కుటిలునిగా చేసివేయును. తగిన సమయంలో తమ తండ్రిగారు తమకు రాజ్యాభిషేకమునకు ఏర్పాట్లు చేసియున్నారు. తమరు కుల క్రమాదిగతమైన రాజ్యలక్ష్మీ భారమును గ్రహించి



దుష్టుల వినాశమును, మరి బంధువర్గమునకు ఉన్నతిని చేకూర్చి శ్రేయస్సు పొందుడు! అభిషేకానంతరము సప్తద్వీపకలితమైన వసుంధరను పునః విజయయాత్రచేయుడు. తమ ప్రతాపమును వృద్ధి చేసికొనుటకు ఇదియే సరియైన అవకాశము. ఏ రాజు తన పరాక్రమము ప్రతిష్ఠించుకొనునో, అతనియొక్క ఆదేశమే సిద్ధ పురుషుని మాటవలె అమోఘము అగుచున్నది. ఇంతమాత్రము చెప్పి శుకనాసుడు విరమించెను.

**ఉపదేశపు పూర్వరంగము : –** ముందు చెప్పబడిన ఉపదేశములను అనుశీలించినపుడు మనకు దానికి పునాదులు దృష్టిగోచరమవుతాయి. శుకనాసుని ఈ ఉపదేశమును మనము ఐదు భాగములుగా విభజించవచ్చును. శుకనాసుని ద్వారా కవి యే యే విషయములను లక్ష్యంగా చేసుకొని వాని వివేచన చేయదలచెనో, ఆ విషయములపై మనము దృష్టిపెట్టవలయును. ఆలోచించగా ఈ క్రింది విషయములు (పేర్కొనిన) ఉపదేశమునకు ఆధారము అని భావింపవచ్చును.

1. యౌవ్వనావస్థలో దానియొక్క స్వాభావిక ఉచ్ఛృలంఖత్వ ప్రదర్శన – అది శాస్త్రమునూ, లోకమర్యాదను కూడా అతిక్రమించిపోవును.

2. లక్ష్మీ యొక్క చంచలత మరియు ఆమెయొక్క పరస్పరత విరోధరూపమైన స్వభావ దిగ్దర్శనము చేసి దానివలన మనిషి ప్రాపంచిక మాయాజాలంలో పడిపోవుటను గూర్చి ఎత్తిచూపుట.

3. రాజ్యలక్ష్మి ప్రాప్తిచే కలిగిన మదము వలన ఉన్మత్తులైన రాజులకు ఆ నిరంకుశతచే ప్రజా సమూహములలో క్షోభ ఉత్పన్నమగుట వివేచింప బడినది.

4. రాజసభలో స్థానమును సంపాదించిన ధూర్తులను వారి ధూర్తతయొక్క రహస్యమును కుండబద్దలు కొట్టినట్లు చూపి రాజకులంలో ఉత్పన్నమగు ఆదరంచే తమ పనులను వారు ఎట్లు సాధించుకొందురో చూపబడినది.

5. ఉపసంహారంలో శిష్టాచార నిర్వహణము చేయవలసినదిగా సలహా ఇవ్వబడినది. ఈ సంకేతము ఒక రాజును పైన ఉదహరించిన దోషములనుండి బయటబడవేయును.

**ఉపదేశపు రహస్యము :-** కథాప్రసంగంలో వచ్చిన కాదంబరీ ఉపదేశములలో ఉన్న మహత్త్వము మానవ జీవనముకొరకు ఎంతో మహత్త్వ పూర్ణమైనది. ఈ విషయమును ఎంత చెప్పినను సరిపోదు. ప్రస్తుతము **శుకనాసోపదేశము మమ్మటుని** మాటలలో కావ్యముయొక్క (కావ్యప్రకాశ) రమణీయప్రయోజనము నకు **"కాన్తాసమ్మితతయోపదేశయుజే"** అను వాక్య రహస్యమును ప్రతిపాదించు సజీవ ప్రతీక అగుచున్నది. మనము ఈ ఉపదేశపు రహస్యము పరిశీలన యోగ్యము మరియు విషయ దృష్టితో పరిశీలింపవచ్చును. శుకనాసుని ఈ ఉపదేశమునకు రాజకుమారుడు చంద్రాపీడుడు పాత్రుడై యున్నాడు. రాజకుమారుని తత్కాల సంబంధమైన స్వరూపమును అధ్యయనము చేసినచో మనకు ఈ క్రింది అంశములు బోధపడుచున్నవిః-

1) ఆయన నూత్నయౌవ్వనావస్థలో ప్రతి మానవుని ప్రతీక. మహామంత్రి ఈ పాత్ర ద్వారా సమస్త యువ సమాజమునకు ఉపదేశము చేసి సముచిత మార్గ నిర్దేశనము చేసెను.

2) రాజుకుమారుడు గురుకులంలో యథావిధిగా విద్యాభ్యాసము పూర్తిచేసి ఇంటికి తిరిగి వెళ్ళు స్నాతకులకు ప్రతీక. అట్టివారు తమ జీవితంలోని సైద్ధాంతికపక్షంలో సముపార్జించిన జ్ఞానమునకు, వ్యావహారికపక్షమైన సముచిత ఉపయోగమను దిశను పొందుటకొరకు దీక్షాంత వచనములను అపేక్షించుట జరుగుచున్నది.

3) ఆయన బాధ్యతగల పదవిలో ప్రతిష్ఠింపబడు ప్రతియొక్క నూతన పాలకునికి ప్రతీక. తన జీవితంలో బాధ్యతాయుతమైన సక్రియతపై ప్రజాభాగ్యపు నిర్ణయము ఆధారపడి కనిపించును.

4) ఉపదేశ విషయసమూహంలో వచ్చి చేరిన లక్ష్మీదేవి-కామిని-కాంచనము మరియు శరీరము ఈ మూడింటికి ప్రతీక అయినది. మరి ఇంకొక విధంగా చెప్పుకొన్నచో స్త్రీ యొక్క స్వేచ్ఛ, స్త్రీపట్ల కలుగు ఇచ్ఛ, ధనేచ్ఛ మరియు పుత్రేచ్ఛ మూడంశములపై నిలిచియుండును.

5) లక్ష్మీ వలన కలుగు మదము, మనిషి యొక్క స్వాభావిక అహంకారము నకు ప్రతీక. లక్ష్మీ మరియు దానివలన కల్గు మదమును మార్మిక రహస్యోద్ఘాటనము చేసి కవి మానవునికి దాని నుండి బయటపడు మార్గమును దిఙ్మాత్రంగా ప్రదర్శించివానికి గొప్ప ఉపకారము చేసెను. ఎందుకనగా ఈషణత్రయమే దుఃఖమునకు మూలకారణము.



6) కవి ఉపదేశమాధ్యమమున ఈ రహస్యమును ఉద్ఘాటించెను అది ఏమనగా ఏ మనుష్యునికైనను శాస్త్రాధ్యయనము మాత్రముచే ఉచితానుచిత కార్య-విధాన వివేకశక్తి అలవడదు. **"న ధర్మ శాస్త్రం పఠతీతి కారణమ్"** అను ఆర్యోక్తిని స్వీకరించి మానవ స్వభావసంస్కారము మరియు బుద్ధి పరిపక్వత కొరకు శాస్త్రాధ్యయనమునకు అదనంగా గురూపదేశము సజ్జన సాంగత్యము మరియు శిష్టజనులయొక్క అనుకరణము కూడా అవసరమగును.

7) నూతన విద్యాప్రాప్తినందిన యువకుడు రాజకుమార చంద్రాపీడుడు తన వ్యావహారిక జీవనంలో ప్రవేశించి అభినవ రాజ్యభారమును దానికి చెందిన ఉత్తరదాయిత్వమును గ్రహించబోవుచుండెను. కాబట్టి మహాకవి ఉపదేశ మాధ్యమమున అతనియొక్క కర్తవ్యమార్గమును నిర్దేశించుచూ ఈ రహస్యము యొక్క సూచన చేసెను. అదియే మానవజీవనపు రెండు పార్శ్వములు. మొదటిది -సైద్ధాంతికముకాగా, రెండవది - వ్యావహారికము. సైద్ధాంతిముఖము మానవ జీవనముయొక్క ప్రథమచరణము అనగా అతడు గురుజనుల యొక్క సాన్నిధ్యంలో జ్ఞానార్జన చేయును. వ్యావహారికముఖము, జీవితపు రెండవ చరణము. ఇందు దాంపత్యజీవితముయొక్క మధురబంధనలో బంధింపబడి మానవుడు తనచే ఉపార్జితమైన జ్ఞానమునకు వ్యావహారికరూపము ఇచ్చు చున్నాడు. ఈ జ్ఞానము మరియు వ్యవహారముయొక్క మంజుల సమన్వయమే మానవజీవనముయొక్క పూర్ణత అగుచున్నది. **"జ్ఞానం భారః క్రియాం వినా"** అనుసూక్తిని దృష్టిలో ఉంచుకొనుట ప్రతిమానవునికి కర్తవ్యమగుచున్నది. అనగా అతడు తన జీవితపు సైద్ధాంతికపక్షమును ఉపార్జించిన జ్ఞానము యొక్క ప్రయోగము వ్యావహారికజీవితంలో సముచితంగా ప్రయోగింపగలడు. ఇందు కొరకు వానికి దీక్ష-దీపములయొక్క మిక్కిలి ఆవశ్యకత ఉన్నది. దాని అఖండ ప్రకాశంచే వెలిగి అది పథ భ్రష్టమగుట నుండి తనకు తానే కాపాడుకోగలడు.

8. లక్ష్మీమదంచే స్వభావసిద్ధంగా నిరంకుశులు అయిన రాజవర్గ మరియు వారి పార్శ్వవర్తులగు ధూర్తపురుషులయొక్క స్వార్థ పరతను స్పష్టరూపంలో కుండ బద్దలుకొట్టినట్లు దాని దుష్పరిమాణముల నుండి తప్పించుకొనుటకు

సంకేతము చేయుచు రాజు మరియు ప్రజలు ఇద్దరును వారి నుండి సావధానచిత్తులై ఉండుటకు హెచ్చరిక చేయబడినది. దోషముయొక్క వాస్తవిక ప్రదర్శన జరిగినపుడు దాని నుండి తప్పించుకొనుటకు, వాని దుష్పరిణామము నుండి దూరంగా నుండుటకు హెచ్చరిక చేయబడినది. దోషముయొక్క వాస్తవిక ప్రదర్శన జరుగునపుడు మాత్రమే దాని నుండి తప్పించుకొనుటకు ఉపాయము ఆలోచింపవచ్చును. మానవ స్వభావమునకు గుణదోషములయొక్క సంగ్రహణము మరియు దోషములను పరిత్యాగము చేయగల్గుట అనవచ్చును.

9. విష్ణుప్రియయైన లక్ష్మీకి మానవీయ వచనములను ఆమె యొక్క స్వాభావిక చాంచల్యత మరియు విరోధిస్వరూపముయొక్క చిత్రణ కటు శబ్దములలో చేయబడినది. దీని ఉద్దేశ్యము మానవుడు మాత్రము లక్ష్మీయొక్క ఇంద్రజాలంలో చిక్కుకొనకుండ చేయును. లక్ష్మీయొక్క నింద మానవుని తమోగుణప్రవృత్తిచే అక్కడ ప్రవేశించిన ఆసుర ప్రవృత్తియొక్క నిరాకరణము చేయుట సత్త్వప్రధానమైన దైవీగుణములయొక్క సన్నివేశము చేయుటగా కనిపించుచున్నది.

10. ఉపదేశంలో ధనము కంటె **విద్యకు అధికమహత్త్వము** ఈయబడినది. ఈ చంచలత్వము వలన కేవలము ధనమునకు అధికప్రాధాన్యము ఇచ్చి, తన జీవితమంతయు ఆమెను ఉపాసించి, తన వాస్తవిక లక్ష్యమును మరిపించున టువంటి జనసముదాయంలో కవి **(బాణభట్టు)** ఒక మార్మికస్పర్శయైన వ్యంగ్యమును చిత్రీకరించెను. డబ్బు కొరకు హాహాకారమును చేయుచు బ్రతుకు నేటియుగంలో శుకనాసునియొక్క ఉపదేశము ఒక నిశ్చితమైన ముద్రను వేయుచ్నుది.

**గురూపదేశ – మహిమ :–** గురూపదేశమును ఏ విధంగా కర్ణరంధ్రంలో చేరిన నిర్మల జలములు కూడా వేదనను కల్గించునో, అదే విధంగా గురువుయొక్క నిష్కపటము, కళ్యాణప్రదమును అగు ఉపదేశము కూడా దుష్టజనుల చెవినబడి వారికి కష్టమునే కల్గించును. అదే గురువాక్యము, సత్పురుషుల చెవినబడి, శంఖములతో కూర్చిన అలంకరణ మాలా సంయోగముచే ఏనుగు యొక్క శోభ పెరిగినట్లు, ఆ మాటల యొక్క వైభవము కూడా విస్తరించును. ఏ విధంగా నిశారంభమునందలి చంద్రునిచే అత్యంత దట్టమైన అంధకారము కూడా



దూరమగునో, అదే విధంగా **గురూపదేశము కూడా అత్యంత** మలినములైన **కామక్రోధాది అవగుణములను దూరము చేయుచున్నది.** ఏ విధంగా వృద్ధాప్యంలో నల్లని వెంట్రుకలు కూడా తెల్లనగునో, అదే ప్రకారము గురూపదేశముకూడా దోషములను సహితము గుణములుగా పరివర్తింపచేయును.

గురూపదేశము సంపూర్ణ మలినములను నీటిలో స్నానముచేయగనే శుద్ధము చేయును. ఇది పలితక్లేశములను ఉత్పన్నము చేయకనే జరారహిత వార్ధక్యమును కల్గించును. మేదో దోషము లేని గురుత. సువర్ణ- నిర్మితము కానప్పటికిని ఉత్కృష్టస్వర్ణాభూషణము. సామాన్య ప్రకాశరహితమైన ఆలోకనము, ఉద్వేగరహితమైన ఉత్కృష్టజాగరణము.

రాజులకు గురూపదేశ మహిమ మరింత అధికము. ఏలననగా వారికి ఉపదేశము ఇవ్వగలిగినవారు చాలా అరుదు. భయవశమున ప్రజలు రాజునెట్లు అనుకరింతురు అనగా, ఏ విధంగా ధ్వనిని ప్రతిధ్వని అనుగమనించునో సరిగా అట్లే రాజపురుషులు మొదట ఉపదేశమును విననే వినరు. విన్నను కూడా ఏనుగువలె ఈ చెవితో విని ఆ చెవితో వదలి వేయుదురు. అందువలననే గురువులకు కూడా కొన్నిసార్లు దుఃఖితులుకాక తప్పదు.

**లక్ష్మీ ప్రకృతి :–** ప్రపంచమున పరిచయమును నిలబెట్టుకొననిది లక్ష్మీ ఒక్కటియే లభించినప్పటికిని బహు కష్టంతో మాత్రమే స్థిరమగును. యోధులు, ఏనుగులు మొదలైన వారి సంరక్షణలో ఉండి కూడా ఆమె తప్పించుకొని పోవును. పరిచయములను నిర్వహించబోదు. ఆమె భ్రమణశీల, మరియు శక్తివంతుడైన రాజును కూడా వదలి వెళ్ళిపోవును.

ఏ విధంగా లతలు వృక్షములకు యెగప్రాకునో, అదే విధంగా లక్ష్మీ కూడా నీచ పురుషులచే ఆలింగనము చేసికొనును. ఇది తరంగములు మరియు కోకిలవలె చంచల స్వభావము కలది మరియు భయంకరమైన సాహసముచే ఆకర్షితురాలు అగును. అంతే కాక క్షణిక శోభను ఉత్పన్నము చేయును. విద్వాంసుని సరస్వతీపట్ల గల ఈర్ష్య వలన కావలె ఈమె ఆలింగనము చేసికొనదు. ఆత్మాభిమానముగలవ్యక్తిని పిచ్చివానివలె అపహసించును. ఈ లక్ష్మీ ఈ ప్రపంచంలో పరస్పరవిరుద్ధమైన విషయములతో నాట్యము చేయుచు తేన విలక్షణశీలము ప్రకటించుచున్నది. నిరంతర ఉష్ణతను ఉత్పన్నము చేయుచూ కూడా శీతలతను కూడా ఉత్పన్నము చేయును. రజోగుణంతో కూడిన ఈమె

కామక్రోధాది దోషరహితుడైన మానవునిలో కూడా ఈ గుణములను నాటును. ఇవి మెల్ల మెల్లగా వృద్ధినందును. అదే విధంగా దీపమువలె చెడుకర్మలకే జన్మమొసగును. ఇది ఏ విధంగా తృష్ణారూపమైన విషలత కొరకు శైలధార అవుతున్నది. ధర్మాచరణరూపమైన చంద్రమండలము కొరకు ఇది రాహువు యొక్క జిహ్వ. ప్రపంచంలో అట్టివారు మనకు కానరారు. లక్ష్మీ మొదట ఆలింగనము చేసుకొని తరువాత మోసగించినదో చిత్రలిఖితమైన కూడా చంచలమైనది. మరి చింతనము చేసిన తర్వాతకూడా మోసము చేయగలదు.

**రాజులపట్ల లక్ష్మీ వ్యవహారము - ఆమె ప్రభావము :-** అదృష్టవశమున లక్ష్మీచే స్వీకరింపబడిన రాజులు విహ్వలులే కాక సమస్త దురాచరములకు పాత్రులు అగుచున్నారు. మంగళ కలశముల జలముచే అభిషేకించబడినపుడు వీరి నైపుణ్యమంతయు కడిగి వేయబడినట్లు అనుపించును. క్రోధము మొదలైన అనేక దుర్గుణములకు నెలవైన రాజులు తమ పతనమును గుర్తింపలేరు.

**ధూర్త-వంచన రాజ-ప్రకృతి :-** ధూర్తజనులు తమ స్వార్థసాధనా తత్పరులై రాజు యొక్క ధనరూపమైన మాంసము తినుట కొరకు యుద్ధరూపమైన పక్షివలె రాజ-సభారూపమైన కమలకాసారమున కొంగలు అగుచున్నారు. జూదము ఆడుట మనోరంజనమని, పలుకుచు అందరి ముందు నవ్వులపాలు అగుటకు కారణము అగుచున్నది. ఈ రాజులు కూడా ముఖస్తుతి చేయగలవారి ద్వారా చేయబడిన ప్రశంసలకు నిజంగా తనను అభినందించుటగా భావించుచున్నారు. స్వాభావికమైన ప్రేమచే ఆర్ద్రహృదయులైన స్వజనులు, బంధువులు, వారికి నష్టకారకులుగా కనిపించుచున్నారు.

కాబట్టి ఓ రాజకుమార! ఈ భయంకరమైన శాసన వ్యవస్థలో మరియు గుడ్డివారిని చేయు ఈ యౌవ్వనకాలంలో తమరు ఇటువంటి ప్రయత్నము చేయవలసినదిగా కోరుచున్నాను. అది ఏమనగా ప్రజలు తమను అపహసించు స్థితి రాకుండుగాక, అంతేకాక తమ తండ్రిగారిచే జయింపబడిన వసుంధరను పునః జయించునది.

**చంద్రాపీడునిపై ఉపదేశ ప్రభావము :-** శుకనాసుని ఉపదేశము ముగియగానే చంద్రాపీడుని మనస్సు ఆ నిర్మల ఉపదేశముచే క్షాళితమైనది, వికసించినది. స్వచ్ఛము కావింపబడి మెరిసినది. ఒక క్షణకాలము ప్రసన్నచిత్తంతో శుకనాసుని చెంత నిలిచి తృప్తిగా రాజ గృహమునకు వెడలెను.



# శుకనాసోపదేశాన్తర్గత సందర్భ సుభాషితాని

1) అభానుభేద్యమ రత్నాలోకచ్ఛేద్యమప్రదీపప్రభాపనేయమతిగహనం తమో యౌవనప్రభావమ్.

2) అపరిణామోపశమో దారుణో లక్ష్మీమదః.

3) అనఞ్జనవర్తిసాధ్యమ్ ఐశ్వర్యతిమిరాన్ధత్వమ్

4) అశిశిరోపచారహార్యోఽతితీవ్రః దర్పదాహజ్వరోష్మా.

5) అమూలమన్త్రాశమ్యః విషమో విషయవిషాస్వాదమోహః.

6) అస్నానశౌచబాధ్యః బలవాన్ రాగమలావలేపః.

7) అక్షపావసానప్రబోధా ఘోరా చ రాజ్యసుఖసన్నిపాతనిద్రా భవతి.

8) గర్భేశ్వరత్వమభినవయౌవనత్వమప్రతిమరూపత్వమమానుషశక్తిత్వ శ్చేతి మహతీయం ఖల్వనర్థపరమ్పరా.

9) యౌవనారమ్భే ప్రాయః శాస్త్రజలప్రక్షాళననిర్మలాపి కాలుష్యముపయాతి బుద్ధిః.

10) యౌవనారమ్భే అనుజ్ఝితధవళతాపి సరాగైవ భవతి యూనాం దృష్టిః.

11) అపహరతి చ వాత్యేవ శుష్కపత్రం సముద్భూతరజోభ్రాన్తిదూరమ్ ఆత్మేచ్ఛయా యౌవనసమయే పురుషం ప్రకృతిః.

12) ఇన్ద్రియహరిణహారిణీ చ సతతమతిదురన్తేయమ్ ఉపభోగమృగతృష్ణికా.

13) నవయౌవనకషాయితాత్మనశ్చ సలిలానీవ తాన్యేవ విషయస్వరూపాణ్యాస్వాద్యమానాని మధురతరాణ్యాపతన్తి మనసః.

14) నాశయతి చ దిఙ్మోహ ఇవోన్మార్గప్రవర్తకః పురుషమత్యాసఙ్గో విషయేషు.

15) అపగతమలే హి మనసి స్ఫటికమణావివ రజనికరగభస్తయో విశన్తి సుఖేన ఉపదేశగుణాః.

16) గురువచనమమలమపి సలిలమివ మహదుపజనయతి శ్రవణస్థితం శూల మభవ్యస్య.

17) ప్రతిశబ్దక ఇవ రాజవచనమనుగచ్ఛతి జనో భయాత్.

18) గురువచనమ్ అపహరతి చ సకలమతిమలినమప్యన్ధకారమివ దోషజాతం ప్రదోష సమయనిశాకర ఇవ.

19) గురూపదేశః ప్రశమహేతుర్వయః పరిణామ ఇవ పలితరూపేణ శిరసిజాల మమలీకుర్వన్ గుణ రూపేణ తదేవ పరిణమయతి.

20) కుసుమశర శరప్రహరజర్జరితే హి హృదయే జలమివ గలత్యుపదిష్టమ్.

21) అకారణఞ్చ భవతి దుష్ప్రకృతేరన్వయః శ్రుతం వా వినయస్య.

22) గురూపదేశశ్చ నామ పురుషాణామఖిలమల ప్రక్షాలనక్షమమజలం స్నానమ్.

23) ఉద్దామదర్పశ్వయథుస్థగితశ్రవణ వివరాశ్చోపదిశ్యమానమపి న శృణ్వన్తి రాజానః.

24) అహఙ్కార - దాహజ్వర - మూర్ఛాన్ధకారితా విహ్వలా హి రాజప్రకృతిః.

25) అలీకాభిమానోన్మాదకారీణి ధనాని.

26) రాజ్యవిషవికారతన్ద్రాప్రదా రాజలక్ష్మీః.

27) న హ్యేవంవిధమపరమ్ అపరిచితమిహ జగతి కిఞ్చిదస్తి, యథేయమనార్యా లక్ష్మీః.

28) గన్ధర్వనగరలేఖేవ పశ్యత ఏవ నశ్యతీయం చఞ్చలా లక్ష్మీః.

29) అత్యారూఢమన్దర పరివర్త భ్రాన్తిజనితసంస్కారేవ పరిభ్రమతీయం లక్ష్మీః.

30) అప్రత్యయబహులేయం లక్ష్మీః దివసాన్తకమలమివ సముపచిత మూలదణ్డ కోషమణ్డలమపి ముఞ్చతి భూభుజమ్.

31) లతేవ లక్ష్మీర్విటపకానధ్యారోహతి.

32) దుష్టపిశాచీవ దర్శితానేక పురుషోచ్ఛాయా లక్ష్మీః స్వల్పసత్త్వమున్మత్తీకరోతి.

33) లక్ష్మీరియం సరస్వతీపరిగృహీతమీర్ష్యయేవ నాలిఙ్గతి జనమ్.

34) పరస్పర విరుద్ధఞ్చేన్ద్రజాలమివ దర్శయన్తీ లక్ష్మీః ప్రకటయతి జగతి నిజం చరితమ్.

35) యథా యథా చేయం చపలా దీప్యతే తథా తథా దీపశిఖేవ కజ్జలమలినమేవ కర్మ కేవలముద్వమతి.



36) న హి తం పశ్యామి, యో హ్యపరిచితయానయా లక్ష్మ్యా న నిర్భరముప గూఢః, యో వా న విప్రలబ్ధః.

37) దురాచారయానయా లక్ష్మ్యా పరిగృహీతా రాజానః సర్వావినయాధిష్ఠానతాం గచ్ఛన్తి.

38) కనకమయమివ సర్వం పశ్యన్తి తృష్ణావిషమూర్ఛితా రాజానః.

39) ఇషవ ఇవ పానవర్ధితతైక్ష్ణ్యాః పరప్రేరితా రాజానః వినాశయన్తి లక్ష్యాన్.

40) వ్యసనశరవ్యతాముపగతాః మహీసతయః వల్మీకతృణాగ్రావస్థితాః జలబిన్దవ ఇవ పతితమప్యాత్మానం నావగచ్ఛన్తి.

41) మిథ్యామాహాత్మ్యగర్వ నిర్భరాశ్చ రాజానః న ప్రణమన్తి దేవతాభ్యః, న పూజయన్తి ద్విజాతీన్, న మానయన్తి మాన్యాన్, నార్చయన్త్యర్చనీయాత్ నాభివాదయన్త్యభివాదనార్హాన్, నాభ్యుత్తిష్ఠన్తి గురూన్.

42) తరలహృదయమప్రతిబుద్ధఞ్చ మదయన్తి ధనాని.

43) విద్వాంసమపి సచేతనమపి మహాసత్త్వమపి అభిజాతమపి ధీరమపి ప్రయత్నవన్తమపి పురుషమియం దుర్వినీతా ఖలీకరోతి లక్ష్మీరితి.

44) ఆరూఢప్రతాపీ హి రాజా త్రైలోక్యదర్శీవ సిద్ధాదేశో భవతి.

45) విరలా హి రాజ్ఞాముపదేష్టారః

46) విశ్వరూపత్వమివ గ్రహీతుమాశ్రితా నారాయణమూర్తిరనయా లక్ష్మ్యా

47) సహజప్రేమార్ద్రహృదయానురక్తా భ్రాతర ఉచ్ఛేద్యాః లోకే పణ్డితా అపి దాక్షిణ్యేనాకార్యం కుర్వన్తి.

48) లక్ష్మీరియం కమలినీసఞ్చరణవ్యతికరలగ్ననలిననాలకంటకక్షతేవ న క్వచిదపి నిర్భరమాబన్నాతి పదమ్.

49) లక్ష్మీరియం న పరిచయం రక్షతి, నాభిజనమీక్షతే, నరూపమాలోకయతే.

50) అనార్యేయం లక్ష్మీః గుణవన్తమపవిత్రమివ న స్పృశతి.

## ప్రశ్నాః

1) శుకనాసస్య ఉపదేశస్య అవశ్యకతాం ప్రభావం చ నిరూపయత?
2) అమృతసోదరాఽపి కటు విపాకా లక్ష్మీః ఇతి వచనం విమృశత?
3) అనర్ధ పరమ్పరా ఇతి కిం కిం కథం కథం భవతి?
4) రాజ్యలక్ష్మీ విషయే బాణభట్టస్య అభిమతం వర్ణయత?
5) అభిషేకసమయః కీదృశః ఇతి శుకనాసః అభిప్రైతి?
6) బాణభట్టస్య దేశకాల విచారం ప్రస్తౌత?
7) శుకనాస చరిత్ర చిత్రణం కురుత?
8) "గద్యం కవీనాం నికషం వదన్తి" నిరూపయత?
9) లక్ష్మ్యాః చాఞ్చల్యం యథాగ్రన్థం వర్ణయత?
10) గన్ధర్వనగర లేఖేవ పశ్యత ఏవ నశ్యతి ఇతి ససందర్భం లిఖత?
11) గురూపదేశశ్చ పురుషణామఖిలమలప్రక్షాళనమమలం జలమ్?
12) పురుషోత్తమరతాపి ఖలజన ప్రియా కా? విశదయత?
13) అకాల కుసుమ ప్రసవా ఇవ మనోహరాకృతయోఽపి లోక వినాశహేతవః ఇతి విశదయత?
14) రాజ్యతన్త్రం విశదయత?
15) బాణభట్టస్య పరిచయం దత్త?
16) కాదంబర్యాం శుకనాసోపదేశస్య వైశిష్ట్యం విశదయత?
17) శుకనాసోపదేశం సంక్షిప్తత?